దీపమాను

(సాహిత్య వ్యాసాలు)

డా॥ వేంపల్లి గంగాధర్



దీపమాను

(సాహిత్య వ్యాసాలు)

డా// వేంపల్లి గంగాధర్

దీపమాను
సాహిత్య వ్యాసాలు

- తెలుగు నిత్యమై ...నిఖిలమై ....
- తెలుగు తల్లికి వెలుగు హారతి
- తొలి తెలుగు శాసనాలను కాపాడుకోలేమా ?
- తొలి తెలుగు శాసనం ఎక్కడ ?
- తొలి తెలుగు శాసనానికి వెలుగు ఎప్పుడు ?
- కాశీయాత్రకు ఏళ్ళు ; ఏనుగుల వీరాస్వామి యాత్ర
- తొలి తెలుగు నవల - శ్రీ రంగరాజు చరిత్ర
- రవీంద్రుడి జన్మస్థలం లో కాసేపు ...
- శాంతినికేతన్ - ప్రకృతి ఒడిలో పాఠాలు
- బ్రౌనుకు మనమేం చేసాం?
- వెలుగు పూల దీపమాను - రాయలసీమ కథా సాహిత్యం
- రాయలసీమ మాండలికం
- మూడు తరాల సీమ కథా సేద్యం
- రాయలసీమ తొలి కథకుడు
- సొదుం జయరాం -జ్ఞాపకాలు
- జానమద్ది హనుమచ్ఛాస్త్రి - జ్ఞాపకాలు
- బాల సౌరి రెడ్డి - జ్ఞాపకాలు
- 'మాసీమ' రాజగోపాల్ రెడ్డి - జ్ఞాపకాలు
- కరువు -కక్షల సీమ కథ
- సీమ కథల్లో కక్షల చిత్రణ
- తెలుగు సూర్యుడు -సి పి బ్రౌన్

- గుంటూరు శేషేంద్ర శర్మ - ముఖా ముఖి
- రావూరి భరద్వాజ- ముఖా ముఖి
- అరుంధతి రాయ్ -ముఖా ముఖి
- రాష్టపతి భవన్ లో తొలి సాహిత్య కారుడు
- తెలుగు విమర్శ -ప్రస్థానం

డాక్టర్ వేంపల్లి గంగాధర్ - పరిచయం


తెలుగు నిత్యమై... నిఖిలమై

తెలుగు నేల వైవిధ్యమైన ప్రాంతం. ప్రకృతి వనరులు పుష్కలం. నదీ ప్రవాహాలతో పులకితమయ్యే నేల. తెలుగు భాషకు ప్రాచీన హోదా దక్కడం ఆ భాష మన నేలలో అంతర్భాగమనే వైశిష్ట్యాన్ని చాటిచెప్పిన సందర్భం.

తెలుగు భాషకు పర్యాయపదాలుగా 'ఆంధ్రం', 'తెలుగు', 'తెనుగు' పదాలు మనం వాడుతున్నాం. ఆంధ్ర శబ్దం సంస్కృత పదం, ప్రాచీన పదం. దక్షిణా పథంలో సంచారంలో ఉన్న ఒక జాతి వారని ఆర్యులు 'ఆంధ్రుల'పై ఒక అభిప్రాయం వ్యక్తపర్చారు. 'ఆంధ్ర' పదం ఋగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ.800-600)లోని శునశ్శేఫుని వృత్తాంతంలో కనిపిస్తుంది. శునశ్శేఫుడిని అన్నగా అంగీకరించని యాభైమంది కుమారులను విశ్వామిత్రుడు అనార్యులైన ఆంధ్ర, పుండ్ర, పుళింద, దశబర, మూతిబ జాతుల్లో కలిసిపోవాలని శపిస్తాడు. ఐతరేయ బ్రాహ్మణ కాలానికే ఆర్య, అనార్య జాతులు ఉన్న విషయం మనం గమనించవచ్చు. వ్యాసుని భారతంలో అయిదు చోట్ల ఆంధ్రుల ప్రసక్తి కనిపిస్తుంది. సహదేవుని దక్షిణ దిగ్విజయ యాత్ర (సభా పర్వం), మార్కండేయుడు ధర్మరాజుతో ధర్మాన్ని బోధించే క్రమం (అరణ్య పర్వం), సంజయుడు ధృతరాష్ట్రునికి దేశ నదీ జనపదాల్ని వివరించే సందర్భం, పాండవ వధ సందర్భం (కర్ణ పర్వం), అర్జునుడి దిగ్విజయ యాత్ర (అశ్వమేధ పర్వం) సందర్భాల్లో ఆంధ్రుల ప్రసక్తి చూడవచ్చు. సంస్కృత భాగవతంలో శుకుడు హరిస్తుతి (ద్వి.సం.అధ్యా14.శ్లో18) చేసే క్రమంలోనూ, మనుస్మృతిలోనూ, క్రీ.శ. 1వ శతాబ్దిలో భరతుడి నాట్యశాస్త్రంలోనూ, వాయు, బ్రహ్మాండ, మత్స్య పురాణాల్లోనూ 'ఆంధ్రుల' ప్రసక్తి కన్పిస్తుంది. క్రీస్తు పూర్వం 3వందల ప్రాంతంలో మగధ రాజైన చంద్రగుప్త మౌర్యుని ఆస్థానాన్ని సందర్శించిన గ్రీకురాయబారి మెగస్తనీసు రచన 'ఇండికా'లో, క్రీ.పూ.3వ శతాబ్దిలో అశోకుడు వేయించిన 13వ ధర్మశిలాశాసనంలోనూ, క్రీ.శ.9వ శతాబ్దానికి చెందిన ఉద్యోతనుడి ప్రాకృత గ్రంథం 'కువలయమాల'లోనూ ఆంధ్రుల ప్రస్తావన ఉంది.

'త్రికళింగ' శబ్దం నుంచే 'తెలుగు' అనే పదం పుట్టిందనే వాదనను ఆచార్య చిలుకూరి నారాయణరావు 'ఆంధ్ర భాషాచరిత్ర'లో వ్యక్తీకరించారు. త్రికళింగ → తిఅలింగ → తెలింగ → తేలింగ → తెలుగు గా మారినదని ఒక భావన. తెలి + అగు = తెలుగు. తెలి అంటే 'స్వచ్ఛం'.

వాల్మీకి రామాయణంలో కిష్కింద కాండలో సుగ్రీవుడు వానరుల్ని దక్షిణ దిక్కుకు పంపుతూ ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్యాది దేశాల్లో సీత కోసం అన్వేషించాల్సిందిగా ఆదేశిస్తాడు. వరాహమిహిరుని (క్రీ.శ.600) 'బృహత్సంహిత'లో, చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ (క్రీ.శ.7వ శతాబ్ది) రచనల్లోనూ, బౌద్ధ జాతక 'భీమసేన జాతకం' కథలోనూ, మైదవోలు తామ్ర దాన శాసనం (క్రీ.శ.240)లోనూ, మల్లదేవ నందివర్మ వేయించిన దాన శాసనం (క్రీ.శ 340)లోనూ 'ఆంధ్ర' శబ్దం కనిపిస్తుంది. నన్నయభట్టు రాసిన నందంపూడిశాసనం (క్రీ.శ.1053)లో ఆంధ్ర శబ్దం భాషాపరంగా నమోదైంది. క్రీ.పూ 3వ శతాబ్దం నుంచి (అశోకుని కాలం), ఇక్ష్వాకుల కాలం వరకు ప్రాకృత భాష రాజభాషగా, శాసన భాషగా సాగింది. తర్వాత సంస్కృతం ఆ స్థానాన్ని ఆక్రమించింది. క్రీ.శ 11వ శతాబ్ది నుంచి ఆంధ్ర శబ్దం భాషాపరంగా వాడుకలోకి వచ్చింది. 'తెలుంగు', 'త్రిలింగ', 'తెలుగు' అనే పదాలు ఒక జాతిని, ప్రాంతాన్ని సూచిస్తూ 'ఆంధ్ర' పదంతో సమానార్థకంగా వాడేవారు. తూర్పు చాళుక్య రాజైన రాజరాజ నరేంద్రుని ఆస్థానంలోని నన్నయ భట్టు 'ఆంధ్ర మహాభారతము' లిఖిత సాహిత్య గ్రంథంగా గుర్తింపు పొందింది. నన్నెచోడుడు తన 'కుమారసంభవం'లోనూ, 12వ శతాబ్దంలో పాల్కురికి సోమనాథుడు తన రచనల్లోనూ 'తెనుంగు' పదాలు వాడారు. క్రీ.శ. 13వ శతాబ్దానికి చెందిన విన్నకోట పెద్దన తన 'కావ్యాలంకార చూడామణి'లో 'తెనుగు' శబ్దం వాడారు. గ్రీకు దేశస్థులైన టోలమి, ప్లినీ 'త్రిలింగమ్', 'మూడో లింగమ్' అనే పదాలు పేర్కొన్నారు. క్రీ.శ.10వ శతాబ్దానికి చెందిన రాజశేఖరుడు తన 'విద్ధసాలభంజిక' నాటకంలో 'జయతు జయతు త్రిలింగాధిపోదేవః' అనే ప్రయోగం చేశాడు. కాకతీయ ఆస్థానంలోని విద్యానాథుడు తాను రాసిన 'ప్రతాపరుద్రీయ' నాటక ప్రకరణంలో త్రిలింగ దేశ ప్రస్తావన చేశాడు.



'త్రికళింగ' శబ్దంనుంచే 'తెలుగు' పదం పుట్టిందనే వాదనను ఆచార్య చిలుకూరి నారాయణరావు 'ఆంధ్ర భాషాచరిత్ర'లో వ్యక్తీకరించారు. త్రికళింగ - తిఅలింగ - తెలింగ - తేలింగ - తెలుగు గా మారినదని ఒక భావన. తెలి + అగు = తెలుగు. తెలి అంటే 'స్వచ్ఛం'. తిక్కన 'నిర్వచనోత్తర రామాయణం'లో తెలుగు పదం చోటు చేసుకుంది. నన్నయకు పూర్వ యుగాన్ని ప్రాఙ్నన్నయ యుగం (Pre-Nannaya age) అని వ్యవహరిస్తారు. క్రీ.పూ.200 నుంచి క్రీ.శ.1000 వరకు గల కాలాన్ని ఈ యుగంగా నిర్ధారించారు. దీన్నే ప్రాకృత, సంస్కృత శాసన భాషాయుగంగా చెప్తారు. ఈ ప్రాకృత, సంస్కృత శాసనాల్లోనూ తెలుగు వ్యక్తుల పేర్లు, ప్రాంతాల పేర్లు, సంఖ్యా వాచకాలు, విశేషణాలు నమోదవుతూ వచ్చాయి. శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, బృహత్పలాయనులు, పల్లవులు పరిపాలించినంత కాలం ప్రాకృతమే రాజభాషగా ఉండేది. తర్వాత క్రీ.శ.17వ శతాబ్ది వరకు సంస్కృత, సంస్కృతాంధ్రాలు రెండూ ఉన్న ద్విభాషా శాసనాలు వచ్చాయి.

తెలుగు భాషా పరిణామ వికాసానికి తొలి అడుగుగా నిలిచిన తొలి తెలుగు శాసనం- కలమళ్ళ శాసనం. ఈ శాసనం తెలుగు భాషకు రాజభాష హోదాను, శాసనభాషగా అధికార ప్రతిపత్తిని కలిగించింది. కడపజిల్లా కలమళ్ళ గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో క్రీ.శ.575లో రేనాటి చోళరాజు ధనుంజయవర్మ వేయించిన ఈ శాసనాన్ని 1904లో మద్రాసు శాసనవిభాగం గుర్తించింది. తొలితరం శాసనాలుగా రేనాటి చోళుల 33 శిలా శాసనాలు, 4 తామ్ర శాసనాలు తెలుగు భాషా స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నాయి.

క్రీ.శ.848నాటి పాండురంగని అద్దంకిశాసనం మొదటి పద్యశాసనంగా గుర్తింపు పొందింది. ఇది తరవోజు ఛందస్సులో ఉంది. క్రీ.శ.1వ శతాబ్దానికి చెందిన శాతవాహనుల కాలం నాటి అమరావతీ స్తూపంలో 'నాగబు' పదం తొలి తెలుగు పదంగా విమర్శకులు వేటూరి ప్రభాకరశాస్త్రి విశ్లేషించారు. తెలుగు వాఙ్మయంలో తొలి తెలుగు అనువాదకవిగా నన్నయ (క్రీ.శ.1020-1060) 'శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో' అంటూ సంస్కృత శ్లోకంతో తెలుగు మహాభారతాన్ని మొదలుపెట్టారు. ఆది, సభా పర్వాలను పూర్తిగాను, అరణ్య పర్వంలోని 142 పద్యాలను రచించారు. నన్నయ తిక్కనలకు మధ్యలో 'శివ కవులు' ఉన్నారు. నన్నెచోడుడు, మల్లికార్జున పండితుడు, పాల్కురికి సోమన 'శివ కవిత్రయం'గా నిలిచారు. వీర శైవ మతాన్ని, దేశీ సాహిత్యాన్ని అక్షరీకరించారు. క్రీ.శ.1000 నుంచి 1600 వరకు 'కవిత్రయ భాషాయుగం'గా వర్గీకరించారు. కవిబ్రహ్మ తిక్కన 15ఆశ్వాసాలు భారతాంధ్రీకరణ చేయగా, నన్నయ వదిలేసిన అరణ్యపర్వంలోని కొంత భాగాన్ని ఎర్రన పూర్తి చేశాడు. క్రీ.శ. 1420-1480 మధ్యకాలం వాడిగా చెప్పబడుతున్న బమ్మెర పోతన ఆంధ్ర మహాభాగవత కర్తగా నిలిచాడు. తర్వాత్తర్వాత శ్రీనాథ కవి సార్వభౌముడు, అన్నమాచార్యులు, అల్లసాని పెద్దన, శ్రీకృష్ణ దేవరాయలు, రాజరాజ భూషణుడు, త్యాగరాజు, క్షేత్రయ్య, మొల్ల, వేమన, వీరబ్రహ్మం... వంటి సాహితీ మూర్తులు తెలుగు సాహితీ లోకాన్ని సుసంపన్నం చేశారు.

క్రీ.శ 1512 నుంచి 175 సంవత్సరాలు పాలించిన కుతుబ్‌షాహీ సుల్తానులు 'ఆంధ్ర సుల్తానులు'గా పేరుపొందారు. దక్కన్‌లో బహమనీ సామ్రాజ్య శకలాల నుంచి ఆవిర్భవించిన స్వతంత్ర రాజ్యం గోల్కొండ. విజయనగర సామ్రాజ్యం కృష్ణదేవరాయల మరణానంతరం అంతఃకలహాలతో బలహీనమైన తర్వాత గోల్కొండ రాజ్యనిర్మాత కులీ కుతుబ్‌షా- గజపతుల సామంతుడైన సీతాపతి రాజుతో పోరాడి ఓరుగల్లు, కొండపల్లి, కొండవీడు వంటి దుర్గాల్ని జయించినట్లు అద్దంకి గంగాధర కవి తన 'తపతీ సంవరణోపాఖ్యానం' కావ్యంలో పేర్కొన్నాడు. దీన్ని కుతుబ్‌షాకే అంకితమిచ్చాడు. వీరి కాలంలో పారసీక, ఉర్దూ, తెలుగు భాషా సాహిత్యాలు సమాదరింపబడ్డాయి. క్రీ.శ1498లో వాస్కోడిగామా పశ్చిమ సముద్ర తీరంలోని కాలికట్ ప్రాంతంలో అడుగుపెట్టడంతో భారత దేశ చరిత్ర మరో మలుపు తీసుకుంది. కొత్త సముద్రమార్గం ద్వారా పోర్చుగీసు, డచ్చి, ఇంగ్లీషు, ఫ్రెంచి దేశాలకు చెందిన వాణిజ్య సంఘాలు దేశంలోకి ప్రవేశించాయి. దీనినే చరిత్రలో 'కుంఫిణీయుగం'గా వ్యవహరించారు. క్రీ.శ.1820లో థామస్ మన్రో గవర్నర్‌గా నియమించబడిన తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీలో ఆంగ్లవిద్య ప్రవేశపెట్టాడు. క్రీ.శ 1816లో కల్నల్ కాలిన్ మెకంజీ 'స్థానిక చరిత్రల'ను నమోదు చేయించాడు. తర్వాత సి.పి. బ్రౌన్ (1798-1884) చెదలు పట్టిన తాళపత్ర గ్రంథాలకు వెలుగునిచ్చాడు. 19వ శతాబ్దిలో నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం సాహిత్య సామాజిక సేవనందించారు.

ప్రతి సంస్కృతికీ ఒక స్వరూపం ఉంటుంది. భౌగోళిక, చారిత్రక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్యకళా రూపాలతో ఇదొక జీవన యానం. నాగరికతలో అంతర్భాగం. తెలుగువారికి ఇదొక పునరుజ్జీవ సందర్భం. తెలుగుతల్లి ఇలాగే నిత్యమై నిఖిలమై నిలిచి చారిత్రక ప్రాభవంతో, సాంస్కృతిక వైభవంతో జీవనదిలా సాగిపోవాలి. అదే ఆశ. ఆకాంక్ష.

■ వేంపల్లి గంగాధర్
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత

ఇండియా టుడే

తెలుగు తల్లికి వెలుగు హారతి

సంస్కృతి అనేది ఒక నిరంతర ప్రవాహం. అది అలాగే సాగుతుంటుంది. అది కొత్త నాగరికతను పూయిస్తుంది. ఇది తెలుగు జాతికి సాంస్కృతిక పునరుజ్జీవన సందర్భం. తెలుగు తల్లి ఇలాగే నిత్యమై, నిఖిలమై నిలచి ఉండాలి.

గెస్ట్ కాలమ్



వేంపల్లి గంగాధర్

ప్రతి సంస్కృతికీ ఒక స్వరూపం ఉంటుంది. భౌగోళికంగా, చారిత్రకంగా, రాజకీయంగా, సామాజికంగా, సాహిత్యంగా, సాంస్కృతికంగా ఇదొక జీవనయానం. నాగరికతలో అంతర్భాగం. చారిత్రక ప్రాభవంతో, సాంస్కృతిక వైభవంతో నేడు 'సీమాంధ్ర' కొత్త బంగారు లోకాన్ని సృష్టిస్తోంది. సుజలాం, సుఫలాం, సస్యశ్యామలమంటూ పల్లవిస్తోంది. కృష్ణా తీరంలోని భట్ల పెనుమర్ర గ్రామంలో పుట్టిన పింగళి వెంకయ్య భారతదేశానికి త్రివర్ణ పతాకాన్ని తయారు చేసిచ్చాడు. వేదాలలో మొట్టమొదటిదైన ఋగ్వేదంలోని ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రుల ప్రసక్తి కన్పిస్తుంది. ధర్మరాజు రాజసూయ యాగం చేసిన సందర్భంలో దక్షిణం వైపునకు దిగ్విజయ యాత్రకు వెళ్ళినప్పుడు సహదేవుడు ఆంధ్ర రాజ్యాన్ని జయించాడని ఐతిహ్యం. క్రీ.పూ. ఒకటవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల నాణేలు కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలంలోని సాతానికోట వద్ద జరిపిన తవ్వకాల్లో వెలుగులోకి వచ్చాయి. గుంటూరు జిల్లా కృష్ణానదీ తీరంలో ఉన్న అమరావతిలో లభించిన బౌద్ధ స్తూపం క్రీ.పూ. ఐదవ శాతాబ్దికి చెందినదిగా కార్బన్ డేటింగ్ పద్ధతి ద్వారా నిర్ధారించారు. మట్టి పొరల మధ్య కూరుకుపోయి 'దీపాలదిన్నె'గా పడివున్న పెద్ద దిబ్బను 1797లో తవ్వించి మహా స్తూపాన్ని కల్నల్ మెకంజీ వెలికి తీశారు. ధాన్యకటక మహానగరాన్ని రాజధానిగా చేసుకొని పరిపాల చేసిన హాలుడు ప్రాకృత భాషలో రచించిన 'గాథా సప్తశతి'లో అనేక తెలుగు పదాలు ఉన్నాయి. రాష్ట్ర సాంస్కృతిక చిహ్నంగా పూర్ణకుంభాన్ని అమరావతి స్తూపం నుంచే మనం స్వీకరించాం.

సీమాంధ్రలోని 13 జిల్లాల్లో ఎంతో వైవిధ్యం కన్పిస్తుంది. విలక్షణమైన సంస్కృతి, సంప్రదాయాలు, వేడుకలు ఇక్కడున్నాయి. కర్నూలు జిల్లాలోని హోళగుంద మండలంలోని నెరణికి తాండ మజరా దేవరగట్టు కొండల్లో వెలసిన మాళమల్లేశ్వర స్వామి దసరా బన్ని ఉత్సవాలు 'కర్రల సమరాన్ని' చూపిస్తాయి. ఇదే జిల్లాలోనే ఉగాది పండుగ తర్వాత వీరభద్రుడు, కాళమ్మ కల్యాణం తర్వాత కారుమంచిరెడ్డి వంశీయుల చేత పిడకలాట (నుగ్గులాట) చేసుకుంటారు. చిత్తూరు జిల్లాలోని తిరుపతిలో జరిగే గంగ జాతర ప్రత్యేకమైనది.

విజయనగరం జిల్లాలో సిరిమానోత్సవం ఏటా ఆశ్వయుజ శుద్ధ దశమి తర్వాత వచ్చే మంగళవారం నాడు జరుపుతారు. అనంతపురం జిల్లా నార్పల మండలంలోని గూగూడులో వెలిసిన కుళ్ళాయి స్వామి మరొక విశేషం. ముస్లింలకు పవిత్రమైన పీరు హిందువులకు లభించడంతో హిందూ-ముస్లింల సఖ్యతగా ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఇదే జిల్లాలోనే 'కదిరి' నరసింహస్వామి రథోత్సవం విశేషమైంది.

కృష్ణా జిల్లా గుడివాడ సమీపంలోని నందివాడ మండలంలో ఉన్న లక్ష్మీనరసింహపురంలో కుక్క విగ్రహాన్ని 'కాలభైరవుడు'గా పూజిస్తారు. నెల్లూరు జిల్లాలోని సూళ్ళూరుపేట 'శ్రీ చెంగాళమ్మ' ఆలయానికి తలుపులు లేకపోవడం విశేషం. ఇదే జిల్లాలో 'రొట్టెల పండుగ' విశేషమైంది. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలు ప్రతి ఏటా మే నెలలో భూదేవి పండుగ జరుపుకుంటారు. పందిని భూమికి బలిచ్చి వ్యవసాయానికి పూనుకుంటారు.

ఉత్తరాంధ్రలో శ్రీ కూర్మనాథస్వామి డోలాయాత్ర, అరసవల్లి శ్రీ సూర్యనారాణ స్వామి రథసప్తమి వేడుకలు, పాలకొండ ఎల్లమ్మ జాతర ఏటా ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. కడప జిల్లాలో జరిగే 'నాగారపమ్మ జాతర' తండాల్లోని గిరిజనుల్ని సమ్మేళన పరుస్తుంది.

సీమాంధ్రలో ఎన్నో జానపద కళారూపాలున్నాయి. కళింగాంధ్ర ప్రాంతంలోనే అరవైకి పైగా కళారూపాలు కనిపిస్తాయి. విజయనగరంలోని అజ్జాడలో పుట్టిన ఆదిభట్ల నారాయణదాసు 'హరికథా పితామహుడి'గా హరికథలకు గుర్తింపు చేకూర్చారు. తెలుగునాటక రంగానికి నిరుపమాన సేవలందించిన ఘనత 'సురభి'కి దక్కుతుంది. అలాగే చిత్తూరు జిల్లా కుప్పం మండలంలోని కంగుంది 'వీధి నాటకాలు' నూట అరవై కుటుంబాలకు జీవనాధారం. నాదస్వర విద్వాంసునిగా పని చేసిన షేక్ చిన మౌలానా, 'నాదస్వరానికి' గుర్తింపు తెచ్చి పద్మశ్రీని అందుకొని ప్రకాశం జిల్లాకు పేరు తెచ్చారు.



అవధానం నుంచి ఆవకాయ దాకా, అన్నమయ్య నుంచి శ్రీశ్రీ దాకా సీమాంధ్ర
ఒక నిత్య వెలుగు,
నిత్య చైతన్యం

సీమాంధ్ర భాషా సంస్కృతి మిశ్రమమైంది. మూడు భాషా వ్యవహారిక మండలాల సమ్మేళనంగా ఉంటుంది. పూర్వ మండలంలోని కళింగాంధ్ర మాండలిక భాష విలక్షణం. దీనిపై ఒరియా భాష ప్రభావం కన్పిస్తుంది. మధ్య మండలం కోస్తాంధ్ర భాషపై సంస్కృత భాష ప్రభావం గమనించవచ్చు. దక్షిణ మండలం రాయలసీమ ప్రాంతం. ఇక్కడ అనంతపురం జిల్లా మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో కన్నడ భాషా ప్రభావం, చిత్తూరు జిల్లా సత్యవేడు, తిరుపతి, చిత్తూరు ప్రాంతాలలో తమిళ సంస్కృతి ప్రభావం వల్ల భాష ప్రభావితమవుతుంది. కర్నూలు జిల్లాకు ఒక చివర తెలంగాణలోని మహబూబ్ నగర్ ప్రాంతం సరిహద్దుగా ఉన్నచోట భాషలో తేడా చూడొచ్చు. ఈ నేపథ్యంలో ఆధునిక వచన వాఙ్మయ ప్రభావంగానీ ఆధునిక భాషా ప్రయోగాలు కానీ కడప భాషపైన అంతగా కన్పించవని ఒక అభిప్రాయం.

సంస్కృతి ఒక నిరంతర ప్రవాహం. కొత్త నాగరికతను పూయిస్తుంది. తెలుగువారికి ఇదొక సాంస్కృతిక పునరుజ్జీవన సందర్భం. తెలుగు తల్లి ఇలాగే నిత్యమై, నిఖిలమై నిలచి ఉండాలని ఆకాంక్ష.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత

తొలి తెలుగు శాసనాలను కాపాడుకోలేమా?

తెలుగుభాషకు ప్రాచీన హోదా లభించిందని అందరికీ సంతోషమే. అందుకోసం చూపించిన ఆధారాలలో కడపజిల్లా శాసనాలు ముఖ్యమైనవి అయినప్పుడు అవి ఎంత భద్రంగా ఉండాలి? కాని ఎండకు ఎండి వానకు తడిసి నడిచే దారులుగా కూర్చునే అరుగులుగా ఉపయోగపడుతున్నాయి మన తొలి తెలుగు శాసనాలు. వీటి దుస్థితి గురించే ఈ వ్యాసం.

తొలి తెలుగు లిపి శాసనాలకు పాడు కాలం దాపురించింది. వాటి విలువ గుర్తించేవారు లేరు. వాటిని వెలికితీసి సంరక్షించి భావితరాలకు చరిత్రను అందించాలనేవారు అసలే లేరు. తెలుగు లిపి పరిణామక్రమాన్ని, శాసనాల భాషగా మారిన వైనాన్ని, నాటి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయడానికి మనకు మిగిలిన ఏకైక ఆధారాలు ఈ శాసనాలు. తెలుగు భాష ప్రాచీనతకు ఆధారాలైన ఈ శాసనాలు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా పడి వుంటున్నాయి?



కలమల్లలో లిపిని కోల్పోతున్నతెలుగు శాసనం, ఇలాంటివే మరో రెండు కూడా ఉన్నాయి.



కడప జిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం 30 కోట్ల రూపాయలు కేటాయించింది. కానీ ఎవరికీ ఈ శాసనాలు కానీ, కలమళ్ల, మాలే పాడు, యర్రగుడిపాడు వంటి చారిత్రాత్మక ప్రదేశాలుగానీ పట్టడం లేదు.

తొలిశాసనం

'కలమళ్ల' పేరు ఎప్పుడైనా విన్నారా? మనం ఎంతో గొప్పగా, ఘనంగా చాటి చెప్పుకుంటూ ప్రాచీన హోదాకోసం పోటీకి దిగడానికి నిలబడే సత్తానందించిన తొలి తెలుగు శాసనాలున్న చారిత్రాత్మక ప్రాంతం అది.

క్రీ.శ. 575లో 'ఎరికల్ ముత్తరాజు' బిరుదుతో ధనుంజయుడు కమలాపురం తాలూకా (కడప జిల్లా) కలమళ్ల గ్రామంలోని చెన్నకేశవాల యం ప్రాంగణంలో వేయించిన తొలి తెలుగు శాసనాల పరిస్థితి ఇప్పుడు దయనీయంగా వుంది. అప్పుడెప్పుడో కొన్ని రాతి శాసనాలు మద్రాసు మ్యూ జియానికి తరలిపోగా మిగిలిపోయిన వాటి పరిస్థితి చూస్తే ఏ చరిత్ర పరి శోధకుడికైనా, ఏ తెలుగు భాషాభిమానికైనా హృదయం చెమ్మగిల్లుతుంది.

కలమళ్ల చెన్నకేశవాలయం బయట, రోడ్డు పక్కన నిలువెత్తు రాతి శాసనం నిస్సహాయంగా నిలబడి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తొలి తెలుగు లిపిని పోగొట్టుకుంటూ కన్నీరు కారుస్తోంది. మరో శాసనం బండ రాళ్ల మధ్య పడివుంటే, ఇంకొకటి పిచ్చిమొక్కల మధ్య కంప పొదలమధ్య పడి వుంది. కడప జిల్లా కేంద్రం నుండి 58 కిలోమీటర్ల దూరంలో ముద్దనూరు – యర్రగుంట్ల స్టేషన్ల మధ్య కలమళ్ల స్టేషన్ ఉంది. అక్కడ్నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉంది చెన్నకేశవాలయం – అదే మన తొలి తెలుగు శాసనానికి పుట్టిల్లు. ఇప్పుడక్కడ నాలుగు శాసనాలు మిగిలివున్నా అవి క్రమంగా లిపిని కోల్పోతూ రాళ్లుగానే మిగిలి ఉన్నాయి.

రేనాటి చోళులు

క్రీ.శ. 6వ శతాబ్దిలో కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలను కలిపి రేనాడు అని పిలిచేవారు. ఇది ఏడువేల గ్రామాల మండలం. దీనిని చోళరాజులు పాలించేవారు. కాబట్టి వీరికి రేనాటి చోళులు అని పేరొచ్చింది. ఆనాటి భాషా స్వరూపాన్ని ఇప్పటి దాకా నిలబెట్టిన ఘనత వీరికే దక్కుతుంది.

చరిత్రకారులు హెచ్.కృష్ణశాస్త్రి, వెంకట్రామ య్య, నీలకంఠశాస్త్రి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వెంకటరమణయ్యలు 'రేనాటి చోళుల' గురించి తమ రచనల్లో ఎంతో సమాచారం అందించారు. రేనాటి చోళులు మొదట పల్లవుల, తర్వాత బాదామి చాళుక్యుల సామంతులుగా వున్నట్లు తెలుస్తోంది. కొన్ని తామ్ర శాసనాలు, ప్రొద్దుటూరు రామేశ్వరంలోని శిలాశాసనాలు వారు లిఖించినవే. కమలాపురం తాలూకాలోని కలమళ్ల గ్రామంలో ధనుంజయవర్మ వేయించిన శిలాశాసనం తెలుగు భాషకే మొదటి వాక్య రచనగా, తొలి శాసనంగా గుర్తించబడింది. దీన్ని బట్టి మన లిపి ఆరవ శతాబ్దం నాటిదని చరిత్రకారుల అభిప్రాయం.

ఎర్రగుడిపాడు

రెండవ శాసనాన్ని కమలాపురం తాలూ కాలోని ఎర్రగుడిపాడులోని చెన్నకేశవాలయంలో గుర్తించారు. రెండవ శాసనం పరిస్థితి మరింత దారుణం. ఆలయం ఆవరణలో చుట్టూ పరిచిన బండపరుపులో శాసనాన్ని కూడా గ్రామస్థులు చేర్చేశారు. నిలువెత్తు ఆ శాసనంలోని లిపి మొత్తం కొట్టుకుపోగా ఇప్పుడు బండమాత్రమే మిగిలింది. ఇక గోడలకు లిఖించబడివున్న శాసనాలకు సున్నాలు వేయడం, ఎర్రమట్టి పూయడంతో మరింతగా లిపి రూపును కోల్పోయింది. కనిపించినంతమేర ఇది ఆనాటి రాజకీయ చరిత్రను చెప్తోంది. చోళుల శాసనాలలో పల్లవ యువ రాజుల పేర్లను పేర్కొనడం వల్ల బహుశా పల్లవులకు, చోళులకు మధ్య అధికార, సామంత సంబంధాలు ఉన్నాయని తెలుస్తోంది.

మాలేపాడు

క్రీ.శ.575లో రేనాటి చోళరాజు సత్యాశ్రయుడు పోట్లదుర్తి – మాలేపాడు

గ్రామాల్లో వేయించిన తెలుగు శాసనాలు కూడా ఎంతో ప్రసిద్ధి చెందినవే. రేనాటి చోళులు వేంగి - చాళుక్య లిపిలో శాసనాలు రాయించారు. అదే ఇప్పటి తెలుగు కన్నడ లిపిల ప్రాచీన రూపం. నన్నయ్య ఈ వేంగి చాళుక్య లిపిలోనే తన భారతం రాసివుంటారని పండితుల అభిప్రాయం. ఇక్కడి శాసనం ఎర్రరాతిపై "చోళ మహారాజు ఒప్పుకుంటే ఇనుప్రోలు అనే గ్రామంలోని రేవణ, వుద్దణ అనే కులపెద్దలు పెద్ద బ్రాహ్మణుడు 'ఇశరేడు'గారికిచ్చిన పన్నస ఇది' అని లిఖించబడి వుంది.

చు - లి - యె

క్రీ.శ. 640 - 41 ల్లో చైనా యాత్రికుడు హులయాన్‌త్సాంగ్ రేణాడు ప్రాంతాన్ని పర్య టించాడు. ఈ ప్రాంతాన్ని అతడు 'చుళియె' (చు-లి-యె) అన్నాడని ... అంటే చోళరాజుల ప్రాంతమని చరిత్రకారుల భావన.

చోళరాజైన సత్యాదిత్యుడు రేనాడునూ, సిద్ధవటంనూ, చోళమహాదేవి రాణి 'చిలమకూరు'నూ, శ్రీకాంత చోళుడు లేబాక, అత్తిరాల ప్రాంతాలను పాలించినట్లు 'మాలే పాడు' శాసనం ధృవీకరిస్తోంది.పోర్ముఖరామ అనే బాణరాజు పెన్నేరు హద్దుగల ప్రాంతాన్ని చోళుల తర్వాత పాలించినట్లు పొట్టిపాడు శాసనం చెబుతోంది. రెండవ కృతివర్మ మరణంతో బదామీ చాళుక్యుల పాలన అంతమై రేనాడులో చోళుల పాలన ప్రారంభమైందని చరిత్రకారుల అభిప్రాయం.

తెలుగు సేవ

రేనాటి చోళుల కారణంగానే ఇవాళ మనకు ప్రాచీన తెలుగువాక్య రచనా విధానం తెలుస్తోంది. తెలుగులోని మొట్టమొదటి శాసనాలలో కనిపించే

పాకృత, ద్రావిడ భాషలనుండి విడిపోయి తెలుగు లిపి నిర్మితం కావడం ఈ శాసనాల్లో కన్పిస్తుంది. అప్పటికే వాడుకలో ఉన్న బ్రాహ్మీ లిపినే కొన్ని మార్పులతో తెలుగు, కన్నడ వారు వాడుకున్నట్లు కూడా చెబుతారు.



కలమల్లలో విరిగిపడి ఉన్న రాతి శాసనం



యర్రగుడిపాడు చెన్నకేశవాలయంలోని తెలుగు శాసనం

రేనాటి చోళుని పేరు ఎరికల్ ముత్తరాజు ధనుంజయుడు. ఇతడు నందివర్మ కుమారుడు. ఎరికల్ అనేది రేనాటి సీమలోని గ్రామమై ఉంటుందని పండితుల అభిప్రాయం. రేనాటి చోళులు 'చెప్పలియా' గ్రామాన్ని రాజధానిగా చేసుకొని పాలించారని, దీనిని ఇప్పటి కమలాపురం తాలూకాలోని పెద్ద చెప్పలి గ్రామంగా గుర్తించారని చెబుతారు.

క్రీశ 625లో వచ్చిన పుణ్యకుమారుడు పోర్ముఖరామ, పురుష శార్దుల, మదన విలాస, మద ముదిత, ఉత్తమోత్తమ వంటి బిరుదులు పొందాడు. ఇతని భార్య వసంతపోరి. ఈయన కాలంలో లిఖించబడ్డ తామ్ర శాసనంలో



పుణ్యకుమారుడు హిరణ్య రాష్ట్రము(సీమ)ను పాలిస్తూ పొద్దుటూరి వారికి కొంత భూమిని దానం చేసినట్లు ఉంది. ఈ శాఖకు చెందిన రాజుల తర్వాత సుందర నందుని వంశములోని శ్రీకంఠ చోళరాజులవి రెండు తామ్రశాసనాలు మాత్రమే లభించాయి. వీరి తర్వాత వైదుంబ రాజులు రేనాడుని ఆక్రమించుకోగా వీరు పొత్తలి ప్రాంతానికి తరలి వెళ్లినట్లు చరిత్ర కథనం.

చోళుల చరిత్ర

తెలుగు భాష చరిత్రలో రేనాటి చోళులకు ఒక విశిష్ట స్థానం ఉంది. రేనాటి చోళుల చరిత్ర తెలుసుకోవడానికి నాలుగు తామ్ర శాసనాలు, 50 శిలాశాసనాలు ఆధారాలుగా లభించాయి. మాలెపాడు, దొమ్మరి నంద్యాలలో దొరికిన రెండు తామ్ర శాసనాల వలన కరికాలుడి వంశములో నందివర్మ జన్మించినట్లు తెలుస్తుంది. అతని వారసుల్లో విక్రమాదిత్యుడు చోళ మహారాజుగా పేరెన్నికగన్నవాడు. ఈ శాసనాల ఆధారంగా రేనాటి చోళులు క్రీ.శ. 550 నుండి క్రీ.శ. 850 వరకు సుమారు 300 సంవత్సరాలు రాజ్యపాలన చేసినట్లు తెలుస్తోంది.

పరిరక్షించుకోవాలి

పాకృత, ద్రావిడ భాషలనుండి విడిపోయి తెలుగు లిపి నిర్మితం కావడం ఈ శాసనాల్లో కన్పిస్తుంది. అప్పటికే వాడుకలో ఉన్న బ్రాహ్మీ లిపినే కొన్ని మార్పులతో తెలుగు, కన్నడ వారు వాడుకున్నట్లు కూడా చెబుతారు. సంస్కృత - ప్రాకృత - ద్రావిడ సమ్మిళితమైన భాషా స్వరూపం తెలుగు భాషమీద పడింది.

రేనాటి చోళుల శాసనాలను మరింత లోతుగా పరిశీలిస్తే అప్పటి తెలుగు లిపిలో, భాషలో గల అక్షర విశేషణములు, పద విశేషాలు, వాక్య రచనా విధానం, ఉచ్చారణ సౌలభ్యం కోసం చేసుకున్న ఇతర మార్పులు మనకు స్పష్టంగా విశదమవుతాయి.

క్రీ.శ. 6 వ శతాబ్ది నుంచి క్రీ. శ. 10 వ శతాబ్ది వరకు తెలుగు లిపిలో వచ్చిన పరిణామక్రమం రేనాటి చోళుల శాసనాల అధ్యయనం వల్ల సాధ్యమవుతుంది. ఇలాంటి కీలకమైన చారిత్రక ఆధారాలున్న శాసనాలు రాతిబండలుగా మిగిలిపోతున్నాయి. వీటిని మనం రక్షించుకోకపోతే చరిత్ర మనల్ని క్షమిస్తుందంటారా?

(డా. జి.వి.సాయిప్రసాద్‌తో కలిసి)

ఫోటోలు, వ్యాసం :
వేంపల్లి గంగాధర్

తొలి తెలుగు శాసనం ఎక్కడ?!

వివిధ
ఆంధ్రజ్యోతి సాహిత్యవేదిక
సోమవారం 15 ఏప్రిల్ 2013

పో గొట్టుకున్నాం!

ఈసారి పోయింది అట్లాటి ఇట్లాటి వస్తువు కాదు. తెలుగు భాషకు వెలుగు పూలు పూయించిన తొలి తెలుగు శాసనం...

తెలుగు భాషకు రాజ భాష హోదాను, శాసన భాషగా ఒక అధికార ప్రతిపత్తి కల్గించి, తెలుగు భాషకు అక్షర రూపం యిచ్చి చారిత్రకంగా, సాహిత్యపరంగా ఘన వారసత్వ కీర్తిని అందించిన 'కలమళ్ళ శాసనం' –తొలి తెలుగు శాసనం ఎక్కడుందో యిప్పుడెవరికీ తెలియడం లేదు. అందరూ నిస్సహాయంగా చేతులెత్తేస్తున్నారు. దీంతో దాదాపుగా మనం తొలి తెలుగు శాసనాన్ని కోల్పోయినట్లేనని భావించాల్సి వస్తోంది.

కడప జిల్లాలోని కలమళ్ళ గ్రామంలో గల శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో క్రీ.శ. 575లో రేనాటి చోళ రాజు ధనుంజయ వర్మ వేయించిన శాసనాన్ని 1904లో మద్రాసు శాసన పరిశోధన విభాగం వారు గుర్తించారు. ఆ తర్వాత వారితో పాటూ ఆ శాసనాన్ని మద్రాసు మ్యూజియానికి తరలించారని అందరూ భావిస్తూ వచ్చారు. ఇదే నేపథ్యంలో నేను సమాచార హక్కు చట్టం ద్వారా 07 జనవరి 2013 నాడు శాసనం నమూనా ప్రతిని, స్క్రిప్ట్‌ను జత పర్చుతూ సమగ్ర వివరాలతో చెన్నై 'ఎగ్మోర్' ప్రభుత్వ మ్యూజియం వారిని ప్రశ్నించడం జరిగింది.

తొలి తెలుగు శాసనం, రేనాటి చోళరాజు ధనుంజయ వర్మ వేయించిన శాసనంకు సంబంధించిన వివరాలు, మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారా? దానిని తగిన విధంగా సంరక్షిస్తున్నారా? వంటి ప్రశ్నలను వారి ముందుంచినపుడు– అలాంటి శాసనమేదీ తమ వద్ద లేదని– చెన్నై ప్రభుత్వ మ్యూజియం అసిస్టెంట్ డైరక్టర్ తిరు ఎస్. సెల్వ అరసు, అధికారికంగా లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

దీంతో యింతకాలంగా ఎగ్మోర్ మ్యూజియంలో వుందని భ్రమపడుతూ వచ్చిన శాసనం అక్కడ లేదని తేలిపోయింది. అంతకు మునుపే శాసన నిర్దేశకుల కార్యాలయం, భారతీయ పురాతత్వశాఖ, మైసూరు వారి వద్ద కూడా ఈ శాసనం లేదని వెల్లడైంది. ఈ మైసూర్ శాఖ ఎపిగ్రాఫియా ఇండియా, ఏన్యువల్ రిపోర్ట్ ఆన్ ఇండియన్ ఎపిగ్రఫీ అనే శాసన పత్రికలను కూడా ప్రచురిస్తోంది. ఈ మైసూర్ కార్యాలయానికి 125 సంవత్సరాల చరిత్ర కూడా వుంది. వీరి వద్ద రేనాటి చోళుల శాసనాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం వుంది. కానీ 'తొలి తెలుగు శాసనాన్ని' సేకరించకపోయినందుకు, సంరక్షించక పోయినందుకు మనం విచారించాల్సిందే!

ఇదే విధంగా భారతీయ పురాతత్వ సర్వేక్షణ, ఉప పురాతత్వ అధీక్షకులు– హైదరాబాదు వారిని కూడా 30 అక్టోబర్ 2012 నాడు రెండు లేఖల ద్వారా ప్రశ్నించడం జరిగింది. వారి నుంచి కూడా అసంతృప్తిని మిగిల్చే సమాధానాలే లభించాయి. తొలి తెలుగు శాసనం ఆచూకీ తమకు కూడా తెలియదని చేతులెత్తేయడం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది.


సమాచార హక్కు చట్టం ద్వారా భారతీయ పురాతత్వ శాఖ, హైద్రాబాదు మండలం వారిని ఈ అంశంపై అడిగిన కొన్ని ప్రశ్నలు– వాటికి వారిచ్చిన సమాధానాలు ఇవి:

? కడప జిల్లాలో బయల్పడిన 'కలమళ్ళ శాసనం' ప్రస్తుతం ఎక్కడ వుంది?

• కలమళ్ళ గ్రామంలో గల శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో 1904లో మద్రాసు నందలి శాసన పరిశోధన విభాగం వారు ఈ శాసనాన్ని గుర్తించారు. ప్రస్తుతం ఎక్కడ వుందో తెలియదు.

? కలమళ్ళ శాసనం పొడవు, వెడల్పు, ఆకారం, బరువు వంటి సాంకేతిక వివరాలు తెలపగలరు?

• కలమళ్ళ శాసనం పొడవు, వెడల్పు, ఆకారం, బరువు వంటి సాంకేతిక వివరాలు లభించుట లేదు.



కడప జిల్లాలోని కలమళ్ళ గ్రామంలో గల శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో క్రీ.శ. 575లో రేనాటి చోళ రాజు ధనుంజయ వర్మ వేయించిన శాసనాన్ని 1904లో మద్రాసు శాసన పరిశోధన విభాగం వారు గుర్తించారు. నేటికి లభించిన తొలి తెలుగు శాసనాల్లో కలమళ్ళ శాసనమే ప్రప్రథమ మనడానికి అందులో వాడిన ప్రాచీన లిపి–భాషలే ప్రమాణం.

? కలమళ్ళ శాసనాన్ని మొదటిసారిగా ఎవరు, ఎప్పుడు, ఎక్కడ గుర్తించారు? తర్వాత ఎక్కడికి తరలించారు? ప్రస్తుతం ఎక్కడుంది?

• కలమళ్ళ శాసనాన్ని తొలిసారిగా 1904లో మద్రాసు ప్రభుత్వ శాఖ వారు కలమళ్ళ గ్రామంలోని ఆలయ ప్రాంగణంలో వున్నట్లు గుర్తించారు. తర్వాత 1947–48 లో ఆచార్య కె.నీలకంఠ శాస్త్రి, యమ్. వెంకట రామయ్య ఈ శాసనాన్ని పరిష్కరించి ప్రచురించారు.

ఇంతకు మించి ఏ సమాచారం అందుబాటులో లేదు.

? తొలి తెలుగు శాసనంగా చెప్పబడుతున్న కడప జిల్లాలోని కలమళ్ళ శాసనంను భారతీయ పురాతత్వ శాఖ తొలి తెలుగు శాసనంగా అంగీకరిస్తోందా? అంగీకరిస్తే ఆధారాలు తెలుపగలరు?

• రేనాటి చోళరాజు ధనుంజయుడు వేయించిన కలమళ్ళ శిలాశాసనాన్ని తొలి తెలుగు శాసనంగా ప్రసిద్ధ శాసన పరిశోధకులు సహేతుకంగా నిర్ణయించారు. కావున మేము కూడా వారి అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నాము. నేటికి లభించిన తొలి తెలుగు శాసనాల్లో కలమళ్ళ శాసనమే ప్రప్రథమ మనడానికి అందులో వాడిన ప్రాచీన లిపి–భాషలే ప్రమాణం. ఎరికల్ ముత్తురాజు వేయించిన ఎర్రగుడిపాడు శాసనం, పుణ్యకుమారుడి తిప్పలూరు శాసనాలు తర్వాత క్రమంలో వచ్చి చేరుతాయి.

'తెలుగు లిపి' నిర్మాణం...

తొలి తెలుగు శాసనం వల్ల నాటి నుంచి నేటి వరకు తెలుగు లిపి పరిణామ క్రమాన్ని అధ్యయనం చేయడానికి వీలు కల్గుతుంది. ప్రాకృత, ద్రావిడ భాషల నుండి విడిపోయి వేరుగా తెలుగు లిపి నిర్మితం కావడం గుర్తించవచ్చు. తెలుగు వాక్య రచనా విధానం, ఉచ్చారణ సౌలభ్యం కోసం చేసుకున్న ఇతర మార్పులు విశదమవుతాయి. ప్రాకృత వాక్యాల స్థానంలో తెలుగు వాక్యాలు చేరడం గమనించవచ్చు. వీటి ద్వారా తెలుగు భాషా సంప్రదాయ, స్వరూపాన్ని విశ్లేషించవచ్చు.

చరిత్ర ఆధారాల్లో...


రేనాటి చోళుల కారణంగా మనకు ఇవాళ ప్రాచీన తెలుగు వాక్య రచనా విధానం తెలుస్తోంది. రేగడినేల ఉన్న ప్రాంతం కాబట్టి 'రేగడినాడు' ప్రాంతం 'రేనాడు'గా మారి ఉండవచ్చునని చరిత్ర పరిశోధకుడు పుట్టపర్తి శ్రీనివాసాచారి అభిప్రాయపడ్డారు. రేనాటి చోళులు తాము కరికాల చోళుని సంతతికి చెందినవారమని చెప్పుకున్నారు. క్రీ.శ. 484 ప్రాంతంలో రేనాడు కరికాల చోళుని పాలనలో వుండేదని చరిత్రకారుడు నేలటూరి వెంకట రమణయ్య నిరూపించారు.

తెలుగులో మొట్టమొదటి శాసనాల్లో కన్పించే రేనాటి చోళుని పేరు ఎరికల్ ముత్తురాజు ధనుంజయుడు. ఇతడు నందివర్మ కుమారుడు. ధనుంజయ వర్మ పేరుకు ముందున్న 'ఎరికల్' అనేది రేనాటి సీమలోని గ్రామమై వుంటుందని కూడా చరిత్రకారుల భావన.

రేనాటి చోళులు 'చెప్పలియా' గ్రామం రాజధానిగా రేనాటి ప్రాంతాన్ని పాలించారు. రేనాడు ప్రాంతం కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, కమలాపురం, జమ్మల మడుగు, తాలూకాలు; కర్నూలు జిల్లా కోయిలకుంట్ల తాలూకాలోని కొన్ని ప్రాంతాలతో వున్న ఏడు వేల గ్రామాలున్న ప్రాంతంగా 'పూర్వోద్ధృతము' రచన నందు ఎస్.వి.రమణయ్య ఆధారాలు చూపారు. రేనాటి చోళులు తమ రాజధానిగా చేసుకున్న 'చెప్పలియా' ప్రాంతం నేడు కమలాపురం మండలంలోని 'పెద్ద చెప్పలి'గా తగిన ఆధారాలతో గుర్తించడం కూడా జరిగింది.

రేనాటి చోళుల వంశ వృక్షంలో 13 తరాల రాజుల పేర్లు శాసనాధారాల ద్వారా రూపొందించడమైంది. కశ్యప గోత్రానికి చెందిన నందివర్మ పరిపాలనా కాలం క్రీ.శ. 550 అని చెప్పుకోవచ్చు. తర్వాతి తరంలో వచ్చిన సింహ విష్ణు, సుందరనంద, ధనుంజయ వర్మలు క్రీ.శ. 575 ప్రాంతంలో వచ్చారు. పుణ్యకుమారుడు, వసంతపోరి చోళ మహరాణి భర్తగా, పోర్ముఖరామ, పురుష శార్దూల, మదన విలాస వంటి బిరుదులు ధరించి క్రీ.శ. 625లో నాల్గవ తరంలో కీర్తి పొందాడు. 11వ తరంలో నృపకామ (క్రీ.శ. 800), 12వ తరంలో దిహికర (క్రీ.శ. 825), 13వ తరంలో శ్రీకంఠ అధిరాజు (క్రీ.శ. 850) క్రమ పట్టికలో కన్పిస్తారు.

ఆనాటి కాలంలో యువరాజు కాకుండా మిగిలిన రాజకుమారులలో పెద్దవాడిని ముత్తురాజు అని పిలిచేవారు. అంటే యువరాజు తర్వాత రాజ్యానికి రాజుగా రావడానికి అవకాశాలున్న వారికే ఈ పట్టం యిచ్చేవారు. మహేంద్రవర్మ కొడుకైన పుణ్యకుమారుడి రెండు తామ్ర శాసనాలు, మూడు శిలాశాసనాలు లభిస్తున్నాయి. ప్రొద్దుటూరు రామేశ్వర శిలాశాసనంలో 'పృథివీ వల్లభ' అనే బిరుదు పేర్కొనడం జరిగింది. పుణ్య కుమారుడు హిరణ్య రాష్ట్రాన్ని పాలిస్తూ కొంత భూమిని దానం చేసినట్లు ఒక తామ్ర శాసనం చెప్తోంది. తర్వాత కాలంలో వైదుంబ రాజులు రేనాడును ఆక్రమించుకోగా వీరు పొత్తపి ప్రాంతానికి మరలిపోయినట్లు చరిత్ర కథనం.



రేనాటి చోళుల రాజలాంఛనము

చివరగా...

గత ఏడాది డిసెంబర్ మాసంలో 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటూ నిర్వహించిన 'ప్రపంచ తెలుగు మహాసభల్లో' తొలి తెలుగు శాసనాన్ని ప్రదర్శిస్తారని ఎందరో భాషాభిమానులు, చరిత్ర పరిశోధకులు ఎదురుచూశారు. కానీ వారికి నిరాశే మిగిలింది. అధికార భాషా సంఘం, రాష్ట్ర సాంస్కృతిక శాఖ గానీ దీని పట్ల శ్రద్ధ పెట్టినట్లు కూడా కన్పించదు. భారతీయ పురాతత్వ శాఖ–హైదరాబాదు శాఖ గురించి యిక చెప్పనవసరం లేదు. కనీసం యికనైనా ఈ శాసనం ఆనవాళ్ళ గురించి, ఆచూకీ గురించి విస్తృతంగా అన్వేషణ జరగాల్సిన అవసరం తప్పనిసరిగా వుంది. లేదంటే– చరిత్ర ఎప్పటికీ మనల్ని క్షమించదు!

– డాక్టర్ వేంపల్లి గంగాధర్
94400 74893

సాహితి


email: sahiti@andhrabhoomi.net

ఆంధ్రభూమి

సోమవారం 15 ఏప్రిల్ 2013



తొలి తెలుగు శాసనానికి 'వెలుగు' ఉందా?



కలమళ్ళ శిలాశాసనము
దాత :
తెలుగు చోళవంశపు ధనంజయుడు
పరిపాలన కాలము:
క్రీ.శ. ఆరవ శతాబ్ది అంతము
శాసన కాలము :
అనిర్దష్టము

ప్రస్తుతం ఇది- 'తెలుగు భాష, సంస్కృతి వికాస సంవత్సరం.' అటు చరిత్రకు- ఇటు భాషకు మధ్య నిలువెత్తు శిఖరంలా నిలిచిన తొలి తెలుగు శాసనం ఎక్కడుంది? చరిత్రకందని మిస్టరీలా మారింది. క్రీ.శ.575 ప్రాంతానికి చెందిన రేనాటి చోళరాజు ధనుంజయర్మ కడప జిల్లాలోని కలమళ్ళ గ్రామంలో గల శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ప్రాంగణంలో వేయించిన దాన శాసనం తొలి తెలుగు శాసనంగా చరిత్రలో గుర్తింపు పొందింది. తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించడానికి చూపిన ఆధారాల్లో ప్రధానమైంది కూడా! ప్రస్తుతం ఈ శాసనం ఎక్కడుంది? ఈ ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేక పోతున్నారు. 1904 సం.లో మద్రాసునుంచి వచ్చిన శాసన పరిశోధన విభాగంవారు తమ వెంట దానిని తీసుకెళ్ళిపోయినట్లు యింతవరకు భావిస్తూ వచ్చారు. ఇదే అంశాన్ని ఆధారాలు చూపిస్తూ నేను సమాచార హక్కు చట్టం క్రింద చెన్నైలోని ఎగ్మోర్ ప్రభుత్వ మ్యూజియాన్ని సంప్రదించినప్పుడు దిగ్భ్రాంతి కల్గించే అంశం బయటపడింది.

దీనికి చెన్నై ప్రభుత్వ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ తిరు ఎస్. సెల్వ అరుసు లిఖిత పూర్వకంగా అధికారిక లేఖను సమాధానమిస్తూ పంపారు. అందులోని సారాంశం ఏమిటంటే- తొలి తెలుగు శాసనంగా చెప్పుకుంటున్న 'కలమళ్ళ శాసనం' తమ సేకరణలోనే లేదని స్పష్టపరిచారు. అయితే 1947-48 సం.లో ఆచార్య కె.నీలకంఠశాస్త్రి, యం.వెంకటరామయ్యగార్లు పరిష్కరించి, తెలుగు వారికి పరిచయం చేసిన 'కలమళ్ళ శాసనం' ఎక్కడికి తరలిపోయిందో అర్థంకాని అయోమయ పరిస్థితి ఏర్పడింది.

భారతీయ పురాతత్వశాఖ హైద్రాబాదు విభాగం వారివద్ద కూడా దీనికి సంబంధించిన ఆధారాలు లేవు. తాము ఆ శాసనాన్ని సేకరించలేదని, భద్రపర్చలేదని కూడా వారు అంగీకరిస్తున్నారు. శాసనానికి సంబంధించిన సాంకేతిక వివరాలు (పొడవు, వెడల్పు, ఆకారం, బరువు) కూడా తమవద్ద లేవంటున్నారు. కలమళ్ళ శిలా శాసనాన్ని తొలి తెలుగు శాసనంగా అంగీకరిస్తూనే... దానిని ఎందుకు సేకరించలేదో, సంరక్షించలేదో చెప్పలేకపోతున్నారు.

శాసన నిర్దేశకుల కార్యాలయం, మైసూర్ వారి వద్ద కూడా ఇది లేదు. కనీసం యిప్పటికైనా అందరూ పూనుకొని, సమష్టిగా నడుంబిగించి తొలి తెలుగు శాసనం ఎక్కడుందో అన్వేషించాల్సిన అవసరం వుంది. తెలుగు భాషను రాజభాషగా నిల్పిన తొలి తెలుగు శాసనాన్ని తెలుగు నేలపైనే చూడాలన్న చరిత్రకారుల, తెలుగు భాషాభిమానుల ఆశయం సఫలం కావాలి.

మనం కోల్పోయిన 'కలమళ్ళ శాసనం'?

భాషా పరిణామక్రమంలో...

ప్రాచీనాంధ్ర భాషా స్వరూపాన్ని గుర్తించడానికి శాసనాలు తప్ప వేరే ఆధారాలు లేవు. పూర్తిగా తెలుగు వాక్యాల్లోవున్న మొట్ట మొదటి శాసనంగా 'కలమళ్ళ శాసనం' గుర్తింపు పొందింది. రేనాటి చోళరాజు ధనుంజయవర్మ క్రీ.శ.6వ శతాబ్ది చివరి పాదానికి చెందిన కాలంలో దీనిని వేయించినట్లు తెలుస్తోంది. (ఎరి)కల్ ముతురాజు ధనుంజయుడు రేనాడు ప్రాంతాన్ని పరిపాలిస్తూ చిఋంబూరి (చిలమకూరు) రేవణకాలు పంపున చెనూరు కాజు కొంత భూమిని దానమిచ్చినట్లు ఈ శాసనంలో చెప్పబడింది. ఈ శాసనంలో కొంత భాగం శిథిలమైంది.

తెలుగు భాష పరిణామక్రమం, సంప్రదాయాలు, స్వరూప స్వభావాలను, లిపి రూపాలను అధ్యయనం చేయడానికి 'తొలి తెలుగు శాసనం' ఉపయుక్తమౌతోంది. ప్రాచీన పద రూపాలు, ద్రావిడ వర్ణాలు, లిపి సంకేతాలు, రేఫ సంకేతాలు, సముచ్చయ ప్రత్యయాలు వంటి వాటన్నింటిని పరిశీలించడానికి రేనాటి చోళులు వేసిన తొలితరం శాసనాలన్నీ దోహదపడ్తున్నాయి. ప్రాకృత, ద్రావిడ భాషలనుంచి తెలుగు భాష కొత్తగా జీవం పోసుకుంటున్న పరిణామక్రమం, శాసన భాషగా లిపి నిర్మితం కావడాన్ని మనం రేనాటి చోళుల తొలి తెలుగు శాసనాల ఆధారంగా అధ్యయనం చేయవచ్చు.

తొలి తరం తెలుగు శాసనాలు

క్రీ.శ. 575 కాలంనుంచి 850 వరకు రేనాటి చోళుల వంశవృక్షం లభిస్తోంది. ఈమధ్య కాలంలోని రాజులు వేసిన శాసనాలు మనకు స్క్రిప్ట్ రూపంలో అందుబాటులో వున్నాయి. తొలి తెలుగు శాసనం నుంచి తర్వాతి శాసనాల వరకు భాషను పరిశీలించినప్పుడు తెలుగు రాజభాషగా, శాసన భాషగా, అధికార భాషగా, పాలన భాషగా ఎలా నిర్మితం అవుతూ వస్తోందో స్పష్టమౌతుంది. తొలి తరం శాసనాలు అన్నీ 'రేనాటి చోళులు కాలానికి చెందినవే. వీరి 33 శిలాశాసనాలు, 4 తామ్ర శాసనాలు తెలుగు భాషా స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ శాసనాలన్నీ దాన శాసనాలే కావడం విశేషం.

33 శిలాశాసనాలు: ఇందులో మూడు కలమళ్ళ శాసనాలు కాగా రెండు శాసనాలు కల్గిన ప్రాంతాలు వెల్దుర్తి, తిప్పలూరు, మాలెపాడు, కొసినెపల్లె, ముద్దనూరు, పెద్దముడియం పేర్లతో లభించాయి. ఒక శాసనంగా బయల్పడినవి ఎర్రగుడిపాడు, ఇందుకూరు, పొట్లదుర్తి, ఉరుటూరు, నల్లచెరువుపల్లె, కమలకూరు, నాగూరు, గంగపెరూరు, కత్తెరగండ్ల, పులపత్తూరు, చిలంకూరు,. చామలూరు, అరకటవేముల, ముత్తుకూరు, మిడతూరు, వేల్పుచర్ల, ప్రొద్దుటూరు ప్రాంతాల శివాశాసనాలు వున్నాయి.

4 తామ్ర శాసనాలు: పుణ్య కుమారుని మాలేపాడు తామ్రశాసనం, పుణ్యకుమారుని దొమ్మరి నంద్యాల తామ్ర శాసనం, శ్రీకంఠచోళుని మద్రాసు మ్యూజియం తామ్ర శాసనం, శ్రీ కంఠశ్రీ మనోహరుని పెద్దచెప్పల్లి తామ్ర శాసనం.

శాసనాల్లో తేదీతోపాటూ 'వారం' కూడా!

రేనాటి చోళ రాజుల్లో పుణ్యకుమారుడికి ప్రాధాన్యత వుంది. పోర్ముఖరామ, పురుషశార్దూలమార్దవ చిత్త అనే బిరుదులున్నాయి. పుణ్య కుమారుడి తిప్పలూరు శాసనంలో ఆనాటి తేదిని తెలుపుతూ 'కొర్తిౣకె చీకు (బహుళ) విదియ, సోమవారము, పునరు పుష్యమి (పునర్వసు నక్షత్రం), బృహస్పతి, హోర ప్రకటించబడినవి. ఈ విధముగా శాసనాల్లో వారమును పేర్కొనడం తెలుగు ప్రాంతంలో అరుదైన విషయంగా చెప్పుకోవచ్చు. పుణ్య కుమారుడు గొప్ప విద్వాంసుడుగా కూడా కీర్తిపొందాడు.

రేనాటి చోళులు మొదట పల్లవులు తర్వాత బాదామి చాళుక్యుల సామంతులుగా వున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ పల్లవ మహేంద్రవర్మ కాలంలో పుణ్యకుమారుడు స్వతంత్ర ప్రతిపత్తితో ఏడువేల రేనాడు రాజ్యమును పరిపాలన చేసినట్లు శాసనాల ద్వారా గ్రహించవచ్చు. తోకను వీపుపైన చుట్టు త్రిప్పి ఎడమవైపుకు నిల్చున్న పరాక్రమ 'సింహం' వారి రాజ లాంఛనంగా చెప్పుకోవచ్చు. క్రీ.శ. 640-41 సం.ల్లో చైనా యాత్రికుడు హుయాన్త్సాంగ్ రేనాడు ప్రాంతాన్ని పర్యటించాడు. ఈ ప్రాంతాన్ని అతడు 'చుళియె' (చు-లి-యె) అని పిలిచాడు. అనగా చోళరాజుల ప్రాంతమని చరిత్రకారుల భావన.

తెలుగు భాష ప్రాచీనతకు ఆధారాలు

క్రీ.శ. 6వ శతాబ్ది నుంచి క్రీ.శ. 10వ శతాబ్ది వరకు తెలుగు లిపిలో చోటుచేసుకున్న మార్పుల్ని, పరిణామక్రమాన్ని రేనాటి చోళుల శాసనాల ద్వారా అధ్యయనం చేయడానికి వీలు కల్గుతోంది. ద్రావిడ భాషలతోను, సంస్కృత ప్రాకృత భాషలతోను మన మొదటి తెలుగు లిపికి వున్న సాన్నిహిత్యాన్ని నిరూపించడానికి, ప్రాచీనతను గుర్తించడానికి వీలవుతుంది. రేనాటి చోళుల చరిత్ర మనకు సమగ్రంగా లభించడం లేదు. అందులోనూ అక్షరాల 'పుణ్యకుమారుడి' గురించి పట్టుమని పది వాక్యాలు వరుసగా మన అధికారిక చరిత్ర పుస్తకాల్లో కనపడవు. 'సమగ్రాంధ్ర సాహిత్యం'లో ఆరుద్ర కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. చరిత్రకారులు హెచ్.కృష్ణశాస్త్రి, నేలటూరి వెంకటరమణయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వెంకట్రామయ్య, నీలకంఠ శాస్త్రి, జి.పరబ్రహ్మశాస్త్రి 'రేనాటి చోళుల' గురించి పరిశోధనలు చేశారు.

బి.ఎస్.శాస్త్రి, అవధానం ఉమామహేశ్వరశాస్త్రి, కె.శ్రీనివాసులు, పి.భాస్కరరెడ్డి వంటి చరిత్ర పరిశోధకులు కూడా కృషిచేసి 'రేనాటి చోళుల' సమాచారం అందించారు. డా.యం.ఆదినారాయణశాస్త్రి రాయలసీమ తెలుగు శాసనాల సాంస్కృతిక అధ్యయనం చేశారు. 'కడప జిల్లా శాసనాలు- చరిత్ర' పైన డా.అవధానం ఉమామహేశ్వరశాస్త్రి పరిశోధన చేశారు. 'రేనాటి చోళులు' పేరుతో కె.శ్రీనివాసులు, ఉమామహేశ్వరశాస్త్రి సంయుక్తంగా 'కడప జిల్లా చరిత్ర అధ్యాపకుల సంఘం' నుంచి రచన వెలువరించారు.

చివరగా...

తెలుగు భాషకు వెలుగుపూలు పూయించిన ఘనత రేనాటి చోళులకు దక్కుతుంది. తొలి తెలుగు శాసనం 'కలమళ్ళ శాసనం' మొదటి అడుగు. దీన్ని అన్వేషించి తిరిగి ఈ నేలపైన ఆవిష్కరించుకోవడం ప్రతి తెలుగువాడి లక్ష్యం. ఆశయం. కనీస ధర్మం.

2013-14 సంవత్సరాన్ని ప్రపంచ తెలుగు మహాసభల్లో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా 'తెలుగు భాష, సంస్కృతి వికాస సంవత్సరం'గా ప్రకటించుకున్నాం. రూ.25 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని ప్రకారం ప్రతి జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు పంపిణీ కావాలి. 'తెలుగుబాట' అనే కార్యక్రమం కూడా రానుంది. అన్నీ బాగానే వున్నాయి. మన నిర్లక్ష్యంతో మననుంచి చేజారిపోయిన తొలి తెలుగు శాసనాన్ని మళ్ళీ తెలుగు నేలపైన పునఃప్రతిష్ఠించుకుంటేనే నిజంగా మనకు సార్థకత. లేకుంటే భావితరాలు ఎప్పటికీ మనల్ని క్షమించవు!

-వేంపల్లి గంగాధర్, 9440074893

శాసనభాగ పాఠము :

1. ....
2. కల్ముతురా
3. జు ధనంజ
4. య ఋ రేనా
5. ణ్డు ఏళన్
6. చిఋంబూరి
7. రేవణకాలు (పం)
8. పు చెనూరు కాజు
9. ఆఱికాశా ఊరి
10. ణ్డవారు ఊరి
11. న వారు ఊరిస....

కవర్ స్టోరీ



సంస్కృతం, తమిళంలకు ప్రాచీన హోదా దక్కిన తర్వాత ఎట్టకేలకు 2008 నవంబరు 1వ తేదీ నాటికి గానీ తెలుగుకు ప్రాచీన హోదా దక్కే భాగ్యం లభించలేదు. అదీ ఎన్నికల కాలం కాబట్టి ఇప్పటికైనా వచ్చింది. లేకుంటే ఎప్పటికి దక్కేదో...? పనిలో పనిగా 'కన్నడ' కస్తూరి కూడా ఇదే హోదాతో గుబాళించింది. 'అన్నీ శుభశకునములే..' అని మనమనుకుంటూ వుండగానే కేరళలో మంటలెత్తుకున్నాయి. ఇప్పుడక్కడ 'ప్రాచీన హోదా'చిచ్చు రగులుకుంది. 'మలయాళం'కు ప్రాచీన హోదా కావాలని అక్కడి రచయితలు, విద్యావేత్తలు ర్యాలీలకు, ధర్నాలకు నడుం బిగిస్తున్నారు. చూడాలి ముందు ముందు ఈ వైఖరి ఎంత వరకు దారి తీస్తుందో?

ప్రాచీన భాష హోదా లభించడం వల్ల ఏమిటి ప్రయోజనం..కొత్తగా కొమ్ములొస్తాయా? భాషకేమైనా పట్టు లంగా, ఓణీ తొడిగి అందాల అప్సరసలా ఫ్యాషన్ పెరేడ్‌లో ర్యాంప్‌పై వయ్యారాలతో నడిపిస్తారా? ఉన్నట్లుండి మనందరి జీవితాలు ఒక్కసారిగా మార్పుకు లోనవుతాయా? ఏం జరుగుతుంది..భాషకు రాజకీయ చీడ పట్టుకుంటే ఇలాంటి వైపరీత్యాలే సంభవిస్తాయి. అప్పుడే ఏమైంది ఇప్పుడు మలయాళం..రేపు అస్సామి ..మర్నాడు హిందీ! దేశంలోని అన్ని భాషలకు ఏదో ఒక గుర్తింపు వచ్చేవరకు ఈ కార్చిచ్చు ఆగుతుందా? ఒకరి భాష గొప్పదని...ఉన్నతమైనదని..

తెలుగుకు వెలుగు!

తెలుగుకు ప్రాచీన భాష ప్రతిపత్తి లభించిన సందర్భంలో విశ్లేషణాత్మకమైన రెండు వ్యాసాలను 'కవర్‌స్టోరీ'గా అందిస్తున్నాం. సం॥


ప్రాచీనమైనదని అంటే పరిస్థితి ఎలా పరిణమిస్తుందో దానికి ఇదే సాక్ష్యం. భాషకిప్పుడు రాజకీయ జాడ్యం చుట్టుకుంది. దాన్నుంచి ఇప్పుడిప్పుడే భాషలు బయటపడడం అసాధ్యంగా కన్పిస్తోంది.

భాష జీవనదిలాంటిది. అనంతంగా సాగిపోతూనే వుంటుంది. మనం నిలబడితే నిలబడడానికి, కాదంటే కూలి పోవడానికి భాష కట్టడం కాదు. భాష నెత్తుటితో పాటూ ప్రవహించే సజీవ ఊపిరి. కేంద్రప్రభుత్వం ప్రాచీన హోదా కల్పిస్తూ 100 కోట్లు ఇచ్చినంత మాత్రనా తెలుగు భాష రేపటినుంచి మాట్లాడే వారి సంఖ్య నాల్గింతలుగా పెరిగిపోదు. డబ్బుతో భాషకు కొలమానం చేయడం ఎంతటి నైతికం? దీనికి, రాజకీయానికి సంబంధం వుండదా? రాజకీయ వైరస్ ఎక్కడైతే ప్రవేశిస్తుందో అక్కడ ఏం మిగుల్తుంది? ఇప్పుడు ఈ 100కోట్లు ఎంత వరకు సక్రమంగా 'భాష'కోసమే వినియోగం అవుతుంది? నీతి ఎంత? అవినీతి ఎంత? పారదర్శకత ఏపాటి? ఇవన్నీ ఇవాళ కన్నడ భాషాభిమానులకు మాత్రమే వస్తున్న ప్రశ్నలు కాదు. తెలుగు వారి హృదయంలోని ఆందోళన కూడా అక్షరాలా ఇదే.

భాషాపురోభివృద్ధికి కొత్తగా ఏర్పడే మండలి నెలకొల్పబడి ఏం సాధిస్తుంది? తెలుగు భాషలోని ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను వెలుగులోకి తీసుకొచ్చి ఆదరించాల్సిన 'తెలుగు అకాడమీ' ఇప్పుడు లాభాల కోసం ఆంగ్లమాధ్యమంలోని పాఠ్యపుస్తకాలను ప్రచురించుకుంటున్న సందర్భంలో కొత్తగా ఏర్పడే మండలి అయినా తెలుగు వారికి నిజంగా ఉపయోగ పడుతుందా? యూనివర్శిటీలు జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటై డాక్టరేట్లు పిలిచి పిలిచి వెంటపడి ఇస్తున్న నేపథ్యంలో భాష పరిశోధన రంగంలో పది మందికి డాక్టోరల్ ఫెలోషిప్, మరో ఐదుగురికి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లు ఇచ్చినంత మాత్రనా తెలుగు భాష ఉద్ధరించబడుతుందా? పోనీ కనీసం వీరి ఎంపిక అయినా రాజకీయాలకు అతీతంగా నిష్పక్షంగా జరుగుతుందా?


పురస్కారాలు ఇవ్వడంకోసమో...తమకు సంబంధించిన వ్యక్తులకు ఇప్పించుకోవడం కోసమో ఇలా మనం 'తెలుగు'కు ప్రాచీన హోదా తెచ్చుకున్నామా? ముగ్గురు భాషా విద్వాంసులకు






జీవితకాల కార్యసాధక పురస్కారాలు (ఒక్కో పురస్కారానికి లక్ష), 50 వేలతో పండితులకు ఐదు పురస్కారాలు ఇస్తారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం సాధించబడుతుంది. తెలుగు భాషకు గొప్పమేలు జరిగిపోతుందని ప్రభుత్వ భావన. నిజానికి తెలుగు భాష ఉనికికోసం నిరంత రం తపించే కవులు, రచయితలు తమ పుస్తకాలను తామే అచ్చువేసుకుని ఉచితంగా పంచుకుంటున్న రోజులివి. 'తెలుగు రచయిత'ను ఎవరు బతికించాలి? చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేస్తే 'ఆప్కో' ద్వారా మార్కెటింగ్ చేసుకోవచ్చు, బొమ్మలు, పెయింటింగ్‌లను తయారు చేస్తే 'లేపాక్షి' ద్వారా అమ్ముకోవచ్చు. మరి పుస్తకాలను ప్రచురించుకున్న 'తెలుగు' రచయితలకు ప్రభుత్వం ఎందుకు ఒక మార్కెటింగ్ సంస్థను ఏర్పాటు చేయదు? ఇప్పటికైనా కవులు, రచయితలు, సాహిత్య కారులు ఇలాంటి సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసేలా కనీసం 'తెలుగుకు ప్రాచీన హోదా' నేపథ్యంలోనైనా తీవ్ర ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనావుంది. ప్రతి జిల్లాలోనూ తెలుగు పుస్తకాలను విక్రయించే ఒక సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ప్రతి ఆరు నెలలకు విక్రయాలనంతరం రచయితలకు దక్కాల్సిన మొత్తాన్ని అందజేసే ఏర్పాటు చేయాలి. అప్పుడే తెలుగులో ఆధునిక సాహిత్యానికి జీవం పోసినట్లు అవుతుంది. తెలుగులో పుస్తక విక్రయాలు పెద్దెత్తున జరుగుతూనే వున్నా, చివరికి రచయితల చేతికే ఏమి అందడంలేదు. ఇది అక్షర సత్యం. సాహిత్య కారులంతా ఉద్యమాన్ని నడిపి అయినా ఇలాంటి సంస్థను స్థాపించుకోవడం అత్యవసరం కూడా! తెలుగు భాషా పండితుల విషయానికి వస్తే గ్రేడ్ I, గ్రేడ్ IIగా దేశంలోనే ఎక్కడా లేనివిధంగా విడగొట్టిన ప్రభుత్వాలు వాళ్లను ఒకేవర్గంగా (ఇద్దరూ చేస్తున్నది ఒకేపని) కలిపే ఏర్పాటు చేయదు. మాతృభాషలో విద్యాబోధన చేస్తున్నారనే స్పృహతో తమిళనాడులో ఇస్తున్నట్లు ఒక 'అదనపు ఇంక్రిమెంట్' ఇచ్చే ఏర్పాటు ఎందుకు చేయదు? తెలుగు భాషా పండితులపట్ల చిన్నచూపు చూపుతూ 'ప్రాచీన హోదా' అని సంబర పడడం ఏమిటి? ప్రభుత్వ కార్యాలయాల బోర్డులన్నీ ఆంగ్లంలో రాసుకొని తెలుగును విస్మరించింది ప్రభుత్వం కాదా? పాలనా భాషగా తెలుగును అమలు చేయాల్సిన ప్రభుత్వం ఎందుకు దారుణంగా విఫలమవుతోంది? ఎంతమంది ప్రభుత్వఉద్యోగులు తమ సంతకాలను రిజిస్టర్లలో తెలుగులో పెడ్తున్నారు? ఇంటిపేర్లను కప్పిపుచ్చుకుంటూ 'పి.పి.కె' అంటూ, 'కె.ఆర్.ఎస్' అంటూ రాసుకుంటూ తెలుగుతనాన్ని వదిలేస్తున్నారో.. మాతృభాషను దూరం చేసుకోవడమంటే కన్నతల్లికి ద్రోహం చేయడం లాంటిదే కదా! రాజకీయ పార్టీ ఏదైనా కావచ్చు. కానీ తెలుగు భాషకు అన్యాయం జరుగుతున్నప్పుడు, తెలుగు రచయితలు, భాషా పండితులు ఆవేదన చెందుతున్నప్పుడైనా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగు భాష మాట్లాడే మొత్తం జనాభా 15 కోట్లు. భారతదేశంలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగు. ఆంధ్రప్రదేశ్‌లోతెలుగువారి జనాభా 8కోట్లు. ఇదీ తెలుగువారి వైభవం. చరిత్రలోతుల్లోకి వెళ్తే రుగ్వేదంలోని ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రుల ప్రసక్తి ఉంది. మనుస్మృతిలోనూ, భరతుడి నాట్యశాస్త్రంలోనూ ఆంధ్రుల ప్రస్తావన కన్పిస్తుంది. చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలోని గ్రీకు రాయబారి మెగస్తనీసు తన ఇండికాలో ఆంధ్రులు స్వతంత్ర రాజులని పేర్కొన్నాడు. కర్నూలు జిల్లాలోని ఎర్రగుడిలోనూ, రాజుల మందగిరిలోనూ లభించిన అశోకుడి శాసనాలను బట్టి ఈ ప్రాంతం మౌర్యసామ్రాజ్యంలో భాగంగా ఉండేదని తెలుస్తుంది. క్రీ.శ. 575 లో 'ఎరికల్ ముత్తురాజు' బిరుదుతో రేనాటి చోళరాజు ధనుంజయుడు కడప జిల్లా కమలాపురం తాలూకాలో కలమళ్ళలో వేయించిన తొలి తెలుగు శాసనం ప్రసిద్ధమైనవిగా గుర్తింపు పొందాయి. ఆంధ్ర దేశాన్ని పాలించిన శాతవాహనరాజు హాలుడు కూర్చిన గాథాసప్తశతి క్రీ.పూ. 2వ శతాబ్దం నాటి తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. క్రీ.శ. మొదటి శతాబ్దానికి ముందు బయటపడిన ఎన్నో చారిత్రాత్మక ఆధారాల్లో తెలుగు ఊళ్లపేర్లు లభించాయి. సీతా స్వయంవరానికి, ధర్మరాజు చేసిన రాజసూయయాగానికి ఆంధ్రరాజులు హాజరైనట్లు పండితులు చెప్తుంటారు. దశరథునికి సమకాలికులు ఆంధ్రులనే అభిప్రాయం కూడా ఉంది. తెలుగుకు ప్రాచీన హోదా నేపథ్యంలో సంబర పడదాం. కానీ మనం ఎంతవరకు న్యాయం చేస్తున్నామో ఆలోచించుకుందాం. భాష గొప్పదా? కాదా? ప్రాచీనమైందా? కాదా? దీనిని ఎవరు గుర్తించాలి? అనే ఆరాటం కంటే నిజమైన భాషా పోరాటమే మనకు కావాలి. అప్పుడే మన తెలుగుకు నిజమైన వెలుగు. తెలుగు నేలపై తెలుగు భాషకు రాజమకుటం ఎప్పటికీ ఉంటుంది. దానికి ఒకరు

ప్రాచీన హోదాపై విశ్లేషణ



హోదా కల్పించాల్సిన అవసరం లేదు. దేశ భాషలయందు ఏ భాష గొప్పదో నాల్గవ తరగతి విద్యార్థినైనా అడిగి చూడండి... చాలు!

- వేంపల్లి గంగాధర్
9440074893





వివిధ
ఆంధ్రజ్యోతి సాహిత్యవేదిక

సోమవారం 17 మే 2010

కాశీ యాత్రకు 180 ఏళ్లు

పాదముద్రల వెంట పయనిద్దాం..

తొలి తెలుగు యాత్రా గ్రంథకర్త, తెలుగుయాత్రా సాహిత్యానికి వన్నెతెచ్చిన వైతాళికుడు, కాశీ యాత్రికుడు 'ఏనుగుల వీరాస్వామి'ని స్మరించుకోవాల్సిన అరుదైన సందర్భమిది. క్రీ.శ. **1830** మే **18**వ తేదీ రాత్రి **9** గంటలకి మేళతాళాల మధ్య బయలుదేరిన కాశీ మహాయాత్రకు **180** ఏళ్ళ సమయమిది. ఎనిమిది రాష్ట్రాల మీదుగా దాదాపు **4000** కిలో మీటర్లు పల్లకీ మీద ప్రయాణానికి పూనుకున్న నాటి సాహస యాత్రికుడికి ఇదే నా నీరాజనం.

కందుకూరి వీరేశలింగానికంటే ముందే ఆంధ్రదేశంలో సంస్కరణ భావాలను వెదజల్లిన వారిలో వీరాస్వామయ్య ప్రథముడు. వీరి 'కాశీ యాత్ర చరిత్ర' (ప్రథమ ప్రచురణ 1838) కేవలం ఒక యాత్రారచనే కాదు. ఇందులో అధ్యయనాత్మక కోణం నుంచి లోతుగా చూస్తే ఎన్నో చారిత్రాత్మక, రాజకీయ, సామాజిక సమస్యలు స్పష్టంగా కన్పిస్తాయి. వాటి మీద తన అభిప్రాయాలను, భావాలను కూడా వీరాస్వామయ్య ఆవిష్కరించిన విధానం విశదమవుతుంది. నాటి ప్రజల స్థితిగతుల గురించి, తేటతెలుగులో జాబులుగా, దినచర్యగా రచింపబడిన ఈ గ్రంథము తెలుగు వాఙ్మయ చరిత్రలోనే అపూర్వమైనది. ఆంగ్ల పాలన గురించి చేసిన వ్యాఖ్యలు చరిత్రకు దర్పణం పడతాయి.

'ఏనుగుల వీరాస్వామి కుల వ్యవస్థ దైవసృష్టి కాదనీ, మానవ సృష్టిగా చెప్తూ కుల విభజన పుట్టుకను బట్టిగాక వృత్తుల వారీగా వుండాలన్నాడు. ఏ పరిస్థితుల్లోను కుల భేదాలు సమర్థించదగినవి కాదని దృఢంగా పేర్కొన్నాడు. కింది కులాలనబడే వాళ్లను హీనంగా చూడబట్టే వారు క్రైస్తవ మతంలోకి మారుతున్నారని వివరించాడు. సతీసహగమనాన్ని అత్యంత క్రూరమైన సాంఘిక దురాచారంగా వర్ణించాడు. బహు దేవతారాధనను నిరసించి భగవంతుడొక్కడే నన్న సార్వజనీన సూత్రాన్ని ప్రకటించాడని' వకుళాభరణం రామకృష్ణ అన్నారు. భారతీయ యాత్రా సాహితీ నిర్మాత, 22 యాత్రా గ్రంథాలను రాసిన రాహుల్ సాంకృత్యాయన్ (1893–1963) కంటే వీరాస్వామి వందేళ్ళ ముందే యాత్రల్లో గెలుపు బావుటా ఎగరేసిన ధీశాలి.

ఏనుగుల వీరాస్వామయ్య క్రీ.శ.1780–1836 మధ్య చెన్న పట్నం (చెన్నై)లో వుండి ప్రజాసేవ చేశారు. తండ్రి పేరు సామయ మంత్రి. చెన్నపట్నం కోర్టులో ఇంటర్ ప్రిటర్‌గా పనిచేసిన వెన్నెలకంటి సుబ్బారావు, కొచ్చెర్లకోట వెంకటరాయుడు వీరి బంధువులు. వీరాస్వామయ్య 1780లో జన్మించినట్లు తెలుస్తోంది. వీరి తొమ్మిదవ ఏటనే తండ్రి చనిపోయారు. వీరు కష్టపడి వీధి బడిలో తెలుగు, తమిళం, సంస్కృతం, ఇంగ్లీష్ స్వయంకృషితో నేర్చుకున్నారు. తూర్పు ఇండియా వర్తక కంపెనీలో వాలంటీరుగా వీరు పన్నెండేళ్ళ వయసులోనే చేరారు. చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూనే కోర్టులో తర్జుమా చేసే ఇంటర్ ప్రిటర్ ఉద్యోగంలో 1819లో చేరారు. వీరు అనేక పండిత సభలలో పాల్గొన్నారు. 1822-23 మధ్య క్షయ మాస నిర్ణయం చేయడానికి జరిగిన సభలో వాదించి గెలిచారు. గయలో జరిగిన పండిత సభలో మూల స్మృతులేవో, ఉపస్మృతులేవో, ఆది పురాణాలేవో నిర్ణయించారు. స్మృతిచంద్రికను తర్జుమా చేశారు. 1830–31 మధ్య వీరు వివిధ ప్రదేశాలను తిరుగుతూ దినచర్య (డైరీ)గా, తన మిత్రుడైన కోమలేశ్వరం శ్రీనివాస పిళ్ళైకి జాబులుగా ఆనాటి ప్రజల సామాజిక స్థితిగతులన్నీ రాశారు. అందులోనే చెన్న పట్నం చరిత్ర ఉంది. దీనినంతా కలిపివారు 'కాశీ యాత్రచరిత్ర' పేరుతో 1838లో ప్రకటించారు.

మిత్రుడైన శ్రీనివాస పిళ్ళై అంటే వీరాస్వామయ్యకు ఎనలేని అభిమానం. వీరిద్దరూ కలిసి 1833లో నందననామ సంవత్సరం కరువులో బీదలకు అన్న వస్త్రాలు సహాయమందించారు. ఆడపిల్లలకు విద్య నేర్పించాలనే ఉద్దేశంతో ఒక ప్రత్యేక పాఠశాల కూడా నడిపారు. వీరాస్వామయ్య, రాఘవాచార్యులు, శ్రీనివాసపిళ్ళై కలిసి జార్జి నార్టన్ నాయకత్వంలో చెన్న పట్నంలో హిందూ లిటరరీ సొసైటీని 1830 దశకంలో స్థాపించారు. ఆంగ్ల విద్యా వ్యాప్తితో పాటూ, స్త్రీ విద్యా వ్యాప్తికి, వితంతు వివాహాలకు, వెనుకబడిన కులాలవారి అభ్యున్నతికీ విస్తృతంగా కృషిచేశారు. వీరందరూ కలిసి ఉన్న చిత్రపటం చెన్నైలోని పచ్చయప్ప కళాశాల వారి వద్దనుంచి స్వీకరించి దిగవల్లి వేంకట శివరావు (సంపాదకుడు) కాశీయాత్ర చరిత్రలో చేర్చారు. అలా 1773లో నాటి చెన్నై పట్నం నాటి చిత్రాన్ని కూడా సేకరించి పొందుపర్చారు.



న్యాయస్థానంలో పనిచేస్తూనే అందరి అధికారుల మన్ననలు అందుకుంటూ 1835లో పదవీ విరమణ పొందిన ఏనుగుల వీరాస్వామయ్య 1836 అక్టోబర్ 3వ తేదీన తనువు చాలించారు. పల్లకీ అయినా, పడవైనా, కాలి నడకైనా యాత్రికుడు విరామం ఎరుగడు. ఆగిపోడు. నదిలా ముందుకు సాగిపోతూనే వుంటాడనే దానికి వీరి జీవితమే తార్కాణం.

'జగదీశ్వరుండు నాచేత కొంత దేశాటనము జేయింపదలచి నన్ను నేలుచున్న సూప్రీం కోరటు (సుప్రీం కోర్టు) దొరల గుండా సెలవిప్పించినాడు గనుక నేను కాశీ యాత్ర బోవలెనని 1830 మే నెల 18వ తేదీ కుజ వారము రాత్రి (9) ఘంటలకు చెన్న పట్టణము విడిచి మాధవరము జేరినాను'– అని కాశీయాత్ర చరిత్ర మొదటి ప్రకరణము ప్రారంభమవుతుంది. అదొక అనంత ప్రవాహ వేగంతో వివిధ ప్రాంతాల ఆచార వ్యవహారాలు, స్వభావ వ్యవహారాలు, సంప్రదాయాలు, వేడుకలు, పండుగలు, వ్రతాలు, నోములు, పూజలు, జాతరలు, ఉత్సవాలు మొదలైన ఎన్నింటినో మన కళ్ళ ముందు సాక్షాత్కరింపజేస్తుంది. అవన్నీ దశ్యాలు దృశ్యాలుగా మన మనో కోణంలో నిలిచిపోతాయి.

చెన్న పట్నం నుంచి యాత్రా పల్లకీ బయలుదేరి దిగువ తిరుపతి, కడప, శ్రీశైలం, హైదరాబాదు, నాగపూర్, జబ్బల్ పూర్, రీమా, మీర్జాపూర్, ప్రయాగ, కాశీ, పాట్నా, గయ, కలకత్తా, కటకం, జగన్నాథం, గంజాం, విజయనగరం, పిఠాపురం, రాజానగరం, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, బాపట్ల, వేటపాలెం, చిన్న గంజాం, నెల్లూరు మీదుగా తిరిగి చెన్న పట్నం చేరడంతో యాత్ర ముగుస్తుంది. మార్గమధ్యంలో చాలా ప్రదేశాలను, ప్రాధాన్యం గల అంశాలను వారు విశ్లేషణతో క్లుప్తంగా వివరించారు.

శ్రీశైలయాత్రలో చెంచుల గురించి, కావలి బంట్రోతులు, మొహరం, దొంగల భయం, కృష్ణా గోదావరుల మధ్య ఆచార వ్యవహారాలు, నర్మదానదిలో రాళ్ళన్నీ లింగాలు, ఇంగ్లీషు దొరతనము, తమల పాకులు, త్రివేణీ సంగమము, పంచ గౌడ స్త్రీలు, హిందుస్థానీ మాటలు, గంగానది మీద ప్రయాణం, మణికర్ణిక, దేవాలయాల మీద బొమ్మలు, కాశీ చలి, విష్ణు పాదము, పంచ గయలు, నావ దొంగలు, ఛపన్న భాషలు, బోయీలు, సుఖరోగములు, చిలక సముద్రం, భోగ స్త్రీలు, వుప్పాడ బోయీలు, అరవ మాటలు, అత్తరు తాంబూలాలు వంటి ఎన్నో ఆసక్తికర అంశాలు తెలుసుకోవచ్చు.

బ్రౌన్‌తో పరిచయం-లేఖ: 1831 సెప్టెంబర్ 3వ తేదీన కాశీనుంచి తిరుగొచ్చిన వీరాస్వామయ్య అందరికీ గంగాజలాన్నీ, పూరీ జగన్నాథ పటాన్ని గుర్తుగా ఇచ్చి కుదుట పడిన తర్వాత తన మిత్రుడైన శ్రీనివాస పిళ్ళైకి యాత్రకు సంబంధించి రాసిన ఉత్తరాలన్నీ సరిచేసి 480 అరఠావుల్లోకి తిరగరాశారు. అందువల్లనే మూల ప్రతిలో 'ఇది ఏనుగుల వీరాస్వామయ్య అల్లించిన కాశీ యాత్రా చరిత్ర' అని వుంటుంది. 1831 డిసెంబర్ 15వ తేదీన మచిలీపట్నంలో వున్న సి.పి. బ్రౌన్‌కు ఉత్తరం రాసి పంపిస్తారు. 'ఈ పుస్తకము చాలామంది కావలెనంటున్నారు. మచిలీపట్నంలో మీరు అచ్చువేయించి మూడు వందల ప్రతులు ప్రకటించడానికి అవకాశం వుందా? దీనివల్ల నేను లాభము పొందదలచడం లేదు, దీని ప్రతులను అమ్మడం వల్ల వచ్చే లాభాన్ని ఇచ్చి వేయడానికి అభ్యంతరం లేదు, నష్టం వస్తే నేనే భరిస్తానని' లేఖ సారాంశం. 'పుస్తకాన్ని ప్రకటించడానికి సిద్ధంగా లేమని' సి.పి.బ్రౌన్ నోట్ రాశాడు. ఫలితంగా 'కాశీయాత్ర చరిత్ర' ముద్రణకు నోచుకోలేకపోయింది.

వీరాస్వామయ్య దస్తూరీతో ఇంగ్లీష్‌లోవున్న అసలు ఉత్తరం చెన్నపట్నం ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీలో వుండడంతో పాటూ దానికి బ్రౌన్ రాసిన నోట్ కూడా దానికే జత చేయబడి వుందని సంపాదకులు శివరావు 'కాశీయాత్ర చరిత్ర'లోనే తెలియపర్చారు. ఇంత చక్కటి యాత్రా రచనను బ్రౌన్ ఎందుకు ప్రచురణకు స్వీకరించకుండా తిరస్కరించాడనే అభిప్రాయం ఇప్పటికీ సందిగ్ధంగానే వుంది.

కాశీయాత్ర చరిత్రను ప్రచురణగా చూడకుండానే కన్నుమూసిన తన మిత్రుడి కోసం 1838 ఏప్రిల్ నెలలో కోమలేశ్వరపురం శ్రీనివాస పిళ్ళై తన డబ్బుతో దీనిని ముద్రించాడు. తర్వాత 31 సంవత్సరాలకు 1869లో మద్రాసు గవర్నమెంట్ రెండవ ముద్రణ తీసుకొచ్చింది. 1941లో దిగవల్లి వెంకట శివరావు సంపాదకత్వంలో మూడవసారి ముద్రించబడింది. అప్పటి నుంచి asian education society (a.e.s) వారు ముద్రిస్తున్నారు.


బాటసారి డైరీ నిండా పాదముద్రలే విజ్ఞాన సర్వస్వాలుగా మిగులుతాయి. యాత్ర అంటే సత్యశోధనతో తనలోకి తాను చేసే అంతర్ముఖీన యాత్ర. అధ్యయనం, చరిత్రకు అక్షరరూపం ఇవ్వడం. ఈ లక్షణాలన్నీ మనకు 'కాశీయాత్రచరిత్ర'లో కన్పిస్తాయి. 180 ఏళ్ళుగా ఈ ప్రయాణం సాగుతుండడమే దీనికి నిలువెత్తు నిదర్శనం. మరో సారి యాత్రా పల్లకీ వెంట ప్రయాణం చేద్దాం.. రండి.

–వేంపల్లి గంగాధర్

'తెలుగు యాత్రా సాహితీ వికాసానికి గొప్ప సంకల్ప బలంతో కృషిచేసిన ఏనుగుల వీరాస్వామికి ఒక స్మారక చిహ్నం నిర్మించాల్సిన అవసరం వుంది. కాశీయాత్ర చరిత్రని సమగ్రంగా పరిశీలించి, ఎడిట్ చేసి, సరైన మార్గ పటాలతో, బొమ్మలతో ముద్రించాల్సిన అవసరం ఉంది. ఆ పని ఒక యాత్రా రచయిత చేస్తేనే న్యాయం చేకూరుతుంది అనడంలో సందేహం లేదు. ఒకటిన్నర శతాబ్దాలుగా తెలుగువారి చేత చదవబడుతున్న కాశీయాత్రాచరిత్రను పూర్తి వ్యవహారిక భాషలోకి మారిస్తే చాలా బాగుంటుంది. ఆయన సాగిపోయిన సరళమైన బాటల మాదిరిగా సరళమైన భాషలోకి వస్తే పాఠకులు ఆనందిస్తారు' –అని ఈ నాటి ప్రముఖ యాత్రా రచయిత ప్రొ.ఎం.ఆదినారాయణ (ఆంధ్ర విశ్వవిద్యాలయం) అభిప్రాయపడ్డారు.

తొలి తెలుగు నవల

శ్రీ రంగరాజు చరిత్ర



వేంపల్లి గంగాధర్

తెలుగులో 'తొలి నవల' ఏది అనే వివాదం మొదటి నుండి ఉండనేఉంది. దీని మీద ఎన్నో వాద వివాదాలు ఎంతో మంది కుప్పలు తెప్పలుగా రాసేశారు. ఇంకా చెప్పడానికి ఏ ముందని కందుకూరి వారి 'రాజశేఖర చరిత్ర'ను భుజాల పైకి ఎక్కించుకుని నేటికీ మెరవణి (ఊరేగింపు) ఆడేవారు ఎంతో మంది ఉన్నారు. ప్రాంతీయ అభిమానాలు, వ్యక్తి ఆరాధనను వదిలించుకుని లోతుగా పరిపక్వతతో ఆలోచిస్తే నిర్దిష్టమైన ఆధారాలతో కూడిన పరిష్కారం కన్పిస్తుంది స్పష్టంగా. ఆ ప్రయత్నంలో భాగంగానే ఈ వ్యాసం. నిజానికి కొక్కొండ వెంకటరత్నం పంతులు 'మహాశ్వేత' పూర్తిగా లభించక పోవడం, లభించినంత వరకు ఉన్న నవల బాణుభట్టుడి కాదంబరి ఆధారంగా ఉందని పైగా దీనికి నవలా లక్షణాలు లేవని తేల్చి చెప్పడం కారణంగా 1867నాటి మహాశ్వేతను మొదటి నవలగా గుర్తించలేక పోయాం. ఇక దీనిపై వివాదం లేదు. ఇక రెండవ స్థానంలో మిగులుతున్నది 1872 నాటి నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి రచించిన 'శ్రీరంగరాజు చరిత్ర'. కందుకూరి వీరేశలింగం 'రాజశేఖర చరిత్ర' 1878లో వచ్చింది. దీనిని బట్టి ఆరు సంవత్సరాల ముందుగానే శ్రీరంగ రాజు చరిత్రము బయటికొచ్చిన విషయం స్పష్టం అవుతున్నది. కందుకూరి వారంటే నాకు ఎంతో ఇష్టం, గౌరవం. కానీ వారి రాజశేఖర చరిత్రను ఈ భావం చేత తొలి తెలుగు నవలాగా గుర్తించలేం. ముందుగా వ్యక్తి ఆరాధన నుంచి బయట పడినప్పుడు మాత్రమే స్వతంత్ర అభిప్రాయం వ్యక్తం చేయడానికి సాధ్యమవుతుంది. కందుకూరి దృష్టిలో శ్రీరంగ రాజు చరిత్ర నవీనతను కలిగి ఉన్న ప్రబంధంగా అనిపించకపోయి ఉండవచ్చు. 1872 నాటికి నవల అనే నామకరణం లేని కారణంగా కొంతకాలం నవీన/ వచన ప్రబంధాలుగా పిలచిన తర్వాత నవల అనే ప్రక్రియ సంతరించుకొనింది. 'తెలుగు సాహిత్యంలో నవలా ప్రక్రియను వీరేశలింగానికి ముందే శ్రీరంగ రాజు చరిత్ర అనే పేరుతో నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి రచించాడు. కానీ ఆంగ్లభాషలో ఆలివర్ గోల్డ్‌స్మిత్ రాసిన – వికార్ ఆఫ్ ది వేక్ ఫీల్డ్– అనే నవలను నమూనాగా ఎంచుకుని రాజశేఖర చరిత్రము అనే నవలను వీరేశలింగం రచించారు' అని వకుళాభరణం రామకృష్ణ రచించిన 'కందుకూరి వీరేశలింగం' జీవిత చరిత్రలో స్పష్టం చేశారు (నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా 2008 వారి ప్రచురణలో 97వ పేజీ). అసలు ఆ రచన ప్రారంభంలోనే కందుకూరి గురించిన మనకున్న భావాలు, అభిప్రాయాలు, వ్యక్తి ఆరాధనలకు అతీతంగా అతిశయోక్తులను వదిలేసి వాస్తవకోణం నుంచి కందుకూరిని చూడాలనే ఉపోద్ఘాతం కనిపిస్తుంది.

'వీరేశలింగానికి ముందు సంస్కరణ భావాలు వ్యక్తీకరించిన వారు ఉన్నారు. వారిని విస్మరించి వారు ఏర్పరచిన నేపథ్యాన్ని గణనలోకి తీసుకోకుండా, ఆధునికత వీరేశలింగంతోనే ఆరంభమైందని, సకల సాంఘిక సంస్కరణ భావజాలానికి వీరేశలింగాన్నే ఆద్యుడుగా చెప్పడం చారిత్రకం కాదు. కాకుంటే వీరేశలింగం తనకు ముందు నెలకొన్న భావాలను పోగుచేసి ఒక రూపమిచ్చి వాటిని ఉద్యమాలుగా మలచి దిశానిర్దేశం చేయడానికి కృషి చేశాడు' (వకుళాభరణం రామకృష్ణ రచన 'కందుకూరి' జీవిత చరిత్ర, నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రచురణ– పేజీ 1). ఇలా స్వంతంత్రంగా రాయడానికి నిష్కళమైన హృదయం కావాలి. అలాంటి అక్షరాలే చిరకాలం నిలుస్తాయి. ఇలాగే 'శ్రీరంగ రాజు చరిత్ర' తొలి చారిత్రక నవలా ప్రయత్నమనిఅక్కిరాజు రమాపతిరావు, ఆర్.ఎస్. సుదర్శనం లాంటివారు అన్నారు. శ్రీరంగరాజు చరిత్రను మొగలి నాగభూషణ శర్మ, బొడ్డపాటి వేంకట కుటుంబరావులు కూడా మొదటి తెలుగు నవలగానే పేర్కొన్నా రు. శ్రీరంగ రాజు చరిత్ర అనువాదం కానీ, అనుసరణ కానీ కాదు. శెట్టి దీనిని 'నవీన ప్రబంధం'గా కూడా వ్యక్తీకరించారు.

1872లో లార్డు మేయో బెంగాల్ దేశీయుల ఆచార వ్యవహారాలు, జీవన విధానం తెలియజేసే నవలకు బహుమతి ప్రకటించారు. అప్పుడు కర్నూలులో డిప్యూటి కలెక్టరుగా ఉన్న నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి 'శ్రీరంగ రాజ చరిత్ర'ను రాసి బహుమతి గెల్చుకున్నాడు. దీనికే 'సోనాబాయి పరిణయము' అనే మరో పేరు కూడా ఉంది. ఫోర్ట్ సెయింట్ జార్జి గెజిట్‌లో దీన్ని నావెల్‌గా పేర్కొంటూ దీనినే వచన ప్రబంధంగా పేర్కొన్నారు. నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి తల్లిదండ్రులు తెన్ను రంగయ్య, వెంకటలక్ష్మమ్మ. వీరు కుంఫిణీ ప్రభుత్వ కొలువులో కొంత కాలం పని చేశారు. క్రీ.శ 1860–70 మధ్య కాలంలో ఉద్యోగ రీత్యా కర్నూలు వచ్చి ప్యాపిలిలో డిప్యూటి కలెక్టరుగా స్థిరపడ్డారు. వీరు బాల వ్యాకరణ కర్త అయిన పరవస్తు చిన్నయ సూరితో కలిసి 'మాన్యువల్ ఆఫ్ హిందు లా' అనే రచనను హిందూ ధర్మ శాస్త్ర సంగ్రహము (1858)గా అనువదించడం లో సంయుక్తంగా కృషి చేశారు. స్వయంగా వీరే 'ఆంధ్ర వ్యాకరణాన్ని' రచించినట్లు కూడా వీరి కుమారుడు రాజా మణిశెట్టి రచనల ద్వారా విశదమవుతుంది. అలాగే కర్నూలు జిల్లా భూగోళము అనే గ్రంథాన్ని ఎ మాన్యువల్ ఆఫ్ కర్నూల్ డిస్ట్రిక్ట్ ఇన్ ది మద్రాస్ ప్రెసిడెన్సి అనే రెండు గ్రంథాలను నరహరి వారే రచించారు. భారతదేశంలో డిస్ట్రిక్ మ్యాన్సువల్ రచించిన తొలి భారతీయుడు కూడా వీరే కావడం విశేషం. శక్తి వంచన లేకుండా చివరి వరకు సాహిత్య రంగంలో కృషి చేసిన నరహరి క్రీ.శ 1888 సర్వధారి నామసంవత్సర వైశాఖ శుద్ధ షష్ఠి బుధవారం సాయం సంధ్యవేళ పరమపదించారు. నరహరి కుమారుడు రాజా మణిశెట్టి కర్నూలు ప్రాంతం వదిలేసి విజయనగరంలోని ఆనంద గజపతి ఆస్థానాన్ని చేరుకున్నాడు. ఇతడు 1896లో నరహరి జీవితం ఆధారంగా 'గోపాలకృష్ణ మూర్తి శతకం' రాశాడు. 'సకల భూపాలరింఛోళ చక్రవర్తి, క్షీర సత్కీర్తి, గోపాల కృష్ణమూర్తి' అనే మకుటంతో శతకం ఉంటుంది. రాజా మణిశెట్టి గురించి రాంభట్ల నృసింహశర్మ ఒక వ్యాసాన్ని రాశారు.

శ్రీరంగరాజు ఈ గ్రంథంలోని నాయకుడు. 'కథా నాయకుండు మహాకులీనుడై యుండవలయును' అనే సూత్రం ప్రకారం ఇతడు నాయకుడయ్యాడు. అతని తండ్రి 'మూర రాయర గండడు' చేరదీసిన వేశ్య కొడుకు కృష్ణుడు. అతడూ శ్రీరంగ రాజు కలిసి పెరిగారు. కలిసి చదువుకున్నారు. ఇద్దరూ కలిసి వేటకు వెళ్ళిన సందర్భంలో కృష్ణుణ్ణి 'గారు' అని గౌరవంగా సంభోధించటాన్ని శ్రీరంగరాజు భరించలేక పోతాడు. అతణ్ణి అంతఃపురం నుంచి వెళ్ళగొట్టాలని తండ్రి మీద అలిగి ఇల్లు వదిలి వెళ్ళిపోతాడు. అతడు అలా తిరుగుతూ శ్రీశైల ప్రాంతానికి వెళ్ళి సోనాబాయి అనే లంబాడీ పడుచును చూస్తాడు. తొలి చూపులోనే ప్రేమిస్తాడు. భీమా నాయకుడనే దుర్మార్గుడు ఆమెను అపహరించి కొండవీటి రాజాకు అప్పగించడం, రాణి ఆమెను తప్పించడం వంటి సంఘటనల తర్వాత సోనాబాయి ఎవరో కాదనీ తన అత్తకూతురేనని శ్రీరంగరాజుకు తెలుస్తుంది. అతడు ఆమెను వివాహం చేసుకుంటాడు. శ్రీరంగరాజు సోనాబాయిని ప్రేమించడం, పెళ్ళి చేసుకోవడం ఇందులోని ప్రధాన కథ. మొదట ఈ నవలకు 'సోనాబాయి పరిణయం' అని నామౌచిత్యాన్ని ఎన్నిక చేసినప్పటికీ తర్వాత శ్రీరంగరాజు చరిత్ర గానే స్థిరీకరించారు. ఫోర్ట్ సెంట్ జార్జి సప్లిమెంట్ మూడవ క్వార్టర్ 1872 గెజిట్‌తో మొదటి నవలగా మూడుసార్లు ప్రకటితమైనది. తెలుగులో మొదటి నవలగా దీన్ని గెజిట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.

ఆచార్య కొలకలూరి ఇనాక్ తన 'సాహిత్య దర్శిని'లో తెలుగు నవలా పరిణామం గురించి వివరిస్తూ నరహరి రంగరాజు చరిత్రను సహజతను, సామాజికతనూ ప్రదర్శించిన తొలి నవలగా నిర్ధారించారు. 'ఆంధ్ర నవలా పరిణామం' గ్రంథకర్త బొడ్డుపాటి వెంకట కుటుంబరావు రంగరాజు చరిత్రను తొలి స్వతంత్ర నవలగా అభిప్రాయపడ్డారు. సమగ్రాంధ్ర సాహిత్యం నాల్గవ సంపుటంలో ఆరుద్ర కూడా తెలుగులో మొట్టమొదటి నవలగా రంగరాజు చరిత్రనే సమర్థించారు.

'వీరేశలింగం పంతులు తెలిసో తెలియకో తన రాజశేఖర చరిత్రను తొలి తెలుగు నవలని ప్రకటించుకున్నారు. కానీ ఇది ఎంత మాత్రము అంగీకార యోగ్యం కాదని కోడూరి శ్రీరామమూర్తి శ్రీరంగరాజు చరిత్రను ధృవీకరించారు. విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య దీనిని సమర్థించక పోయినప్పటికి 'రాయలసీమ మాండలికానికి చెందిన ప్రత్యేకమైన పద జాలాన్ని ఉపయోగించటం ద్వారా భాష విషయంలో నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టి ఆ కాలానికి సాహసమనుకునే పని చేశాడు. తొట్ల (ఊయల), సల్లడము (చెడ్డీ), కుచ్చుల (లంగా), కపిల (మోట), సంగటి (రాగిముద్ద) వంటి ఎన్నో రాయలసీమ పదాలు ఈ నవలలో చోటు చేసుకోవడం ప్రశంసనీయం' అని అభిప్రాయపడ్డారు. వాస్తవానికి కూడా శ్రీరంగరాజు చరిత్రకూ, రాయలసీమకు కొన్ని సంబంధాలు కనిపిస్తాయి. నవలలోని కథా నాయకుడు శ్రీశైల అరణ్య ప్రాంతంలోనూ అలంపూరం, సంగమేశ్వరం ప్రాంతాలను సందర్శించడం వంటి సంఘటనలు నవలలో చోటు చేసుకుని ఉండటం విశేషం.


కందుకూరికున్నంత మంది శిష్యులు, అభిమానులు నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టికి లేకపోవచ్చు. అదే అదునుగా తీసుకుని చరిత్రను వక్రీకరించే ప్రయత్నం విషాదకరం. వాస్తవాలు విస్పృతంగా వెలుగులోకి వస్తున్నప్పుడైనా ఆధారాలు సాక్ష్యాలుగా కనిపిస్తున్నప్పుడైనా కొన్నింటిని మనం హృదయం తెరచి స్వీకరించగలగాలి. అలాంటి అరుదైన అంశాల్లో తొలి తెలుగు నవలా వివాదం ఒకటి.

శ్రీరంగరాజు చరిత్రలో నవలా లక్షణాలు ఉన్నాయి. సామాజిక, వ్యక్తిత్వ పాత్ర చిత్రణ, ప్రథమ పురుష లక్షణాలన్నీ ఇందులో ఉన్నాయి. చారిత్రక నేపథ్యమూ, కల్పనా చాతుర్యాల కలయికగా ఈ నవలా రూపొందింది. పాఠకులకు ఆసక్తి కలిగించే రచనా శైలి కూడా ఇందులో ఉంది. శ్రీరంగరాజు చరిత్ర నవలపై అప్పట్లో (1872 ప్రాంతంలో) మచిలీ పట్నం నుంచి వెలువడే 'పురుషార్థప్రదాయిని' పత్రిక సమీక్షిస్తూ 'Rangaraja charitra is a novel in a sweet easy grametical and idiamatic telugu prose' అని ప్రశంసించింది.

వాస్తవానికి మొదటి ప్రయత్నమెప్పుడూ పరిపూర్ణంగా ఉండదు. కొంత అపరిపక్వంగానే ఉండవచ్చు. అంతమాత్రం చేత దానిని పక్కన పెట్టడం గానీ పరిగణనలోకి తీసుకోకుండా చర్చించడం గానీ దారుణమనే చెప్పాలి. కందుకూరికున్నంత మంది శిష్యులు, అభిమానులు నరహరి గోపాలకృష్ణమ్మ శెట్టికి లేకపోవచ్చు. అదే అదునుగా తీసుకుని చరిత్రను వక్రీకరించే ప్రయత్నం విషాదకరం. వాస్తవాలు విస్పృతంగా వెలుగులోకి వస్తున్నప్పుడైనా ఆధారాలు సాక్ష్యాలుగా కనిపిస్తున్నప్పుడైనా కొన్నింటిని మనం హృదయం తెరచి స్వీకరించగలగాలి. అలాంటి అరుదైన అంశాల్లో తొలి తెలుగు నవలా వివాదం ఒకటి. మొదటి అడుగు ఒంటరిదే కావచ్చు. కానీ దానికి జత కలిసే స్వరాలు ఎన్నో ఉంటాయి. సత్యాన్ని వాస్తవాన్ని ఇప్పటికైనా గుర్తిద్దాం.

రవీంద్రుడు జన్మించిందిక్కడే!





విగ్రహం చెంత వ్యాసకర్త

'విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ నెలకొల్పిన శాంతినికేతన్ గురించి అందరికీ తెలిసిందే. కానీ కోల్‌కతాలోని జొరసంఖో ప్రాంతంలో ఉన్న టాగోర్ నివాసం గురించి మాత్రం చాలామందికి తెలీదు' అంటూ అక్కడి విశేషాలు చెప్పుకొస్తున్నారు డా. వేంపల్లి గంగాధర్. టాగోర్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా కేంద్రసాహిత్య అకాడమీ ప్రకటించిన 'రైటర్స్ ట్రావెల్ గ్రాంట్' ద్వారా కోల్‌కతాలో పర్యటించారాయన.

రవీంద్రసరణి రోడ్డులోని ఆర్చిని దాటుకుని వెళ్తే రాచదర్పం ఉట్టిపడే నిలువెత్తు భవనం ఒకటి కనిపిస్తుంది. అదే రవీంద్రుడి నివాసం... జొరసంఖోటాగోర్‌బారి. ఆనాటి దేశ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సమాలోచనలకు సజీవసాక్ష్యం. జాతిపిత మహాత్మాగాంధీ, సి.ఎఫ్. ఆండ్రూస్ వంటి వారంతా ఇక్కడికి వచ్చి క్విట్ ఇండియా, వందేమాతర ఉద్యమాలకు వ్యూహాలను రచించేవారు. రవీంద్రుడి జ్ఞాపకాలతోపాటు నాటి బ్రిటిష్‌కాలంనాటి పరిణామక్రమాలన్నింటినీ మౌనంగా వీక్షించిన ఈ భవనాన్ని ప్రధాని పండిట్ జవహర్‌లాల్ 1961లో ప్రజల సందర్శనార్థం మ్యూజియంగా మార్చారు.

30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనం, జాతీయ వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. రవీంద్రుడి జీవితంలో ముఖ్యమైన సంఘటనలకు స్మృతిచిహ్నాలుగా నిలిచిన ఎన్నో వస్తువులు, చిత్రాలు, రచనలు, దుస్తులు, పత్రాలు, ప్రచురణలను ఇక్కడ ప్రత్యక్షంగా చూడవచ్చు. టాగోర్ రచనల్లోని చక్కని పరిచయవాక్యాలు, ఫొటోలు భవనం గోడలమీద కనిపిస్తాయి. టాగోర్ తండ్రి మహర్షి దేవేంద్రనాథ్ టాగోర్‌కు గుర్తుగా దీనికి మహర్షిభవన్ అనే పేరు పెట్టారు. చివరి రోజుల్లో రవీంద్రుడి జీవితాన్ని ప్రతిబింబించే చిత్రాలన్నింటినీ ఓ గ్యాలరీలో ప్రదర్శిస్తున్నారు. దీనికి 'ప్రయాణ్ కక్ష్య' అనే పేరు పెట్టారు.



విశ్వకవి వాడిన కారు

వంశవృక్ష పట్టిక

పై అంతస్తులోని ఓ గదిలో టాగోర్ సతీమణి మృణాళినీదేవికి చెందిన దివాన్, పుస్తకాలు, ఫొటోలు, చెక్క అరలు, కుర్చీలు, వెండి సామాన్లు, తమలపాకులు దాచుకునే పెట్టె వంటివన్నీ ఉన్నాయి. మరణించేవరకూ ఆమె ఆ గదిలోనే ఉండేవారట. గురుదేవ్ గీసిన పెయింటింగ్‌లో ఆమెను మనం చూడవచ్చు. దీనికి పక్కనే టాగోర్‌కు చెందిన స్టడీరూం, అతిథులకోసం ఏర్పాటుచేసిన గెస్ట్‌రూం ఉన్నాయి. బయట వరండాలో గురుదేవుడి రచనలకు సంబంధించిన షోకేస్ ఉంది. ఇందులోనే టాగోర్ వంశవృక్షాన్ని తెలిపే పట్టికను అమర్చారు. ఆయన ధరించిన దుస్తులు, పొడవుచేతుల కోట్లు, టోపీ, చెప్పులు... వంటి వాటిని ఆయన గదిలో భద్రపరిచారు.

అక్కడ నుంచి మెట్లు ఎక్కి పై అంతస్తులోకి వెళితే సాంస్కృతిక వికాసానికి టాగోర్ చేసిన కృషికి సంబంధించిన ఫొటోలు, రాజారామ్మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, బంకించంద్ర చటోపాధ్యాయ, వివేకానంద... వంటి ప్రముఖుల చిత్రపటాలు కనిపిస్తాయి. ఇక్కడే రవీంద్రుడి తాతగారైన ద్వారకనాథ్ టాగోర్, తండ్రి మహర్షి దేవేంద్రనాథ్ టాగోర్, ఇంకా సమీప బంధువులకు చెందిన విలువైన వస్తువులను ప్రదర్శనకు ఉంచారు.

జన్మదినోత్సవం...

తూర్పువైపున ఉన్న వరండాలో టాగోర్ కుటుంబానికి చెందిన వ్యక్తుల ఫొటోలు, పుస్తకాలు, పెయింటింగ్‌లు అమర్చారు. మూడు గదుల్లో ఆర్ట్‌గ్యాలరీలను కూడా ఏర్పాటుచేశారు. ఈ భవంతిలోనే కుటుంబంలోని మహిళలు ప్రసవించేందుకు ప్రత్యేకంగా నిర్మించిన ఓ గది ఉంది. అందులోనే టాగోర్ 1861 మే 7వ తేదీన జన్మించారు. అయితే బెంగాల్‌లో మాత్రం తేదీతో సంబంధం లేకుండా వైశాఖ మాసం 25వ రోజున ఆయన జన్మదినోత్సవం జరుపుతారు. అందుకే ఈ ఏడాది మే 9 తేదీన ఆయన జయంత్యుత్సవాన్ని చేశారు. వంటగదిలో మట్టిపొయ్యి, పింగాణీపాత్రలు, భోజనం చేయడానికి వీలుగా వెదురుతో అల్లిన బల్ల, అద్దాల బీరువాలు ఉన్నాయి.

మహర్షిభవన్‌కు పక్కనే విచిత్రహాల్ ఉంది. సాంస్కృతిక అంశాలకు సంబంధించిన వస్తువులన్నీ ఈ హాల్లో పొందుపరిచారు. టాగోర్ రచించిన డాక్‌ఘర్ (పోస్టాఫీసు) నాటకాన్ని 1917లో ప్రదర్శించిందిక్కడే. ఆయన ఎప్పుడూ ప్రయాణించే కారు కూడా ఆవరణలో ప్రదర్శనకు ఉంచారు. ప్రతిరోజూ ఇక్కడ రెండుసార్లు సౌండ్ అండ్ లైట్ షోలు ఉంటాయి. మంగళ, గురువారాలు ఈ షోలకు సెలవు. పచ్చని చెట్ల మధ్యలో అలరారే ఈ ప్రాచీన భవంతిని సందర్శిస్తే ఆనాటి రవీంద్రుడి జీవితంలోని ఎన్నో విశేషాలను ప్రత్యక్షంగా చూసినట్లే అనిపించింది. గురుదేవుడి జీవితాన్ని కనులారా వీక్షించాలనుకునేవాళ్లు ఒక్కసారయినా ఈ భవనాన్ని తప్పక సందర్శించాల్సిందే. ★



శాంతినికేతన్

ప్రకృతి ఒడిలో పాఠాలు

చిరుజల్లులు కురుస్తున్న వేళ పచ్చటి ప్రకృతి మధ్య ... అందంగా విప్పారిన ముద్దబంతి పువ్వుల్లా పిల్లలు ... ఎత్తయిన చెట్ల మధ్యనున్న ఆ పాఠశాలే 'శాంతినికేతన్'. విశ్వకవి రవీంద్రుడి 150వ జయంతోత్సవాల నేపథ్యంలో అక్కడికి వెళ్లాం.

ఠాగూర్ దృష్టిలో శాంతినికేతన్ అంటే కేవలం ఒక పాఠశాల కాదు. ప్రకృతిని ప్రేమించడం. స్వేచ్ఛగా విహరించడం. నచ్చిన రంగంలో విజయం సాధించడం. జీవిస్తూ జీవితాన్ని అధ్యయనం చేయడం. మట్టి, మనిషి, ఆకాశాలను అర్థం చేసుకోవడం. ఆధ్యాత్మిక రహస్యాల్ని ఛేదించడం. సత్యమార్గాన్ని ప్రబోధించడం. అందుకే ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయాలకు శాంతినికేతన్ కేంద్రబిందువుగా మారింది. మహాత్మా గాంధీ, నెహ్రూ, ఇందిర, సత్యజిత్‌రే వంటి వారిని ఆకర్షించగలిగింది. విశ్వమానవ దృక్పథానికి నిర్వచనం శాంతినికేతన్.


భోల్‌పూర్‌లో ...

కోల్‌కతాకు 163 కిలోమీటర్ల దూరంలో వుంది శాంతినికేతన్. భోల్‌పూర్ వరకు రైలు మార్గం ద్వారా వెళ్ళవచ్చు. అక్కడినుంచి రిక్షాలుంటాయి. భోల్‌పూర్ రైల్వేస్టేషన్లోంచి బయటికి వచ్చే మార్గం దగ్గరే ఠాగూర్‌కు చెందిన పెద్ద పెద్ద బొమ్మలు గోడలకు దర్శనమిస్తాయి. శాంతి నికేతన్ సైట్ సీయింగ్ మ్యాప్‌కూడా వుంటుంది. భోల్‌పూర్ రైల్వే అధికారులు చేసిన మరో గొప్ప పని కూడా వుంది. ఠాగూర్ అనారోగ్యంతో ఉన్నపుడు ప్రయాణం చేసిన చిట్ట చివరి రైలు బోగీని భద్రపరిచి ప్రదర్శనకు పెట్టారు. ఇది నిజంగా ప్రశంసించదగ్గ విషయం. భోల్‌పూర్‌లో ఠాగూర్ మ్యూజియం వుందన్న విషయం కూడా చాలా మందికి తెలియదని మిత్రుడు అన్నపుడు కొంత బాధ కల్గింది. మ్యూజియం టిక్కెట్లు, రైలు టిక్కెట్లు విక్రయించే కౌంటర్లోనే ఇస్తారు.


శాంతినికేతన్ దారిలో...

ఠాగూర్ కంటే ముందు ఆయన తండ్రిగారైన మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్ దీనికి బీజం వేశారు. కాకపోతే రవీంద్రనాథ్ ఠాగూర్ దీనిని ప్రయోగాత్మక పాఠశాలగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించాడు. దీని వెనక వేద పాఠశాలల స్ఫూర్తి ఉంది. శాంతినికేతన్‌లోనే ఠాగూర్ జీవిత కాలమంతా గడిచింది. కీర్తిని, కష్టాల్ని, సంఘర్షణను అన్నిట్నీ మౌనంగా అనుభవించాడక్కడ. 1883లో తన జీవితంలోకి ప్రవేశించిన ఆయన సతీమణి 'మృణాళిని' చిన్న వయస్సులో ఇక్కడే మరణించింది. క్షయవ్యాధితో పెద్దకూతురు మాధురీలత, రెండవ కూతురు రేణుక, కలరా వ్యాధితో చిన్న కొడుకు శమీంద్రనాథ్‌లు కూడా ఇక్కడే ప్రాణాలు విడిచారు. ఇంత దుఃఖాన్నీ ఠాగూర్ శాంతినికేతన్‌లోనే భరించారు.

దాదాపు 1122 ఎకరాల్లో, కేవలం ఐదుమంది విద్యార్థులతో తండ్రి ప్రారంభించిన శాంతినికేతనాన్ని క్రమక్రమంగా విశ్వభారతి విశ్వవిద్యాలయంగా మార్చేందుకు ఠాగూర్ ఎంతగానో కష్టించాడు. నోబెల్ బహుమతిగా తనకు దక్కిన మొత్తాన్ని శాంతినికేతన్ కోసమే ఖర్చు పెట్టాడు. తండ్రి 1905లో చనిపోయిన తర్వాత నెలకు కొంత మొత్తం వంశపారంపర్యంగా వస్తే దానిని కూడా ఠాగూర్ దీనికే కేటాయించాడు. త్రిపుర మహారాజు నుంచి కొంత మొత్తం, కుటుంబానికి చెందిన నగలు అమ్మడం వల్ల వచ్చిన మరికొంత మొత్తం, పూరిలో సముద్రతీరం వద్ద వున్న నివాసాన్ని అమ్మడం ద్వారా వచ్చిన ఇంకొంత మొత్తం, తన రచనల ద్వారా వచ్చిన 12వేల



తొలినాళ్ల ఆనవాలు... ఈ గంట



ఠాగూర్ కొడుకు-సమీంద్ర, కూతురు-మీరాదేవి

పారితోషికం మొత్తం 'శాంతిని కేతన్'ను ఆర్థికంగా నిలబెట్టడానికే ఠాగూర్ శ్రమించాడు.

ఇవాళ శాంతి నికేతన్‌లో 6500 మంది విద్యార్థులున్నారు. 52 హాస్టళ్ళున్నాయి. 126 మంది ప్రొఫెసర్లు ఉన్నారు. రెండు కిండర్ గార్డెన్ స్కూల్స్, 8 ఇనిస్టిట్యూట్స్, ఒక ఫ్రీ డిగ్రీ స్కూల్, రెండు పాఠశాలలు, 15 అనుబంధ సెంటర్లు పనిచేస్తున్నాయి.


ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పొందిన అమర్త్యసేన్, ప్రధానిగా ఎదిగిన ఇందిరాగాంధీ, ప్రత్యేక ఆస్కార్ అందుకున్న సినీ దర్శకుడు సత్యజిత్‌రే, ఇంకా... మహారాణి గాయత్రిదేవి, అబ్దుల్ గనీఖాన్, చిత్రకారుడు నందలాల్ బోస్ శాంతినికేతన్‌లోనే విద్యను అభ్యసించారు.

14 మే 1951 నుంచి 22 ఆగస్టు 1953 వరకు విశ్వభారతికి ఠాగూర్ వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయానికి భారత ప్రధాని మన్మోహన్ సింగ్ ఛాన్సలర్‌గా, పశ్చిమబెంగాల్ గవర్నర్ రెక్టార్‌గా, ప్రొఫెసర్ రజిత్ కాంతరే వి.సి.గా విధులు నిర్వహిస్తున్నారు.

కళాభవన్, విద్యాభవన్, శిక్షాభవన్, సంగీత్ భవన్, వినయ భవన్, రవీంద్ర భవన్, పల్లె సంఘటన (గ్రామీణ పునరుద్ధరణ సంస్థ) పల్లె శిక్షాభవన్ (వ్యవసాయ సంస్థ) అనే శాఖలన్నీ శాంతినికేతన్‌లో భాగమై వున్నాయి. శాంతి నికేతన్‌కు దగ్గర్లోనే సురుల్ గ్రామంలో గ్రామీణ పునరుద్ధరణ కేంద్రాన్ని స్థాపించి 'శ్రీనికేతన్' అని పేరు పెట్టారు. 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ రూరల్ రికన్‌స్ట్రక్షన్'గా దీన్ని వ్యవహరిస్తారు. చేతివృత్తులకు సంబంధించిన శిక్షణ ఇక్కడ అందిస్తారు.

శాంతినికేతన్‌లో సంగీత, నృత్య, శిల్ప, చిత్రలేఖన విద్యలతోపాటు, బెంగాలీ, హిందీ, సంస్కృతం, పర్షియన్ ... వంటి భాషా సాహిత్యాల్ని బోధిస్తున్నారు. ఇక్కడ తెలుగు విద్యార్థులు కూడా ఉండడం విశేషం. రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణారావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, బెజవాడ గోపాలరెడ్డి తదితరులు శాంతి నికేతన్‌లోనే చదువుకున్నారు.

గురజాడ అప్పారావు గారు కలకత్తా వెళ్ళినప్పుడు అట్నుంచి అటే శాంతి నికేతన్ వెళ్ళి విశ్వకవిని కలిశారు. వారిద్దరు మధ్య సాహిత్యాంశాలతో ఉత్తరాలు రాసుకోవడం కూడా జరిగింది. అలాగే పిఠాపురం ఆస్థాన సంగీత విద్వాంసుడైన తుమురాడ సంగమేశ్వర శాస్త్రి వీణావాద్య కచేరికి మెచ్చి ఠాగూర్ వారిని తనతో పాటు శాంతినికేతన్‌కు తీసుకెళ్ళారు.



అమీర్ కుటీర్ దగ్గర వ్యాసకర్త

విలువలు పతనం...!

'నా కలల ఆశ... ఆకాంక్ష శాంతినికేతన్. దానికి విలువ తగ్గితే నా శ్రమ వృధా అవుతుంది. దీని గురించే నేను నిరంతరం ఆలోచిస్తూ గడుపుతున్నా' నని విశ్వకవి ఠాగూర్ స్వయంగా రాసుకున్నాడు కూడా!

కానీ ఏదతే జరగకూడదని భావిస్తూ వచ్చారో అలాంటి సంఘటనలన్నీ శాంతినికేతన్‌లో చోటు చేసుకుంటూ వచ్చాయి. నోబెల్ పురస్కారాన్ని రవీంద్ర మ్యూజియం (శాంతినికేతన్‌లో ఠాగూర్ నివాసం పక్కనే ఈ మ్యూజియం ఉంది) నుంచి ఎవరో దొంగిలించారు. ఇప్పటి వరకు ఆ మెడల్ దొరకలేదు. సిబిఐకి కేసు ఇచ్చినా ఫలితం లేకపోయింది. జనవరి 7, 2008లో శాంతినికేతన్ హాస్టల్‌లో ఇరవైమూడు సంవత్సరాల సస్వతిపాల్ అనే అమ్మాయిని ఒక అబ్బాయి వెంబడించి రివాల్వర్‌తో కాల్చి, వాడు కూడా కాల్చుకొని ప్రాణాలొదిన సంఘటన చోటుచేసుకుంది.


అలాగే ఎన్నో కళాఖండాలు దొంగలపాలయ్యాయి. ఠాగూర్ పెళ్ళినాటి ప్రత్యేక చీర (మృణాళిని దేవి ధరించిన బళుచూరి చీర) మాయమైపోయింది. కళాభవన్ నుంచి ఠాగూర్, నందలాల్, బోస్ వంటి చిత్రకారులు గీసిన పెయింటింగ్స్ కనిపించకుండా పోయాయి. దేవేంద్రనాథ్ ఠాగూర్‌కు చెందిన బంగారు ఉంగరం కూడా దుండగుల బారిన పడింది. సోమనాథ్ గారు స్వహస్తాలతో రాసిన ప్రతులు, సురేంద్రనాథ్ దత్తా వేసిన పెయింటింగ్స్, బుద్ధుడి సన్నిధిలోని తల్లి, బిడ్డల ప్రార్థనకు చెందిన ప్రాచీన పెయింటింగ్, బిహారీ ముఖర్జీ గీసిన సూర్యకాంతి పుష్పం పెయింటింగ్ లాంటివి ఎన్నో శాంతినికేతన్‌లో అపహరణకు గురయ్యాయి. మృణాళినీ దేవి చేతి గాజులు, ఠాగూర్ బంగారపు షర్ట్ బటన్, ఇంట్లో వాడే వెండి పళ్ళెం, చేతి కర్ర, చైనా స్పూన్స్, షర్ట్ జేబుకు తగిలించుకొనే గడియారం, సమురాయ్ కత్తిలాంటివెన్నో మనం కోల్పోయిన విలువైన వారసత్వ సంపద జాబితాలో వుండడం బాధాకరం.



ఠాగూర్ బొమ్మతో వచ్చిన నాణాలు



కుడ్య చిత్రాలు



టైల్స్‌తో చేసిన కళాఖండం

మొక్కుబడిగా

యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో శాంతినికేతన్ చోటు దక్కించుకోలేక పోయింది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలంటూ శాంతినికేతన్, పశ్చిమ కనుమలను మన దేశం ప్రతిపాదించగా పశ్చిమ కనుమలకు మాత్రమే ఆ స్థానం దక్కింది.

ఒక అంతర్జాతీయ అవార్డును నెలకొల్పాలని ప్రతిపాదించి, రెండు పోస్టల్ స్టాంపులను, ఒక నాణేన్ని విడుదల చేసి రవీంద్రుడి 150వ జయంతోత్సవాలకు భారత ప్రభుత్వం మొక్కుబడిగా పచ్చజెండా ఊపింది. ఒక వ్యక్తిని మరొక వ్యక్తితో పోల్చడం విజ్ఞత కాదని తెల్సినా యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ రవీంద్రుడిని ఆంగ్లకవి విలియం షేక్‌స్పియర్‌తో పోల్చేశారు. మరి ఎవరు సలహా ఇచ్చారో!

ఏది ఏమైనా ఠాగూర్ ఒక వ్యక్తి కాదు. మహోన్నత శక్తి. వ్యక్తి వ్యవస్థగా రూపాంతరం చెందడం ఠాగూర్ జీవితంలో మనం స్పష్టంగా చూడవచ్చు. ఠాగూర్ నేటి యువతకు ఒక కాంతి దీపం.

- డా. వేంపల్లి గంగాధర్
94400 74893

బ్రౌనుకు మనమేం చేశాం ?

అప్పుడప్పుడు పత్రికలలో సి.పి. బ్రౌన్ గురించి వార్తలు, విశేషాలు వస్తూనే ఉంటాయి. అయినా తెలుగు సాహిత్యానికి జీవంపోసిన మహాశక్తి బ్రౌన్ గురించి ఎంతమందికి తెలుసు? సి.పి. బ్రౌన్ ఎవరూ అంటే? ఈతరం వారిలా ఎంతమంది నుంచి సరైన సమాధానం వస్తుంది అనేది కూడా ప్రశ్నార్థకమే! నేడు మనం మహాభారతం, భాగవతం, కాశీఖండం భాస్కర రామాయణం, విష్ణుపురాణం, చదువుతున్నాం అంటే దాని వెనుక బ్రౌన్ మహాశయుడి కృషి ఎంతో ఉంది. ఈ పుస్తకాలనే కాక మరెన్నో విశిష్ట గ్రంథాలను బ్రౌన్ సంరక్షించాడు. పుట్టుకతో ఆంగ్లేయుడు అయినా తన జీవితాన్ని మొత్తం తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసిన మహనీయుడు బ్రౌన్. బ్రౌన్ జీవితంలో ఎన్నో విశేషాలు ఉన్నాయి. తెలుగు జాతి కృతజ్ఞతా భావంతో ఆర్థర్ కాటన్‌ను గుర్తు పెట్టుకున్నట్లే సి.పి. బ్రౌన్‌ను కూడా కలకాలం మనస్సులో ఉంచుకోవాలి.

ఆంధ్రదేశాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత ఆర్థర్ కాటన్‌కు లభిస్తే ఆంధ్ర భాషను అపురూప రీతిలో ఉద్ధరించిన ఘనత సి.పి. బ్రౌన్‌కు దక్కుతుంది. అందుకే వీరిద్దరు మనకు ప్రాతఃస్మరణీయులు. తెలుగు సాహిత్య దీపం మిణుకు మిణుకుమంటూ కనుమరుగు కానున్న కాలంలో, కారణ జన్ముడిలా అవతరించి తెలుగు భాషకు చేయూత నిచ్చాడు సి.పి. బ్రౌన్.

డేవిడ్ బ్రౌన్, కౌలే దంపతుల రెండవ కుమారుడుగా 1798 నవంబర్ 10వ తేదీన కలకత్తాలో జన్మించాడు. తండ్రి డేవిడ్ బ్రౌన్ కలకత్తాలో క్రైస్తవ మత ప్రచారకుడిగా పని చేస్తుండే వారు. అవిశ్రాంతంగా పని చేయడం వల్ల డేవిడ్ బ్రౌన్ ఆరోగ్యం క్షీణించి 1812 జూన్ 14వ తేదీన మరణించాడు. అనంతరం తల్లీసోదరులతో లండన్ చేరాడు బ్రౌన్. అక్కడ హెయిల్‌బెరి కాలేజీలో చేరి సంస్కృతం అభ్యసించాడు. ఇండియాలో తమ వద్ద ఉండి మరణించిన వారి పిల్లలను సర్వీస్‌లో చేర్చుకుని ఉద్యోగాలు ఇచ్చేవారు. ఆ నిర్ణయం మేరకు 1817 ఆగష్టు 4న రైటర్ ర్యాంక్‌తో బ్రౌన్ మద్రాసులో అడుగుపెట్టారు. అక్కడ వెలగపూడి కోదండరామ పంతులు గారి వద్ద తెలుగు అక్షరాభ్యాసం చేశాడు. అప్పటికి తెలుగు అనే భాష ఒకటి వుందని కూడా ఆయనకి తెలియదు. అయితే తండ్రి శిక్షణలో బాల్యంలోనే హిబ్రూ, లాటిన్, బెంగాలి, హిందుస్తానీ భాషలను నేర్చుకున్నాడు బ్రౌన్. మూడేళ్ళు మద్రాసులో శిక్షణ ముగించి 1820 ఆగష్టులో కడపలో కలెక్టర్‌కు రెండవ సహాయకుడుగా చేరాడు. అంతకు ఎనిమిదేళ్ళ కిందట వరకు అంటే 1812 వరకు సిద్ధవటం కడప జిల్లా కేంద్రంగా ఉండేది. కడప కలెక్టర్ హన్బరి తెలుగులో అనర్గళంగా మాట్లాడడం గమనించి, ఈ తెలుగు భాషను మాట్లాడడంలో అతనిని మించిపోవాలనుకున్నాడు బ్రౌన్. కేవలం పుస్తకాలను చదవడం ద్వారా తెలుగురాదని భావించి, సిబ్బందిని గురువుగా భావించి తెలుగు మాట్లాడడం నేర్చుకున్నాడు. బ్రౌన్ 1821లో కడపలో రెండు పాఠశాలలు స్థాపించాడు. 1822లో బ్రౌన్ కడప నుంచి మచిలీపట్నం జిల్లా కోర్టు రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యాడు. అక్కడే కొంత కాలం జిల్లా జడ్జిగా కూడా పనిచేశాడు. "తెలుగులో చదవదగిన సాహిత్యం అంటూ ఏదీలేదని" - ఇంగ్లీషు వారు భావించేవారు. అప్పుడు బ్రౌన్ స్థిర నిర్ణయంతో 'తెలుగు భాషా సాహిత్య అధ్యయనం' కొనసాగించాడు. ఈ విధమైన బ్రౌన్ తెలుగు సాహిత్యాభిరుచిని చాలా మంది ఇంగ్లీషు దొరలు ఏవగించుకున్నారు.

తెలుగు సాహిత్యానికి జీవంపోసి, ఎనలేని కృషి చేసిన మహనీయుడు సి.పి. బ్రౌన్- ఆయన జీవితమంతా సాహితీ సేవలోనే గడించింది. ఆ సాహితీ తపస్వి మరణించి ఈ సంవత్సరాంతానికి సరిగ్గా వందేళ్ళు పూర్తవుతున్నాయి. అయినా ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పించే ప్రయత్నాలు అటు ప్రభుత్వపరంగా కానీ ఇటు తెలుగు సాహితీ లోకంలోగానీ కనిపించడంలేదు. యావత్ తెలుగు జాతి రుణపడి ఉన్న ఆ సాహితీ మేరువు గురించి సాహితీవేత్తలు కొందరైనా ఒక్కసారి ఆలోచించి ఆయనకు ఘనంగా నివాళులర్పించే ప్రయత్నం చేయడం కనీస ధర్మం.

అయినా బ్రౌన్ పట్టినపట్టు వదలలేదు. ఆ పట్టుదల వలనే తెలుగు సాహిత్య సముద్ధరణ జరిగింది. 1823 జూన్ నెలలో ఆరు వారాల పాటు సెలవు పెట్టి మద్రాసుకు వెళ్లాడు. పుస్తక సేకరణ బ్రౌన్ లక్ష్యంగా మారింది.

వేమన పద్యాలకు ప్రాచుర్యం

బ్రౌన్ దృష్టి తెలుగు కావ్యాల మీద బాగా నాటుకపోయింది. ఒకసారి అబేదుబాయ్ [1770-1848] అనే ఫ్రెంచి గురువు రాసిన హిందూ మేనర్స్, కస్టమ్స్ అండ్ సెరిమనీస్ [హిందువుల యొక్క ఆచారాలు, అలవాట్లు, మత కర్మలు] అనే పుస్తకం చదువుతుండగా వేమన పద్యాలు కనిపించాయి. అంతే! వేమన పద్యాలు వ్రాత ప్రతుల లెన్నింటినో సేకరించాడు. మిత్రులు, అభిమానుల ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వేమన పద్యాలున్న తాటాకు గ్రంథాలను తెప్పించాడు. 1829 లో వేమన పద్యాలను ఆంగ్లంలో అనువదించి రెండుసార్లు సొంత ఖర్చుతో ప్రచురించాడు. వేమన కవితా ప్రతిభను ప్రపంచ వ్యాప్తి చేశాడు. సి. పి. బ్రౌన్. 1825 లో రాజమండ్రి కలెక్టరుకు హెడ్ అసిస్టెంట్ మేజిస్ట్రేటుగా చేరాడు. అక్కడ ఆంధ్ర మహాభారత పఠనం ప్రారంభించాడు. తిరిగి 1826 లో కడప జిల్లా కోర్టు రిజిస్ట్రార్‌గా చేరాడు. కడపే తాను సేకరించిన గ్రంథాల పరిష్కరణ శుద్ధ ప్రతుల తయారీకి స్థావరం కావాలని నిశ్చయించాడు. అందుకోసం కడపలో 1000 వరహాలకు పెద్ద బంగళా, తోట కొన్నాడు. బ్రౌన్ ఎక్కడ పనిచేసినా అతని బంగళాని 'బ్రౌన్ కాలేజి' అని పిలిచేవారు.

బ్రౌన్ ఉద్యోగరీత్యా ఎక్కడ పని చేస్తూ ఉండినా, కడపలోని తోట, ఆస్తి పాస్తులు, సాహిత్య సంబంధమైన పనులు మొదలైన వాటి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడు. తాటాకుల్లో శిథిలమైపోతూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న పెక్కు తెలుగు కావ్యాలను కాలగర్భంలో కలసిపోకుండా పునరుద్ధరించిన ఘనుడు సి. పి. బ్రౌన్.

తెలుగు ప్రబంధాలలో అత్యంత జనప్రియమైన మనుచరిత్ర, వసుచరిత్రలను మొట్టమొదట వ్యాఖ్యానాలతో అచ్చువేయించిన యశస్సు బ్రౌన్‌కే దక్కుతుంది. కడప జిల్లా నందలూరుకు చెందిన ములుపాక బుచ్చయ్య శాస్త్రికి కడపలోని తన బంగళాలో కొలువు ఏర్పాటు చేసి 1829-30 లో వసుచరిత్రకు వ్యాఖ్యానం తయారు చేయించాడు. కడపలో బంగళా తోట వ్యవహారాలు చూసేందుకు విశ్వాసపాత్రుడైన అయోధ్యాపురం కృష్ణారెడ్డిని నియమించాడు. తెలుగు తాళ పత్ర గ్రంథాలను వివిధ ప్రదేశాల నుంచి తెప్పించుకొని, వాటిని కాగితాల మీదికి ఎక్కించి, పరిష్కరింపజేసి, శుద్ధ ప్రతులను తయారుచేయించి అచ్చుకు సిద్ధంగా వ్యాఖ్యానాలు, పీఠికలు తయారుచేయడంలో కడపలోని 'బ్రౌన్ కాలేజి' సాగిపోతుండేది.

లిఖిత ప్రతులు ఎక్కడున్నా వాటిని సేకరించడమే తన లక్ష్యంగా బ్రౌన్ పెట్టుకున్నాడు. పండితుల సహాయంతో పరిష్కరింపచేసి ప్రచురణకు వీలుగా శుద్ధ ప్రతులను తయారుచేయించాడు. పద సూచికలు తయారుచేయించాడు. పద్య సంఖ్యలను నిర్ణయించి ఆశ్వాస విభజన చేయించేవాడు. పరిష్కారానికి వీలుకాని పద్యాల పక్కన తీర్పు కాని కారణాలు రాయమనేవాడు. పండితులు ఎన్ని తీర్పులు సూచించినా చిట్టచివరి తుది తీర్పు తప్పనిసరిగా బ్రౌన్‌దే. మారుమూల ప్రాంతాల నుండి వ్రాత ప్రతులు సొంత డబ్బుతో సేకరించి తెచ్చేవాడు. బ్రౌన్ మహాభారత శుద్ధ ప్రతి తయారీకి రూ. 2714 ఖర్చు చేశాడు. అప్పుడు అతని నెల జీతం రూ. 500. తెలుగు భాషా సాహిత్య సముద్ధరణకు తన సర్వస్వం వ్యయంచేసి అది చాలక పోగా మరో 60 వేల రూపాయలు అప్పు తెచ్చి వేలాది గ్రంథాలను సేకరించాడు. ఇలా సేకరించి దాదాపు 5 వేల వ్రాత ప్రతులు అందించాడు. అలాగే 1215 వేమన పద్యాలు సేకరించి ఆంగ్లానువాదం చేసి ప్రచురించాడు. మన కవులను గ్రీక్, లాటిన్, ఇంగ్లీష్ కవులతో పోలుస్తూ తులనాత్మక అధ్యయనానికి శ్రీకారం చుట్టాడు బ్రౌన్. వసుచరిత్ర, మనుచరిత్ర వంటి ప్రసిద్ధ కావ్యాలను మొట్టమొదటిసారిగా ఆయనే ప్రచురించాడు. 1841 లో నలదీవ్వపద, 1844 లో వసుచరిత్ర, మనుచరిత్రల ప్రతులు సేకరించాడు. జూలూరు అప్పయ్యశాస్త్రిచేత వాటికి వ్యాఖ్యానాలు రాయించాడు. వల్నాటి వీరచరిత్ర, ప్రభా

వతీ ప్రద్యుమ్న రాఘవపాండవీయ, కళా పూర్ణోదయ కావ్యాలకు వ్యాఖ్య రాయించి అచ్చు వేయించాడు.

మానవతామూర్తి

బ్రౌన్ సాహితీ సమారాధకుడే కాక, మానవతామూర్తి కూడా. 1822-33లో వచ్చిన గుంటూరు కరవు సమయంలో ఒక అధికారిగా ఆయన అమూల్య సేవ చేశాడు. బాలబాలికలకు ఉచిత విద్యాభ్యాసం కొరకు కడపలో రెండు పాఠశాలలు, 1823లో మచిలీపట్నంలో రెండు పాఠశాలలు, 1824లో మద్రాసులో ఒక పాఠశాల నెలకొల్పాడు. కడపలో 'సతీ సహగమనం' నిరోధించాడు. నిరుద్యోగులెందరికో ఉద్యోగాలు, బీదలకు సహాయాలు చేసినట్లు బ్రౌన్ జాబుల వలన స్పష్టమవుతోంది. తన సంపాదనలోని ప్రతి రూపాయికి పైసా వంతున దానధర్మాలకు కేటాయించాడు. ఒకసారి అప్పులు చేసి కటకటాలపాలైన పదకొండు మందిని 355 రూపాయలిచ్చి విడిపించాడు. ఉద్యోగ విధులను ఏమాత్రం విస్మరించక, ఏమాత్రం సమయం దొరికినా భాషాసేవలో గడిపేవాడు.

ప్రతిరోజూ అయిదు నుంచి పది గంటల కాలాన్ని అధ్యయనానికి వినియోగించేవాడు. వేమన పద్యాల తర్వాత బ్రౌన్‌ను ఆకర్షించిన తెలుగు రచన 'సుమతీ శతకం'. ఈ శతకం నుంచి 85 పద్యాలను ఆంగ్లంలోనికి అనువాదం చేశాడు. బ్రౌన్ 36 పురాణేతిహాసాలను సేకరించినట్లు తెలుస్తున్నది. కాశీఖండము, పద్మపురాణము, భాగవతం, భారతం, భాస్కర రామాయణం, విష్ణుపురాణం, శ్రీకాళహస్తి మహాత్మ్యం... శుద్ధ ప్రతులు రాయించాడు. మద్రాసు విశ్వవిద్యాలయంలో ద్వితీయ పండితుడిగా ఉన్న పురాణం హయగ్రీవశాస్త్రి గారి కోరిక మేరకు బ్రౌన్ తాను పరిష్కరింపజేసిన ఆంధ్ర మహాభాగవతాన్ని హయగ్రీవశాస్త్రులు తన వివేకాదర్శ ముద్రణాలయంలో 1848లో ముద్రించాడు. ఈ భాగవత పీఠికలో కడప జిల్లాలో ఉన్న ఒంటిమిట్టయే ఏకశిలానగరమని ఆయన రాశాడని బ్రౌన్ నిఘంటువు తెలియజేస్తున్నది. కావ్యాలు, ప్రబంధాలు, ద్విపదలు మొదలైన వాటినే కాక శైవుల మత గ్రంథమైన బసవపురాణం అద్భుత కథల సంకలనం తయారుచేశాడు. బాణాల శంభుదాసు రచించిన ద్విపద సారంగధర చరిత్రను బ్రౌన్ 1827లో ఆవిష్కరించాడు. ప్రభులింగలీల అనే శైవమత సంబంధమైన ద్విపదను ఆంగ్లంలోకి అనువదించాడు.

బైచరాజు వెంకటరాజు రచించిన పంచతంత్ర, హంసవిశంతులకు పదసూచికలు తయారు చేయించాడు. సింహాసన ద్వాత్రింశిక కథాసారాన్ని 43 పుటల్లో ఆంగ్లంలో సంగ్రహం చేశాడు. గౌరన హరిశ్చంద్రోపాఖ్యానాన్ని 1842లోను, వైజయంతి విలాసాన్ని 1849లో అచ్చు వేయించాడు. కళాపూర్ణోదయం, తారాశంశాక విజయం, విజయవిలాసం, కుచేలోపాఖ్యానాలను ముద్రింపజేశాడు. పాతికేళ్లలో దాదాపు పాతిక ప్రబంధాలను పరిష్కరింపజేసిన సాహితీ వ్రతుడు సి.పి. బ్రౌన్. బాణాల శంభుదాసు రచించిన ద్విపద సారంగధర చరిత్రను బ్రౌన్ 1827లో పరిష్కరించాడు. ద్విపదలలో హరిశ్చంద్ర కావ్యాన్ని నవనాథ చరిత్రలో కొంతభాగాన్ని మొట్టమొదట అచ్చు వేయించిన కీర్తి బ్రౌన్‌కే దక్కుతుంది. తెలుగు సాహిత్యంలో బ్రౌన్ ముద్రపడని ప్రాచీన కావ్యం లేదు. గ్రంథ సేకరణతో పాటుగా సాహిత్య సంబంధమైన ఇతర వాటిని కూడా సేకరించాడు. చాటువులు, జానపద గీతాలు, సామెతలు, పలుకుబళ్లు - వీటితో పాటు మంత్రతంత్ర శాస్త్రాలకు చెందిన ఆనందతంత్రం, సౌందర్యలహరి, కులార్ణవం వంటి సంస్కృత గ్రంథాలను సేకరించాడు.



కావ్యాలు, ప్రబంధాలు, ద్విపదలు మొదలైన వాటినే కాక 84 శతకాలను సేకరించి పరిష్కరించినవాడు బ్రౌన్. తెలుగు నేర్చుకునే పాశ్చాత్యుల కోసం బ్రౌన్ స్వయంగా వ్యాకరణం రచించి 1840లో ముద్రించాడు. ఆయన వ్యాకరణ రచనలో వ్యవహారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. తెలుగు వాఙ్మయంలో లేఖా సాహిత్యానికి విశిష్ట స్థానాన్ని తెచ్చిన మూలపురుషుడు బ్రౌన్. 19వ శతాబ్దంలో తెలుగు భాషా స్వరూప లక్షణాలు, సంప్రదాయాలు, లేఖావతారిక విషయం లేఖాంతం ఎలా ఉండేవో తెలుసుకోవడానికి బ్రౌన్ తయారుచేయించిన 20 లేఖా సంపుటాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

బ్రౌన్‌నిఘంటువులు

సి.పి.బ్రౌన్‌కు ఎనలేని కీర్తిని సంతరింపజేసినవి ఆయన తయారు చేసిన నిఘంటువులు. బ్రౌన్‌కు ముందు కాంబెల్, మారిన్, మామిడి వెంకయ్య... లు తెలుగు నిఘంటువులను సమకూర్చారు. కానీ నాటి నుంచి నేటి వరకు పండితులనుంచీ సామాన్యుల వరకూ ఉపయోగపడేవి బ్రౌన్ నిఘంటువులే. బ్రౌన్ పాండితీ గరిమ నిశిత ప్రజ్ఞకు సాక్ష్యాలు ఈ నిఘంటువులు. బ్రౌన్ నిఘంటువులో వాడుక పదాలు ఉన్నాయి. అవసరమైన చోట పూర్వకవి ప్రయోగాలున్నాయి. సామెతలు, జాతీయాలు, ఆంగ్లసమానార్థాలు వీలైనన్ని ఎక్కువగా ఇవ్వబడ్డాయి. ఇవే బ్రౌన్ నిఘంటు ప్రత్యేకతలు. ఉదాహరణకు అంటిచెట్టు Aplantain కదళీవృక్షము.

1844 లో తెలుగు - ఇంగ్లీమ నిఘంటువు ముద్రణ ప్రారంభించి 1852 లో పూర్తిచేశాడు. 1982 లో న్యూఢిల్లీకి చెందిన తెలుగు - ఇంగ్లీమ నిఘంటువులలోని పుటలు 1416. ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువు, ఇంగ్లీ - తెలుగు నిఘంటువు 1845 లో ప్రారంభించబడి 1853 లో పూర్తి అయింది. మిశ్రభాషా నిఘంటువు 1854 లో ముద్రింపబడింది. ఈ నిఘంటువులో అరబిక్, ఫారసీ, ఉర్దూ భాషాపదాలే కాక తమిళ, కన్నడ, మళయాళ భాషాపదాలకు కూడా అర్థాలు ఇచ్చాడు. బ్రౌన్ నిఘంటువులను ఆంగ్లం సాహిత్యం మన వారికి అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో రాశాడు. బ్రౌన్ జిల్లా నిఘంటువులను కూడా తయారు చేశారు. ఈ జిల్లా నిఘంటువు 1855 లో విల్సన్ ప్రచురించిన ఒక పుస్తకంలో విలీనం చేశారు.

1852 లో క్రైస్తవ విజ్ఞాన సంఘం వారి కోరిక మేరకు లిటిల్ లెక్సికన్ ప్రచురించాడు. అందులో అనుబంధంగా వ్యాకరణ విశేషాలు, తెలుగు వాచకం చేర్చబడినవి.

భారతీయ శిల్పశాస్త్రంపై బ్రౌన్ పరిశోధనాత్మకవ్యాసం రాశాడు. అది మద్రాస్ గెజెట్‌లోనే కాక ఏషియాటిక్ జర్నల్ లో కూడా వెలువడింది. ఉర్దూ సాహిత్యంలో వ్యంగ్యకవిగా పేరుగాంచిన సౌదా [1713 -1780] రచనలను బ్రౌన్ సేకరించి, సంస్కరింపించి ప్రచురించాడు. చారిత్రక విషయాల పట్ల ఆసక్తి గల బ్రౌన్ 'రాజుల యుద్ధాలు' అనే అనంతపురం చరిత్రను ఇంగ్లీష్‌బలోనికి తర్జుమా చేసి 1853 లో ప్రచురించాడు. తాతాచారి కథలను ఇంగ్లీష్‌లో 'పాప్యులర్ తెలుగు టేల్స్' అనే పేరుతో 1855 లో ప్రచురించాడు. మృతప్రాయమైన దశలోనుంచి తెలుగుభాషా సాహిత్యాలు జీవశక్తితో కళకళలాడునట్లు చేసిన యుగపురుషుడు బ్రౌన్.

తన కాలంనాటి పత్రికలలో వెలువడిన వ్యాసాలు, సంపాదకీయాలు, వార్తలు, లేఖలు మొదలైన వాటిని సేకరించి మంచి కాగితాలపై రాయించి ముందుతరాల వారికి అందజేశాడు. బ్రౌన్ ధన సంపాదనే ప్రధానంగా భారత దేశాన్ని పీల్చి పిప్పి చేయాలన్న సంకల్పంతో ఏర్పడిన ఈస్టిండియా కంపెనీ ఉద్యోగిగా మన దేశంలో అడుగు పెట్టాడు. కొంగలలో హంసలాగా వ్యవహరించిన వ్యక్తి బ్రౌన్. మొత్తం 34 ఏళ్ళు [1817 - 1834 : 1838 -1855] ఇండియాలో ఉండి స్వదేశానికి వెళ్ళిపోవాలని నిర్ణయించుకొని ఉద్యోగం మానేసి పింఛను తీసుకున్నాడు. బ్రౌన్ దొర లండన్ వెళ్ళిన తర్వాత అక్కడ తెలుగు సాహిత్యానికి విశిష్ట స్థానం లభించింది.

ఆనాడు ఇంగ్లండులో బ్రౌన్ దొరను తెలుగులో మించిన వారు లేరు. అందువల్ల 1865 లో లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు భాషాచార్యునిగా నియుక్తుడైనాడు. అక్కడ తెలుగు కోర్సుని ఏర్పాటు చేశాడు. ఖండాంతరాలలో తెలుగు భాషా సాహిత్యాలకు గౌరవస్థానాన్ని తెచ్చిన ఘనుడు బ్రౌన్. మహత్తర లక్ష్యసాధనకోసం శ్రమించిన వాళ్ళనందరినీ సమాజం సాధారణంగా పిచ్చివాళ్లగానే భావిస్తుంది. గ్రీక్‌లాటిన్, హీబ్రూ, ఫ్రెంచి, ఇటాలియన్, పర్షియన్, సంస్కృతం, ఆంధ్ర, ఆంగ్లం వంటి 24 భాషలలో పాండిత్యం గడించినవాడు బ్రౌన్. లండన్ తిరిగి వెళ్ళిన తర్వాత ఇంకో 30 ఏళ్ళు తెలుగు భాషాసాహిత్యాలసేవ చేసి 1884 డిసెంబర్ 12 వ తేదీన కీర్తిశేషులయ్యారు. బ్రౌన్ ఆంగ్లేయుడైనా పుట్టింది ఇండియాలోనే. పెళ్ళి, పెళ్ళాం, పిల్లల బాదరబందీ లేమీ లేకుండా రేయింబవళ్ళు తెలుగుభాషా సాహిత్యాలే తన ఊపిరిగా జీవించిన సార స్వతయోగి బ్రౌన్.

-వేంపల్లి గంగాధర్

వెలుగు పూల దీపమాను

'రాయలసీమ కథా సాహిత్యం'

రాయలసీమకు ఒక ప్రత్యేకమైన సామాజిక, సంస్కృతిక చరిత్ర ఉంది. భాషలో ప్రత్యేకమైన మాండలికం ఉంది. కాల గమనంలో జరిగిన ఎన్నో పరిణామ క్రమాలను ఇక్కడి సాహిత్యకారులు తమ రచనల్లో బలంగా వ్యక్తీకరించారు. రాయలసీమ సాహిత్యంలో స్థానికత, ప్రాంతీయత చాలా ఉన్నత ప్రమాణాలతో కనిపిస్తుంది. ఇక్కడ ప్రవహించే ప్రతి నదికీ పాడుకోవడానికి ఒక పాట ఉంది, ప్రతి కొండకూ వినిపించేందుకు ఒక కథ ఉంది. రాయలసీమ వాసులభాష, మాట తీరు, స్వభావ వ్యవహారాలు ఇతర ప్రాంతాల కన్నా భిన్నంగా ఉండటానికి చారిత్రక భౌగోళిక సాంస్కృతిక కారణాలు అనేకం. ఎన్నో ప్రాచీన కావ్యాలు, ప్రబంధాలు ఇక్కడే రూపు దిద్దుకున్నాయి. మొట్టమొదటి తెలుగు శాసనం (క్రీ.శ. 575) కడప జిల్లా ఎర్రగుడిపాడు వద్ద లభ్యమైంది. ప్రాకృత, ద్రావిడ భాషల నుండి విడిపోయి తెలుగు లిపి నిర్మితం కావడం ఈ శాసనాల్లో కనిపిస్తుంది. ఈ శాసనాలను పరిశీలించడం వల్ల అక్షర, పద, వాక్య రచనా విధానాన్ని, ఇతర మార్పులను గమనించవచ్చు. క్రీ.శ 6వ శతాబ్ది నుంచి క్రీ.శ10వ శతాబ్ది వరకు తెలుగు లిపిలో వచ్చిన పరిణామ క్రమం రేనాటి చోళుల శాసనాల వల్ల తెలుసుకోవచ్చు. వారి కారణంగానే ఇవాళ ప్రాచీన తెలుగు వాక్యరచనా విధానం తెలుస్తోంది. మొదటి శాసనాల్లో కనిపించే రేనాటి చోళుని పేరు ఎరికల్ ముర్తరాజు ధనుంజయుడు. ఎరికల్ అనేది రేనాటి సీమలోని గ్రామమై ఉంటుందని ఒక అభిప్రాయం. రేనాటి చోళుల చరిత్ర తెలుసుకోవడానికి నాలుగు తామ్ర శాసనాలు, 50 శిలా శాసనాలు ఆధారంగా లభించాయి.

అన్ని మార్గాలను కలుపుకొని రాయలసీమ అస్తిత్వ ఉద్యమం ముందుకు సాగే దశకు చేరుకుంది. వివిధ దారుల్లో, వివిధ రూపాల్లో సీమ సాహిత్య అస్తిత్వం బలంగా వినిపిస్తోంది. రాయలసీమ ప్రాంతీయ స్పృహ విస్తృతం అవుతోంది. సామాజిక, సాంస్కృతిక ఆర్థిక రంగాల్లో స్థానీయత ప్రస్ఫుటమౌతోంది. రాయలసీమ రచయితలు చాలా వరకు తమ మాండలికంలోనే తమ జీవితాలను కథల్లో ప్రతిబింబించారు. 'గట్టి గింజలు' కథా సంపుటిని అందించిన వై.సి.వి. రెడ్డి వంటి తొలి తరం కథా రచయిత కూడా తన భాషను, యాసను కథా సాహిత్యంలో పలికించడానికి ఏ మాత్రం వెనుకాడలేదు. రా.రా., జయరాం, మధురాంతకం, కేతు విశ్వనాథరెడ్డి, కొలకలూరి ఇనాక్, నామిని వంటి కథకులు చేసిన కృషి తెలుగు సాహిత్యం విస్మరించలేని దశకు చేరుకుంది. ఇప్పటికీ ఇదే కథా స్ఫూర్తి యువ కథకుల్లోనూ కొనసాగుతూ వస్తోంది. సామాజిక పరిణామంలో, దాని చలనశీలతలో సీమ సాహిత్యకారులు ప్రధాన భూమిక పోషించారు.



వేంపల్లి గంగాధర్

90లలో భూస్వామ్య సాయుధ ముఠాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక శక్తుల ఆధ్వర్యంలో నడచిన ఉద్యమం రాయలసీమలో గుర్తించవలసిన మార్పులకు కారణం అయింది. 80లలో ప్రాంతీయ ఉద్యమానికి నేతృత్వం వహించిన శక్తులే సీమ సామాజిక వ్యవస్థలోని చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని 'ఆధునిక' రూపంలో కొనసాగిస్తూ భూస్వామ్య సాయుధ ముఠాల అవతారమెత్తాయి. 'ఫ్యాక్షన్' కథలు విస్తృతంగా ఆవిష్కృతమైనాయి. అనంతపురం జిల్లాకు చెందిన గుత్తి రామకృష్ణ 1941 మార్చి 26 విజయవాణి పత్రికలో రాసిన 'చిరంజీవి' కథ రాయలసీమ ప్రాంతం నుంచి వెలువడిన మొదటి కథగా చెప్పుకోవచ్చు. 1960కి ముందు 1956- 57 ప్రాంతాల్లో అనంతపురం జిల్లా మొదటితరం రచయితగా 'విశాలాంధ్ర' జర్నలిస్ట్‌గా జి. రామకృష్ణ పని చేశారు. వీరు రాసిన 'గంజి కోసరం' అనే కథ ధాత కరువు, డొక్కల కరవులను ఇతివృత్తాలుగా తీసుకొని రాసిన విలువైన కథలుగా చెప్పుకోవచ్చు. దీనిని బట్టి 1941నాటికే 'చిరంజీవి' లాంటి కథను అందించిన జి. రామకృష్ణను 'రాయలసీమ తొలి కథకుడి'గా గుర్తించుకోవాల్సిన చారిత్రక అవసరం కూడా ఉంది. రాయలసీమ కథకుల్ని స్థూలంగా మూడు తరాలుగా వర్గీకరించుకోవచ్చు. 1941 మొదటి సీమకథ వచ్చినప్పటినుంచి 1970 వరకు కథలందించిన వారిని మొదటితరంగా, 1970-95 మధ్యకాలంల వారిని రెండవతరంగా, 1995నుండి ఇప్పటి వరకూ కథారచన సాగిస్తున్న వారు మూడవ తరంగా విభజించుకోవచ్చు.

ఇతివృత్తాల వారీగా కథాంశాల ఎంపిక విధానం ద్వారా చూస్తే, మొదటి తరం కథకులు మధ్యతరగతి ఆర్థికాంశాలను కథాంశాలుగా రాశారు. రెండవతరం కథకులు కరవు, కక్షలపై విస్తృతంగా కథారచన చేశారు. మూడవతరం కథకులు దళిత, స్త్రీ, ముస్లిం వాదాలతో పాటు ప్రపంచీకరణ పరిణామాలను కూడా కథాంశాలు చేశారు. మొదటి తరం కథకుల్లో జి. రామకృష్ణ, కె. సభా, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, ఆర్.ఎస్. సుదర్శనం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, ముంగుర శంకరరాజు, భారతం నాదముని రాజు, రాచమల్లు రామచంద్రా రెడ్డి, కేతు విశ్వనాథ రెడ్డి, సోదుం జయరాం, వై.సి.వి. రెడ్డి, పి. రామకృష్ణా రెడ్డి మొదలైనవారు. రెండవ తరం కథకుల్లో డా॥ కేశవ రెడ్డి, చక్రవేణు, నరేంద్ర, మహేంద్ర, సంగమనేని నారాయణ, బండి నారాయణ స్వామి, రాసాని, కుప్పిరెడ్డి, దాదా హయత్, వీణావాణి, సడ్లపల్లె చిదంబర రెడ్డి, ఎం.వి. రమణారెడ్డి మొదలైనవారు.

మూడవ తరం కథకుల్లో పాలగి విశ్వ ప్రసాద్, సన్నపురెడ్డి, బిజి వేముల, ఇబ్రహిం, సుంకోజి, గోపిని కరుణాకర్, వేంపల్లి గంగాధర్, చిలుకూరి దీవెన, నిర్మలా రాణి, తవ్వా ఓబుల్ రెడ్డి, జి. వెంకట కృష్ణ, తుమ్మల రామ కృష్ణ, పాణి మొదలైనవారు.

సోమవారం 29, మార్చి 10

సూర్య సాహిత్య, సాంస్కృతిక వేదిక

అక్షరం

4

editpage@suryaa.com

మొదటి 'సీమ' కథకులు

రాయలసీమ మొదటి కథకుడిగా గుత్తి రామకృష్ణను చెప్పుకున్నాం. కడప జిల్లాలో మొదటి కథా రచయితగా భారతం నాదమునిరాజు గుర్తింపు పొందారు. వీరు 'నీల వేణి' కథా సంపుటి వెలువరించారు. కర్నూలు జిల్లాలో కథకుడు సముద్రపు శ్రీమహావిష్ణు 1946-47 మధ్య కథలు రాస్తూ పేరు తెచ్చుకున్నారు. చిత్తూరు జిల్లాలో కె. సభా విస్తృతంగా కథలు రాసి కొత్త కథాలోకాన్నే సృష్టించి కీర్తి పొందారు.

'ప్రాంతీయ వాస్తవిక వాద స్పృహ ఉన్న సాహిత్యం వేరు, కేవలం ప్రాంతీయ స్వలాభాపేక్ష ఉన్న రాజకీయం వేరు. ఉప సంస్కృతులు, ఉప సమస్యలు ఉన్నంతకాలం అవి తప్పనిసరిగా సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. వాటిని తేల్చుకోవలసింది సాహిత్యకారులు కాదు. రాజకీయ మనుషులు. అది తెలంగాణ అయినా సరే, రాయలసీమ అయినా సరే!... చుట్టూ ఉన్న జీవితాన్నే నా కథలో ఇతివృత్తంగా తీసుకున్నాను. రక్త మాంసాలున్న మనుష్య రకాల్నే (టైప్స్) పాత్రలుగా చిత్రించడానికి ప్రయత్నించాను. పాత్రలకు జీవితంతో సంబంధం లేని గాలి కబుర్లు లేకుండా చూశాను. వస్తు శిల్పాల మధ్య సామరస్యం కోసం తపించాను. నేను చాలా స్లో రైటర్ని. తిరగరాస్తే తప్ప, ఎడిట్ చేసుకుంటూ పోతే తప్ప ఏ కథనూ ఏకబిగిన రాసే శక్తి లేని రచయితను. ఈనాడు యువ కథా రచయితలు ఇంతకు ముందు రచయితలు వెళ్ళని జీవిత పార్శ్వాల్లోకి, అనుభవ మూలాల్లోకి వెడుతున్నారు. సమాజంలో భిన్న వర్గాలు, భిన్న ప్రాంతాలను మరింత నిశితంగా అర్థం చేసుకునే క్రమంలో కథలు వస్తున్నాయి. సమాజంలోని వివిధ పార్శ్వాల నుండి కథలు వచ్చేసనికి సాహిత్యం కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. అయితే ఈ కథకులు చేయాల్సిన పరిశ్రమ చలా ఉంది' అంటారు కేతు విశ్వనాథరెడ్డి.

'రాయలసీమ కథకులు స్పృశింపని సామాజిక రంగాలు కొన్ని మిగిలి ఉన్నాయి. పారిశ్రామిక రంగం గురించీ, రాజకీయ రంగం గురించీ ఇక్కడి కథకులు కథా రచన ప్రారంభించవలసి ఉంది. ఇంకా స్పష్టమైన కంఠస్వరాన్ని- వర్తమానంలో రాస్తున్న యువ కథకులు సాధించవ[లసి] ఉంది. సామాజిక వాస్తవికతకు దూరం కాకుండా తెలుగు కథా సాహి[త్యా]న్ని సుసంపన్నం చేయడంలో రాయలసీమ కథకుల పాత్ర ఎంతో వి[స్తృత]మైనదీ, విశాలమైనది

> ○ సీమ సాహిత్యంలో స్థానికత, ప్రాంతీయత ఉన్నత ప్రమాణాలతో కనిపిస్తుంది
>
> ○ ఇక్కడ ప్రవహించే ప్రతి నదికీ పాడుకోవడానికి ఒక పాట ఉంది
>
> ○ ఇక్కడ ఉన్న ప్రతి కొండకూ వినిపించేందుకు ఒక కథ ఉంది

గత ఆరేడు సంవత్సరాల్లో రాయలసీమ కథా సాహిత్యంలో కొన్ని కొ[త్త] గొంతులు స్థిరపడ్డాయి. ఈ యువ రచయితలు కొంత వరకూ చర్విత చర్వణంగా, స్వీయానుకరణంగా మారిపోతూ ఉన్న రాయలసీమ క[థా] సాహిత్యంలోకి కొత్త ప్రాణశక్తిని తీసుకొచ్చారు. రాయలసీమ రచయిత[లు] గొప్ప కథలు రాశారన్న తృప్తి నాకు ఉంది. నేటి యువతరం వీరి వా[రస]త్వాన్ని అంది పుచ్చుకుని ముందుకు సాగుతారన్న విశ్వాసమూ ఉం[ది]' అంటారు వల్లంపాటి. 'రాయలసీమ దూరంగా ఉన్న ఇతర ప్రాంతాల[వా]రికి సీమ అంటే ఒక అగ్నిగుండంగానో, నరకప్రాయమైన ప్రదేశంగా అనిపిస్తూ ఉంటుంది. ఇదొక తప్పుడు భావన. సీమలో ప్రధాన సమ[స్య] ఫ్యాక్షన్ కాదు. ఇక్కడ వానల కోసం కప్పలకు పెళ్ళిళ్ళు చేయడం, గ[ంగ]దల్ని ఊరేగించడం, చెరువు కట్టలమీద నగ్నంగా పరుగులు తీయ[డం] ఇంకా ఇక్కడ ఉన్నాయి. వానలు లేక మధ్యతరగతి రైతాంగం అటు క[ర్నా]టక, తమిళనాడు లకు వలసలు పోవడాలు, ఇంటివద్ద ఉన్న పశువు[లు] గడ్డి లేక చస్తాయని వాటిని కబేళాలకు తెగనమ్మడాలు మామూల[ుగా] జరిగే విషయాలు. రాయల సీమలో ఎక్కడైనా కరవుని పిలిస్తే పలుకు[తుం]ది. అనంతపురం జిల్లాలో పిలవకనే పలుకుతుందని సామెత. వంద సం[వ]త్సరాల కాలంలో అరవైకి పైగా కరవుల వాతన పడిన జిల్లా ఇది. ఒక[వైపు] ప్రకృతికి కరుణ లేకపోవడం, మరోవైపు పాలకపక్షం సరిగ్గా దృష్టి సా[రి]చకపోవడంతో ఈ సమస్య పెరుగుతోంది.

సింగమనేని నారాయణ సంకలనం చేసిన '[సీమ] కథ' సీమ రచయితల బాధ్యతను గుర్తు చేసింది. కొత్త ఆలోచనల్నీ, స[ంఘ]ర్షణల్నీ సంవేదనల్నీ ఆవిష్కరించింది. తర్వాత మిత్ర జ్యోతి సంస్థ [ప్రచు]రించిన 'సీమ కవిత' సీమ కవులపై మరింత బాధ్యత పెంచింది. సీమ[లో] కరవూ, కక్షలూ ఒకదానికొకటి వేరు చేసి చూడడం సాధ్యం కాదు.

కరవుతో బాటు కక్షల ఇతివృత్తాలతో ఎన్నో కథలు వచ్చాయి. ఈ [నేప]థ్యంలో అనంతపురం జిల్లా రచయితలు రాసిన కరవు కథల సంకల[నం] 'ఇనుప గజ్జెల తల్లి' అనే పేరుతో వెలువడింది. అలాగే రాయల[సీమ] ఫ్యాక్షన్ ఇతివృత్తాలతో వచ్చిన కథలతో 'సీమ కక్షల కథలు' సంకల[నం] 35 కథలతో వెలువడింది. దీనికి మరొక ముందడుగుగా కర్నూలు [జిల్లా] నుంచి 62 కథలతో 'కర్నూలు కథ'; కడప జిల్లానుంచి 47 కథలతో '[కడప] కథ': 15 కథలతో మదనపల్లె రచయితల సంఘం 'కథా గుచ్ఛం' సం[కల]నాలు వెలువడడం ప్రయోజనాత్మక పరిణామం. ఇలా ఎందరో కథ[కులు] ఈ దశలో ఎన్నెన్నో కథల్ని ఆర్తితో, ఆవేదనతో రచించారు. సీమ న[ుంచి] వస్తున్న ఈ కథల్ని కేవలం కథలుగానే చూడలేం. కథల కోణంనుంచి [కథ]కులు సీమ చరిత్రను రికార్డు చేస్తున్నట్టుగా కూడా గుర్తించవలసిన [అవ]సరం ఉంది. సీమ కథా సాహిత్యంలోకి కొత్త ప్రాణశక్తి ఎప్పటికప్పు[డు] ప్రవేశిస్తోంది. తెలుగు కథా సాహిత్యంలో రాయలసీమ కథ పాత్ర [ఎంతో] విస్తృతమైనది. కొండ బండల మాటున విప్పారే రాతి పూల అందం, [పరి]మళం ఈ కథల్లో సజీవం, మహోన్నతం.

(వల్లంపాటి వెంకట సుబ్బయ్య, సింగమనేని నారాయ[ణ]

సాహితీ వ్యాసాల ఆధారం[గా])

రాయలసీమ పలుకే రత్నం






వేంపల్లి గంగాధర్

రాయలసీమ వాసుల భాష, మాటతీరు, స్వభావ వ్యవహారాలు ఇతర ప్రాంతాల కన్నా భిన్నంగా ఉండడానికి చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక కారణా లున్నాయి. 'రాయలసీమలో చిత్రమైన ద్విమాండలి కత (Diglossia) కూడా కన్పిస్తుంది. సీమలోని అన్ని జిల్లాలలోనూ ఒకే మాండలిక భాషలేని మాట నిజమే. కానీ విభిన్న ప్రాంతాల్లో వినిపించే విభిన్న వర్ణాల మాండలికంలో ఏకత్వం కూడా వినిపిస్తుంది' అంటారు ప్రముఖ సాహితీ విమర్శకులు వల్లంపాటి వెంకట సుబ్బయ్య.

'జీవితం బండబారి మొరటుదేలినప్పుడు వాళ్ళు ఉపయోగించే భాషలో, యాసలో జీవన శైలిలో, వ్యావ హారిక శైలిలో ఆ మొరటుదనం అనివార్యంగా ప్రతిఫ లిస్తుంది. భాషలో, యాసలో, వ్యక్తీకరణలో సౌకు మార్యం, సారళ్యం లేకపోవడానికి ఇక్కడి బండబారిన జీవితమే కారణం' అంటారు ప్రముఖ విశ్లేషకులు సింగమనేని నారాయణ.

రాయలసీమది మిశ్రమ సంస్కృతి. అనంతపురం జిల్లాలో మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో కన్నడ భాషా ప్రభావం కన్పిస్తుంది. చిత్తూరు జిల్లాలో సత్య వేడు, తిరుపతి ప్రాంతాల్లో తమిళ ప్రభావం ఎక్కువ. కర్నూలు జిల్లాకు ఒక చివర తెలంగాణాలోని మహ బూబ్‌నగర్ ప్రాంతం సరిహద్దుగా ఉన్న చోట భాషలో తేడా కన్పిస్తుంది. కడప జిల్లాకు మరో చివర ప్రకాశం జిల్లా కలుస్తుంది. అక్కడ కొంత భాషను ప్రభావితం చేస్తూ ఉంది.



ప్రాంతీయ, సామాజిక, చారిత్రక, జీవ శాస్త్రానుసా రాలు, భాషావ్యవహారాల లోని భిన్న భిన్న వృత్తులు, ప్రాంతీయ భేదాలు, స్త్రీ, పురుష భేదాలు, సంఘంలోని స్థాయి, చదువు, సంస్కారం.... తదితరాల వల్ల ఈ ప్రాంతీయ భేదాలు ఏర్పడి మాండలికాలు తయారవుతున్నాయి.


తెలుగు భాషకు ఉన్న నాలుగు ప్రాంతీయ మాండలిక రూపాలు:

1) ఉత్తర మాండలికం/ తెలంగాణ
2) దక్షిణ మాండలికం/ రాయలసీమ
3) మధ్య మాండలికం/ కోస్తా
4) పూర్వ మాండలికం/ కళింగ

మ్మ, ఆ, చి, చే, దొం, ల, ట, డ, ర, కా, బీ, క, గ, గు, ట్ల, బెం, మా, పొ, ము, క్క, మ, లు, సొ, డి, డ


ఇక్కడ పాతిక అక్షరాలున్నాయి. వీటిని ఉపయోగించి కొన్ని దుంపలు, కూరగాయల పేర్లు రాయగలరా? ప్రయత్నించి చూడండి.

బ్రహ్మచెముడు!



ఒక నాటకంలో బ్రహ్మ వేషధారికి చెవులను కప్పుతూ మిగిలిన తలలను అమర్చారు. లోపలిపక్క దూదిలాంటిది పెట్టడంతో అతని చెవులు మూసుకుపోయాయి. అతనికి పక్కవారి సంభాషణలు సరిగ్గా వినిపించక తన సంభాషణలు తప్పుగా చెబుతున్నాడు. అక్కడే ఉన్న భమిడిపాటి వెంటనే 'బ్రహ్మచెముడు అంటే ఇదే కాబోలు' అని చమత్కరించారు.

కడప మాండలికం



కడప ప్రాంతం భాషలోని ప్రత్యేకతల విషయానికి వస్తే క్రియా రూపాల్లో ఏకారధ్వని వినిపిస్తుంది. నకారం కొన్ని వర్గ మాండలికాల్లో ఇకారంగా మారుతుంది. అర్ధ దీర్ఘస్వరం వినిపిస్తుంది. ఊనిక ద్వితీయాక్షరం మీద కొన్ని ప్రాంతాల్లో పలుకుతుంది. దంత్య (దంత మూలీయ) చ, జ లు వాడుకలో లేవు. విసర్గ స్థానంలో కంఠమూల స్పర్శధ్వని వినిపిస్తుంది. త, ద లు- చ, జ లుగా తాలవ్యీకరణం పొందినట్లు కన్పించదు. 'ఇవ్వు'కు బదులు 'ఈ' వంటి ప్రాచీన రూపాలు ఈ మాండలికంలో కన్పిస్తాయి. ఆధునిక వచన వాఙ్మయ ప్రభావం గాని, ఆధునిక ప్రసార సాధనాల ప్రభావం గాని ఈ మాండలికంపై అంతగా కన్పించదు. 'కడప మాండలికం కోస్తా మాండలికం కంటే తెలంగాణా మాండలికానికే దగ్గర వుంద'ని బూదరాజు రాధాకృష్ణ అభిప్రాయపడ్డారు. **ఉదా:** "ఏమే! నీ మొగుడు నా ఇంటి మీది కొచ్చి నన్నూ, నా కొడుకునూ తిట్టిపోతాడా! వాన్ని కాల్చి బూడ్ది సేయిచ్చకుండా ఊరకుంటానా".

అనంతపురం మాండలికం

ఈ జిల్లా వారి మాండలికం మీద కన్నడ భాషా ప్రభావం ఉచ్చారణలో, పదజాలంలో, పదబంధాల్లో, వాక్య రచనలో కూడా కన్పిస్తుంది. ఇతర ప్రాంతాల్లో తెలుగు వాడుకలో లేని చోట్ల కూడా 'ళ' 'ణ'ల వాడుక ఎక్కువ. దంత మూలీయ చ, జ ల వాడుక తక్కువ. అనేక పదాలు కన్నడ ప్రభావం వలన వాడుకలోకి వచ్చాయి.

భూతార్థక ప్రత్యయాలుగా 'ఇనా' రూపాలతో పాటూ 'త' రూపాలు కూడా వినిపిస్తాయి. ఉదాహరణకు 'వచ్చినా(ను)' అనే రూపంతో 'వస్తి(ని)' అనేది వాడుకలో వుంది. 'వీటికి' అనే శబ్దానికి బదులు 'ఇవిటికి' వంటి రూపాలు, అనౌప విభక్తిక ప్రయోగాలు చేయడం ఈ వ్యవహారంలో కన్పిస్తాయి. 'కంతు' అనే పదానికి 'వాయిదా' అనే అర్థంలో వాడటం సీమలో పలుచోట్ల మనం స్పష్టంగా గమనించవచ్చు. 'రుద్దు' అనే పదాన్ని 'తిక్కు'గా వ్యవహరించడం కూడా కన్పిస్తుంది.

చిత్తూరు మాండలికం

ఈ జిల్లాలోని సత్యవేడు, పలమనేరు, చంద్రగిరి తాలూకాలు పూర్వం మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగాలు కావడం వలన తమిళ భాషా ప్రభావం ఎక్కువగా ఇక్కడ కన్పిస్తుంది. అలాగే మదనపల్లి, వాయల్పాడు తాలూకాల్లో కడప జిల్లా మాండలిక ఛాయలున్నాయి. ఇక్కడ 'శ' 'స' వర్ణాలను 'స' వర్ణంగా ఉచ్చరిస్తారు. మహా ప్రాణత్వం విద్యావంతుల భాషలో విన్పిస్తుంది. ఒక్కోసారి సగం తెలుగు, సగం తమిళం అయిన ప్రయోగాలు ఇక్కడ విన్పిస్తుంటాయి. ఉదాహరణకు 'ఇదే బతుకుదా' 'పూడ్సినాడు' (పూడ్సు-ఇనా-డు). ప్రాచీన భాషా ప్రయోగాలు ఎన్నో చిత్తూరు జిల్లా వ్యవహారంలో జీవిస్తున్నాయి.

కర్నూలు మాండలికం

కర్నూలు జిల్లా భాషలో దక్షిణ మండలం లక్షణాలతో పాటు ఉత్తర మండల లక్షణాలు కూడా పదజాలంలో కన్పిస్తాయి. ఆలూరు, ఆదోని తాలూకాలు ఒకప్పుడు బళ్ళారి జిల్లాలో వుండటం వల్ల కన్నడ భాషా ప్రభావం ఉంది. నంద్యాల, ఆళ్ళగడ్డ, కోయిలకుంట్ల తాలూకాలో కన్నడ ప్రభావం; కర్నూలు, ఆత్మకూరు తాలూకాల్లో మహబూబ్‌నగర్ జిల్లా మాండలిక లక్షణాల ముద్ర ఉంది. ఇందువల్ల కర్నూలు జిల్లా మాండలికంపై విభిన్న ప్రాంతాల ప్రభావం ఉందని భావించవచ్చు.

అభ్యంతరార్థకంలో- 'లోన' ప్రత్యయం వాడుక సాధారణంగా వినిపిస్తుంది (ఉదా: కాలేజిలోన). తమర్థ రూపానికి 'నీకి' చేరడం కన్పిస్తుంది (తాగనీకి). 'లెక్క'ను తులనార్థకంలో ప్రయోగిస్తారు (వాని లెక్క). తోలుకొనివచ్చు రూపం పశుపక్ష్యాదులకు పరిమితమై ఉండగా వాడుకలో మనుష్యపరంగా వాడటం గమనించవచ్చు. (ఉదా: పెండ్లాన్ని తోల్కపోడు). వ్యతిరేక రూపానికి 'గా' ప్రత్యయంగా చేర్చడం జరుగుతుంది (ఉదా: ఇంటికొస్తాండగా). కర్నూలు మాండలికంలో ప్రాచీన భాషా ప్రయోగాలు వ్యవహారంలో ఎక్కువ.

చివరగా...

సీమలో విభిన్న ప్రాంతాలలో విన్పించే విభిన్న వర్ణాల మాండలికంలో ఏకత్వం కూడా కన్పిస్తుంది. భాషలో కొంత మొరటుతనం వుండటంతో ఉచ్చారణలోనూ, యాసలోనూ ఈ శైలే ప్రతిబింబిస్తుంది. ఇలాంటి శైలితోనే ఇటీవల కథలు సీమ నుంచి విస్తృతంగా వస్తున్న పరిణామాన్ని కూడా గుర్తుంచుకోవాలి. రాయలేలిన సీమలో రత్నాల భాషగా సీమ మాండలికాన్ని చెప్పుకోవచ్చు. పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య, కాలజ్ఞానాన్ని ప్రబోధించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములు, పద్యాల ద్వారా చైతన్యాన్ని కాంక్షించిన వేమన, ప్రబంధాల ద్వారా పేరుగాంచిన అల్లసాని పెద్దన వంటి ఉద్దండులు రాయలసీమ భాషకు పట్టం కట్టారు. ■



ప్రముఖ రచయిత,
కేంద్ర సాహిత్య అకాడమీ
యువ పురస్కార గ్రహీత,
అనంతపురం. 94400 74893



ఒరెంకారేవడ్సా? కాదిస్కేస్కే!

ఇదేంటో మీకు అర్థం అయిందా? పోనీ ఇదే భాషో చెప్పగలరా? తెలుగే! ఔను... ఆశ్చర్యపోకండి. వాక్యంలో పదాల మధ్య ఎక్కడ ఖాళీ వదలాలో తెలియని వ్యక్తి రాసిందిది. విషయం ఏంటంటే... పడవల మీద ప్రయాణం చేసే వారిద్దరి మధ్య సంభాషణ ఇది. ఇద్దరూ ఒకరికొకరు ఎదురయ్యారు. అందులో ఒకడు 'ఓరి వెంకా, రేవు అడుసా?' అని అడిగాడు. అంటే రేవు బురదగా ఉందా? అని. దానికి రెండో వాడు 'కాదు ఇసుక ఇసుకగానే ఉంది' అని జవాబిచ్చాడు. వాళ్ళు ఎలా ఉచ్చరించారో అదే పద్ధతిలో ఈ పెద్దమనిషి రాసేశాడు. అసలు దాన్ని ఎలా రాయాలంటే... ఓ రెంకా... రేవడుసా? కాదు ఇసుకిసుకే! అర్థమైంది కదా పదాలకు మధ్య దూరం పాటించకపోతే మన తెలుగే మనకు విదేశీ భాషలా అన్పిస్తుంది మరి!



డా॥ వేంపల్లి గంగాధర్

మూడు తరాల 'సీమ' కథా సేద్యం

కోటి గొంతుల కిన్నెర...

కోటి గుండెల కంజరి...

వైవిధ్య భరితమైన సాహిత్య ప్రాభవ వైభవాలు రాయలసీమలో కనిపిస్తాయి. శ్రీకృష్ణ దేవరాయలు ఆస్థానంలోని అల్లసాని పెద్దన, ప్రజాకవి వేమన, కాలజ్ఞానకర్త వీరబ్రహ్మం, పదకవితా పితామహుడు అన్నమయ్య వంటి మహానుభావులు ఎందరో ఈ ప్రాంతంలో సాహితీ సేద్యం చేశారు. కవిత్వం, అవధానం, నవల, విమర్శ, కథ వంటి సాహితీ ప్రక్రియలన్నీ ఆనాటి పునాదుల పైనే నిర్మితమవుతూ వచ్చాయి. ఆధునిక కథా సాహిత్యం 1901లో బండారు అచ్చమాంబ రాసిన ధనత్రయోదశి కథతో ప్రారంభమైందని భావిస్తే, రాయలసీమలో మొదటి కథ 1941 వరకు పుట్టనే లేదు. కథ కోసం సీమ ప్రాంతం 40 సంవత్సరాలు ఎదురు చూడక తప్పని పరిస్థితులు. 1941 మార్చి 26న ప్రచురితమైన అనంతపురం జిల్లాకు చెందిన జి. రామకృష్ణ రాసిన చిరంజీవికథ మొదటికథగా వెలుగులోకి వచ్చింది. సీమలో ఆధునిక జీవితమే ఆలస్యంగా మొదలు కావడం ఇందుకు మరో కారణం.

రాయలసీమ నుంచి కథారచయితలుగా కీర్తి పొందిన 'మొదటితరం కథకులు' మధ్యతరగతి జీవితాలను కథావస్తువులుగా స్వీకరించి కథలను నిర్మింతం చేశారు. ఆర్థికంగా మారుతున్న జీవన వైరుధ్యాలను కథాంశాలుగా మార్చారు. 1941 నుంచి 1970 వరకు కె. సభా, జి. రామకృష్ణ, మధురాంతకం రాజారాం, రాచమల్లు రామచంద్రారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి, సొదుం జయరాం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, పి. రామకృష్ణారెడ్డి, కలువకొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, భారతం నాదమునిరాజు, ముంగర శంకర రాజు తదితరులను పేర్కొనవచ్చు. కథాశిల్పంపై రాచమల్లు రామచంద్రారెడ్డికి ఉన్న పట్టు, నమ్మకం ఎటువంటిదో వారి 'అలసిన గుండెలు' కథా సంకలనంలోని కథలు చదివితే అర్థమవుతుంది. మధ్యతరగతి జీవితాల్లోని మార్పులను కేంద్రంగా స్వీకరించి అత్యుత్తమ కథలకు ప్రాణం పోశారు. తన కథల గురించి తానే రాసుకున్న వ్యాసాన్ని చదివితే రారా దృష్టిలో కథఃటే ఎంతటి బలమైన సాధనమో మనకు విశదమౌతుంది.

తర్వాత మనకు అదే స్థాయిలో శక్తిమంతమైన కథకుడిగా ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి కన్పిస్తారు. వీరి జప్తు, ఇచ్ఛాగ్ని, అమ్మవారి నవ్వు కథాసంకలనాల్లోని కథలు ప్రపంచ స్థాయి కథానికల కోవకు చెందినవిగా చెప్పుకోవచ్చు. పీర్లసావిడి, గడ్డి, దాపుడుకోక, జప్తు, ఇచ్ఛాగ్ని, నమ్ముకున్న నేల, విరూపం కథలు చారిత్రాత్మకమైన హోదాను కలిగి ఉండి పాఠకుడి మనసుపై తీవ్రమైన ప్రభావాన్ని ఏర్పరచుతాయి. బలమైన కథా మూలాల్లోంచి పాఠకుడు సాంఘిక, సామాజిక చరిత్ర కోణాన్ని చూస్తాడు.

తర్వాత చిత్తూరు జిల్లానుంచి కథలందించిన కె. సభా స్థానికత, ప్రాంతీయతకు పట్టం కట్టారు. వీరు దాదాపు 300కు పైగా కథలు రాసినట్టు తెలుస్తోంది. వాటిలో కొన్ని- బంగారు, పాతాళగంగ, నీటి దీపాలు పేరుతో కథాసంకలనాలుగా వచ్చాయి. వీరు పిల్లల కథలు కూడా ఎన్నో రాశారు. 'దామల చెరువు పెద్దాయన'గా గుర్తింపు పొందిన మధురాంతకం రాజారాం చిన్న వయస్సులోనే 'వీరోచిత వర్తకం' అనే కథ రాశారు. తన ఉపాధ్యాయ వృత్తిలో ఎదురైన అనుభవాల ఆధారంగా ఎన్నో పాత్రలకు రూపం పోసి కథలు రాశారు. వర్షించిన మేఘం (1961), తాను వెలిగించిన దీపాలు (1963), పునర్నవం (1968), కళ్యాణ కంకిణి (1968), కమ్మ తెమ్మెర (1968), వక్రగతులు (1968), వగపేటికి (1977), వినోద ప్రదర్శనం (1978), రేపటి ప్రపంచం (1975), నిర్వచనం (1995), పాఠశాల (1993), హాలికులు కుశలమా (1994), కూనలమ్మ కోన (1995), కథా సంపుటాలు వెలువడ్డాయి. సీమ కథకు కొత్త అర్థం చెప్పిన కథకులుగా మధురాంతకం పేరొపొందారు. కడప జిల్లాకు చెందిన సొదుం జయరాం అపారమైన జీవితానుభవం ఉన్న రచయిత. వాడిన మల్లెలు, సింహాద్రి స్వీట్ హోం, సొదుం జయరాం కథలు అనే మూడు కథా సంపుటాలు వెలువడ్డాయి. కొకు, రారా వంటివారి ప్రశంసలు అందుకున్నారు వీరు.

వాడిన మల్లెలు శీర్షికతోనే జయరాంతో పాటు రారా, ఆర్. వెంకటేశ్వరరావు (ఆర్వీయార్) కూడా సంవేదన పత్రికలోనే వేర్వేరు దృక్కోణాలతో కథ రాసి ప్రయోగం చేశారు. అలాగే పెన్నేటి కథలు, మనిషీ- పశువూ కథా సంపుటాల ద్వారా పి. రామకృష్ణారెడ్డి సీమ కథలకు అక్షర రూపం ఇచ్చారు. కడప మాండలికంలోని యాస, వేగం, కారుణ్యాన్ని వీరి కథల్లో చూడొచ్చు. విమర్శకుడిగా గుర్తింపు పొందిన వల్లంపాటి వెంకట సుబ్బయ్య 1962లో 'అన్యథా శరణం నాస్తి' కథ ద్వారా కథకుడుగా కూడా సాహిత్యరంగానికి పరిచయమయ్యారు. రైల్వేలో ఉద్యోగిగా ఉంటూ 'గూడు కోసం గువ్వలు' కథ ద్వారా పులికంటి కృష్ణారెడ్డి చిత్తూరు జిల్లానుంచి ముందుకొచ్చారు. కోటిగాడు స్వతంత్రుడు, పులికంటిథావాహిని, పులికంటి దళిత కథల ద్వారా సీమ కథా సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్రను పులికంటి సాధించారు.

వస్తువులో నవ్యత్వం, శిల్పంలో వైవిధ్యంతో కలువ కొలను సదానంద (చిత్తూరు జిల్లా) పిల్లల పుస్తకాలతో పాటు, రక్తయజ్ఞం (1965), పైరు గాలి (1967), ఓంద్రింతలు (1975), నవ్వే పెదవులు- ఏడ్చే కళ్ళు (1975), రంగు రంగుల చీకటి (1995), అనే ఐదు కథా సంపుటాలు వెలువరించారు.

1970 నుంచి 1995 వరకు సీమ నుంచి రెండవ తరం కథకులు రంగ ప్రవేశం చేశారు. వీరు రైతులకు సంబంధించిన ఇతివృత్తాలతో పాటు కరవు, గ్రామీణ కక్షలు (ఫ్యాక్షన్), వ్యవసాయ సంక్షోభాల పైన విస్తృతంగా కథలు రాశారు. సామాజిక చరిత్రను నమోదు చేశారు. ఇనాక్, సింగమనేని నారాయణ, నామిని సుబ్రహ్మణ్య నాయుడు, ఎంవిఆర్, శశిశ్రీ, డా॥ కేశవరెడ్డి, మధురాంతకం నరేంద్ర, మహేంద్ర, చిలుకూరి దేవపుత్ర, శాంతి నారాయణ, రాసాని, దాదా హయత్ తదితరులను రెండవ తరం సీమ కథకులుగా పేర్కొనవచ్చు. మార్క్సిస్టు తాత్వికత కోణం నుంచి ఆధునిక సీమ కథకు శ్రీకారం చుట్టిన కథకులు సింగమనేని నారాయణ. జూదం (1988), కథలు (1999) పేర్లతో రెండు సంపుటాలు వచ్చాయి. వీరి మొదటి కథ 17 ఏళ్ళ వయస్సులో రాసిన 'న్యాయం ఎక్కడ?' 1960 జూలై 2న ఒక పత్రికలో ప్రచురితమయింది. ఉచ్చు, ఊబి, అడుసు, ఫిరంగిలో జ్వరం, అగాధం, మకర ముఖం, నిషిద్ధం, హింస కథలు మళ్ళీ మళ్ళీ చదవాలనే భావనను కలిగిస్తాయి. మానవ సంబంధాలను ఆవిష్కరించే కథలుగా వీరి కథలు గుర్తింపు పొందాయి. ఎనిమిది కథా సంపుటాలు వెలువరించడం ద్వారా కీర్తి పొందిన కొలకలూరి ఇనాక్ ఊరబావి (1983), సూర్యుడు తలెత్తాడు (1988), కట్టడి (2007) కథాసంపుటాల్లోని కథలు దళిత కోణం నుంచి సమాజాన్ని ఆవిష్కరిస్తాయి. దళిత కథలకు కొత్త ఊపిరిగా, కుల వివక్షను, సాంఘిక దోపిడీని, జీవన సంఘర్షణను వీరు కథల్లో బలంగా చిత్రించారు. చిలుకూరి దేవపుత్ర ఆరు గ్లాసులు, ఏకాకి నౌక చప్పుడు, బందీ, వొకర టింకర ఒ కథలు విలువైనవి. బండి నారాయణ స్వామి 'వీరగల్లు' కథా సంకలనం ప్రకటించారు. వీరి చమ్కీదండ, పద్దపాదం, రంకె, పల్లె మాదిగ, సావుకూడు, నీళ్ళు, నడక, ఇరుసు... వంటి కథలు ప్రతిష్ఠాత్మకం. శక్తిమంతమైన కథలు రాసిన కథకుడు స్వామి. 19070లో తొలి కథా సంకలనంగా 'రక్తపు ముద్ద పిలిచింది' ద్వారా శాంతి నారాయణ కథా క్షేత్రంలోకి అడుగు మోపారు. చిత్తూరు జిల్లాలో నామిని తన మొదటికథ 'మళ్ళీ జన్మించు మహాత్మా' ద్వారా పరిచయమయ్యారు. 1985లో పచ్చనాకుసాక్షిగా కథల ద్వారా, 1986లో పాలపొదుగు కథలు, 1987లో సినబ్బ కథలు, 1988లో మునికన్నడి సేద్యం, 1990లో మిట్టూరోడి కథల ద్వారా నామిని సీమ కథా సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు. మధురాంతకం రాజారాం కుమారుడు నరేంద్ర కుంభమేళా, అస్తిత్వానికి అటు ఇటు, ప్రహేళిక, వెదురు పువ్వు కథా సంపుటాల ద్వారా పేరు పొందారు. 'కనుపించని కోయిల' కథా సంపుటి ద్వారా మహేంద్ర కూడా ఉత్తమ కథకుడిగా కీర్తి పొందారు.

పూతలపట్టుకు చెందిన డా॥ కేశవరెడ్డి సీమ కరవు నేపథ్యంలో 'వక్ర ప్రకృతి' కథ రాశారు. ది రోడ్, భగవాన్ వాచ కథలను కూడా వీరు అందించి కథాసాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. 1995 నుంచి నేటి వరకు సీమ మూడవ తరం కథకులుగా విభజించుకుంటే పాలగిరి విశ్వప్రసాద్, సన్నపు రెడ్డి వెంకట్రామిరెడ్డి, నాగప్పగారి సుందర్రాజు, రాప్తాడు గోపాల కృష్ణ, సుంకోజి, ఎం. హరికిషన్, తుమ్మల రామకృష్ణ, గిపిసీ, జి.ఆర్. మహర్షి, తవ్వా ఓబుల్‌రెడ్డి, జి.వెంకట కృష్ణ, చక్రవేణు, డా॥ వేంపల్లి గంగాధర్, ఎస్.వి. ప్రసాద్, షరీఫ్ వంటివారు కనుపిస్తారు. మూడవ తరం కథకులు ప్రపంచీకరణ ప్రభావాన్ని, దళితుల ఆవేదనల్ని, స్త్రీల అభ్యుదయ భావాలను అక్షర బద్ధం చేశారు. కరవు, కక్షల కథలతో పాటు ఎన్నో సామాజిక సమస్యలపై విస్తృతంగా కథలు రాస్తున్నారు. ఇవాళ రాయలసీమలో దాదాపు మొత్తం 220 మంది కథకులు ఉన్నారు. వీరిలో 177 మంది కథారచయితలు కాగా, 43 మంది రచయిత్రులున్నారు. వీరి కథలన్నీ సేకరించి, విశ్లేషించి వీరి జీవిత విశేషాలతో పాటు- నా పరిశోధన గ్రంథం 'రాయలసీమ కథా సాహిత్యం'లో పొందుపరచే అవకాశం నాకు దక్కింది. రాయలసీమ ప్రాంత జీవితాలను, జీవనాన్ని ఈ కథలు రికార్డు చేశాయి. తెలుగు కథా సాహితీ చరిత్రలో సీమ కథ తగిన ప్రాధాన్యతను, గుర్తింపును, హోదాను కలిగి ఉంది. సీమ కథ ఆలస్యంగా మొదలైనప్పటికీ అత్యద్భుతమైన పరిణతి సాధించింది. ఇదొక గొప్ప ప్రయత్నం. సీమ కథలో పరిపూర్ణత ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. 'కోటి గొంతుల కిన్నెర- కోటి గుండెల కంజరి'కి ఇవే కథా కుసుమాల అభినందన చందనాలు.

మూడవ తరం కథకులు ప్రపంచీకరణ ప్రభావాన్ని, దళితుల ఆవేదనల్ని, స్త్రీల అభ్యుదయ భావాలను అక్షర బద్ధం చేశారు. కరవు, కక్షల కథలతో పాటు ఎన్నో సామాజిక సమస్యలపై విస్తృతంగా కథలు రాస్తున్నారు. ఇవాళ రాయలసీమలో దాదాపు మొత్తం 220 మంది కథకులు ఉన్నారు. వీరిలో 177 మంది కథారచయితలు కాగా, 43 మంది రచయిత్రులున్నారు

'రాయలసీమ' తొలి కథకుడు

జి.రామకృష్ణ

గురజాడకంటే పదేళ్ల ముందే భండారు అచ్చమాంబ 'ధనత్రయోదశి' పేరుతో ఆమె దాంపత్య లాలిత్యాన్ని గుర్చి 'హిందూ సుందరి' పత్రికలో 1901-02 ప్రాంతాల్లో. కథ రాశారు. 1903లో 'కల్పలత' పత్రికలో 'అపూర్వోపన్యాసం' కథను ఆచంట సాంఖ్యాయనశర్మ రాశారు. 1905లో వెదురుమూడి శేషగిరిరావు 'మద్రాసు కథలు' రాశారు. తణుకు నుంచి వెలువడిన 'సువర్ణరేఖ' పత్రికలో ఇవి ప్రచురితమైనాయి. దీనిని బట్టి ఆధునిక కథా సాహిత్యం 1901లోనే ప్రారంభమైనట్లు చెప్పుకోవచ్చు. ఆధునిక తొలి కథానికగా భండారు అచ్చమాంబ రచించిన 'ధనత్రయోదశి' కథను విమర్శకులు కూడా గుర్తిస్తున్నారు. మరి అయితే, రాయలసీమ తొలి కథకుడు ఎవరనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న.

ఆధునిక సాహిత్య ప్రక్రియలైన కథ, నవల, నాటికల్లాంటివి రాయలసీమలో చాలా ఆలస్యంగా ప్రారంభమైనాయి. 1910-45 మధ్యకాలం నాటికే కోస్తాంధ్ర ప్రాంతంలో తెలుగు కథానిక వస్తువులోనూ, రూపంలోనూ కూడా గొప్ప వికాసం పొంది వుండగా, ఆ దశలో రాయలసీమలో కథానికే ఆవిర్భవించకపోవడాన్ని గమనించవచ్చు. రాయలసీమలో ఆధునిక జీవితం చాలా ఆలస్యంగా ప్రారంభం కావటమే ఇందుకు అసలు కారణమనిపిస్తుంది. 1910 నుండి అనంతపురం జిల్లాలో పత్రికా ప్రచురణ మొదలైనా దాదాపు 1960-65 ప్రాంతాల వరకు నవల, కథానిక ప్రక్రియలను అటు పత్రికలు కానీ, ఇటు రచయితలు కానీ ఆదరించలేదు.

తెలుగు జర్నలిజానికీ, పత్రికా రంగానికీ పుట్టినిల్లు రాయలసీమ అని తెలిసినప్పుడు ఆశ్చర్యం వేస్తుంది. ఇప్పటిదాకా పరిశోధకులకు లభించిన ఆధారాల ప్రకారం తొలితెలుగు పత్రిక 'సత్యదూత'గా భావిస్తున్నారు. ఒకప్పుడు సీడెడ్ జిల్లాలుగా పిలువబడిన నేటి రాయలసీమకు ఒకప్పుడు బళ్లారి సాంస్కృతిక కేంద్రంగా ఉండేది. తొలి తెలుగు పత్రిక 'సత్యదూత' 1835లో బళ్లారి నుండి వెలువడింది. క్రైస్తవ మిషనరీలు మత ప్రచారంకోసం పత్రికా ప్రచురణకు పూనుకున్నా, అది ఒక విధంగా తెలుగుదేశంలో సాంస్కృతిక వికాసానికి దోహదం చేసింది. 1910 నుండి అనంతపురం జిల్లాలో పత్రికా ప్రచురణ మొదలైనా దాదాపు 1960-65 ప్రాంతాల వరకు నవల, కథానిక ప్రక్రియలను అటు పత్రికలు కానీ, ఇటు రచయితలు కానీ ఆదరించలేదు.

1910లో కెజి బాబూరావు సారథ్యంలో 'శంకర విజయము', పప్పూరి రామాచార్యులు, కైపు సుబ్రహ్మణ్యశర్మలు 1922 నుంచి ప్రచురించిన 'పినాకిని', గాడిచర్ల హరిసర్వోత్తమరావు తాడిపత్రి నుంచి 1924లో వెలువరించిన 'మాతృసేవ', అనంతపురం నుంచి 1925లో ఎం.సుందరమ్మ వెలువరించిన 'భారతమహిళ', 1926 నుంచి పప్పూరి రామాచార్యులు ప్రచురించిన 'సాధన', ఎం.పి. రంగనాయకులు ప్రచురించిన 'సారథి' (1962-75) లాంటి పత్రికలు ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలకే ప్రాధాన్యాన్నిచ్చాయి తప్ప ఆధునిక సాహిత్య ప్రక్రియలైన కథానిక, నవలలను ఆకర్షించలేకపోయాయి. రచయితల దృష్టిని అటు వైపు మళ్లించలేకపోయాయి.

ఎవరీ రామకృష్ణ?


1915న అనంతపురంలో జన్మించిన గుత్తి రామకృష్ణ రచయితగానే కాక పత్రికా విలేఖరిగా కూడా గుర్తింపు పొందారు. వీరి మొదటి కథ 'చిరంజీవి', 'విజయవాణి' అనే పత్రికలో 26.3.1941 సంచికలో ప్రచురింపబడింది. చింతా దీక్షితులు తర్వాత రాయలసీమ రచయిత రాసిన రాయలసీమ జీవిత కథ కోసం 20 సంవత్సరాలు గడిచిపోయాక తిరిగి రామకృష్ణ కథతో ప్రారంభమైంది. ఇప్పటివరకు దొరికిన సమాచారం మేరకు మొదటి రాయలసీమ కథా రచయిత అన్న గౌరవం 'జి.రామకృష్ణ'కు దక్కుతుంది. రాయలసీమ నుంచి వచ్చిన మొట్టమొదటి కథగా గుర్తింపు పొందిన 'చిరంజీవి' కథ నేపథ్యం విషయానికి వస్తే- వెంకటరాముడు అనే కట్టుబానిస రెడ్డిగారింట్లో వెట్టిచాకిరీ చేస్తుంటాడు. మూడు తరాల క్రితం వెంకటరాముని ముత్తాత రెడ్డి వద్ద 60 రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. ఆ బాకీ ఇంకా తీరలేదు. అందుచేత వెంకటరాముడిని కట్టుబానిసతనం వదలలేదు. ఒకరోజు అతడు తన తల్లి ఆరోగ్యం బాగోలేదని కాస్త తొందరగా పశువుల్ని తోలుకొని తిరిగివస్తాడు. మనసు బాగోలేక పోవడం చేత ఆనాడు వెంకటరాముడు ఇతరుల కోసం తెస్తానన్న వస్తువులని తీసుకురాడు. పశువుల్ని రెడ్డి ఇంటివైపు తోలి తాను తల్లిని చూడటానికి ఇంటికి వెళతాడు. ఆమె చాలా నీరసంగా ఉంటుంది. కొనవూపిరితో ఉన్న తల్లి కోసం కాస్త గంజి నీళ్లు తీసుకురావడం కోసం రెడ్డి ఇంటికి వెళతాడు. పశువుల్ని గాడిపాటున కట్టివేయలేదని, గడ్డి వేయలేదని, పాలు పితకలేదని రెడ్డికి కోపం వస్తుంది. అతడు బూతులు తిడుతూ బర్ర తో వెంకటరాముణ్ణి చావగొడతాడు. రెడ్డి వెళ్లిపోయాక, రెడ్డి భార్య దయగా సంగటి ముద్దలు, చారు ఇచ్చి పంపుతుంది. వాటిని తీసుకుని వెంకటరాముడు ఇంటికి తిరిగొస్తాడు. అప్పటి కే తల్లి చనిపోయి ఉంటుంది. ఇది 'చిరంజీవి'లోని కథ ఇతివృత్తం.

వల్లంపాటిగారికి రాసిన లేఖలో తాను 10 కథలు రాసినట్లు చెప్పారు జి.రామకృష్ణ. ఈ కథలన్నీ 1950-55 సంవత్సరాల మధ్య వచ్చినవే. ఈ కథల్లో ఆయన రాసిన 'గంజికోసరం' అనే కథ కరువుకు సంబంధించిన ప్రముఖ కథ. అనంతపురం జిల్లా చరిత్రను పరిశీలిస్తే ఎక్కువగా కరువులే కనిపిస్తాయి. 1876-78 సంవత్సరం మధ్య సంభవించిన దారుణమైన ధాత కరువు, డొక్కల కరువులాంటివి అందుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం కురిసే జిల్లాల్లో అనంతపురం జిల్లా రెండో స్థానంలో వుంది. కేవలం 544 మి.మీ. వర్షపాతం జిల్లా ప్రజానీకాన్ని నిత్యం సంక్షోభంలో ముంచుతుంది. 1948-52 సంవత్సరాల మధ్య రాయలసీమలో భయంకరమైన కరువు పరిస్థితి ఏర్పడింది. దీన్ని ఆ సంవత్సరం పేర 'ధాత' కరవు అన్నారు. ధాత కరవు సమయంలో ప్రభుత్వం, రామకృష్ణ మిషన్ వంటి ధార్మిక సంస్థలూ నడిపిన 'గంజి కేంద్రాలు' కొన్ని వేల ప్రాణాలను రక్షించాయి. అందువల్లనే ఆ కరువుకు 'గంజి కరువు' అన్న పేరొచ్చింది. దీని ఫలితంగా వచ్చిన కథే 'గంజి కోసరం'. ఈ కథలో రామకృష్ణ రాయలసీమ జీవితంలోని కరువు, ఫ్యూడలిజం అనే రెండు అంశాలను చిత్రించారు.

1960కి పూర్వం 1956-57 ప్రాంతాల్లో జిల్లా మొదటితరం రచయితగా 'విశాలాంధ్ర' జర్నలిస్టుగా జి.రామకృష్ణ పని చేశారు. ఈయన రచనలు డాక్యుమెంటరీ రచనలను పోలి వున్నా ఇతివృత్తం కరువు కాగా జీవద్భాష అనంతపురం మాండలికం.

'గంజి కోసరం' కథలో ముసలి అవ్వ, కోడలు, మనుమరాలు, మనుమడు కరువు వలన వేరే ఊరికి తిరిపెం గంజికి వెళ్లారు. గతంలో అవ్వ కుటుంబం బాగా బ్రతికినా కరువు వలన కొడుకు దూరమవుతాడు. బాగా బ్రతికిన కుటుంబం చేత కూడా కరువు వేరే ఊరికి తిరిపెంగంజికి వెళ్లేటట్టు చేస్తుంది. గతంలో అవ్వ, కొడుకు, కోడలు వారి ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తుంటారు. వరుసగా అయిదారేండ్లు వర్షాలు లేక కరువు వస్తుంది. అవ్వ కుటుంబం జీవనం గడవక చేను, కొన్నాళ్లకు పశువులను అమ్మినారు. అయిదెకరాల మడి రెడ్డి కుదువబెడితే, బాకీ కట్టలేని స్థితిలో భూస్వామి భూమిని స్వాధీనం చేసుకుంటాడు. పండంటి సంసారం నిట్టనిలువునా కూలినందుకు అవ్వ బాధపడుతుంది. అవ్వ కొడుకు వేరే ఊరికి కూలికి వెళ్తాడు. అక్కడ అతనికి అర్ధరూపాయికి మించి కూలిగిట్టదు. అక్కడ ప్రాజెక్టు పని నిలిచిపోవడంతో వాళ్ల ఊరివాళ్లతో కలిసి వేరే ఊర్లో ప్రాజెక్టు పనికి వెళ్తాడు కాని తరువాత అతని సంగతి తెలియదు. అవ్వ ఊర్లో కలమందగడ్డ, గ్యాదరాకు కూడా అయిపోతుంది.

'ఇంక ఇక్కడ ఉంటే బతుకలేము. కలమందగడ్డ, గ్యాదరాకు కూడా అయిపోయింది. నువ్వారా ముసిల్దానా ఆ పల్లెలో సర్కారోళ్లు గంజిపోస్తా వుండారంట' అని ఇరుగుపొరుగు వారు పిలిచినపుడు అవ్వ బొందిలో ప్రాణముండగా తిరిపెంగంజికి పోనని అంటుంది. కానీ ఆ ఊరి రెడ్డి కన్ను అవ్వ కోడలిపై పడటంతో



జి.రామకృష్ణ మొదటి కథ 'చిరంజీవి', 'విజయవాణి' అనే పత్రికలో 26.3.1941 సంచికలో ప్రచురింపబడింది. ఇప్పటివరకు దొరికిన సమాచారం మేరకు మొదటి రాయలసీమ కథా రచయిత అన్న గౌరవం ఆయనకు దక్కుతుంది.

ఆలోచించి గంజికేంద్రానికి వెళ్తుంది. దారిలో మనువడ్ని బుజ్జగిస్తూ ఆ కొండ కింద ఊర్లోనే గంజిపోస్తున్నారని నడిపిస్తుంది. మధ్యాహ్నం ఆకలవడంతో అందరూ ఒకచోట కూర్చొని ఉప్పు కారం చల్లిన గ్యాదరాకు తింటారు. అంతలో ఒక మనిషి అటుగా వస్తూ 'గంజిపోసే చోటికేనా అవ్వా' అని అడిగితే, అవ్వ 'లేదు నాయనా ఆ ఊర్లో బంధువులు వుంటే చూచి రావటానికని అబద్ధం చెబుతుంది. తిరిపెంగంజికని చెబితే బావుండదని అందుకే అలా చెప్పానని మనుమడితో అంటుంది.

అవ్వ కథలు చెబుతూ నడిపిస్తుండగా పొద్దు తిరిగి, చల్లపొద్దు అవుతుంది. గంజి కేంద్రానికేనా అని ఒక మనిషి అడిగితే అవునంటుంది. ఆ మనిషి 'పిల్లోనికి, పిల్లకి గంజిపోస్తారు. ముసిల్దానివి నీకు గంజిపోస్తారు. నీ కోడలుకు పోయరు' అని నీ కోడలు యాగటి మనిషి అని చెబితే పోస్తారని చెబుతాడు. నడుస్తుండగానే ఆ ఊరు వస్తుంది. ఆ ఊరి మంకాళమ్మకు 'తల్లీ మంకాళమ్మా! మమ్ము రచ్చించు తల్లీ! మా సంసారం కుదుటపడి మళ్లా మా ఊరు చేరిస్తే నీకు యాట కొట్టిస్తాను తల్లీ' అని అందరూ మొక్కుకుంటారు. అక్కడి నుండి గంజి కేంద్రానికి బయలుదేరుతారు. అక్కడ చావిడిలో పుట్టగోచులవారు, చింపిరి తలలవారు, చీరపేలికలవారు, చంటిబిడ్డలవారు గుంపులు గుంపులుగా చావడివైపు వెళ్తున్నారు. అక్కడ తాశీల్దారు 'పైవారి ఉత్తరువు మేరకు గంజికేంద్రాన్ని మూస్తున్నాము. మంత్రిగారు మూయమని చెప్పిపోయినారు. నేనేమి చేయలేను మీరిచ్చిన అర్జీలను కావాలంటే మంత్రులకు పంపుతాము' అంటాడు. దీనితో అవ్వ కుటుంబానికి నిరాశ ఎదురవుతుంది.

అవ్వ కొడుకు కరువు వలన కుటుంబానికి దూరమవుతాడు. అవ్వ కూడా మర్యాద కోసం ఊర్లో ఆస్తులన్నీ అమ్మి జీవనం సాగిస్తూ వలస పోకుండా ఉంటుంది. కాని కరువు ఎక్కువ అవడం వలన అవ్వ కుటుంబమంతా వేరే ఊరికి సామాన్లు సర్దుకొని గంజికోసం వెళ్తారు. తిరిపెంగంజి బొందిలో ప్రాణం వుండగా వద్దనుకున్న అవ్వ, కుటుంబంతో సహా గంజి కోసం వెదుక్కుంటూ వెళ్తుంది. కరువు చివరికి అవ్వ చేత వద్దనుకున్న పని చేయడానికి, అవ్వ అలా మారడానికి కారణమయ్యింది.

ప్రతి మనిషికి అభిమానం ఉంటుంది. కానీ ఆ అభిమానం వలన మనుషులు కరువు పరిస్థితుల్లో ఆకలి అనుభవించుట ఎంత మాత్రము సంస్కారం కాదు. కోటి విద్యలు కూటి కొరకే అన్నట్టు, ప్రతి మనిషి తన జానెడు కడుపును నింపుకోవాలని ప్రయత్నిస్తాడు. అలానే ఈ కథలోని అవ్వ తన ముందు జీవితాన్ని ఆలోచింపక కోడలు, మనుమడు, మనుమరాలుతో వేరే ఊరికి గంజికి వెళ్లేందుకు కరువు కారణమవుతుంది. ఈ 'గంజికోసరం' కథ 1953లో రాయబడింది.

'సభా'నా? 'రామకృష్ణ'నా?

'ఇంతవరకు విమర్శక లోకంలో చిత్తూరు జిల్లాకు చెందిన కె.సభాను మొదటి కథా రచయితగా పేర్కొనే ఆనవాయితీ ఉండేది. మధురాంతకం రాజారాం, నేను, సింగమనేని నారాయణ అనేక సందర్భాలలో కె.సభానే మొదటి రాయలసీమ కథారచయితగా పేర్కొన్నాము. అతడు రాసిన మొదటి కథ 'కడగండ్లు' 1944 ఏప్రిల్ నెలలో చిత్రగుప్త పక్షపత్రికలో ప్రచురించబడింది. ఈ కథతో పోల్చినపుడు రామకృష్ణ రాసిన మొదటి కథ 'చిరంజీవి' దానికంటే మూడు సంవత్సరాల క్రితమే ప్రచురించబడింది. కాలక్రమం ఆధారంగా ఆలోచిస్తే తొలి రాయలసీమ కథారచయిత అనే గౌరవం జి.రామకృష్ణకే దక్కుతుంది' అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'రాయలసీమ ఆధునిక సాహిత్యం - సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ'లో పేర్కొన్నారు.

ప్రస్తుతం నేను రాస్తున్న ఈ వ్యాసానికి కూడా ప్రధానంగా వల్లంపాటి, సింగమనేని వ్యాసాలే ఆధారమని తెలియజేసుకుంటున్నాను. రాయలసీమకు తొలి కథను అందించిన 'సీమ ప్రథమ కథకుడు' గుత్తి రామకృష్ణకు శతసహస్ర వందనాలు.

- వేంపల్లి గంగాధర్



కడప జిల్లాకు చెందిన ప్రముఖ కథారచయిత సొదుం జయరాం. వీరి స్వగ్రామం ఉరుటూరు. రాచమల్లు రామచంద్రారెడ్డి, కొడవటిగంటి కుటుంబరావులు మెచ్చిన కథకుడిగా వీరికి పేరొచ్చింది. 'వాడిన మల్లెలు', 'సింహాద్రి స్వీట్‌హోం', 'సొదుం జయరాం కథలు' తదితర కథాసంపుటాలు, 'అగమ్యం' నవల వెలువడ్డాయి. కొన్ని కథలు రష్యన్‌లోకి అనువాదమయ్యాయి. కొద్దికాలంగా కథారచనకు దూరమైన జయరాం ప్రస్తుతం కేన్సర్‌వ్యాధితో బాధపడుతున్నారు. ఈ జ్ఞాపకాలలో ఆయన తన తొలినాటి పాత్రికేయ జీవితం గురించి ఎక్కువగా గుర్తు చేసుకున్నారు.

సాహిత్యంలో నాకు తన పర భేదం తెలియదు

'సంవత్సరం సరిగ్గా జ్ఞాపకం రావడం లేదు. నేను, రామ్మోహన్ పొద్దుటూరులో ట్యుటోరియల్ కాలేజీ ఒకటి నడుపుతుండేవాళ్లం. గజ్జల మల్లారెడ్డి కూడా పొద్దుటూరులోనే ఉండేవాడు. వాళ్లమ్మాయి మా కాలేజీలోనే చదివేది. మల్లారెడ్డి రోజూ సాయంత్రం కాలక్షేపం కోసం మా కాలేజీకి వచ్చేవారు. ఆయన రాసిన కవితలూ గట్రా వినిపించేవారు. ఉన్నట్లుండి మల్లారెడ్డిగారికి విశాలాంధ్ర నుంచి పిలుపు వచ్చింది- విశాలాంధ్ర వారపత్రిక సంపాదకత్వ బాధ్యత వహించవలసిందిగా కోరుతూ. ఆయన వెళ్లడానికి అంత సుముఖంగా లేరుకానీ పార్టీ ఆదేశం మన్నించాలి. తప్పనిసరి అయింది. ఆ సందర్భంగా ఆయన రామ్మోహన్‌నూ, నన్నూ తోడుగా రమ్మని పిలిచాడు. ఎందుకంటే పార్టీలో చీలిక వచ్చి విశాలాంధ్ర దినపత్రిక నుంచి కొంతమంది వెళ్లిపోయారు. దినపత్రికలో సబ్‌ఎడిటర్స్ అవసరం ఏర్పడింది. ఆరోజుల్లో సబ్‌ఎడిటర్స్ అంటే ఇంగ్లీష్ బాగా వచ్చి ఉండాలి. అందుకని మంచి సబ్ ఎడిటర్స్ దొరకడం కష్టమే. దీంతో మల్లారెడ్డిగారు మమ్మల్ని రమ్మని గట్టి వత్తిడే తెచ్చారు. ట్యుటోరియల్ కాలేజీ కూడా సంతృప్తికరంగా లేదు. వెళ్లడమే బాగుంటుందనిపించి మా అంగీకారం తెలిపాము. అలా జరిగింది విశాలాంధ్రకు వెళ్లడం.

అప్పట్లో సబ్ ఎడిటర్లకు చాలా తక్కువ జీతాలు యిచ్చేవారు. నిజానికి నేను జీతాన్ని గురించి బాధ పడలేదు. నా ప్రవృత్తికి తగిందేనని సంతృప్తి పడ్డాను. అప్పుడు వేములపల్లి శ్రీకృష్ణగారు సంపాదకులు. కానీ సంపాదకత్వ బాధ్యత చూసేది మాత్రం ఏటుకూరి బలరామ్మూర్తిగారు. తెల్లటి పంచా, షర్ట్‌తో ఎంతో నిరాడంబరంగా కనిపించే ఆయన్ని చూస్తే సంపాదకుడని నమ్మబుద్ధి కాదు. మేము వెళ్లిన రోజు మోహన్‌ను, నన్ను ఆయన ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకున్నారు. పిటిఐ వార్తలు అనువదించడంతో పాటు కొన్ని ప్రత్యేక వ్యాసాల్ని అనువదించే పని కూడా నాకు అప్పగించారు. ఆ వ్యాసాల్ని రాత్రి పూట రూంలో అనువాదం చేసే వాణ్ణి.


ఏటుకూరిగారు ఆఫీసుకు అందరికంటే ముందు వచ్చేవారు. అందరితో అభిమానంగా ఆదరంగా ఉండేవారు. ఆయన కింద పని చేసే ప్యూన్ను కూడా 'బ్రహ్మంగారూ. ఒక కప్పు కాఫీ తెచ్చి పెడతారా' అంటూ ఎంతో నమ్రతగా అడిగేవారు. కాఫీతాగి, నాలుగు దినపత్రికలు చూసి సంపాదకీయం రాయడం మొదలు పెడితే అరగంటలో గీకి పడేసేవారు. అంత స్పీడ్ ఆయనది. అందుకే ఆయన అన్ని పుస్తకాలు రాయగలిగారు. ఆయన రాసిన పరిశోధనాత్మక పుస్తకాలు పది డాక్టరేట్లకు సమానం.

ఇంకొకటి... సబ్ ఎడిటర్స్ తప్పులు చేస్తే చూపించి నవ్వడం తప్పమందలించడం ఎరుగని మనిషాయన. ఒకసారి నాకు ఏదో వ్యాసం ఇస్తే నేను అనువదించడంలో పెద్ద బ్లండర్ చేశాను. ఎవరో అది చదివి ఉదయమే ఆయన దృష్టికి తెచ్చారు. అప్పుడు నేను అక్కడే ఉన్నాను. ఆయన ఆ తప్పు చూపించిన వ్యక్తితో పక పకా నవ్వి 'దినపత్రిక ఆయుష్షు పండ్రెండు గంటలు. తప్పు దొర్లితే ఏం కొంపమునుగుతుంది లెద్దూ' అన్నారు. ఆ తర్వాత నా వైపు తిరిగి 'ముందు ముందు కొంచెం జాగ్రత్తగా చెయ్యండి జయరాంగారూ' అన్నారు. నేను ఊపిరి పీల్చుకున్నాను.

విశాలాంధ్ర ఆదివారం అనుబంధంను ఉమారాజేశ్వరరావుగారు చూసేవారు. అయితే ఆయన, పరకాల పట్టాభిగారు చాలా స్లో రైటర్లు. అందుకని సమీక్షకు వచ్చిన మంచి మంచి పుస్తకాలు విశాలాంధ్రలో ఏటుకూరిగారే రివ్యూ చేసేవారు. 'ప్రగతి'కి ప్రధాన సంపాదకులైన మద్దుకూరు చంద్రశేఖర రావుగారు కూడా బలరామమూర్తిగారిలాగే నిరాడంబరమైన వ్యక్తి. సాయంత్రం విశాలాంధ్ర ఆఫీసుకొచ్చి సబ్ ఎడిటర్ల పక్కన కూర్చొని పిచ్చాపాటి మాట్లాడేవారు. అయితే ఆయన సంభాషణల్లో సాహిత్యం కంటే రాజకీయాలే ఎక్కువగా ఉండేవి. వారు మంచి సాహిత్య విమర్శకులు కూడా. కానీ సాహిత్యం గురించి చాలా తక్కువ మాట్లాడేవారు. అట్లాంటి వారు ఈ తరం కమ్యూనిస్టుల్లో మచ్చుకు కూడా కనిపించరు. అలాంటి గొప్ప వ్యక్తి కూడా ఆర్థిక ఇబ్బందులకు లోనయినట్లు విన్నాను. మరో ముచ్చట. ఇవాళ ప్రసిద్ధ చిత్రకారుడు మోహన్ కూడా మా జతన సబ్‌ఎడిటర్‌గా పని చేసినవాడు. కొంచెం సందు దొరికితే ఏవో పిచ్చిగీతలు గీస్తూ ఉండేవాడు. ఒకసారి రెండు మూడు నిముషాల్లో నా బొమ్మ గీసి ఇచ్చాడు. ఆ చిత్రం ఇప్పటికీ నా దగ్గరుంది.

మహీధరగారితో అక్కడే పరిచయం అయ్యింది. విశాలాంధ్ర ఆఫీసుకు వచ్చినప్పుడు ముఖ్యంగా నన్నూ, రామ్మోహన్‌ను కలిసేవాడు. ఆయన గొప్ప నమ్రతగల రచయిత. తను ఏమి రాసినా రాతప్రతిని ఎంతో మందికి చూపి అభిప్రాయాలు సేకరించేవాడు. 'ఈదారి ఎక్కడికి?' రాతప్రతి నాకూ రామ్మోహన్‌కు ఇచ్చి చదివి అభిప్రాయం చెప్పమన్నాడు. నేను ఉరుటూరులో ఉన్నప్పుడు కూడా మద్రాసు నుంచి ఉత్తరాలు రాసేవాడు.

దినపత్రిక నుంచి తర్వాత మల్లారెడ్డి సంపాదకత్వంలోని వారపత్రికకు వచ్చాను. అందులో నేను 'సరిగమలు' అనే ఫీచరుని నిర్వహించాను. దాని కోసం కొన్ని కథలు కూడా రాశాను. ఉమారాజేశ్వరరావుగారికి నేనంటే ప్రత్యే



కూర్చున్నవారు (ఎడమ నుంచి) రా.రా, ప్రొ. జి.ఎన్.రెడ్డి, పుట్టపర్తి, శ్రీశ్రీ, కొ.కు, గజ్జల మల్లారెడ్డి, వై.సి.వి.రెడ్డి.
నిల్చున్నవారు (ఎడమ నుంచి) ఆర్వియార్, ఐ.సుబ్బారెడ్డి, టి.సాంబశివారెడ్డి, సోమయాజులు, కేతు విశ్వనాథరెడ్డి, నల్లపాటి రామప్ప నాయుడు, వి.రామకృష్ణ, తువ్వా చంద్రశేఖర్‌రెడ్డి, టి.చెన్నారెడ్డి, సాదుం జయరాం

కమ్మైన అభిమానం ఉండేది. కథాసంకలనాలూ నవలలూ నా చేత రివ్యూ చేయించేవారు. నా రివ్యూలు ఆయనకు బాగా నచ్చేవి. అయితే ఒక రివ్యూ విషయంలో ఇద్దరి మధ్య అభిప్రాయ భేదం వచ్చింది. అది నవీన్‌గారి 'అంపశయ్య' పుస్తకం. ఎందుకో అంపశయ్య చైతన్య స్రవంతి ప్రయోగం నాకు నచ్చలేదు. కొంచెం దూకుడుగా విమర్శ రాశాను.

'నవీన్ మన వామపక్ష భావాలు ఉన్నవాడు. మనం కూడా అతణ్ణి విమర్శిస్తే ఎట్లా' అన్నది ఆయన వాదన.

కాని సాహిత్యాన్ని సాహిత్యంగా చూడాలన్నది నా పద్ధతి. విమర్శకు తన, పర అనే తేడాలు ఉండరాదు. సమీక్ష మళ్లీ రాయమన్నాడు. మరొకరికిచ్చి రాయించుకోండి అన్నాను. ప్రచురించకుండా ఆ సమీక్ష చాలా రోజులు పెట్టుకున్నాడు. చివరలో వేములపల్లి శ్రీకృష్ణగారి దృష్టికి వెళ్లింది. ఆయన నన్ను తన గదికి పిలిపించుకొని 'మీ సమీక్ష చదివాను. బాగానే ఉంది. కొంచెం కటువుగా వుంది. తగ్గించుకొని రాయలేరా' అన్నాడు.

నేను వీల్లేదు అన్నాను.

సరే అలాగే ప్రచురించమని ఉమారాజ్‌కు చెప్పారు. ఇలా విశాలాంధ్రలో చాలా పుస్తక సమీక్షలే చేశాను. మాస్కోలో ఉన్న రారాగారు నా సమీక్షలు చదివి 'విశాలాంధ్రకు మీరు వచ్చిన తర్వాత సాహిత్యాన్ని సాహిత్యంగా చూడటం కనిపిస్తున్నది. మీ సమీక్షలు బాగుంటున్నాయి' అని ఉత్తరం రాశారు. ఈ విషయం రారా లేఖల్లో చూడొచ్చు.

రాంభట్లగారి పరిచయం కూడా విశాలాంధ్రలో జరిగిందే. ఆయన నడయాడే విజ్ఞాన సర్వస్వం. ఆయనతో నా పరిచయం విచిత్రంగా జరిగింది. ప్రసాద్‌గారి 'కథలూ, కాకరకాయలూ' సమీక్ష చేయమని ఉమారాజ్ దానిని నాకిచ్చారు. దానికి ముందు మాట రాసింది రాంభట్లగారు. ఆయన ముందుమాటలో కథల్ని గురించి ప్రస్తావించకుండా ఏదో సోది రాశారు. నేను సమీక్షలో రాంభట్లగారిని బాగా విమర్శించినట్లు జ్ఞాపకం. అప్పటికి రాంభట్లగారితో నాకు పరిచయం లేదు. ఆయన ఎప్పుడు విశాలాంధ్ర ఆఫీసుకు వచ్చినా అందరితో చాలా చలాకీగా మాట్లాడేవారు. నాతో మాట్లాడేవారు కాదు. సమీక్ష విషయమై ఆయనకు నా మీద కోపం.

చివరకు నేనే ఒక రోజు స్వయంగా నన్ను నేను పరిచయం చేసుకున్నాను. కోపం పోయిందో ఏమో 'నా ముందు మాటను హెకిల్ చేశారు కదా మీరు' అంటూనవ్వారు. తర్వాత మామూలే. నాకు మంచి మిత్రుడు అయ్యారు. 'తెలంగాణ వీరగాథలు' రాసే పని పురమాయించి నన్ను హైదరాబాద్ కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులో పెట్టారు. రాంభట్ల రోజూ కలిసేవారు. నేనంటే చాలా అభిమానం చూపేవారు. చాలా సహృదయులు.

విజయవాడలో ఉండగా చాలా మంది పాత్రికేయులతో, రచయితలతో, కవులతో పరిచయాలయ్యాయి. జ్ఞాపకాల దొంతరలో కొంతమంది మరుగున పడ్డారు. మరికొంతమంది ఉన్నారు. ఇప్పుడు నాకు డెబ్బయి ఏళ్లు వచ్చాయి. ఎన్నో జ్ఞాపకాలు.. ఎన్నో అనుభవాలు..

పోయిన సంవత్సరం నవంబరులో అనుకుంటాను. బయాప్సీ టెస్ట్‌లో నాకు కాన్సరు అని డాక్టరు నిర్ధారించారు. వెంటనే హైద్రాబాద్ వెళ్లమని సలహా ఇచ్చారు. చావుకు నేను భయపడ్డంలేదు. మనిషికి చావన్నది అనివార్యం. కాకపోతే హాస్పిటల్‌కు వెళ్లడానికి ఆర్థిక సమస్యలు.

నన్ను హైదరాబాదు సాగనంపడానికి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు నా అన్నవాళ్లు చాలా మందే వచ్చారు. అందరి ముఖాల్లోనూ నేను ఏమవుతానో అని ఒక దిగులు. అందరూ నా కోసం దిగులు పడుతూ ఉంటే ఏ దిగులూ లేకుండా మామూలుగా ఉన్నవాణ్ణి నేనే. ఏడుపదుల నా జీవితంలో ఏనాడూ హాస్పిటల్లో పేషెంటుగా ఉండలేదు. ఔట్ పేషెంట్‌గా కూడా లేను. జ్వరమో, పులకరమో వస్తే దాని మానాన అది పోవలసిందే తప్ప మందులూ మాకులూ వాడినవాణ్ణి కాదు. అలాంటి నేను ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్‌లో చేరాను. నా దగ్గర మూడు నాలుగు వేలు మాత్రమే డబ్బున్నది. అది అడ్వాన్సుకూ కన్సల్టేషన్ ఫీజుకూ సరిపోయింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో బెడ్ ఇచ్చారు. తర్వాత సంగతి తర్వాత అనుకున్నాను. మా అబ్బాయి ఇంద్రసేన (కజిన్ బ్రదర్ కొడుకు), కామ్రేడ్ శివరామిరెడ్డికీ, కేతు విశ్వనాథరెడ్డికీ ఫోన్ చేసి నేను హాస్పిటల్లో ఉన్న విషయం చెప్పాడు. మరుసటి రోజే శివరామిరెడ్డిగారు విశ్వంను వెంటబెట్టుకుని హాస్పిటలుకు వచ్చాడు. శివరామరెడ్డి వయసు 85 సంవత్సరాలు. ఓపిక చేసుకుని నన్ను చూడటానికి వచ్చిన ఆయన ఆత్మీయతకు నా గుండె ఆర్ద్రమయింది.

'హాస్పిటల్లో చేరావు. బాగానే ఉంది. డబ్బు ఎలా ఏర్పాటు చేస్తున్నావు' అన్నాడు.

నా సమాధానం ఒక చిరునవ్వు. నా జీవితం ప్రణాళికాబద్ధమైనది కాదు. అంటే రేపటి విషయం ఆలోచించే తత్వం కాదు. కాసేపు ఆ మాటా, ఈ మాటా మాట్లాడి వెళ్తూ 'జయరాం. నిశ్చింతగా ఉండు. హాస్పిటల్ బిల్లు ఎంతయినా నేను వచ్చి చెల్లిస్తాను' అంటూ విశ్వంతో వెళ్లిపోయాడు. ఆ ఆప్యాయతకు మరోసారి కళ్లు చెమ్మగిల్లాయి.

ఏది ఏమైతేనేం.. డబ్బు పంపడం ద్వారా, ఫోన్ల ద్వారా పరామర్శించడం ద్వారా చాలా మంది తమ ఆత్మీయతను వెల్లడించుకున్నారు. ఇంతమంది ఆత్మీయుల్నిసంపాదించుకున్నందుకు నా జన్మ సాఫల్యమైనట్లు అనిపించింది. అమితమైన సంతోషం కలిగింది.


ఇలా రకరకాలుగా లభించిన ఆత్మీయతే చరమాంకంలో ఉన్న నాకు గొప్ప సంతృప్తి. ఊరట.

–సేకరణ: వేంపల్లె గంగాధర్



'హాస్పిటల్లో చేరావు. బాగానే ఉంది. డబ్బు ఎలా ఏర్పాటు చేస్తున్నావు' అన్నాడు.
నా సమాధానం ఒక చిరునవ్వు. నా జీవితం ప్రణాళికాబద్ధమైనది కాదు. అంటే రేపటి విషయం ఆలోచించే తత్వం కాదు.

✹ జానమద్ది హనుమచ్ఛాస్త్రి



సి.పి.బ్రౌన్ గ్రంథాలయం ప్రసక్తి వచ్చినా, కడప జిల్లా రచయితల సంఘం ప్రస్తావన వచ్చినా గుర్తుకొచ్చే పేరు జానమద్ది. 78 సంవత్సరాల వయస్సులోనూ నిత్యనూతనంగా, ఉత్సాహంగా కన్పిస్తారు. నిరాడంబరతకు, స్వచ్ఛతకు ప్రతిరూపంగా. నిలువెత్తు ఆత్మీయతకు ప్రతిబింబంగా ఉంటారు. కడప సాహిత్య వేదికకు రెండు దశాబ్దాలకు పైగా ప్రధాన సారథిగా ఎనిమిది రచయితల మహాసభలను జరిపించిన ఘనత వారిది. వీరి కృషి ఫలితంగానే బ్రౌన్ గ్రంథాలయం కడపలో సరస్వతీ మందిరంగా వెలిసింది. వీరిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. గ్రంథాలయ సేవకు గుర్తింపుగా అయ్యంకి వెంకట రమణయ్య అవార్డు అందుకున్నారు. రచయితగా, అనువాదకుడిగా, విమర్శకుడుగా సాహిత్య వికాసానికి కృషి చేస్తున్న 'బ్రౌన్ శాస్త్రి' జ్ఞాపకాలు ఈ వారం ...

ఈ జన్మకు ఇది చాలు

జానమద్ది మా ఊరి పేరు. ఇది కర్నాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ జిల్లాలో ఉంది. అక్కడ్నుంచి మా తాతగారి కుటుంబమంతా రాయదుర్గం వచ్చేసింది. సుబ్రహ్మణ్యశాస్త్రి, జానకమ్మ గార్లకు మూడవ సంతానంగా 1926 సెప్టెంబర్ 5వ తేదీన పుట్టాను. హనుమాన్ అని ముద్దుగా పిల్చుకునే వారు. తాతగారు నగరేశ్వర దేవాలయంలో అర్చకులుగా ఉండేవారు.

నా ప్రాథమిక విద్య అంతా వీధిబడిలో జరిగింది. పాఠ్య పుస్తకాలు ఉండేవి కావు. అక్షరాలు నోటు పుస్తకంలో రాసిచ్చేవారు. ఉదయం, సాయంత్రం అమరకోశం చెప్పేవారు. నాల్గవ తరగతి బోర్డు స్కూల్‌లో చదివాను. హైస్కూల్లో హెడ్‌మాస్టర్ సుందరం అయ్యర్. వారిని చూస్తే చాలు విపరీతమైన భయం. 6, 7 తరగతుల్లో సారస్వత సమావేశాలు జరిగేవి. ఈ కార్యక్రమాలన్నీ నేత్రపల్లి సంజీవరావు ఆధ్వర్యంలో సాగేవి. వీరితో పాటు ఐదుకల్లు సదాశివన్‌గారు కూడా అక్కడే ఉపాధ్యాయులుగా పని చేసేవారు. అందరూ కన్నడం నేర్చుకోవాలని చెప్పేవారు. అప్పటికే నాకు కన్నడం వచ్చి ఉండడం వల్ల ఎనిమిదో తరగతి వారికి కూడా నా చేత అప్పుడప్పుడు కొన్ని పాఠాలు చెప్పించేవారు. నేనప్పుడు ఆరో తరగతి.

సినీనటి జమున చిన్నాయన నిప్పాణి రంగారావు ప్రముఖ కమ్యూనిస్టు లీడర్. వారు సాయంత్రం కాగానే వచ్చి ఉపన్యాసాలు ఇచ్చేవారు. స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించి మాలో చైతన్యాన్ని నింపేవారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా కరపత్రాలు పంచేవాళ్ళం. పి.ఎస్.శర్మతో కలిసి ఈ పని చేసేవాళ్ళం. కొండరాళ్ళపై 'డూ ఆర్ డై', 'క్విట్ ఇండియా' అనే నినాదాలు రాసేవాళ్ళం. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం బలంగా ఉంది. అక్టోబర్ 2 గాంధీ జన్మదినం పురస్కరించుకుని ఏదైనా చేయాలనిపించింది. ఆ రోజు ఉదయం పాఠశాల ప్రార్థనా సమయంలో 'గాంధీ మహాత్మాకు జై' అని గట్టిగా అరిచాను. నాపై హెడ్‌మాస్టర్ కోప్పడ్డారు. బెత్తంతో ఆరు దెబ్బలు పడ్డాయి.క్షమాపణ చెప్పాల్సిందిగా పట్టుపట్టారు. నేను చేసిన తప్పు ఏమిటో తెలియడం లేదన్నాను. మా తాతయ్యను పిలిపించి నన్ను అదుపులో ఉంచాలని ఆదేశించి పంపారు. అప్పట్నుంచి ఉద్యమానికి నన్ను దూరంగా ఉంచుతూ వచ్చారు..

నాకు ఇంగ్లీషు రావడానికి కారణం హెడ్‌మాస్టర్ సుందరం అయ్యర్ గారే. క్లాస్ కెళ్ళేటప్పుడు తప్పనిసరిగా డిక్షనరీ, టెక్స్ట్, నోట్సు మూడూ ఖచ్చితంగా ఉండాల్సిందే. ఏది లేకపోయినా బయటకు పంపేసే వారు. 1943లో ఎస్.ఎస్.ఎల్.సి పాస్ అయ్యాను. గవర్నమెంట్ కాలేజ్, అనంతపురంకు సైన్స్ గ్రూప్‌లో ప్రవేశం కోరుతూ అప్లికేషన్ పెట్టుకున్నాను. వారు ఆర్ట్స్ గ్రూప్‌లో సీటు ఇస్తామంటూ చెప్పారు. నాకు అది నచ్చలేదు. చేరలేదు. దాంతో ఖాళీగా ఉండాల్సి వచ్చింది. విన్‌స్టెంట్ టూరింగ్ టాకీస్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేశాను. అక్కడ ఉండి చెడిపోతానని బళ్ళారిలోని గవర్నమెంట్ ట్రైనింగ్ స్కూల్‌లో ఉపాధ్యాయ వృత్తికోసం సెకండరీ ట్రైనింగ్‌లో చేర్పించారు. 1944–46 మధ్యలోనే నా ట్రైనింగ్ పూర్తయ్యింది. అక్కడే ఉద్యోగం కూడా దొరికింది. జీతం 30 రూపాయలు, 1946 జూన్‌లో మోడల్ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగంలో చేరిపోయాను. బళ్ళారిలో నాకు ఆశ్రయం కల్పించింది రామచంద్రస్వామి గారనే ఆయుర్వేద వైద్యులు.

బళ్ళారిలో ఉన్నప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలు బాగా జరిపిస్తూ ఉండే వాళ్ళం. అక్కడే బళ్ళారి రాఘువగారు పరిచయమయ్యారు. రామచంద్రస్వామి గారింటికి రాఘువ వచ్చేవారు. పాతకాలం నాటి కారు, దానికి స్వామిదాసు అనే డ్రైవరు. రాఘువగారి నాటక ప్రదర్శనలకు అందరం కలిసి వెళ్ళేవాళ్ళం. వారి వల్ల నాటకాల వైపు ఆకర్షితుడనై చంద్రగుప్త నాటకంలో మురా పాత్ర కూడా వేశాను.

బళ్ళారి జిల్లా కన్నడ తాలూకాలలో కన్నడ పాఠశాలల పర్యవేక్షకుడిగా నన్ను ఎంపిక చేశారు. అప్పుడు నా జీతం 110 రూపాయలు. నా జీవితంలో టర్నింగ్ పాయింట్ గాడిచర్ల హరి సర్వోత్తమ రావు గారితో పరిచయం కలగడం. మొట్టమొదట జైలుకెళ్ళిన తెలుగువాడు, పత్రికా సంపాదకుడు, రాజకీయ ఖైదీ ఆయన. రాయలసీమలోనే ఎం.ఏ పాసైన మొదటి వ్యక్తి కూడా వారే. వారు బళ్ళారి జిల్లా సందర్శనకు వచ్చారు. 'తను తెలుగులో ఇచ్చే ప్రసంగాలను కన్నడంలోకి అనువాదం చేసి చెప్పేవాళ్ళు కావాలంటే బళ్ళారి జిల్లా విద్యాశాఖాధికారి నా గురించి చెప్పారు. అలా వారితో పరిచయం కలిగింది. పగటిపూట గ్రంథాలయాలను, రాత్రిపూట వయోజన విద్యా కేంద్రాలను తనిఖీ చేసేవారు.

వయోజన విద్య బోధించే పాఠశాలకు కిరోసిన్ కోసం రోజుకు అర్ధ రూపాయి ఇచ్చేవారు. కొందరు పని చేయకుండానే బిల్లులు పెట్టుకునేవారు. గాడిచర్ల గారితో ఎనిమిది రోజులు కలిసి ఉన్నాను. వ్యాన్‌లో చిన్న ప్రొజెక్టర్, ఫిల్మ్‌తో ఊర్లు తిరిగి ఆరోగ్యం గురించి, విద్య గురించి ప్రచారం చేశాం. నా చదువు గురించి ఓసారి ఆంధ్రా యూనివర్శిటీలోని డా. వి.ఎస్.కృష్ణ గారికి గాడిచర్ల వారు లేఖ కూడా రాశారు.

బి.ఏ (హిందీ), ఎం.ఏ (తెలుగు, ఇంగ్లీష్) చదివాక స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్‌గా నెల్లూరు జిల్లా దర్శి తాలూకాలోనూ, గుంటూరు, బాపట్లలలోనూ పని చేశాను. అప్పట్లో మూడు అణాలకు భోజనం, రెండు అణాలకు ఇడ్లీ, కాఫీలు ఇచ్చేవారు. 1960లో కడపకు వచ్చాను. ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం. ఎ.వి. నాయుడు డి.ఇ.ఓగా ఉండేవారు. సాహితీవేత్త పుట్టపర్తి నారాయణాచార్యుల వారిని నేషనల్ అవార్డుకు సిఫార్సు చేయాలో ... వద్దో చూడమని చెప్పారు. తర్వాత నా మాట ప్రకారం సిఫార్సు చేయడం



1976నాటి కడపజిల్లా రచయితల సంఘం సభ:
మొదటివరుస: కరుణశ్రీ, పైడి లక్ష్మయ్య, బోయి భీమన్న, పి.ఎల్. సంజీవరెడ్డి, పుట్టపర్తి, మల్లెమాల, జాషువద్ది
రెండవరుస: దాశరథి, ఆరుద్ర, పురిపండ, పోలా వెంకట సుబ్బయ్య, ఎస్.టి.జ్ఞానానందకవి, జె.బాపురెడ్డి, వై.వి. రమణారెడ్డి

జరిగింది. నా ఎంపికపై కొందరు విమర్శలు కూడా చేశారు. 1964లో రాజంపేటలో ఉండేటప్పుడు తాళ్ళపాకలో ఎలిమెంటరీ స్కూల్‌ను, అప్పర్ ప్రైమరీ స్కూల్ చేయాలని కొందరు ఊరిజనం నన్ను కలవడం జరిగింది. పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల వారికి గుడి కట్టిస్తే మీ ప్రతిపాదనకు ఒప్పుకుంటానని షరతు పెట్టాను. సాధు వెంకట కృష్ణయ్య అనే వ్యక్తి అప్పటికప్పుడు నూట పదార్లు ఇస్తానని ముందుకొచ్చాడు. అన్నమాచార్యుల బొమ్మను చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రహ్మణ్యం శ్రమించి గీశారు. అలా తాళ్ళపాకలో అన్నమయ్య కోసం కృషి జరిగింది. ఆ పటాన్ని డా. బెజవాడ గోపాలరెడ్డి గారు తాళ్ళపాకలో ఆవిష్కరించారు.

తర్వాత నాకు జిల్లా ఎడ్యుకేషనల్, సర్వే ఆఫీసర్‌గా బదిలీ జరిగింది. చాలా ఊర్లు తిరిగాను. సమాచారాన్ని సేకరించాను. కడప ఆర్ట్స్ కాలేజీలో పని చేస్తున్న కేతు విశ్వనాథరెడ్డి 'కడప ఊర్ల పేర్లు' మీద చేస్తున్న పిహెచ్.డి పరిశోధనకు ఆ సమాచారం ఉపయోగపడింది. కొంతకాలం కడప గవర్నమెంటు ఈవెనింగ్ కాలేజ్‌లో లెక్చరర్‌గా ఉండే నన్ను కదిరికి బదిలీ చేశారు. అయితే రచయితల సంఘం అధ్యక్షులు మల్లెమాల వేణుగోపాలరెడ్డి గారు అప్పటి విద్యాశాఖా మంత్రిగా ఉన్న వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారి దగ్గరికి పులివెందుల తీసుకెళ్ళి మాట్లాడించి బదిలీని ఆపించారు.

1972లో చిత్తూరు జిల్లా రచయితల సభలు జరిగాయి. కథకుడు పి.రామకృష్ణారెడ్డి గారు కడప నుంచి అక్కడికెళ్ళి వచ్చి 'మా సీమ' పత్రిక ఆఫీసులో కూర్చొని కడపలో కూడా రచయితల సంఘం ఎందుకు పెట్టుకోకూడదనే ప్రశ్న తీసుకొచ్చారు. దీనికి జవాబుగా కడప జిల్లా రచయితల సంఘం ఆవిర్భవించింది. పి.రామకృష్ణారెడ్డి (తులసీకృష్ణ) గారు అధ్యక్షులుగా, డా. మల్లెమాల వేణుగోపాలరెడ్డి, జూటూరు రమణయ్య గార్లు ఉపాధ్యక్షులుగా, నేను కార్యదర్శిగా సంఘం ఏర్పాటైంది. అందరి శ్రమ చేత కడప జిల్లా రచయితల సంఘానికి గౌరవ ప్రతిపత్తి లభించింది. మూలనిధి ఏర్పాటుచేసి సాహిత్య సభల నిర్వహణ కొనసాగిస్తూ వచ్చాము. 1973 ఆగస్టు 11, 12 తేదీలలో జిల్లా రచయితల మహాసభలు అత్యంత వైభవంగా జరిగాయి. మహాకవి గడియారం వేంకట శేషశాస్త్రి గారు వాటికి అధ్యక్షత వహించగా ఈ లైబ్రరీ నిర్వహణను ఎస్.వి.యూనివర్సిటీకి అప్పగించడంతో ఒక రకంగా నా బాధ్యత తీరిపోయిందని భావిస్తున్నాను. సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా. బెజవాడ గోపాలరెడ్డి వీటిని ప్రారంభించారు. కడప జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా, అధ్యక్షులుగా 1973 నుండి 1992 వరకు దాదాపు 400కు పైగా సాహితీ సమావేశాలు నిర్వహించారు. 'బ్రౌన్ – వేమనల' సంస్మరణ సంచికకు సంపాదకత్వం వహించడం బ్రౌన్ పట్ల నాలో అభిమానం పెరగడానికి పునాది వేసింది.

1976లో ఆరుద్ర, బంగోరేలు కడపకు వచ్చారు. బ్రౌన్ నివసించిన బంగళా శిథిలావస్థలో ఉండడం చూశారు. అప్పుడుఆ స్థలం సి.ఆర్.కృష్ణస్వామి కుమారుడు సంపత్ కుమార్ గారి ఆధ్వర్యంలో ఉంది. బంగోరే గారి 'బ్రౌన్ లేఖలు' ప్రచురణకు అప్పటి కడప కలెక్టర్ పి.ఎల్.సంజీవరెడ్డి గారి ద్వారా ఐదు వేల రూపాయలు కూడా ఇప్పించాము. 1984లో మద్రాసులో బ్రౌన్ వసంతోత్సవం జరిగింది. వేదికకు ఆరుద్ర కన్వీనర్‌గా వ్యవహరించారు. నేను కూడా 'కడపలో బ్రౌన్' అనే వ్యాసం సమర్పించాను.

1984లోనే సాహిత్య అకాడమీ ఎన్నికలు వచ్చాయి. మల్లెమాల, నేనూ ఇద్దరమూ పోటీ చేశాము. ఓట్లకోసం అంతకు మునుపు అకాడమీ అవార్డు పొందిన వారిని కలవాల్సి వచ్చింది. భానుమతి, బాపూ, రమణ, గొల్లపూడి, ఎ.ఎస్.రామన్, ఆరుద్ర, మోదుకూరి జాన్సన్ వంటి ప్రముఖులందర్నీ కలిసి ఓటు చేయమని కోరాం. అందరూ మా కృషిని ప్రశంసిస్తూ తమ ఓటు వేసి గెలిపించారు. మల్లెమాల, నేనూ ఇద్దరమూ ఏకకాలంలో సాహిత్య అకాడమీకి ఎన్నుకోబడ్డాము. ఆ తర్వాత సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులకు కూడా రచయితల సంఘం ఆతిథ్యమిచ్చింది. ఆ సందర్భంగా డా. బెజవాడ గోపాలరెడ్డి, డా. బోయి భీమన్న, జె.బాపురెడ్డి, పురిపండా, డా. దివాకర్ల, డా. దేవులపల్లి రామానుజరావు, డా. లక్ష్మీకాంతమ్మ వంటి ప్రముఖులందరూ కడపకు విచ్చేసి ఆనందింపజేశారు.

ఓసారి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు కడప వచ్చారు. పేరాల భరతశర్మ గారు కృషి చేసి తీసుకొచ్చారు. రామకృష్ణ హైస్కూల్లో మీటింగ్ పెట్టారు. సభకు అధ్యక్షులుగా పుట్టపర్తి వారు ఉన్నారు. అక్కడే మా సీమ రాజగోపాల్‌రెడ్డి గారికి విశ్వనాథ వారికి వాగ్వివాదం జరిగినట్లు జ్ఞాపకం. విశ్వనాథ వారు కోపిష్టి అని, దురహంకారి అనే విమర్శలు ఉండేవి కానీ నా అనుభవం వేరు. రాయవరం దగ్గర్నుంచి బైరపురెడ్డి నారాయణరెడ్డి అనే కవి 'రాయలసీమ రైతు' అనే కావ్యం తీసుకొని వచ్చాడు. ఆయన చదివింది ఐదో తరగతే. విశ్వనాథ వారితో ముందు మాట రాయించుకోవాలని కోరిక. నాకు కొంత అనుమానం వేసింది. అయినా తీసుకెళ్ళాను విశ్వనాథ వారి ముందుకు. విషయం చెప్పాను. మీ ఆశీస్సులు కావాలి అన్నాను. విశ్వనాథ వారు 'రాయలసీమ రైతు' పుస్తకాన్ని అటు – ఇటు రెండు సార్లు తిప్పి చూసి, అక్కడక్కడా చదివి ... 'రాసుకో ...' అని రెండున్నర పేజీల అభిప్రాయం చెప్పారు. నారాయణరెడ్డి కళ్ళల్లో ఆనందం. నా కళ్ళల్లో సంతృప్తి. 'ఐదో తరగతి చదివి కావ్యాలు రాయడమే గొప్పతనం కదా!' అన్నారు విశ్వనాథ. 'మీ గురించి మరోలా విన్నాను స్వామీ' అని అంటే ... 'అది నా కర్మ. నేనేం చేయగలను' అని నవ్వారు.

అది విశ్వనాథ వారి మంచితనం అనిపించింది.

1983లో ఆంగ్లోపన్యాసకులుగా పదవీ విరమణ చేశాను. తెలుగు, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో 2500 పైగా వ్యాసాలు రాశాను. ఒక కథ కూడా రాశాను. 'కూలిన నీడలు'. పాతిక కవితలు రాశాను. అనువాదాలు కూడా ఉన్నాయి. 20 పుస్తకాలు రాశాను. 'నీరాజనం' పేరుతో వ్యాస సంపుటి తీసుకొచ్చాను. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, వీరబ్రహ్మేంద్ర స్వామిల గురించి ఇంగ్లీష్‌లో పుస్తకాలు రాస్తున్నాను. చాలా శ్రమించి బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పరచిన విషయం మీకు తెలిసిందే. బ్రౌన్ లైబ్రరీలో 31450 పుస్తకాలు ఉన్నాయి. మెకంజీ కైఫియతులు 40 సంపుటాలు సంపాదించాము. అవి వెలుగులోకి తేవాల్సి ఉంది.

ఇప్పటికీ తెల్లవారు ఝామున నాలుగు గంటలకు నిద్రలేస్తాను. వచ్చిన ఉత్తరాలన్నిటికీ వివరంగా ప్రత్యుత్తరాలు రాస్తాను. ఆరోగ్యంగానూ, ప్రశాంతంగానూ ఉన్నాను. అనుకున్నవన్నీ సాధించాను. కుటుంబ జీవితం కూడా తృప్తిగా ఉంది. ఆర్థిక సమస్యలు ఏవీ లేవు. ఇలా సాహితీ సేవలో నిమగ్నమ్వవడమే ఈ జన్మకు చేసుకున్న పుణ్యమని భావిస్తాను.

–వేంపల్లి గంగాధర్

* జ్ఞాపకాలు

* డాక్టర్ బాలశౌరిరెడ్డి

ఆ శక్తి కడప మట్టిలోనే ఉంది



రాజేష్‌గాంధీ

కడపజిల్లాలోని సాదాసీదా పల్లెటూరిలో పుట్టిన బాలశౌరి రెడ్డి తెలుగువారి సాహిత్య సంపదను హిందీ పాఠకులకు పంచిన ఘనుడు. అటు తెలుగులోనూ ఇటు హిందీలోనూ లెక్కకు మించిన రచనలు చేసిన సవ్యసాచి. అనువాదకుడు. హిందీ చందమామకు రెండు దశాబ్దాలపాటు సంపాదకత్వం వహించి ఆ పత్రిక అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశాడాయన. ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన బాలశౌరి రెడ్డి ఆ ఘనతంతా తను పుట్టి పెరిగిన కడప మట్టిదేనని సవినయంగా తెలియచేస్తున్నారు.



మా ఊరు పులివెందుల తాలూకా గొల్లల గూడూరు. మాది మధ్యతరగతి రైతు కుటుంబం. నాకు నాలుగు సంవత్సరాల వయసులో మా అమ్మ ఓబులమ్మ స్వర్గస్తురాలైంది. మా నాన్న గంగిరెడ్డి మరో వివాహం చేసుకోకుండా తన జీవితాంతం నా అభివృద్ధి కోసం కృషి చేసిన మహానుభావుడు. నేను ఆ అపూర్వ దంపతుల స్వరూపాన్ని పుణికి పుచ్చుకుని పుట్టిన బిడ్డను. నాకు మా నాన్న నేర్పిన విద్య ఒకటే. 'నీవు మంచి చేస్తే బాగుపడతావు– చెడు చేస్తే చెడిపోతావు'. ఇదే నా జీవితానికి తారక మంత్రం.

నాకు చిన్నప్పట్నించి తెలుగు భాష అంటే ఎనలేని అభిమానం. అమరం, ఆంధ్రనామ సంగ్రహం, శతకాలు బట్టీపట్టేవాణ్ణి. పెద్దల ముందు వాటిని వల్లెవేసి ప్రశంసలు పొందేవాణ్ణి. తెలుగులో సాహితీ సృజన చేయాలని కలలు కనేవాణ్ణి. అయితే ఒక సంఘటన నా జీవితాన్ని మలుపు తిప్పింది. 1946లో మద్రాసు హిందీ ప్రచార సభకు గాంధీగారు హాజరయ్యారు. నేను ఆయనను దర్శించడమే కాదు ఆయన సంతకాన్ని కూడా పొందాను. అయితే ఆ సంతకం హిందీలో ఉంది. అది చూసి నేను కూడా హిందీ భాషను క్షుణ్ణంగా అభ్యసించాలని బలంగా అనుకున్నాను. దాని కోసం నా యిరవయ్యవ ఏట యిల్లు విడిచి పెట్టి కాశీకి వెళ్లిపోయాను.

కాశీలో నేను విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే సరోజినీ నాయుడు మరణించారు. అప్పుడామె ఉత్తరప్రదేశ్ గవర్నరు. ఆ సందర్భంగా కాశీలో జరిగిన ఒక శోకసభలో నేను హిందీలో ఒక కవిత పఠించాను. ఆ కవి సమ్మేళనానికి అధ్యక్షత వహించిన కమలా త్రిపాఠిగారు నన్ను ప్రశంసించి హిందీలో రచనలు చేయమని ప్రేరేపించారు. అయితే నా మొదటి రచన మాత్రం తెలుగులోనే అచ్చయ్యింది. 1949లో 'త్రిలింగ' పత్రికలో 'లలితకళలు' శీర్షికన ప్రచురితమైన ఆ రచనను పుట్టపర్తి నారాయణాచార్యులుగారు ప్రశంసిస్తూ కార్డు రాసి నా భుజం తట్టారు. యాదృచ్ఛికంగా అదే నెలలో నా మొదటి హిందీ రచన 'గ్రామ సంసార్' అనే ద్వీసప్తాహికలో ప్రచురితమై పఠితుల ఆదరణ పొందగల్గింది. అలా తెలుగులోనూ, హిందీలోనూ ఒకేసారి మొదలైన నా రచనావ్యాసంగం హిందీలో 75, తెలుగులో 13 గ్రంథాలుగా భాసించింది.

కాశీ నుంచి తిరిగి వచ్చాక నేను 'అబ్' అనే దినప్రతికలో హిందీలో వ్యాసాలు రాసేవాణ్ణి. అందులో రచయిత అడ్రసు కూడా యిచ్చేవారు. ఆ అడ్రసు చూసి హిందీ ప్రచారసభ విద్యాశాఖ సెక్రటరీ ఎస్ఆర్ శాస్త్రిగారు నాకు ఉత్తరం పంపారు. అందులో మద్రాసు హిందీ ట్రెనింగ్ కళాశాలలో ఉపన్యాసకులుగా చేరమని 125 రూపాయలు జీతం ఉంటుందని తెల్పారు. అది చూసి మా నాన్నగారి అనుమతితో మద్రాసు చేరుకున్నాను. అక్కడ ఎంతోమంది తెలుగు ఉద్దండులతో పరిచయాలయ్యాయి.

కొడవటిగంటి కుటుంబరావు, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, దేవులపల్లి వెంకట కృష్ణారావు, పాలగుమ్మి పద్మరాజు, నార్ల, విద్వాన్ విశ్వం... వీరందరూ తెలుగులో నేను రచనా వ్యవసాయం చేసేందుకు ప్రేరక సూత్రాలయ్యారు. రావూరి భరద్వాజ, వాసిరెడ్డి సీతాదేవి, తెన్నేటి హేమలత, ముత్తుంబ నరసింహాచార్యులు, కనక మేడల వెంకటేశ్వరరావు, సభా.. మేమంతా కలిసి ఆ రోజుల్లో వ్యాసాలు, కథలు రాసేవాళ్లం. అయితే నేను హిందీలోనే ఎక్కువ రాయడానికి కారణం ఉంది. 1955లో అంటే అర్ధ శతాబ్దం కిందట '

ఆజ్‌కల్' పత్రికలో ప్రచురించబడిన నా రచనకు అక్షరాలా 100 రూపాయల పారితోషికం వచ్చింది. అది చాలా పెద్ద మొత్తం. ఇతరుల ఊహకు అందనిది. అప్పట్లో నా జీతమే 350 రూపాయలు.

అలా హిందీలో సాగుతున్న నా వ్యాసంగం 1954లో ఆంధ్ర హిందీ పరిషత్తు హైదరాబాద్ వారి కోరికపైన 'పంచామృత్' అనే గ్రంథాన్ని రచించడంతో మరో మలుపు తిరిగింది. అది నాకు చాలా పేరు తెచ్చిన రచన. అందులో తిక్కన, పోతన, పెద్దన, వేమన, చేమకూర వెంకట కవుల పరిచయాలతో పాటు ఒక్కొక్కరివి 125 పద్యాల వంతున మొత్తం 625 పద్యాలకు హిందీ అనువాదం చేశాను. ఆ పుస్తకం చదివి నాటి మధ్య భారత గవర్నరు భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు ప్రశంసిస్తూ ఉత్తరం రాశారు. నార్ల వారు స్వయంగా హిందీ ప్రచారసభకు వచ్చి నన్ను అభినందించారు. అన్ని పత్రికలూ మంచి రివ్యూలు రాశాయి. హిందీ జర్నలిజానికి పితామహుడైన శివపూజన సహాయ్ 'సాహిత్య' పత్రికలో దానిపై సంపాదకీయం రాశారు. భారత ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు పోటీ పడి బహుమతులందచేశాయి. ఆ సందర్భంగా కడపలో నాకు పెద్ద సన్మానం చేశారు.

నేను హిందీలో 13 నవలలు రాసి ప్రచురించాను. ప్రచురణకర్తలంతా ఢిల్లీ, అలహాబాద్, పాట్నావారే. అందులో నాలుగు నవలలు చారిత్రకమైనవి. పల్నాడు, కొండవీడు, విజయనగరాల చరిత్రకు సంబంధించినవి. ఇక 'జిందగీకీ రాహ్' అనే మరో నవలకు కూడా బాగా పేరొచ్చింది. ఇది 'బతుకుబాట' పేరుతో తెలుగులోకి అనువాదమైంది. మూలరచనకు ఇందిరాగాంధీ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాను. అలాగే నా 'లకుమ' నవల యింత వరకూ హిందీలో ఏడు ముద్రణలు పొందింది. దీనిని 1972లో పి.రాజగోపాలనాయుడుగారు తెలుగులో అనువదించారు. కన్నడంలో, గుజరాతీలో కూడా ఇది అనువాదం అయ్యింది. యిపుడు ఇంగ్లీషులో శ్రీమతి శశిపాండే గారు అనువదించారు. గుజరాతీలో నావి 5 నవలలు అనువదింపబడ్డాయి. నా కథలు ఉర్దూ, గుజరాతీ, డోగ్రో, మలయాళం భాషలలో ప్రచురించబడ్డాయి.

నా జీవన యాత్రలో నేను అనేక ఉద్యోగాలు చేశాను. వాటిలో ముఖ్యమైనది హిందీ చందమామకు సంపాదకత్వం వహించడం. 1966 నుంచి 1988 వరకు నేను దాదాపు 23 సంవత్సరాలు హిందీ చందమామకు సంపాదకత్వం వహించాను. నేను బాధ్యతలు తీసుకున్నప్పుడు చందమామ హిందీలో 75 వేలు అచ్చయ్యేది. నేను విరమించుకున్న సమయంలో ఒక లక్షా అరవై ఏడు వేల ప్రతులు అమ్ముడుపోతుండేవి. ఆ తర్వాత నేను కలకత్తాలోని భారతీయ భాషా పరిషత్తు సంస్థకు డైరెక్టరుగా వెళ్లాను. 1990 నుంచి 1994 వరకు అక్కడ పని చేశాను. ఆ సంస్థ ప్రతి సంవత్సరం 12 భారతీయభాషలకు బహుమతులు ప్రదానం చేస్తూ ఉంటుంది. నా హయాంలో సి.నారాయణ రెడ్డి 'విశ్వంభర' కావ్యానికి ప్రథమ బహుమతి యిచ్చాము. పుట్టపర్తి గారి 'పండరీ భాగవతానికి', అలాగే మాలతీ చందూర్, రావూరి భరద్వాజ, కేతు విశ్వనాథరెడ్డిలకు బహుమతులు ఇవ్వడం జరిగింది.

1994లో ముఖ్యమంత్రి కె.విజయభాస్కరరెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షులుగా నన్ను నియమించారు. ఆ సందర్భంలో దువ్వూరి రామిరెడ్డి, జాషువ, డా.విశ్వనాథ సత్యనారాయణగార్ల శతజ



> **నేను రాసిన 'పంచామృత్' నాకు చాలా పేరు తెచ్చిన రచన. అందులో తిక్కన, పోతన, పెద్దన, వేమన, చేమకూర వెంకట కవుల పరిచయాలతో పాటు ఒక్కొక్కరివి 125 పద్యాల వంతున మొత్తం 625 పద్యాలకు హిందీ అనువాదం చేశాను.**

యంతి ఉత్సవాలను ఆంధ్ర, గుంటూరు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల సహకారంతో ఘనంగా జరపాలని నేను, నిర్వాహక వర్గం నిర్ణయించాము. అయితే అప్పుడే అంతర్ రాష్ట్రీయ హిందీ సమితివారు నన్ను అమెరికాకు ఆహ్వానించారు. వారి కోరిక మేరకు నేను న్యూయార్క్, వాషింగ్టన్, న్యూజెర్సీ, లండన్, సింగపూర్ నగరాలు దర్శించి భారత్‌కు చేరుకునేలోగా ఎన్నికలు జరిగి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంది. దాంతో నేను అకాడమీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశాను. విద్యాశాఖమంత్రి ముద్దుకృష్ణమనాయుడు నా రాజీనామాను వాపసు తీసుకోమని కోరారు. నా మిత్రులు గజ్జల మల్లారెడ్డిగారు అధికార భాషా సంఘం అధ్యక్షులుగా వుంటూ నా రాజీనామాను వ్యతిరేకించారు. అయితే నేను మాత్రం నా ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేందుకు నిర్ణయం తీసుకున్నాను. ఈలోగా మద్రాసులోని హిందీ రచయితలు, ప్రొఫెసర్లు, అభిమానులు నన్ను తమిళనాడు హిందీ అకాడమీకి ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. 1998 నుంచి నేను ఆ బాధ్యత నిర్వహిస్తున్నాను.

హిందీ భాషా రంగంలో నేను ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా నా మాతృభాషయైన తెలుగు మాధుర్యాన్ని హిందీ పాఠకులకు అందించడంలో ఎటువంటి లోటూ చేయలేదు. తెలుగు వాఙ్మయ నిర్మాతలు నన్నయ్య నుంచి నారాయణరెడ్డి వరకు 30 మంది రచనలను హిందీలో పరిచయం చేశాను. అలాగే హిందీలో 'తెలుగు వాఙ్మయ చరిత్ర'ను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంవారి చేత ప్రచురింపజేశాను. అంతేగాక తెలుగు నుంచి 235 కథలను 5 సంపుటాలుగా హిందీలో అనువాదం చేశాను. 13 నవలలు, 5 నాటకాలు అనువదించాను. తెనాలి రామలింగడి కథలు, మర్యాద రామన్న కథలు, తెలుగు ప్రబంధకావ్యాల సంగ్రహం... యిలా దాదాపు 30 పుస్తకాల ద్వారా తెలుగు భాష, సాహిత్య, సాంస్కృతిక ఔన్నత్యాన్ని హిందీ పఠిత లోకానికి అందజేశాను. మన హిందీ రచయితలు ఈ కోవలో విశేషంగా కృషి చేయాలని అభిలషిస్తున్నాను.

సాధారణంగా ఇంటగెలిచి రచ్చగెలవమని అంటుంటారు. నేను రచ్చ ఎక్కువగా గెలిచాను. దేశ అత్యున్నత పదవుల్లో ఉన్న జ్ఞానీ జైల్‌సింగ్, రాజీవ్‌గాంధీ, శంకర దయాళ్ శర్మల చేతుల మీదుగా అనేక పురస్కారాలు అందుకున్నాను. 2000 సంవత్సరంలో ఢిల్లీ సాహిత్య అకాడెమీ భవన్‌లో నాకు ఘన సన్మానం జరిగింది. ఆ సందర్భంగా 'అపనే అపనే బాలశౌరిరెడ్డి' అనే నాలుగు వందల పుటల అభినందన గ్రంథాన్ని ప్రసిద్ధ హిందీ రచయిత కమలేశ్వర్ ఆవిష్కరించారు. అలాగే మద్రాసులో జరిగిన నా అమృతోత్సవ సభకు (75 సంవత్సరాల సభ) ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆచార్య విష్ణుకాంత శాస్త్రిగారు వచ్చి ఆశీర్వదించారు. వీటన్నిటికి మించి కడపోత్సవాల సందర్భంలో నారా చంద్రబాబు నాయుడు నా స్వంతజిల్లాలో నాకు సన్మానం చేస్తూ మీ సారస్వత సేవకు మేమంతా గర్విస్తున్నామని ప్రస్తుతించారు. ఇది నాకు ఎంతో ఆనందం కలిగించింది. ఈ విధంగా బహుమతులు, సన్మానాలు అందుకున్న నేను మీవాణ్ణి, మీ కడపజిల్లా నివాసిని అని ఈ సందర్భంగా చెప్పుకుని గర్వపడుతున్నాను. ఇదంతా నా గొప్పతనం కాదనీ ఆ శక్తి కడప మట్టిలోనే ఉందని నేను నమ్ముతున్నాను. 55 ఏళ్ల నుంచి మద్రాసులో ప్రవాస జీవితం గడుపుతున్నా నా ఆత్మమూలం కడపమట్టిలోనే ఉంది. మా అబ్బాయి వెంకట రమణారెడ్డి ఇంజనీరుగా మద్రాసులోనే స్థిరపడ్డాడు. నా కుమార్తెలు జ్యోతి, భారతిలు కడపలోనే ఉన్నారు.

ఇక నా శ్రీమతి సుభద్రాదేవి జీవితమంతా నాకు తోడూ నీడా. నా సోమరితనాన్ని వదలగొడుతూ నన్ను ప్రేరేపించిన వ్యక్తి ఆమె. 70 సంవత్సరాల వయసులో కూడా నాతో రచనలు చేయిస్తున్న గొప్పతనం ఆమెదే. యువతరానికి నేను చెప్పేది ఒక్కటే. జీవితంలో పట్టుదల, ఓర్పు, కృషి, విశ్వాసం అలవరుచుకోవాలి. వాటిని చక్కగా పోషించుకుంటే తప్పకుండా సఫలత పొందగలుగుతాము. ఇక రచయితలకు.. వారు తమ సమాజానికి, దేశానికి, చివరకు తానుంటున్న ప్రపంచానికి రచయితలుగానే గాక పౌరులుగా కూడా సేవ చేయాలి. రచయిత జీవితం ఇతరులకు ఆదర్శప్రాయం కావాలి. రచనలు సమాజ కల్యాణానికి గీటురాళ్లు కావాలి.

–సేకరణ: వేంపల్లి గంగాధర్

– 'మాసీమ' రాజగోపాలరెడ్డి, రాయలసీమ నేత

రాయలసీమ రాజకీయ, సామాజిక చిత్రంలో ప్రత్యేక ఛాయ 'మాసీమ' రాజగోపాలరెడ్డి. సోషలిజం ఆయన సిద్ధాంతం. గ్రామం ఆయన కార్యక్షేత్రం. ఎమర్జెన్సీకి, సీమ నీటి సమస్య పరిష్కారానికి ఆయన జరిపిన పోరాటం విశిష్ట మైనది. అక్షరసమరంలోను ఆయనదో ప్రత్యేక స్థానం. ఆయన జ్ఞాపకాలు ఈవారం...

నా పత్రిక పేరే మా ఇంటి పేరయింది...



మా అందరినీ రిషీవ్యాలీ స్కూలులో చేర్చారు మానాన్నగారు. నేను నాలుగో తరగతి అక్కడే చదివాను. ఆ స్కూలు వాళ్ళే మమ్మల్ని దక్షిణ భారతయాత్రకు తీసుకువెళ్ళారు. అరుణాచలం తీసుకువెళ్ళి రమణమహర్షిని చూపించారు. ఆశ్రమంలో మా భోజనం ఏర్పాట్లను రమణ మహర్షి పర్యవేక్షించడం ఇప్పటికీ నాకు గుర్తే. అప్పుడే రామేశ్వరం కూడా వెళ్లాం. అక్కడ పంబన్ బ్రిడ్జి కలిగించిన అనుభూతి అంతా ఇంతా కాదు. నౌకలు వచ్చినపుడు ఆ వంతెన రైల్వేట్రాక్‌తో సహా పైకి లేచి వాటికి దారి ఇస్తుంది. నౌకలు వెళ్ళాక మళ్ళీ యథాస్థానంలోకి వస్తుంది. మేం చదువుకుంటున్నపుడే నాన్నగారికి వ్యవసాయంలోను, వ్యాపారంలోను కూడా నష్టం వచ్చింది. అయినా మా చదువులని నిర్లక్ష్యం చేయలేదాయన. ఖర్చుకు వెనకాడలేదు.

మా నాయన పేరు రాచుపల్లె పెద్దఎల్లారెడ్డి. ఆయన పెద్దగా చదువుకోలేదు. కాని భారత, భాగవతాలు నిత్యం పారాయణం చేసేవారు. ఎవరైనా అడిగితే అర్థం కూడా వివరిస్తూ ఉండేవారు. బాగా దానధర్మాలు చేసేవారు. మా గ్రామానికి ఆయనే రెడ్డి. ఆయనకు ఇద్దరు భార్యలు. వారి ద్వారా చెరి నలుగురుగా, మొత్తం ఎనిమిది మంది పుత్ర సంతానం. పెద్దఎత్తున వ్యవసాయంతో పాటు మాకు సైదాపురంలో మైకా గని కూడా ఉండేది. కడపలో బియ్యం దుకాణం ఉండేది. దాని కోసం మా స్వగ్రామంలోనే స్టీమ్ ఇంజన్‌తో నడిచే బియ్యం మర ఉండేది. మా స్వగ్రామం కడప జిల్లా చెన్నూరు మండలం రామనపల్లె. నేను 1932లో మా అమ్మమ్మ గారి ఊరు రాపూరు (నెల్లూరు జిల్లా)లో పుట్టాను.

మేమంతా పులివెందులలో చదువుతున్నపుడే క్విట్ ఇండియా ఉద్యమం మొదలయింది. నేను, మా అన్నదమ్ములు అంతా అక్కడి హైస్కూలులోనే చదివాం. నా రాజకీయ పరిజ్ఞానానికి సంబంధించి తొలి బీజం ఇక్కడే పడింది. క్విట్ ఇండియా ఉద్యమం ప్రభావంతో మేమంతా లేబరేటరీ మీద పడి ధ్వంసం చేశాం. దానితో పోలీసులు హాస్టల్ మీద దాడి చేసి, మమ్మల్ని చితక్కొట్టి, ఇద్దరిద్దరు వంతున బేడీలు వేసి నడిపించుకుంటూ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. నేను ఫిఫ్త్ ఫారమ్ నుంచి కూడా విద్యార్థి కాంగ్రెస్‌లో చురుకుగా ఉండేవాడిని. 1947లో ఎస్ ఎస్ ఎల్ సి చదువుతున్నపుడు సోషలిస్టు పార్టీ పత్రిక 'జనతా' తెప్పించుకునేవాడిని. స్కూలుకు వస్తూ దారిలో పోస్టాఫీసుకు వెళ్ళి ఆ పత్రిక తీసుకుని క్లాసుకు వెళ్లేవాడిని. చివరి బెంచ్‌లో కూర్చుని చదువుతూ ఉంటే హెడ్మాస్టర్ గమనించి ''India expects everyman to do his duty' అనేవారు. ఒక్కసారిగా క్లాసంతా నా వైపు చూసేది. నేను పత్రిక కిందకు జారవిడిచి మళ్ళీ పాఠాలు వినేవాడిని. 1947లోనే నా సీనియర్ ఎన్.సి.గంగిరెడ్డి 'ఆగస్టు విప్లవ వీరులు – సోషలిజం', 'తిరుగుబాటుదారులకు లేఖలు' అనే పుస్తకాలు ఇచ్చి చదివించాడు. వాటితోనే నేను సోషలిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడనయ్యాను.


మాసీమ
సంపాదకులు : ఆర్. రాజగోపాలరెడ్డి,
సంపుటి : 5
1975 జూలై 5 కడప.
ఫాసిస్టుగా మారిన కాంగ్రెస్

తిరుపతిలో నేను ఇంటర్ చదువుతున్నపుడు, అంటే 1952లో జయప్రకాశ్ నారాయణ్ కడప జిల్లాకొచ్చారు. అదో ముచ్చట. రాత్రి ఎనిమిది గంటలకి కడప సభకు ఆయన రావాలి. తొమ్మిదయినా జాడ లేదు. దీనితో సభ రద్దు చేసేశాం. కాని రాత్రి పదకొండు గంటలకి ఆయన వచ్చారు. సభ జరుగుతుందని అప్పటికప్పుడు ప్రచారం చేశాం. పెద్ద సంఖ్యలో జనం వచ్చారు.

బెల్గాం లా కాలేజీలో చేరాక కొందరు మిత్రులం కలిసి స్టూడెంట్స్ సోషలిస్టు క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్నాం. సినిమా హాళ్ళను బాడుగకు తీసుకుని డిబేట్లు నిర్వహించేవాళ్లం. జనం టిక్కెట్లు కొనుక్కుని వచ్చేవారు పెద్ద సంఖ్యలో.

అప్పుడే ఒకసారి 'దేశం కోసం రోజూ ఒక గంట' పేరుతో మా గ్రామంలో రోడ్డు పని చేస్తుంటే ఒక పేదవాడు వేసిన ప్రశ్న నాకు బాగా జ్ఞాపకం. మా మిత్రులమంతా మట్టి ఎత్తుతూ ఉంటే ఆ పేదవాడు వచ్చి 'అయ్యా! మీరు మా పని చేస్తే మా గతి ఏమిటి?' అన్నాడు. నిజానికి అది సోషలిస్టు పార్టీ ఇచ్చిన 'జనవాణి దివస్' కార్యక్రమంలో భాగం. అసలు విషయం చెప్పిన తరువాత వెళ్లాడు.

నేను చేసిన మొదటి ఉద్యమం ఖాదర్‌ఖాన్ కొట్టాలు కేంద్రంగా జరిగింది. మా ఊరికి సమీపంలో ఉందది. అక్కడ రెండువందల ఎకరాలు ఒకే భూస్వామికి చెందినవి ఉన్నాయి. ఆ భూములలో పని చేయడానికి ఇతర ప్రాంతాల నుంచి జనాన్ని రప్పించి, వారంతా ఇళ్ళు కట్టుకోవడానికి అనుమతించారు. అవే ఖాదర్‌ఖాన్ కొట్టాలు. అక్కడకు వచ్చి ఇళ్లు కట్టుకున్నవారిలో ఒకరు తమ ఇంటి మీద సొర తీగ పాకించారు. దానికి కాసిన ఒక కాయ కావాలంటూ ఒక భూస్వామి ఆ ఇల్లాలిని అడిగాడు. ఆమె నిరాకరించింది. దీనితో భూస్వామి ఆ తీగనే కోసేశాడు. ఇది చినికి చినికి గాలివానగా మారింది. చివరికి భూస్వామి అక్కడ ఉన్న వారంతా ఖాళీ చేయాలని ఆదేశించాడు. దానిమీద వారంతా నన్ను ఆశ్రయించడంతో వారు ఖాళీ చేయరని

1977 ఎన్నికల సభలో ప్రసంగిస్తున్న రాజగోపాల్‌రెడ్డి, చివర నీలం సంజీవరెడ్డి.



నేను భూస్వామికి కచ్చితంగా చెప్పాను. వివాదం సుప్రీంకోర్టు దాకా పోయింది. మేం గెలిచాం.

లా చదువుతూ ఉండగానే మా గ్రామ పంచాయతీకి నేను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యాను. మన అధికార యంత్రాంగం ఎంత గుడ్డిగా పనిచేస్తుందో అప్పుడే అర్థమైంది. సెలవులకు ఇంటికి వచ్చినప్పుడల్లా ఏదో ఒక కార్యక్రమం చేపట్టేవాడిని. ఇందుకు నా మిత్రుడు భుజంగరావు అండ ఉండేది. లా చదువుతుండగానే కనుపర్తికి చెందిన అనసూయాదేవితో పెళ్ళయింది. మాకు నలుగురు పిల్లలు. 1954లో నేను న్యాయవాదిగా నమోదై, ఒక సంవత్సరం పాటు ప్రొద్దుటూరులో ప్రాక్టీసు చేశాను.

సీమ సమస్యల పరిష్కారానికి 1969లో అనంతశయనం అయ్యంగారి అధ్యక్షతన ప్రొద్దుటూరులో నిర్వహించిన సమావేశం నేను మరువలేనిది. తరువాత కడప ఆకాశవాణిని పూర్తి స్థాయి కేంద్రంగా మార్చడానికి కూడా ఉద్యమం చేపట్టవలసి వచ్చింది. అక్కడ నియమించడానికి తగిన సామర్థ్యం కలిగిన వారు సీమలో ఎందరో ఉన్నారని చెప్పడానికి తరువాత ఒక సంగీత సమ్మేళనం కూడా నిర్వహించాం.

రాయలసీమ అభివృద్ధి, సోషలిస్టు భావాల ప్రచారానికి 1971లో నేను ప్రారంభించిన పత్రికే 'మాసీమ'. దాని సంపాదకుడిని, యజమానిని కూడా నేనే. పుట్టపర్తి నారాయణాచార్యుల వారి చేతుల మీదుగా ప్రారంభించాను. పి.రామకృష్ణారెడ్డి (తులసీ కృష్ణ), జానమద్ది హనుమచ్ఛాస్త్రి, ఎం.జానకిరామ్, సురాశర్మ, డాక్టర్ వేణుగోపాలరెడ్డి, కేశవకుమార్ నా పత్రికకు రాస్తూ ఉండేవారు. సురమౌళి హైదరాబాద్ లేఖ పంపేవారు. జానమద్ది ' మా సీమ కవులు' అనే శీర్షికను నడిపారు. నిజానికి ఈ మిత్రులంతా రోజూ 'మాసీమ' కార్యాలయంలో కలుసుకునేవారం. మేమే తరువాత కడప జిల్లా రచయితల సంఘం కూడా నడిపాం.

బెల్గాం లా కాలేజీలో చేరాక కొందరు మిత్రులం కలిసి స్టూడెంట్స్ సోషలిస్టు క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్నాం. సినిమా హాళ్ళను బాడుగకు తీసుకుని డిబేట్లు నిర్వహించే వాళ్లం. జనం టిక్కెట్లు కొనుక్కుని వచ్చేవారు పెద్ద సంఖ్యలో.

1972-73 కాలం నా జీవితంలో చాలా ముఖ్యమైనది. అప్పుడు జరిగిన ఆంధ్రోద్యమంలో నేను చురుకుగా పాల్గొన్నాను. ఆనాడు తెలంగాణ ప్రాంతంలో తెలుగువారి మీద జరిగిన దౌర్జన్యాలకు నిరసనగా ప్రత్యేక ఆంధ్రను ఏర్పాటు చేయాలని కోరుతూ ఇది ప్రారంభమైంది. కడప కలెక్టర్ చంద్రమౌళి నా మీద కక్ష కట్టడం వల్ల నన్ను మీసా కింద అరెస్టు చేసి ముషీరాబాద్ జైలుకు పంపారు. 1973 మార్చిలో ఎన్‌జివో హోంమీద పోలీసులు దాడి చేసి కాల్పులు జరిపారు. లోపల ఉన్న ముగ్గురు చనిపోయారు. వెలుపల జివిజి రావు అనే నా మిత్రుడు చనిపోయాడు. అతడి శవాన్ని భుజం మీద వేసుకుని తీసుకువెళ్ళి ఎదురుగా ఉన్న ఇంటిలో ఉంచి తరువాత అతని బంధువులకు అప్పగించాను. కాల్పులలో మరణించిన వ్యక్తి శరీరం మోయడం వల్ల నా ఒళ్ళూ, బట్టలూ రక్తసిక్తమైనాయి. అది చూసినవారంతా కాల్పులలో నేనూ గాయపడ్డానని ప్రచారం చేశారు. దీంతో కొంత గందరగోళం జరిగింది. ఇంకా ఈ కాల్పులలో చాలామందే మరణించారని, వారి మృతదేహాలను రాయచోటి ఘాట్‌లోని అడవులలో పారేశారని పుకారు పుట్టింది. మరునాడు నేను, కొందరు మిత్రులు జీప్ మీద ఆ అడవిలోకి వెళ్ళాం. ఇంతలో మరో పుకారు. మేం సాయంత్రం దాకా తిరిగి రాకపోవడంతో మమ్మల్ని పోలీసులు అడవిలో హతమార్చారని దాని సారాంశం. కడప ప్రజలు రెండు లారీలలో ఆ ప్రాంతానికి వచ్చారు. మమ్మల్ని చూసి ఊపిరి పీల్చుకున్నారు. వారి అభిమానం నన్ను బాగా కదిలించింది.

1975లో 'మాసీమ' ఐదవ జన్మదిన సంచిక తేవాలని అనుకుంటున్నాం. అప్పుడే ఇందిరాగాంధీ జూన్ 25 అర్ధరాత్రి ఎమర్జెన్సీ విధించారు. సెన్సార్‌షిప్ అమలులోకి వచ్చింది. అంటే పత్రికలో ఏం ప్రచురిస్తున్నామో ముందుగా అధికారులకు చూపించాలి. కాని నేను ఈ నిబంధనను పాటించకుండా సంచిక వెలువరించాను. ఇందులో పతాకశీర్షికే 'ఫాసిస్టుగా మారిన కాంగ్రెస్' అన్న వార్తా కథనం. ఇంకా 'బానిసత్వంలో బతికేకంటే ఆత్మహత్యమేలు' (లోహియా వ్యాసం), 'లాఠీ, గోలీ రాజ్యం ఇంకెన్నాళ్ళు?' (కాళోజీ గేయం) కూడా ఉన్నాయి. దానిలో సంపాదకీయం రాసే చోట ఖాళీగా వదిలి 'సత్యం వద-ధర్మం చర' అని మాత్రం వేశాను. నన్ను అరెస్టు చేసి ముషీరాబాద్ జైలుకు తరలించారు. ఆ జైలు జీవితం ఒక అనుభవం. ఒక్కొక్క డిటెన్యూకు రోజుకు నాలుగున్నర రూపాయలు భత్యం ఇచ్చేవారు. అందరం కలిసి సరుకులు తెప్పించుకుని వండించుకునే వాళ్ళం. అక్కడికి అప్పుడు 450 మంది వరకు డిటెన్యూలు వచ్చారు, అన్ని పార్టీల వారూ ఉన్నారు. బి.సత్యనారాయణ రెడ్డి (తరువాత యుపి గవర్నర్‌గా చేశారు), గౌతు లచ్చన్న, పి.జనార్దనరెడ్డి,సుంకర సత్యనారాయణ, డి.సూర్యప్రకాశ్‌రెడ్డి, వి.వి.రామారావు (తరువాత సిక్కిం గవర్నర్), బెల్గాంలో నా సహాధ్యాయుడు ఎం.డి.వై.రామమూర్తి మొదలయిన వారు ఉన్నారు. తరువాత పెరోల్ మీద నేను కడప వెళ్ళినపుడు ఒక సంఘటన జరిగింది.

కడపలో రచయితల సభ ఏర్పాటు చేస్తే, అక్కడకు వెళ్లాను. సభ చుట్టూ ఎమర్జెన్సీని కీర్తిస్తూ బేనర్లు కట్టారు. ఒళ్ళు మండిపోయింది నాకు. వెంటనే ఒక గేయం రాసి సభలో చదివాను. అంతా చప్పట్లు కొట్టారు. ఆ సభలోనే ఉన్న గజ్జెల మల్లారెడ్డి కూడా చప్పట్లు కొట్టారు. తరువాత ఎమర్జెన్సీని తూర్పారపడుతూ చదివిన గేయానికి మల్లారెడ్డి చప్పట్లు కొట్టడం మీద సిపిఐ పార్టీ సమావేశంలో చర్చ జరిగినట్టు తెలిసింది. ఆ సమయంలో 'మాసీమ' సాహసం గురించి ప్రసిద్ధ విమర్శకుడు కెవి ఆర్ తన జైలు డైరీలో ఎంతో కొనియాడారు. ఎమర్జెన్సీ తరువాత మా ఇంటిపేరు 'మాసీమ' గా మారిపోయింది.

జనతాపార్టీ ఆవిర్భావం తరువాత నేను కడప జిల్లా కార్యదర్శినయ్యాను. 1978లో కడప అసెంబ్లీ నియోజవర్గం నుంచి ఆ పార్టీ తరఫున పోటీ చేశాను. ఒకసారి ప్రచారంలో భాగంగా బాబూ జగ్జీవన్‌రామ్ వచ్చారు. సభ తరువాత ఆయన వేదిక నుంచి దిగుతూ నా భుజం మీద చేయి ఆన్చారు. వెంటనే మరొకరు రెండో చేతికి తమ భుజం ఆన్చబోయారు. వెంటనే ఆయన 'one strong shoulder is enough for me' అని సున్నితంగా తిరస్కరించడం నాకు బాగా గుర్తు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నా మీద 722 ఓట్ల ఆధిక్యంతో గెలిచాడు.

1983లో రాయలసీమ ఉద్యమానికి నాంది పలికాను. తరువాత తుమ్మలూరు ప్రాజెక్టు సాధన ధ్యేయంలో మిత్రుడు మైసూరారెడ్డి కలిశాడు. తరువాత రాజశేఖర రెడ్డి కూడా చేరాడు. ఈ ఉద్యమంలోనే ఒకసారి బంద్ జరిపినపుడు ఆలంఖాన్ పల్లెలో కాల్పులు జరిగాయి. బాషా అనే అతను చనిపోయాడు. మరునాడు అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు వచ్చారు. అప్పుడు మేం నిర్వహించిన మౌన నిరసన ఆయనను బాగా కదిలించింది. దాని పర్యవసానమే తెలుగుగంగ, గాలేరు - నగరి, హంద్రీ - నీవా పథకాల ప్రకటన. రాయలసీమ సమస్యల మీద ఎందరో నాయకులతో కలిసి ఉద్యమాలలో పాల్గొన్నాను. అప్పటికీ, ఇప్పటికీ అనేక సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటూనే ఉన్నాను. అయితే అప్పటి రాజకీయాల నేపథ్యంలో ఇప్పటి రాజకీయాలను చూస్తుంటే లోహియా అన్న మాట ఒకటి గుర్తుకు వస్తుంది - నాటిది త్యాగయుగం, నేటిది భోగయుగం.

సేకరణ: వేంపల్లె గంగాధర్

సోమవారం 29, మార్చి 2010

కరువు -కక్షల 'సీమ' కథ!

వేంపల్లి గంగాధర్

గతం వర్తమానాలకు మధ్య నిరంతరం సాగే సంభాషణ 'చరిత్ర' ఇది నిరంతరం మార్పులకు గురైన సంఘజీవనాన్ని ప్రతిబింబిస్తుంది' అంటారు ప్రఖ్యాత చరిత్రకారుడు ఇ.హెచ్ కార్.

భిన్న కాలాల్లో, భిన్న ప్రాంతాల్లో అభి వృద్ధి చెందిన సామాజిక, సాంస్కృతిక అంశాల వల్ల ఆయా కాలాలకు, ప్రాంతాలకు ప్రత్యేకమైన సాంకేతిక, ఆర్థిక సాంస్కృతిక అభివృద్ధి లక్షణాలవల్ల నాగరికత రూపొందుతుంది. స్థూలంగా చెప్పాలంటే నాగరికత అంటే భౌతిక, మానసిక జీవితాల అభివృద్ధిక్రమం. రాయలసీమకు ఒక ప్రత్యేకమైన సామాజిక, సాంస్కృతిక చరిత్ర ఉంది. ఇక్కడ ప్రవహించే ప్రతి నదికీ పాడుకోడానికి ఒక పాట ఉంది. ప్రతి కొండకూ వినిపించేందుకు ఒక కథ ఉంది. సీమ ప్రాంత గ్రామీణ జీవితంలోనూ ఎన్నెన్నో వైరుధ్యాలు దర్శనమిస్తాయి. చారిత్రకంగా అనేక ప్రత్యేకతలున్నాయి ఈ ప్రాంతానికి. జానపద కళారూపాల విలక్షణత ఇక్కడ కన్పిస్తుంది. సాహిత్య, సాంస్కృతికరంగాల్లో వికాసానికి సీమ చేసిన దోహదం సాటిలేనిది. మొట్టమొదటి తెలుగు శాసనం క్రీ.శ.575 నాటి రేనాటి చోళుల శాసనం కడపజిల్లా ఎర్రగుడిపాడు వద్ద లభించి చరిత్రకు ఆధారమైంది.

ఏడు కరువులొచ్చినా

రాయలసీమ ఏడు వందల మి.లీ.కంటే తక్కువ సగటు వర్షపాతం కలిగి ఉంది. దీనికితోడు గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీ సెల్సియస్‌కి ఎక్కువగానే ఉంటుంది. నిస్సారమైన పంట భూములు, చాలని పెట్టుబడులు, నైపుణ్యంలేని సేద్యపు పనులు, తక్కువ వ్యవసాయోత్పదకత, నామమాత్రమైన పారిశ్రామికీకరణ, తక్కువ నీటి పారుదల సౌకర్యం, అత్యల్ప వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు సీమ వెనుకబాటుతనానికి కారణాలు. అక్షయనామ సంవత్సరంలోవచ్చిన కరువును అక్షయకరువు(1747) అన్నారు. ఈ కరువు గురించి చిత్తూరు జిల్లా కార్వేటి నగరం జమీందారిలోని ఆస్థానకవి, పదకర్త సారంగపాణి (18వ శతాబ్దం) తన పదాలలో వివరించారు. ధూర్జటి శ్రీకాళహస్తి మహాత్మ్యంలో కరువు వర్ణన చేయడాన్ని గమనించవచ్చు.

కరువు అనే పదానికి సమాంతరంగా వర్షాభావం, బరువు, క్షామం అనే పదాలు వ్యవహారంలో ఉన్నాయి. కరువు వర్షాభావం యొక్క ప్రథమ దశ అని, క్షామం దాని పరిణతి దశ అని సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం. కరువు మనిషికీ మనిషికీ మధ్యసంబంధాన్ని, మనిషికి భూమికి మధ్య ఉన్న సంబంధాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. కదిరి నరసింహరాయస్వామి దేవాలయంలోని ఒక శాసనంప్రకారం 1390-91లో వచ్చిన కరువు గురించిన ప్రస్తావన ఉంది. 1803-1885ల మధ్య కరువు తీవ్రత గురించి 1886నాటి బళ్ళారి తాత్కాలిక కలెక్టర్ నికొల్సన్ కూడా రికార్డుల్లో రాశాడు.

1876-78లో సీమలో వచ్చిన ఈ కరువును పెద్ద కరువు, ధాతుకరువు, దూబకరువు, వలసకరువు, ముష్టి కరువు, డొక్కల కరువు అని రకరకాల పేర్లతో పిలిచారు. 22 నెలలపాటూ ఈ కరువు కొనసాగింది. 1891-92 మధ్యవచ్చిన కరువు కారణంగా దాదాపు 1/3వంతుల పశువులు, జీవాలు చనిపోయాయి. 1896-97కరువువల్ల బుక్కపట్నం, ధర్మవరం, పరిగి చెరువులు పూర్తిగాఎండిపోయాయి. మద్రాసునుంచి వచ్చేగడ్డికోసం రైతులు ఎదురు చూస్తూ గడిపారు. 1900లో ఒకసారి 1901లో మరోసారి వచ్చిన కరువు మీద 'ఇండియన్ ఇరిగేషన్ కమిటి' నివేదిక వచ్చింది. 1920-21 కరువు కారణంగా గుత్తిలో ఏడు వంట శాలలను కూడా ఏర్పాటు చేశారు. 1924-25 మధ్య, 1966-68మధ్య, 1972-73 1979-80, 1980-81ల మధ్య కరువులు సీమను ఆవరించి నిర్వీర్యం చేశాయి.

1948-52 సంవత్సరాల మధ్యసీమలో వచ్చిన ధాతు కరువు సమయంలో ప్రభుత్వం, రామకృష్ణమిషన్ వంటి ధార్మిక సంస్థలూ నడిపిన గంజి కేంద్రాలు ఎందరికో కడుపులు నింపి ప్రాణాలు రక్షించాయి. అందుకే ఆ కరువును 'గంజి కరువు' అని కూడా పిలిచారు. ఇలాంటి ఇతివృత్తాన్ని ప్రధానంగా స్వీకరించి రాయలసీమ తొలి కథకుడు అనంతపురానికి చెందిన గుత్తి రామకృష్ణ 'గంజి కోసరం' అనే విశిష్టమైన కథను రాశారు. ఈ కథ 1953 సెప్టెంబర్ 9 నాటి ఆంధ్రప్రభ వారపత్రికలో కూడా ప్రచురితమైంది. ముసలిఅవ్వ,కోడలు,మనుమరాలు,మనుమడు కరువువలన వేరేఊరికి వలసవెళ్ళడం ఇందులోని కథాంశం.

నల్ల ఛత్రి పట్టుకొని

క్రీ.శ. 6వశతాబ్దం నాటికి సామ్రాజ్యవ్యవస్థ పతనమై రాజ్య వ్యవస్థ వచ్చింది. క్రీ.శ.17వ శ.నాటికి ప్రాంతీయ రాజ్యవ్యవస్థ కూడా పతనమై పాలెగాళ్ళ వ్యవస్థ వచ్చింది. రాయలసీమలో పాలెగాళ్ళు, తెలంగాణాలో దేశ్‌ముఖ్‌లు, కోస్తాలో జమిందార్లు వీళ్ళందరూ రాజ్యం పాలిస్తూ వచ్చారు. బ్రిటిష్ పరిపాలన భారతదేశంలో స్థిరపడి 200 సంవత్సరాలు కొనసాగి ఆర్థిక రాజకీయ మార్పులు ఎన్ని తెచ్చినా రాయలసీమలో పాలెగాళ్ళ వ్యవస్థ కొనసాగుతూనే వచ్చింది. నిజాం ప్రభువు ఈస్టిండియా కంపెనీకి ఈ జిల్లాల్ని దత్తత ఇచ్చే కాలంనాటికే ఇక్కడ 80 మంది పాలెగాళ్ళు ఉండేవారు. కర్నూలు జిల్లాలోనే 22 మంది పాలెగాళ్ళను గుర్తించారు. సీడెడ్ జిల్లాలకు మొదటి కలెక్టర్‌గా వచ్చిన సర్‌థామస్‌మన్రో పాలెగాళ్ళను అణచడానికి కృషిచేశాడు. ఈ పాలెగాళ్ళు కొత్తకొండ, కప్పర్తల దేవరకొండ, అవుకు, కోయిలకుంట్ల ప్రాంతాల్లో వున్నట్లు గుర్తించారు. 1900 సంవత్సరం నుంచే కొయిలకుంట్ల తాలూకాలో ఫ్యాక్షన్ ఉండేదని రికార్డులు చెప్తున్నాయి. అప్పటి పాలెగాళ్ళ సొంత సైన్య సంస్కృతి, దాడులసంస్కృతి, ఇప్పటి ముఠా కక్షల నాయకులకు ఒక వారసత్వంగా సంక్రమిస్తూ వస్తోంది.

మారిన కాలానికి అనుగుణమైన ఆయుధాలు కలిగి ఉండటం, అనుచరులను పెంచిపోషించడం, ఎన్నికల్లో పాల్గొనడం, కాంట్రా క్టులు, మద్యం వ్యాపారాలు, ప్రత్యర్థులపై కక్ష, రాజకీయ వ్యూహాలు వంటివన్నీ పాలెగాళ్ళ సంస్కృతి వాతావరణం నుంచి మనకు వస్తున్నట్లు గమనించవచ్చు. సీమలోని ముఠాకక్షలు, వాటి మూలాల గురించి కూడా ఎన్నో కథలు ఆవిష్కార మైనాయి. రాయలసీమలో రాజకీయం ప్రత్యేకమైన నేపథ్య కోణాన్ని కలిగిఉంది. ఎన్నికల్లో వర్గరాజకీయాలు తీవ్ర స్థాయిలో ఉంటాయి. గ్రామాల్లో ఆధిపత్యపోరు స్పష్టంగా కన్పిస్తుంది. ఎన్నికల అనంతరం గ్రామాల్లో హింస, ఘర్షణ ఏర్పడుతుంది. గ్రామాల్లో పగలు, ప్రతీకారాలతో నిరంతరం భయం, అశాంతి మధ్య జీవితాలను నెట్టుకొస్తున్న పరిస్థితులున్నాయి. సీమ రాజ కీయం కక్షలవలయంలో ఎలా చిక్కుకొని ఉందో కేతువిశ్వనాథ రెడ్డి రాసిన 'పీర్ల సావిడి' కథలో చూడవచ్చు. వేంపల్లి గంగాధర్ రాసిన 'కొలిమ్మాను' ఫ్యాక్షన్ కథ తేజ వారపత్రిక నిర్వహించిన కథల పోటీలో ప్రథమ బహుమతి పదివేల రూపాయలు గెల్చుకుంది. కక్షల కథలు సీమ నుంచి విస్తృతంగా వచ్చాయి.

వానవాక కలగా, కరువే నిత్యజీవన దృశ్యమై, వ్యవసాయం జూదమై, బతుకు రుణగ్రస్తమైన రైతుల జీవన వ్యథల్ని సీమలో స్పష్టంగా చూడవచ్చు. రాయలసీమ సామాజిక జీవిత గమనాన్ని అర్థం చేసుకోవచ్చు. గ్లోబలైజేషన్ క్రమంలో మారుతున్న మానవ సంబంధాల్ని ప్రజల జీవితాల్లో వస్తున్న మార్పుల్ని సాహిత్య కారులు ప్రతిబింబిస్తున్నారు. సీమలో కరువులకి, కక్షలకి అవినా భావ సంబంధం ఉంది. పరస్పరం సంబంధం కలిగిన కరువు, కక్షలు రాయలసీమపైన తీవ్ర ప్రభావాన్ని చూపిస్తూనే ఉన్నాయి.

హీన దశ లేక ప్రాథమిక దశనుంచి ఉత్తమ దశకు చేరడానికి చేసేప్రయత్నాన్ని, భౌతికంగా,మానసికంగా ఉన్నతదశకు చేరడానికి చేసే నిరంతర ప్రయత్నాన్ని 'సంస్కృతి' అంటాము. కరువు, కక్షలవలయాల నుంచి సీమవిముక్తం కావడానికి నిరంతరంగా పెనుగులాడుతూనే ఉంది. ఏకకాలంలో అనేక వలయాల్లో ఈ సంఘర్షణ ఇప్పటికీ మనకు స్పష్టంగా కన్పిస్తూనే ఉంది. ❑

సృష్టి

'సీమ' కథల్లో కక్షల చిత్రణ

చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు రాయలసీమ ప్రాంతంలో భాగంగా వున్నాయి. క్రీస్తుశకం 1136 నుంచి 1650 సంవత్సరందాకా అధికారంలో వున్న విజయనగర సామ్రాజ్యంలో రాయలసీమ ప్రాంతం ప్రముఖ పాత్ర వహించింది. కాకతీయుల కాలంలో ప్రారంభమైన చెరువుల ఇంజనీరింగ్ విజయనగర రాజుల కాలంలో ఉన్నత స్థాయిని చేరుకుంది. క్రీ.శ.1650లో పెనుగొండ వద్ద జరిగిన యుద్ధంలో విజయనగర రాజ్యం ధ్వంసమైంది. ఆ తర్వాత రాయలసీమ ప్రాంతం అనేక చేతులు మారి చివరగా బ్రిటిష్‌వారి ఆధీనంలోకి వచ్చింది. 1800 సంవత్సరంలో నిజాం ప్రభువులు దత్త మండలం(సీడెడ్ జిల్లాలు)గా రాయలసీమ ప్రాంతాన్ని బ్రిటిష్‌వారికి అప్పగించారు. అప్పటికే సీమ ప్రాంతంలో సుమారు 80 మంది పాలెగాళ్ళుండేవారని చరిత్ర చెప్తోంది. ఈ పాలెగాళ్లు కొత్తకొండ, కప్పర్తల, దేవరకొండ, అవుకు, కోయిలకుంట్ల ప్రాంతాల్లో తమ స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. తమ సొంత సైన్యాలతో మనుగడ సాగించేవారు. 1900 సంవత్సరం నుంచే కోయిలకుంట్ల తాలూకాలో ముఠా కక్షలుండేవని రికార్డులు చెప్తున్నాయి.


విజయనగర సామ్రాజ్య పతనం అనంతరం పాలెగాళ్ళ రాజ్యాల నుంచే ఈ గ్రామ కక్షలు ప్రారంభమయ్యాయి. పాలెగాళ్ళ కాలంలో గ్రామానికి-గ్రామానికి మధ్య లేదా కొన్ని గ్రామాలకు- మరికొన్ని గ్రామాలకు మధ్య ఈ కక్షలు నడిచేవి.

ఈ పాలెగాళ్ళలో ఉన్న పంతం, ప్రత్యర్థిపై క్రౌర్యం ప్రదర్శించే మనస్తత్వం సీమ ప్రజల్లో మానసికంగా రూపుదిద్దుకున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు పిలువకపోయినా వచ్చే కరువు కాటకాల వల్ల సీమలో పని చేసేందుకు రైతులకు పని వుండేది కాదు. ఈ భౌతిక స్థితి, మానసిక స్థితి కలగలిసిన విలక్షణ కక్షల సంస్కృతికి బీజం వేసినట్లు తెలుస్తోంది. ఈ కక్షల చరిత్ర కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, కమలాపురం, పులివెందుల, కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, పాణ్యం, ఆత్మకూరు, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి ప్రాంతాల్లోకి క్రమక్రమంగా చేరింది. 1960-70వ దశకంలో కడప జిల్లాలోని రాయచోటి, చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె, అనంతపురం జిల్లాలోని పెనుగొండ, ధర్మవరం, కర్నూలు జిల్లాలోని కొన్ని తాలూకాలకు ఈ కక్షల సంస్కృతి వ్యాప్తి చెందింది.

1980 దశకం నుండే పత్రికలు ఫ్యాక్షన్ అనే పదాన్ని వాడుకలోకి తెచ్చేంతవరకు ఈ గ్రామకక్షలను 'పార్టీ' అని పిలిచేవారు. బ్రిటిష్ కాలం నుండి కూడా 'పార్టీ' అనే పదమే వాడుకలో వున్నట్లు తెలుస్తోంది. బ్రిటిష్‌వారి పోలీసు రికార్డుల్లో మాత్రమే ఫ్యాక్షన్ అని రాసుకున్నట్లు వుంది.

ఆనాడు సర్కారు ప్రాంతంలో రైతువారి పద్ధతి ఉండి, భూమి అంతా జమీందారుల ఏలుబడిలో ఉంటూ దాన్ని సాగు చేసుకునే రైతులు కప్పం కడుతూ వుండేవారు. తెలంగాణాలో భూమి అంతా దేశ్‌ముఖ్‌లు, ప్రజాకారుల చేతిలో వుండి తక్కినవారంతా కూలీలుగా పని చేయాల్సి వచ్చేది. అదే సమయంలో రేనాడు ప్రాంతంలో భూమి ఏ ఒక్కరి చేతిలోనో కాకుండా చాలామంది చేతుల్లో ఉండి అందరూ రైతులమనే భావన కలిగివుండేవారు. భూస్వామ్య భావజాలంలో ప్రధానంగా వుండే ఆధిపత్య ధోరణి, మాట పట్టింపు, తమ మాటే నెగ్గాలనే మొండితనం లక్షణాలు కక్షలకు కూడా ఒక కారణమైనాయి.

గ్రామాధిపత్యం కోసమే కాకుండా, కేవలం మాట పట్టింపుతో తమ మాటే గెలవాలనే మొండితనంతో గ్రామకక్షలకు బీజం వేసుకున్న చరిత్ర సీమలో కన్పిస్తుంది. గ్రామంలోని అన్ని కులాలవారు రెండు వర్గాలుగా విభజింపబడి ఏదో ఒక నాయకునికి మద్దతు ఇచ్చిన సంఘటనలే వున్నాయి. 1975 నుంచి 83 దాకా దేశంలోనూ, రాష్ట్రంలోనూ రాజకీయాల్లో వచ్చిన పెనుమార్పుల నేపథ్యంలోనే రాజకీయాలలో హింసావాదులకు కూడా స్థానం దొరికింది. ఇదే సమయంలో రాయలసీమలో కొత్తగా బరిలోకి దిగిన రాజకీయ నాయకులకు



గ్రామాల్లోని పార్టీ నాయకుల అండ కావాల్సి వచ్చేది. ఈ పరిణామం అనతి కాలంలోనే 1985 నాటికి ఈ ఫ్యాక్షన్ నేతలే ప్రత్యక్షంగా ఎన్నికల బరిలోకి దిగే సంస్కృతి ప్రారంభమై 'రాజకీయ కక్షల చరిత్ర' బలపడడానికి మూలమైంది.

నిజానికి రాయలసీమ ఫ్యాక్షన్ అనుకునే సీమ కక్షల సంస్కృతి క్రమక్రమంగా తగ్గుతోంది. అన్ని ప్రాంతాల్లో విస్తరించుకున్న ఈ హింసా రాజకీయ పరిణామం, రాయలసీమలో 'ఫ్యాక్షన్'గా ప్రత్యేక ముద్రతో చర్చకు వస్తోంది. ఫ్యాక్షనిజం రాజకీయ ప్రాబల్యాన్ని సంతరించుకోవడంతో రాజకీయ వ్యవస్థలో ఫ్యాక్షనిస్టుల పలుకుబడి పెరిగింది. ప్రతిష్ట పెరిగింది. ఫ్యాక్షన్ పీడిత ప్రాంతంలో వెనుకబాటుతనాన్ని, నిరుద్యోగాన్ని ఫ్యాక్షనిస్టులు పెంచారు. వీటిని తమ పెట్టుబడిగా ఉపయోగించుకున్నారు.

కక్షలు-హత్యలు

కడప జిల్లాలో కక్షలు, హత్యలు ఎక్కువగా నమోదవుతాయి. గ్రామాల్లోని చిన్న విషయాలే కొలుగా మారి హత్యలకు దారితీస్తాయి. ఇవి రెండు రకాలుగా వుంటాయి. ఒకటి వ్యక్తిగతమైన హత్యలు, రెండు రాజకీయ హత్యలు. పూలికుంట్ల గ్రామంలోని వసుదేవరెడ్డికి, మీగడోళ్ల మల్లారెడ్డికి భూమి తగాదా వల్ల 'పార్టీ' ఏర్పడుతుంది. ఇద్దరూ పగలు పెంచుకొని ఒకరి కోసం మరొకరు 'అనువులు' కాస్తూ వుంటారు. ఒకరోజు కడప నుంచి వస్తుండే వసుదేవరెడ్డిని వేంపల్లె రోడ్డులో అనువులు గాసి మల్లారెడ్డి చంపిస్తాడు. వసుదేవరెడ్డి భార్య ముండమొయ్యకుండానే తన ఏకైక కొడుకును 'నేలమాలు'లో వుంచి పండెండు సంవత్సరాలు సాకుతుంది. అతనికి యుక్త వయస్సు వస్తూనే తమ ప్రత్యర్థి అయిన మల్లారెడ్డి తల తెచ్చి యిస్తే ముండ మోస్తానని కొడుకుతో అంటుంది. అతడు జీతగాని సాయంతో మల్లారెడ్డిని గుర్తించి అనువులు బాసి అతని తలను తెచ్చి యిస్తూనే ఆమె వైధవ్యాన్ని స్వీకరిస్తుంది.

ఇలాంటిదే చెన్నక్రిష్టారెడ్డి కథ కూడా. చెన్నక్రిష్టారెడ్డి మంచివాడు. ఆయన అతని తోడల్లుడు చెంచిరెడ్డి ఆహ్వానం మేరకు కోడిపందెం వెళతాడు. ఇద్దరి కోళ్లకు కత్తులు కట్టి అల్లిలో దించుతారు. చెన్నక్రిష్టారెడ్డి కోడి గెలుస్తుంది. అతని అనుయాయులు తాగిన మైకంలో కోస కోడిని(ఓడిన కోడిని) చెట్టు కొర్రకు వేలాడదీసి "పూలి కుంటకు ఒగిసిన"మంటూనే చెంచిరెడ్డి కొడుకు నాగిరెడ్డి "మనుషుల పందెం" ఆడదామంటాడు. ఇరు వర్గాలకు మాట మాట పెరిగి అనువులు కానుకొని చంపుకొంటారు.

రాజకీయ హత్యకు మంచి ఉదాహరణ చింతల్‌రెడ్డి కథ. దొరిగల రంగారెడ్డి, చింతల్‌రెడ్డి బావ, బావమరుదులు. చింతల్‌రెడ్డి మంచివాడని పేరు. ప్రజల మద్దతుతో ఎలక్షన్‌లో పోటీ చేసిన చింతల్‌రెడ్డి రంగారెడ్డిపై గెలుస్తాడు. అది గిట్టని రంగారెడ్డి నివురుగప్పిన నిప్పులా వుండి ఒకరోజు చింతల్‌రెడ్డి ఒంటరిగా వస్తుండగా, తన అనుయాయుల చేత చంపిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న చింతల్‌రెడ్డి చెల్లెలు రామకిష్టమ్మ కోర్టుకు పోయి

కొల్లిపోవడమెందుకని కేసు పెట్టదు. కాని తన అన్నను చంపినవాణ్ణి మచ్చిక చేసుకొని పొలం పనులకు రప్పించి, ఒటరివాణ్ణి చేసి, ఒక్కొక్క అవయవం తీసివేస్తూ చంపించడం ఆమె కక్షకు మూల్యంగా తలంచవచ్చు. పై కథలో ఇరుపక్షంలోని ముఖ్య వ్యక్తులు మరణించిన తర్వాత మరల హత్యలు జరగకుండా వుండేందుకు ఇరుపక్షంవాళ్ల బంధువులు, పెద్దలు కలిసి రాజీ కుదుర్చుకోవడం కడప జిల్లాలో ప్రముఖం.

రాయలసీమ ప్రధానంగా కరువు ప్రాంతం. ఫలితంగా ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో వ్యవసాయ పనులు మూడు నెలలకు మించి ఉండవు. ఈ ఆర్థిక వెనుకబాటుతనం వల్ల నిరక్షరాస్యత, నిరుద్యోగం కూడా ఈ ప్రాంతంలో అధికం. ఈ పరిస్థితుల్లో నిరాశా నిస్పృహలతో ఉన్న నిరుద్యోగ యువకులను ఫ్యాక్షనిస్టులు పావులుగా వాడుకుంటున్నారు. పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం ఒకదానికొకటి తోడవడంతో పేదల కుటుంబాలకు ముఖ్యంగా బలహీన వర్గాలకు చెందినారు హింసనే జీవనోపాధిగా ఎంచుకున్న ఉదాహరణలు ఎన్నో వున్నాయి. అందుకే ఫ్యాక్షనిజం సమస్య పరిష్కారం కావాలంటే ఈ ప్రాంతం యువకుల్లో ముఖ్యంగా బలహీన కుటుంబాలకు చెందిన యువకులకు ఉపాధి అవకాశాలు పెరగవలసిన అవసరం వుంది. ఫ్యాక్షనిజం సజీవంగా ఉండడానికి ఆర్థిక కారణాలే ప్రధానమైనవి. బలవంతపు వసూళ్లు, చట్టవిరుద్ధమైన మైనింగ్ కార్యకలాపాలు, చట్ట వ్యతిరేకంగా జరిపే ఇతర పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, ప్రత్యర్థులను భయానికి గురిచేసి టెండర్లు సంపాదించడం వంటి పనులు ద్వారా ఫ్యాక్షనిస్టులు బలపడ్డారు. పార్టీలు సంకుచిత ప్రయోజనాల కోసం ఫ్యాక్షనిస్టులను అక్కున చేర్చుకోవడం ఈ సమస్య పెరగడానికి మరో కారణం.

మట్కా లాంటి గ్యాంబ్లింగ్ కార్యకలాపాలను ప్రోత్సహించడం, కల్తీ మద్యం అమ్మకాలు, కిరాయి హత్యలు, పేలుడు పదార్థాల అమ్మకాలు, ఆస్తుల, భూముల దురాక్రమణ వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాల ద్వారా ఫ్యాక్షనిస్టులు విపరీతంగా సంపాదించారు. తమకు ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను హడలెత్తించి తామే గొడవల్లో, వివాదాల్లో తీర్పులు చెప్పడం మొదలైంది.

రాయలసీమ ఖనిజ నిక్షేపాల భాండాగారం. ఇక్కడ పలకరాయి నుంచి వజ్రాల వరకు అన్ని రకాల ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. కర్నూలు, కడప జిల్లాలో బెరైట్, అనంతపురంలో సున్నపురాయి నిక్షేపాలు పుష్కలంగా వున్నాయి. వీటికి రాష్ట్రంలోనే కాదు దేశ విదేశాల్లో కూడా మంచి డిమాండ్ వుంది. ఈ ఖనిజ నిక్షేపాలున్న ఫ్యాక్షనిస్టుల చేతుల్లోకి మారాయి.

స్థానిక గొడవల్లో, వివాదాల్లో తామే న్యాయ నిర్ణేతలై తీర్పు చెప్పడంలో ఫ్యాక్షనిస్టులు సిద్ధహస్తులు. ప్రధానంగా రెండు కారణాలరీత్యా వీరు ఈ పాత్రను తమకు ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పోషించగలుగుతున్నారు.

పాలనా వ్యవస్థ, చట్టం నుంచి తప్పించుకోవడానికి ఫ్యాక్షనిస్టులకు రాజకీయ ఆశ్రయం అవసరమైంది. ప్రజలను భయపెట్టే సామర్థ్యం వుండడం, నేరాలు, ఘోరాలకు పాల్పడగలిగే యంత్రాంగం వుండడం వల్ల ఫ్యాక్షనిస్టులు విజృంభిస్తున్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్‌బూత్‌లు ఆక్రమించుకోవడానికి, రిగ్గింగ్‌కు పాల్పడడానికి తమకు వ్యతిరేకంగా ఉండే ఓటర్లను, ప్రత్యర్థులను బెదరగొట్టడానికి, అవసరమైతే భౌతికంగా నిర్మూలించడానికి కూడా ఫ్యాక్షనిస్టులు నాయకులకు బాగా ఉపయోగపడుతున్నారు.

పూర్వం ఫ్యాక్షన్ అనేది పల్లెల్లో పెత్తనం కోసమే వుండేది. ఇవ్వాళ అది అక్రమ ధనార్జనకు, అధికార దుర్వినియోగానికి ఉపయోగపడుతోంది. పూర్వం ఫ్యాక్షన్ ప్రభావం కేవలం ఫ్యాక్షనిస్టుల మీద, వారి అనుచరుల మీద మాత్రమే ఉండేది. ఇవ్వాళ గ్రామాల్లోని సామాన్య జనంపై కూడా ప్రభావం కన్పిస్తోంది.

> **రాయలసీమ ప్రధానంగా కరువు ప్రాంతం. ఫలితంగా ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో వ్యవసాయ పనులు మూడు నెలలకు మించి ఉండవు. ఈ ఆర్థిక వెనుకబాటుతనం వల్ల నిరక్షరాస్యత, నిరుద్యోగం కూడా ఈ ప్రాంతంలో అధికం. ఈ పరిస్థితుల్లో నిరాశా నిస్పృహలతో ఉన్న నిరుద్యోగ యువకులను ఫ్యాక్షనిస్టులు పావులుగా వాడుకుంటున్నారు.**

ఫ్యాక్షనిస్టుల గుంపు ప్రదర్శించే నాటు తుపాకులు, వారి వాహనాలకు బారులు తీర్చి తిరగడం, బాంబులు వేసుకునే విష సంస్కృతి సామాన్యుడి మానసిక స్థితిని దెబ్బతీస్తోంది. పేదరికం, నిరుద్యోగం, ఏడాది పొడుగునా పొలాల్లో పనులు లేకపోవడం గ్రామస్థుల్ని ఫ్యాక్షనిస్టులుగా అనుచరులుగా మారేటట్లు చేశాయి. నిజానికి అలాంటి కుటుంబాలవారు ఎందరో ఊరు విడిచి వెళ్ళడం, కాలక్రమేణా వలస జీవులుగా మిగిలిపోవడం జరిగింది.

ఓట్ల కోసం రాజకీయ నాయకులు అమాయకపు పల్లెల్ని రెండు వర్గాలుగా చీల్చడం ప్రారంభించారు. కులం ఒక ప్రధాన కారణమైంది. ఫ్యాక్షన్ పెరిగింది. ముఠాలు పెరిగాయి. వ్యక్తిగతంగా సైన్యాన్ని నడుపుకునే ఫ్యాక్షన్ రాజకీయవేత్తలు పుట్టుకొచ్చారు. ఫ్యాక్షన్ రాజకీయాలలో పల్లెలు అగ్నిగుండాల్లా మారిపోసాగాయి. బాంబులు పేరే తెలియని మారుమూల పల్లెటూళ్ళలో కూడా ఇవి తప్పనిసరిగా మారాయి. ఫ్యాక్షన రాజకీయాల్లో చిక్కుకుని చాలా కుటుంబాలు ధ్వంసమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఊళ్లకు ఊళ్లు బూడిదయ్యాయి. ఈ ఫ్యాక్షన్ నాయకులకు అండగా ఒక కిరాయి గూండా వర్గం పెరగసాగింది. మద్యం చాలా సహజమైన పానీయమైపోయింది. నాలుగు బాంబులూ, రెండు నాటుతుపాకీలూ, పదిమంది అనుచరులూ ఉన్నవారంతా ఇక్కడ ఒక దళ నాయకుడైపోయాడు.

పల్లెల్లోని కక్షల్ని ఉపయోగించుకొని గ్రామీణ జీవితాన్ని వీళ్లు హింసాత్మకంగా చేస్తూ వచ్చారు. ఏ సిద్ధాంత బలమూ లేని, ఏ తాత్విక దృక్పథమూ లేని ఇలాంటి గ్రూపులు కొన్ని రాజకీయ పార్టీలకు వత్తాసుగా మారి గ్రామీణ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయి. పల్లెల్లో బతకడం కష్టమైపోయి పట్టణాలకు వలస వచ్చే రైతు కూలీల సంఖ్య పెరిగింది. చిన్నకారు రైతులు భూముల్ని అమ్ముకొని కూలీలుగా మారిపోయారు. ఇరవై ఎకరాలుండే రైతులు కూడా రెండు సంవత్సరాలు వర్షాలు రాకపోతే బతుకుతెరువు కష్టమైపోయింది. కరెంటు రేట్లూ, ఎరువుల ధరలూ ఎప్పటికప్పుడు విపరీతంగా పెరిగిపోవడం, రైతు సమస్యల్ని, కరువు తీవ్రతనూ పాలకవర్గాలు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో చైతన్యం పెరిగింది. ఈ దశలోనే పట్టణీకరణ ఎక్కువైపోయింది.

ఒక గ్రామంలో లేదా ఒక ప్రాంతంలో ఆధిపత్యం కోసం ప్రారంభమైన పోరు ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చెందుతూ వచ్చింది. మారుతున్న రాజకీయ సామాజిక సంక్లిష్ట పరిస్థితుల మధ్య, ప్రాకృతికంగానూ, రాయలసీమ అనుభవిస్తున్న భౌగోళిక పరిస్థితులను, కరువు, తాగునీటి సమస్య, సాగునీటి సమస్య, పంటలు పండకపోవడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడం, దళారీల దోపిడీ- వంటి అంశాలన్నీ సీమలో ప్రధానంగా కన్పిస్తాయి. రాయలసీమ కోల నేపథ్యంలో ఎన్నో కథలు చిత్రితమైనాయి.

'కూలిన బురుజు' కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి. ఈ కథలో "పుట్ట చెండ్లాట మాదిరి నాటుబాంబుల్తో ఆడుకున్న గ్రామ పార్టీల ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నాను. కక్షలూ, కార్పణ్యాల అడవిలోకి వెళ్తున్నాను" అంటూ మొదలవుతుంది. టౌన్నుంచి పల్లెలోకి అడుగుపెట్టిన కిష్టుడు పల్లెల్లోని కక్షల్ని తన కోణం నుంచి అందిస్తాడు. భర్తను లక్ష్మక్కను పలకరిస్తాడు. "మీ బావను చంపినోడు కుక్కచావు చచ్చేదాకా ఆ గాజులు పగలగొట్టుకోను. ఈ బొట్టు చెరుపుకోను అన్నానురా. నువ్వు చదువుకున్నోడివి చెప్పు ఇది తప్పంటావా?" అని ప్రశ్నిస్తుంది. దివాసానికి పల్లెకొచ్చినవాళ్ళని కూడా పోలీసులు అరెస్ట్

చేస్తారు. అక్కడే కథకుడికి సాహితీ మిత్రుడు జయరాం పరిచయం అవుతాడు. "ఒక రోగం ఎందుకస్తుందో అని వైద్య శాస్త్రంలో కారణాలు కనుక్కుంటే సరిపోదు. మందు కనిపెట్టాలి". అలాగే పల్లెల్లో ఈ కక్షల నివారణకు కూడా ముగింపు కనుక్కోవాలనే కథకుడి సందేశంతో కథ ముగుస్తుంది.

'ఎలిగే పెద్దోళ్ళు-నలిగే సిన్నోళ్ళు' కథను రాసింది పి.రామకృష్ణ. సీమలో ఫ్యాక్షనిస్టు నాయకులు తమ అవసరాలకు దళితుల్ని ఫ్యాక్షనిజంలోకి లాగుతారు. నాయకుల సిగ పట్లలో దళితుడు సాటి దళితుడ్ని చంపుకుంటాడు. నాయకులు రాజీపడ్డంతో వాళ్ళు తనని ఉపయోగించుకున్నారనే స్పృహ దళితుడికి కలుగుతుంది. ఓబిగాడు రంగారెడ్డి ఇంటి దగ్గరికొస్తాడు. "నీ కొడుకు నా పెండ్లాన్ని రమ్మని రోజూ పిలుస్తాండాడు. ఇంగోసారట్ట పిల్చినాడంటే వాన్ని నరికేస్తానని సెప్పు" అని చెప్తాడు. వూర్లో వర్ధనరెడ్డికి, నాగసుబ్బారెడ్డికి మధ్య గొడవలు అవుతాయి. వాళ్ళ వర్గం వాళ్ళు వీళ్ళ వర్గం బాంబులేసుకుంటారు. వర్గాల్లో వుండే పేద వాళ్ళు చివరాఖరికి నష్టపోతారు. ప్రాణాలు పోగొట్టుకుంటారు. కానీ బాగా సంపాదించుకుని వెలిగిపోయే పెద్దోళ్ళు పదవుల కోసం చేతులు కలుపుకుంటారు. కథకుడు సింగమనేని నారాయణ 'ఫిరంగిలో జ్వరం' కథను రచించారు. ఈ కథలో వెంకటనాయుడు అనే ఫ్యాక్షనిస్టు చీనీ తోటను ఎవరో నరికివేయడంతో కథ ప్రారంభమవుతుంది. ఆ పని చేసింది గణేనాయక్ అనే సుగాలీ నాయకుడేనని, అతని మీద తానే ప్రతీకారం తీర్చుకుంటానని వెంకటనాయుడు ప్రకటిస్తాడు. ఒకనాడు తన శత్రువైన వీరారెడ్డి ఈనాడు బలహీనుడైపోయాడనీ, అతనికి తన మీద దాడి చేసే ధైర్యం లేదని కూడా చెబుతాడు. ఇలా సాగుతూ వెళ్లి ఈ కథ వెంకటనాయుడు గణేనాయక్‌ను పట్టుకోవడం కోసం అతనితో సంబంధం వున్న తాండాలను తగులపెట్టడంతో అంతమవుతుంది.

వెంకటనాయుడు, వీరారెడ్డిలిద్దరూ ఇరుగు పొరుగూర్ల భూస్వాములు. సారా కాంట్రాక్టుల కోసం పోటాపోటీగా తలపడుతూ సైన్యాలను నిర్మించుకొని సాధారణ ప్రజలను సమిధలను చేస్తూ, పరస్పర దాడులు సాగిస్తూ, ఫ్యాక్షనిస్టు ముఠాలుగా రూపొంది గ్రామీణ జీవితాన్ని అల్లకల్లోలం చేస్తారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా నియోజకవర్గానికి శాసనకర్తగా వెంకటనాయుడు ఎదిగితే, వీరారెడ్డి క్రమంగా బలహీనపడతాడు. వీరారెడ్డి వర్గానికి చెందిన సుగాలీ తాండాల నాయకుడు గణేనాయక్‌నాయుడు చెంతకు చేరతాడు. వీరిద్దరి మధ్య సారా వ్యాపారం వైరం తెస్తుంది. నాయుడు తాండాలపై ఘోరమైన దాడులు జరిపిస్తాడు. ఈ పరిస్థితుల్లో నాయుడు చీనీతోటను రాత్రికి రాత్రే ఎవరో నరికేస్తారు. ఈ పని చేసింది గణేనాయక్ అని ప్రకటించి అతన్ని పట్టివ్వాలని హెచ్చరిస్తాడు. తాండాలు తగులబెట్టిస్తాడు. నాయుడు-వీరారెడ్డిల మధ్య మైత్రి కుదురుతుంది. 'రేపటి ఆనందమైన సూర్యోదయం కోసం, తెల్లటి కాంతుల కోసం జిల్లా వాసులు మరోవైపు ఆశాజనకంగా ఎదురు చూస్తున్నారని' కథ చివర కథకుడు ముగింపునిస్తాడు. కథా రచయిత చిలుకూరి దేవపుత్ర రాసిన 'ఆయుధం' కథ రాజకీయ నేపథ్యంలో నడుస్తుంది. రాజన్నకీ శివరామప్పకీ మధ్య వున్న వైరం ప్రధానంగా కథా ఇతివృత్తం. రెండు గ్రామాలకీ ఒకే పంచాయితీ కావడంతో అయిదేళ్ళ కిందట సర్పంచి పదవికి రాజన్న తండ్రి నారాయణప్ప, శివరామప్ప అన్నయ్య ఈశ్వరప్ప పోటీ చేస్తారు. నారాయణప్ప గెలుస్తాడు. ఓటమిని భరించలేని ఈశ్వరప్ప అనంతపురంలో కోర్టుకు హాజరు కావడానికి వెళ్తున్న నారాయణప్పని, అతని బావమరిది హనుమంతప్పనూ నరి కించేస్తాడు. ప్రతీకారంగా ఈశ్వరప్పను రాజన్న బాంబులు వేసి చంపిస్తాడు. ఈ నేపథ్యంలో రాజకీయంగా బలమైన స్థానానికి రాజన్న చేరుకుంటాడు. రీపోలింగ్ సమయంలో రాజన్న తన బావమరిది చంద్రప్పతో వ్యూహం పన్నుతాడు. రాజకీయాల నేపథ్యంలో తనకు అత్యంత నమ్మకస్తుడైన అంగరక్షకుడిగా మల్లేసును వాడుకుంటాడు. మల్లేస్‌ను ఆయుధంగా చేసుకుంటాడు. చివరాఖరికి రాజన్నపైన ప్రత్యర్థులు దాడి చేసినప్పుడు మల్లేస్ అడ్డుపడి ప్రాణాలు పోగొట్టుకొని రాజన్నను రక్షిస్తాడు.

> 'ఎలిగే పెద్దోళ్ళు-నలిగే సిన్నోళ్ళు' కథను రాసింది పి.రామకృష్ణ. సీమలో ఫ్యాక్షనిస్టు నాయకులు తమ అవసరాలకు దళితుల్ని ఫ్యాక్షనిజంలోకి లాగుతారు. నాయకుల సిగ పట్లలో దళితుడు సాటి దళితుడ్ని చంపు కుంటాడు.

'భారతం మిట్ట' కథకుడు పులికంటి కృష్ణారెడ్డి. భారతం మిట్ట రాజకీయ చదరంగానికి కాలిబూడిద కావడంతో కథ మొదలవుతుంది. ఎమ్మెల్యేని ఘొరావ్ చేయించిన ఎం.పి. మీద కసి తీర్చుకోవడానికి భారతం మిట్ట అగ్నిగుండం అవుతుంది. 'మనస్పర్థలు, తగాదాలు, విభేదాలు, కక్షలు, కార్పణ్యాలు ఈ రోజు పుట్టుకొచ్చినవేమీ కావు. అనాదిగా వున్నవే. అయితే ఒకనాడు వాటిని పరిష్కరించుకొనే ఓర్పూ నేర్పూ గ్రామాల్లో వుండె. ఎట్టాటి సమస్య అయినా రచ్చబండ దగ్గర తెగిపోతా ఉండె. జాతరో, భారతమో ఏదో ఒకటి వచ్చేసరికి అన్నీ సర్దుకొనిపోతా వుండె. అందరూ భారతం మిట్టన కలిసిపోయేవాళ్లు. పల్లెలకు, పల్లెలకు మధ్య అభిప్రాయ భేదాలను రూపుమాపింది. అందరినీ ఒక తాటి మీద నడిపించింది. ఈ రోజు లేనిపోని వైషమ్యాలతో, అభిప్రాయ భేదాలతో భారతం మిట్టకే కాదు, ఊళ్ళకే అగ్గిపెట్టింది కదా!' అని రచయిత అభిప్రాయపడతాడు. తానూ, వెంకటరెడ్డి ఇద్దరూ కలిసి వారధి మీద కూర్చొని కన్న కలలు ఆవిష్కరిస్తాడు. వూరు విడిచి వెళ్లిపోతాడు. కోలు గ్రామాల్లోని మానవీయ విలువల్ని ఎలా మంటగలు పుతున్నాయో ఈ కథ హృద్యంగా వివరి స్తుంది. ఆలోచింపచేస్తుంది.

స్వామి రాసిన 'నడక' కథ భూమి నేపథ్యంలో సాగుతుంది. కథానాయకుడు మల్లయ్య పాత్ర ద్వారా పల్లెలో వస్తున్న మార్పులు, కక్షలను రచయిత విశ్లేషిస్తాడు. బస్సు రావడంతో పల్లెలో జనం బయటి ప్రపంచాన్ని ఎదిగే పరిణామంలో ఎలా పతనమౌతారో ఈ కథలో తెలుస్తుంది.

'శనీస్సురుడు' కథా రచయిత వి.ఆర్. రాసాని. నూరిండ్ల పల్లెలో సుమారుగా పద్దైదేళ్ళ క్రితం వున్న శ్రాంత పరిస్థితుల్ని, నేటి హింసా రాజకీయ కక్షల్ని 'నాడు-నేడు'గా ఈ కథలో కథకుడు విశ్లేషిస్తాడు. బసిరెడ్డి కొడుకు జయరామిరెడ్డి కోణం నుంచి కథ నడుస్తుంది. 'అప్పుడెప్పుడో నలమహారాజు కథలో శనీస్సురుడు నలున్ని ఎట్టబట్టాలా అంట కాపెట్టుకోనుండీ, వొగతూరి బయటికేడికో బోయి, కాళ్ళూ సేతులు సరిగ్గా కడుక్కోకుండా అంతప్పురంలోకి వచ్చేసిన నలున్ని చూసి 'అదే మంచి సమీం' అంటూ బావించుకొని ఆ రాజును పట్నాడంట. అట్ల ఆ మాదిరి పెద్దిరెడ్డి పోతానే రాజకీయాలు వచ్చి సేరిపోయి శనీస్సురుడు పట్టనట్లు పట్టింది" అంటాడు కథకుడు.

ఇంకా కక్షల కోణం నుంచి వైసివిరెడ్డి 'ఐదు రూపాయలు', ఆరవీటి శ్రీనివాసులు 'తొందరపడి ఒక కోడి ముందే కూసింది', జి.ఆర్. మహర్షి 'నేను బతకలేను సిన్నమ్మా', డాక్టర్ శాంతి నారాయణ 'గర్భస్రావం', సడ్లపల్లె చిదంబరరెడ్డి 'ఇసక', సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి 'తడి', తుమ్మల రామకృష్ణ 'ఊబి', కె.పద్మనాభరెడ్డి 'గళంలో హాలాహలం', దాదాహాత్ 'వారసత్వం', చెరువు అనంతకృష్ణ శర్మ 'కక్ష', డి.రామచంద్రరాజు 'ఏటిదరిమాను', మధురాంతకం రాజారాం 'గాలివీడు నుంచి న్యూయార్క్‌దాకా', పాలగిరి విశ్వప్రసాద్ 'చుక్క పొడిచింది', డాక్టర్ ఎం.వి. రమణారెడ్డి 'పరిష్కారం', ఎ.నాయకి 'జాడలేని మనిషి', శ్రీనివాసమూర్తి 'దేవుని మాన్యం', ఎం.హరికిషన్ 'పడగనీడ', బత్తుల ప్రసాద్ 'నెత్తర మరకలు', తవ్వా ఓబుల్‌రెడ్డి 'నవ వసంతం', నాగులారపు విజయసారథి 'చంద్ర గ్రహణం', వేంపల్లి గంగాధర్ 'కొలిమ్మాను', జి.వెంకటకృష్ణ 'పడగనీడ', ఇనాయతుల్లా 'నిచ్చెన', ఎస్వీ ప్రసాద్ 'స్వేచ్ఛ' వంటి కోల చరిత్రను రికార్డు చేసే కథలెన్నో ఆవిష్కృతమయ్యాయి. కత్తులు నూరుతూ, నెత్తురు పారే నేల మీద శాంతి కపోతాలు ఎగరాలనేదే కథకులందరి చిరకాల స్వప్నంగా కనిపిస్తుంది.

– వేంపల్లి గంగాధర్

తెలుగు సూర్యుడు సి.పి.బ్రౌన్



సి.పి.బ్రౌన్...

తెలుగు కొమ్మకు వెలుగు పూలు పూయించిన సాహితీ తపస్వి... సాహితీ లోకంలోని చీకటిని ఛేదించిన కాంతి ఖడ్గం... ఆరిపోతున్న తెలుగు సాహిత్య దీపాన్ని అఖండ స్ఫూర్తితో- చైతన్యదీప్తితో వెలిగించిన సారస్వత యోగి... తెలుగు సాహిత్యానికి ఖండంతరాల్లో సైతం ఖ్యాతిని అందించిన అద్వితీయుడు... ఆరంభమే శ్రీకారమై- ఆలోచనే సాకారమై భాషాసేవకు ప్రాకారమై తపించిన మహనీయుడు... తెలుగు భాషకు కొత్త ఉషస్సులు తెచ్చిన తెలుగు సూర్యుడు అయిన బ్రౌన్ **205**వ జయంతి రేపు. ఈ సందర్భంగా ఆయనను స్మరిస్తూ ఈ వ్యాసం...

ఆంధ్రదేశాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత ఆర్థర్ కాటన్‌కు లభిస్తే ఆంధ్ర భాషను అపురూపరీతిలో ఉద్ధరించిన ఘనత సి.పి.బ్రౌన్‌కు దక్కుతుంది. అందుకే వీరిద్దరూ మనకు ప్రాతః స్మరణీయులు.

డేవిడ్ బ్రౌన్, కౌల్ దంపతులకు రెండో కుమారుడుగా 1798 నవంబరు 10వ తేదీన బ్రౌన్ కలకత్తాలో జన్మించాడు. తండ్రి డేవిడ్ బ్రౌన్ కలకత్తాలో క్రైస్తవ మత ప్రచారకుడిగా పనిచేస్తూ వుండేవారు. అవిశ్రాంతంగా పని చేయడం వల్ల ఆయన ఆరోగ్యం క్షీణించి 1812 జూన్ 14వ తేదీన మరణించాడు. అనంతరం తల్లీ సోదరులతో లండన్ చేరాడు బ్రౌన్. అక్కడ హెయిల్ బెరి కాలేజీలో చేరి సంస్కృతం అభ్యసించాడు. ఇండియాలో తమ వద్దవుండి మరణించినవారి పిల్లలను సర్వీసులో చేర్చుకొని ఉద్యోగాలు ఇచ్చేవారు. ఆ ప్రకారం 1817 ఆగస్టు 4న రైటర్‌ర్యాంక్‌తో బ్రౌన్ మద్రాసులో అడుగుపెట్టాడు.

అక్కడ వెలగపూడి కోదండరామ పంతులు గారివద్ద తెలుగు అక్షరాభ్యాసం చేశాడు. అయితే తండ్రి శిక్షణలో బాల్యంలోనే హిబ్రూ, లాటిన్, బెంగాలీ, హిందుస్తానీ భాషలను నేర్చుకున్నాడు బ్రౌన్. మూడేళ్ళు మద్రాసులో శిక్షణ ముగించి 1820 ఆగస్టులో కడపలో కలెక్టరుకు రెండవ సహాయకుడిగా చేరాడు. అంతకు ఎనిమిదేళ్ళ కిందటి వరకు అంటే 1812 వరకు సిద్ధవటం కడప జిల్లా కేంద్రంగా వుండేది. కడప కలెక్టర్ హన్బరి తెలుగులో అనర్గళంగా మాట్లాడటం గమనించిన బ్రౌన్ అదే ఆసక్తితో తెలుగు మాట్లాడ్డం నేర్చుకున్నాడు.

బ్రౌన్ 1821లో కడపలో రెండు పాఠశాలలను స్థాపించాడు. 1822లో కడప నుంచి మచిలీపట్నం జిల్లాకోర్టు రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యాడు. అక్కడే కొంతకాలం జిల్లా జడ్జిగా కూడా పనిచేశాడు. బ్రౌన్ తెలుగు సాహిత్యాభిరుచిని ఆంగ్ల దొరలు ఏవగించుకున్నారు. అయినా బ్రౌన్ నిరాశపడక తన కృషి సాగించాడు. 1823 జూన్‌లో ఆరువారాలపాటు సెలవుపెట్టి మద్రాసుకు వెళ్ళాడు ఆయన. అక్కడే పుస్తక సేకరణ బ్రౌన్ లక్ష్యంగా మారింది.

తెలుగు సాహిత్యానికి జీవంపోసి...

"Telugu Literature was dying out, the flame was just glimmering in the socket"

- సి.పి.బ్రౌన్

తాటాకుల్లో శిథిలమైపోతూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఎన్నో తెలుగు కావ్యాలను కాలగర్భంలో కలిసిపోకుండా పునరుద్ధరించిన ఘనుడు బ్రౌన్. లిఖిత ప్రతులు ఎక్కడున్నా వాటిని సేకరించడమే తన లక్ష్యంగా పెట్టుకున్నాడు. పండితుల సహాయంతో పరిష్కరింపచేసి ప్రచురణకు శుద్ధప్రతులను తయారు చేయించాడు. పదసూచికలను, పద సంఖ్యలను నిర్ణయించి ఆశ్వాస విభజన చేయించే

సృష్టి

వాడు. పరిష్కారానికి వీలుకాని పద్యాల పక్కన తీర్పుకాని కారణాలను రాయమనేవాడు.

మారుమూల ప్రాంతాల నుంచి రాతప్రతులు సొంత డబ్బుతో సేకరించేవాడు. బ్రౌన్ మహాభారత శుద్ధ ప్రతి తయారీకి రూ. 2714

> బ్రౌన్ మిత్రులద్వారా, పరిచయమున్న వారంద రి ద్వారా వివిధప్రాంతాలనుంచి వేమన పద్యాలున్న తాలూకు గ్రంథాలను తెప్పించాడు. ***1829*** లో వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి రెండుసార్లు సొంత ఖర్చుతో ప్రచురించాడు.

ఖర్చు చేశాడు. అప్పుడు బ్రౌన్ నెల జీతం రూ. 500. తెలుగుభాషా సాహిత్య సముద్ధరణకు తన సర్వస్వం వ్యయంచేసి అది చాలక పోగా మరో అరవైవేల రూపాయలు అప్పుతెచ్చి వేలాది గ్రంథాలను సేకరించాడు. ఇలా సేకరించి దాదాపు ఐదువేల రాత ప్రతులు అందించాడు. అలాగే 1215 వేమన పద్యాలను సేకరించి ఆంగ్లానువాదం చేసి ప్రచురించాడు. మన కవులను గ్రీక్, లాటిన్, ఇంగ్లీష్ కవులతో పోలుస్తూ తులనాత్మక అధ్యయనానికి శ్రీకారం చుట్టాడు బ్రౌన్.

వసుచరిత్ర, మనుచరిత్ర వంటి ప్రసిద్ధ కావ్యాలను మొదటిసారిగా ఆయనే ప్రచురించాడు. 1841లో నలదీ్వపద, 1844లో వసుచరిత్ర, మనుచరిత్రలను సేకరించారు. జూలూరు అప్పయ్య శాస్త్రి గారిచేత వాటికి వ్యాఖ్యానాలు రాయించారు. పల్నాటి వీరచరిత్ర, ప్రభావతీ ప్రద్యుమ్న, రాఘవ పాండవీయ, కళాపూర్ణోదయ కావ్యాలకు వ్యాఖ్య రాయించి అచ్చువేయించాడు బ్రౌన్. ప్రతి రోజూ అయిదు నుంచి పది గంటల కాలాన్ని అధ్యయనానికి వినియోగించేవాడు. వేమన పద్యాల తర్వాత బ్రౌన్‌ను ఆకర్షించిన తెలుగు రచన సుమతి శతకం. ఈ శతకం నుంచి 85పద్యాలను ఆంగ్లంలోకి అనువాదం చేశాడు.

కాశీఖండం, పద్మపురాణం, భాగవతం, భారతం, భాస్కర రామాయణం, విష్ణుపురాణం, శ్రీకాళహస్తి మహాత్మ్యం వంటి గ్రంథాలకు శుద్ధప్రతులు రాయించారు. కావ్యాలు, ప్రబంధాలు, ద్విపదలు మొదలైన వాటినే కాక శైవుల మత గ్రంథమైన బసవపురాణం అద్భుత కథల సంకలనం తయారుచేశాడు.

మద్రాసు విశ్వవిద్యాలయంలో ద్వితీయ పండితుడిగా వున్న పురాణం హయగ్రీవశాస్త్రి గారి కోరిక మేరకు బ్రౌన్ తాను పరిష్కరింపచేసిన ఆంధ్ర మహాభాగవతాన్ని హయగ్రీవ శాస్త్రులు తన వివేకదర్పని ముద్రణాలయంలో 1848లో ముద్రించారు. ఈ భాగవత పీఠికలో కడప జిల్లాలో వున్న ఒంటిమిట్టయే ఏకశిలానగరమని ఆయన రాశాడని బ్రౌన్ నిఘంటువు తెలియజేస్తున్నది. బాణాల శంభుదాసు రచించిన ద్విపద సారంగధర చరిత్రను బ్రౌన్ 1827లో ఆవిష్కరించాడు. ప్రభులింగ లీల అనే శైవమత సంబంధమైన ద్విపదను ఆంగ్లంలోకి అనువదించాడు. బైచరాజు వెంకటరాజు రచించిన పంచతంత్ర, హంసవిశంతులకు పదసూచికలు తయారుచేయించాడు. సింహాసన ద్వాత్రింశిక కథాసారాన్ని 43పుటల్లో ఆంగ్లంలో సంగ్రహం

చేశారు. గౌరవ హరిశ్చంద్రోపాఖ్యానాన్ని 1842 లోను, వైజయంతి విలాసాన్ని 1849లో అచ్చు వేయించారు. కళాపూర్ణోదయం, తారాశశాంక విజయం, విజయవిలాసం, కుచేలోపాఖ్యానాలను ముద్రింపచేశారు. ఈవిధంగా తెలుగు సాహిత్యంలో బ్రౌన్ ముద్ర పడని ప్రాచీన కావ్యం లేదు. పాతికేళ్ళలో దాదాపు పాతిక ప్రబంధాలను పరిష్కరింపచేసిన సాహితీసామ్రాట్ బ్రౌన్.

ద్విపదలతో హరిశ్చంద్ర కావ్యాన్ని, నవనాథ చరిత్రలో కొంత భాగాన్ని మొదట అచ్చు వేయించిన కీర్తి బ్రౌన్‌కు దక్కుతుంది. గ్రంథ సేకరణతోపాటుగా సాహిత్య సంబంధమైన ఇతర వాటిని కూడా బ్రౌన్ సేకరించాడు. చాటువులు, జానపద గీతాలు, సామెతలు, పలుకుబళ్ళు వీటితోపాటు మంత్రతంత్ర శాస్త్రాలకు చెందిన ఆనంద తంత్రం, సౌందర్యలహరి, కులార్ణవం వంటి సంస్కృత గ్రంథాలను సేకరించాడు.

లేఖా సాహిత్యం

తెలుగు వాఙ్మయంలో లేఖా సాహిత్యానికి విశిష్ట స్థానం తెచ్చిన మూలపురుషుడు బ్రౌన్. పందొమ్మిదవ శతాబ్దంలో తెలుగు భాషా స్వరూప లక్షణాలు, సంప్రదాయాలు, లేఖావతారిక విషయాలు, లేఖాంతాలు ఎలా వుండేవో తెలుసుకోవడానికి బ్రౌన్ తయారుచేయించిన ఇరవై లేఖా సంపుటాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

కావ్యాలు, ప్రబంధాలు, ద్విపదలు మొదలైన వాటినేకాక 84 శతకాలను సేకరించి పరిష్కరించాడు బ్రౌన్. తెలుగు నేర్చుకునే పాశ్చాత్యుల కోసం బ్రౌన్ తానే స్వయంగా వ్యాకరణం రచించి 1840లో ముద్రించాడు. ఆయన వ్యాకరణ రచనలో వ్యవహారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. 1852లో క్రైస్తవ విజ్ఞాన సంఘం వారి కోరిక మేరకు లిటిల్ లెక్సికన్ ప్రచురించారు. అందులో అనుబంధంగా వ్యాకరణ విశేషాలు, తెలుగు వాచకం చేర్చారు. భారతీయ శిల్పశాస్త్రంపై బ్రౌన్ పరిశోధనాత్మక వ్యాసం రాశాడు. అది మద్రాస్ గెజెట్‌లోనేకాక ఏషియాటిక్ జర్నల్‌లో కూడా వెలువడింది. ఉర్దూ సాహిత్యంలో వ్యంగ్య కవిగా పేరుగాంచిన సౌదా (1713-1780) రచనలను బ్రౌన్ సేకరించి, సంస్కరించి ప్రచురించాడు. చారిత్రక విషయాలపట్ల ఆసక్తిగల బ్రౌన్ 'రాజుల యుద్ధాలు' అనే అనంతపురం చరిత్రను ఇంగ్లీష్‌లోకి అనువాదం చేసి 1853లో ప్రచురించాడు. తాతాచారి కథలను ఇంగ్లీష్‌లో 'పాప్యులర్ తెలుగు టేల్స్' అనే పేరుతో 1855లో ప్రచురించారు.

బ్రౌనుకు తోడ్పడిన పండితులు

ఆంధ్ర సాహిత్య పునరుజ్జీవనంలో బ్రౌన్‌కు ఎందరో పండితులు సహకరించారు. జూలూరి అప్పయ్యశాస్త్రి, పరవస్తు చిన్నయసూరి, చెంచయ్య, తిరుపతి తాతాచార్యులు, కంభం నరసింహాచార్యులు, చిలకమర్రి నరసింహాచార్యులు, సముద్రాల నరసింహాచార్యులు, ములుపాక బుచ్చయ్యశాస్త్రి, ఆరణిమఠం వీరభద్రయ్య, గరిమెళ్ళ వెంకయ్య, పైడిపాటి వెంకట నరసయ్య, వఠ్యం అద్వైత బ్రహ్మశాస్త్రి... వంటి పండితులు గ్రంథాల బృహత్ కార్యానికి ఆసరాగా నిలబడ్డారు.

బ్రౌన్ నిఘంటువులు

బ్రౌన్‌కు ఎనలేని పేరుప్రఖ్యాతులను తెచ్చిపెట్టినవి ఆయన తయారుచేసిన నిఘంటువులు. బ్రౌన్‌కు ముందు కాంబెల్, మారిస్, మామిడి వెంకయ్య... వంటివారు తెలుగు నిఘంటువులను సమకూర్చారు. కానీ నాటి నుంచి నేటి వరకు పండితుల నుంచీ సామాన్యులవరకూ ఉపయోగపడేవి బ్రౌన్ నిఘంటువులే. బ్రౌన్ పాండితీ గరిమ నిశిత ప్రజ్ఞకు సాక్ష్యాలు ఈ నిఘంటువులు. బ్రౌన్ నిఘంటువులలో వాడుక పదాలు వున్నాయి. అవసరమైనచోట పూర్వకవి ప్రయోగాలున్నాయి. సామెతలు, జాతీయాలు, ఆంగ్ల సమానార్థాలు వీలైనన్ని ఇచ్చారు. బ్రౌన్ నిఘంటువులను ఆంగ్ల సాహిత్యం మనవారికి అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతోనే రాశారు. బ్రౌన్ జిల్లా నిఘంటువులను కూడా తయారుచేశారు.

వేమన పద్యాలకోసం...

బ్రౌన్ మిత్రులద్వారా, పరిచయమున్న వారందరి ద్వారా వివిధప్రాంతాలనుంచి వేమన పద్యాలున్న తాలూకు గ్రంథాలను తెప్పించాడు. 1829లో వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి రెండుసార్లు సొంత ఖర్చుతో ప్రచురించాడు. ఈవిధంగా వేమన కవితా ప్రతిభను ప్రపంచ వ్యాప్తి చేశాడు బ్రౌన్. వేమన పద్యాలు కంటపడేనాటికి ఆయనది 26 ఏళ్ళ వయస్సు.

బ్రౌన్ కాలేజి

1826లో మళ్ళీ కడప జిల్లా కోర్టు రిజిస్ట్రార్‌గా చేరిన తర్వాత తాను సేకరించిన విలువైన గ్రంథాలపరిష్కరణకు శుద్ధప్రతులు తయారుచేయించాలని నిర్ణయించుకున్నాడు. దానికి కడపనే వేదికగా చేసుకున్నాడు. అందుకోసం కడపలోనే వెయ్యి వరహాలకు పెద్ద బంగళా, తోట కొన్నాడు. బ్రౌన్ ఎక్కడ పనిచేస్తూ వున్నా యిక్కడ మాత్రం సాహిత్య కృషి జరుగుతూనే వుండేది. ఈ బంగళానే 'బ్రౌన్‌కాలేజి' అని పిలిచేవారు. బ్రౌన్ ఉద్యోగరీత్యా ఎక్కడ పనిచేస్తూ వున్నప్పటికీ కడపలోని తోట, ఆస్తిపాస్తుల్ని, సాహిత్య సంబంధమైన పనులను ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడు. వీటిని అయోధ్యాపురం కృష్ణారెడ్డి పర్యవేక్షిస్తూ వుండేవాడు.

ఎవరీ కృష్ణారెడ్డి?

బ్రౌన్ గురించి తెలిసిన వారందరికీ దాదాపుగా పరిచయమయ్యే పేరు- అయోధ్యాపురం కృష్ణారెడ్డి. బ్రౌన్ దొరకు అంతరంగికులైన తెలుగు ఉద్యోగుల్లో ముఖ్యుడు ఇతను. కడప జిల్లా రాయచోటి తాలూకా హసనాపురం వీరి సొంత వూరు. బ్రౌన్ సాహిత్యవేదికగా కడపలో ఏర్పాటుచేసిన 'బ్రౌన్‌దొరగారి కాలేజి', ఇల్లు, తోట బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన ఘనుడు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన జమాఖర్చులను ఎప్పటికప్పుడు బ్రౌన్‌కు తెలియజేస్తూ వచ్చాడు. ఫలితంగా ఆయనకు కృష్ణారెడ్డిపై మంచి నమ్మకం ఏర్పడింది. మొదట ఆరువరహాల జీతంకోసం చిన్న ఉద్యోగిగా చేరిన కృష్ణారెడ్డి అనంతరం క్రమక్రమంగా ఎదుగుతూ కడప జిల్లా కోర్టులో నాజరై, తర్వాత మునసబుగానూ పనిచేశారు. బ్రౌన్‌కు, కృష్ణారెడ్డికి మధ్య నడిచిన లేఖలు ఎన్నో అంశాల్ని వివరిస్తాయి.

తనకాలంనాటి పత్రికలలో వెలువడిన వ్యాసాలు, సంపాదకీయాలు, వార్తలు, లేఖలు



కడపలోని బ్రౌన్ పరిశోధనా కేంద్రం

నేటి బ్రౌన్ గ్రంథాలయం

నాడు బ్రౌన్ నివసించిన చోట-

నేడు బ్రౌన్ గ్రంథాలయం వెలిసిన ప్రదేశం. కడపలో బ్రౌన్ కాలేజీగా పేరొందిన ప్రదేశంలోనే నేడు బ్రౌన్ గ్రంథాలయం ఉంది. బ్రౌన్ రచనలన్నీ ఇక్కడే దర్శనమిస్తాయి. వేమన పద్యాల అనువాదం, లేఖలు, బ్రౌన్ సాహిత్య జీవిత చరిత్ర, 1820 నాటి కడప జిల్లా రికార్డులు, అనంతపురం చరిత్ర, బ్రౌన్ మరణ ధృవపత్రం, వివిధ పత్రికల్లో బ్రౌన్ రాసిన వ్యాసాలు యిక్కడి బ్రౌన్ గ్రంథాలయంలో కన్పిస్తాయి. మన రాష్ట్రంలోని గ్రామాల చరిత్రను తెలియజేసే మెకంజీ కైఫియత్‌లు 75 వరకు వున్నాయి. కడప జిల్లా శాసనాలు కూడా యిక్కడ భద్రపరిచారు. సి.పి.బ్రౌన్ సాహిత్య పరిశోధన కేంద్రంగా వెలిసిన ఈ కేంద్రాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు గుర్తించారు.

బ్రౌన్‌కు సరైన న్యాయం జరగలేదు!

తెలుగు భాషా సాహిత్యాల వికాసం కోసం అనితరసాధ్యంగా శ్రమించిన సి.పి.బ్రౌన్‌కు ఈ నేలపై సరైన న్యాయం జరగలేదని కడపలోని సి.పి.బ్రౌన్ పరిశోధనా కేంద్రం కార్యదర్శి డాక్టర్ జానమద్ది హనుమాచ్ఛాస్త్రి అన్నారు. ఆయనతో జరిపిన సంక్షిప్త ఇంటర్వ్యూ ఇది...

ప్రశ్న: బ్రౌన్ అంటే ఒక పుస్తక సామ్రాజ్యం. అక్షర తపస్వి. మరి నిజంగా బ్రౌన్‌కు సరైన న్యాయం జరిగిందంటారా?

జవాబు: జరగలేదు. నిజంగానే బ్రౌన్‌కు సరైన న్యాయం జరగలేదు. బ్రౌన్‌ను మొదటి నుంచి కూడా విస్మరిస్తూ వచ్చారు. బ్రౌన్‌ను నిలబెట్టుకోవడం కోసం ఎన్నో కష్టాల్ని ఎదుర్కొన్నాం. ఎవరిపాటికి వాళ్ళు వదిలేస్తూ వెళ్ళిపోతే ఎలాగైనా సరే బ్రౌన్ సాహిత్యాన్ని నిలబెట్టుకోవాలని ఎంతగానో శ్రమించాం.



డా॥ జానమద్ది

యిప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో బ్రౌన్ స్మృతి చిహ్నం ఏదీ లేదు. దీని గురించి ఎవరూ ఆలోచించరు. ఇది బ్రౌన్‌ను విస్మరించడం కాదా? బ్రౌన్ మనకోసం ఎంతో చేశాడు. కాలప్రవాహంలో కొట్టుకుపోతున్న ఎన్నోరచనల్ని రక్షించాడు. ఎంతో సాహితీ కృషి చేసిన ఆ మహానుభావుడికి మనమేం చేశాం? ఎంత చేశాం?

ప్రశ్న: బ్రౌన్‌పై పరిశోధనల తీరు...

జవాబు: 1976లో బ్రౌన్ మీద పరిశోధననిమిత్తం ఆరుద్ర, బంగోరె కడప వచ్చారు. స్థల నిర్ధారణ కోసం శ్రమించారు. అనంతరం అప్పటి కడప కలెక్టర్ పి.ఎస్. సంజీవరెడ్డి గారి ద్వారా నేను బాధ్యతలు స్వీకరించాను.

ప్రశ్న: ఆ తర్వాత ఏం చేశారు?

జవాబు: మొదట్లో రాజకీయ నాయకులెవరూ సహకరించలేదు. విన్నపాలు పంపుకోవడంతోటే ఎంతోకాలం వృధా అయింది. అయినా మా ప్రయత్నాలు మానుకోలేదు. నిరాశపడలేదు. 1987లో కడప కలెక్టర్‌గా వచ్చిన జె. హరినారాయణ గారు మూడున్నర లక్షల రూపాయల గ్రాంటు ఇచ్చి ప్రోత్సహించారు.

ప్రశ్న: బ్రౌన్ పరిశోధనా కేంద్రం నిర్మాణం కోసం ఎలా శ్రమించారు?

జవాబు: కడప, ప్రొద్దుటూరు ప్రాంతాల్లోని విద్యార్థినీ విద్యార్థులు ఒక్కోరూపాయి చొప్పున అందజేస్తే ఈ పరిశోధనా కేంద్రం నిర్మితమైంది. మీరు నమ్మలేని నిజమేమిటంటే బందరులోని ఒక కూలీ పదిరూపాయలు ఎం.ఓ ద్వారా పంపడం మరచిపోలేనిసంఘటన. ఇలా ఎన్నో చేతులు కలిసి దీన్ని నిలబెట్టుకున్నాయి. బ్రౌన్‌ను బతికించుకున్నాయి.

ప్రశ్న: మీ కేంద్రం భవిష్యత్ కార్యక్రమాలు ఏమిటి?

జవాబు: అముద్రిత గ్రంథాలు ఎన్నో వున్నాయి. మెకంజీ కైఫీయత్‌లు ఒక భాగం మాత్రం తీసుకొచ్చాం. ఇంకా 70కి పైగా వున్నాయి. వీటిని కూడా తీసుకురావాల్సిన అవసరం వుంది. ఎన్నో అముద్రిత గ్రంథాలకు జీవం పోయడానికి తప్పకుండా ప్రయత్నిస్తాం.

మొదలైన వాటిని సేకరించి మంచి కాగితాలపై రాయించి ముందు తరాల వారికి అందజేసిన మహనీయుడు బ్రౌన్. ధనసంపాదనే ప్రధానంగా భారతదేశాన్ని పీల్చి పిప్పి చేయాలనే సంకల్పంతో ఏర్పడిన ఈస్టిండియా కంపెనీ ఉద్యోగిగా బ్రౌన్ మనదేశంలో అడుగుపెట్టాడు. కొంగలలో హంసలాగా వ్యవహరించాడు.

మొత్తం 34 ఏళ్ళు (1817-1834; 1838-1855) ఇండియాలో వుండి స్వదేశానికి వెళ్ళిపోవాలని నిర్ణయించుకొని ఉద్యోగం మానేసి బ్రౌన్ పింఛను తీసుకున్నాడు. ఆయన లండన్ వెళ్ళినతర్వాత అక్కడ తెలుగు సాహిత్యానికి విశిష్ట స్థానం లభించింది. ఆనాడు ఇంగ్లండులో బ్రౌనును తెలుగులో మించినవారు లేరు. అందువల్ల 1865లో లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగుభాషాచార్యునిగా నియక్తుడైనాడు. అక్కడ తెలుగు కోర్సును ఏర్పాటుచేశాడు. ఖండంతరాలలో తెలుగు భాషాసాహిత్యాలకు గౌరవ స్థానాన్ని తెచ్చిన ఘనుడు బ్రౌన్. గ్రీక్, లాటిన్, హీబ్రూ, ఫ్రెంచి, ఇటాలియన్, పర్షియన్, సంస్కృతం, ఆంధ్ర, ఆంగ్లం వంటి 24 భాషలలో పాండిత్యం ఉందాయనకు. లండన్ తిరిగి వెళ్ళిన తర్వాత ఇంకో ముప్పయి సంవత్సరాలు తెలుగు భాషా సాహిత్యాలకి సేవ చేసి 1884 డిసెంబరు 12వ తేదీన కీర్తిశేషులయ్యారు.

బ్రౌన ఆంగ్లేయుడైనా పుట్టింది ఇండియాలోనే. అవివాహితుడిగా ఉండి రేయింబవళ్ళు తెలుగు భాషా సాహిత్యాలే తన ఊపిరిగా జీవించారాయన. అక్షరాల వత్తి ఆరిపోతే విశ్వమంతా గాడాంధకారం అలముకొంటుంది. అదే అసలైన ప్రళయం అన్నారు. అలాంటి ప్రళయం నుంచి తెలుగు సాహిత్యాన్ని కాపాడిన బ్రౌన్‌కు ప్రతి తెలుగువాడూ తప్పక ఋణపడి వుంటాడు.

– వేంపల్లి గంగాధర్

సాహిత్య స్వాప్నికుడు సాయుధుడు శేషేంద్ర

"సముద్రం ఒకడి కాళ్ళ దగ్గర కూర్చుని మొరగదు
తుపాను గొంతు చిత్తం అనడం ఎరగదు
పర్వతం ఎవడికీ వంగి సలాం చెయ్యదు
నేనింత ఒక పిడికెడు మట్టే కావచ్చు
కానీ కలమెత్తితే
నాకు ఒక దేశపు జెండా
కున్నంత పొగరుంది"



-అంటారు శేషేంద్ర. అంతేకాదు "చెట్టుగా ఉంటేఏడాదికొక వసంత మన్నా దక్కేది. మనిషినై అన్ని వసంతాలూ కోల్పోయాను" అని ఆయన ఆవేదనపడతారు.

"కాలాన్ని నా కాగితం చేసుకుంటా, దాని మీదలోకానికిఒకస్వప్నం రాసి ఇస్తా, దాని కింద నా ఊపిరితో సంతకం చేస్తా"నని తన రచనా భావాల్ని ప్రస్ఫుటంగా వెల్లడిస్తారు.

"నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది కన్నుల్లో నీరుతుడిచి కమ్మటికల ఇచ్చింది" అంటూ పాటలపల్లవులు లిఖిస్తారు.

ఆధునిక సాహిత్య చరిత్రకు ఒకదారిని చూపిన నవయుగవైతాళికులు శేషేంద్ర.

కవిగా, విమర్శకులుగా, పరిశోధకులుగా గుంటూరు శేషేంద్రశర్మ తెలుగు సాహిత్యంలో అత్యున్నత శిఖరాలను అందుకున్నారు.వీరు 1927 అక్టోబరు 20వతేదీన నెల్లూరుజిల్లా నాగార్జునపాడు గ్రామంలో జన్మించారు. ఆంధ్రా యూనివర్శిటీ నుంచి డిగ్రీపూర్తిచేసిన శేషేంద్ర న్యాయశాస్త్రాన్ని మద్రాసు యూనివర్శిటిలో అభ్యసించారు. 37 సంవత్సరాలపాటు మున్సిపల్ కమీషనర్గా వీరు రాష్ట్రంలో పలుచోట్ల బాధ్యతలు నిర్వహించారు.

రచనా ప్రక్రియలో

1951లో వీరి మొదటి అనువాద రచన వచ్చినా, 'శేషజోత్స్న' పేరుతో 1968 నుంచి 1972 వరకు రాసిన కవిత్వమే వీరి మొదటి రచనగా భావించాలి. ఈ రచన తెలుగు సాహిత్యంలో ఒక వినూత్నమయిన ఒరవడి తీసుకొచ్చింది.


తర్వాత వచ్చిన 'మండే సూర్యుడు', 'రక్త రేఖ' కావ్యాలు 1974లో వెలువడ్డాయి.

1975లో వచ్చిన 'నా దేశం-నా ప్రజలు' రచన ఎంతగానో సంచలనం సృష్టించింది.

భారతీయ సాహిత్యంలోనే ప్రశస్తమైన ఇతిహాసరచనగా కీర్తినందుకుంది. తర్వాత 'నీరైపారిపోయింది' కవిత్వం ప్రచురింపబడింది. విభిన్నకోణాల్లో భావాల్ని ఈ రచన స్పృశించింది.

1977లో 'గొరిల్లా' కవితా సంకలనం పరిపూర్ణమైన కవిత్వానికి పర్యాయపదంగా నిలిచింది. అనంతరం వాల్మీకి రామాయణం పైన 'షోడసి', 'స్వర్ణహంస', 'సీత' వంటి విమర్శనాత్మక విశ్లేషణలతో రచనలు చేశారు. 'కాలరేఖ' కవిత్వానికి సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు.

గుంటూరు శేషేంద్రశర్మ పలు అంతర్జాతీయ సెమినార్లలోనూ పాల్గొన్నారు. గ్రీసు,జర్మనీ, ఫ్రాన్స్,



మడగాస్కర్, కెన్యా, ఇటలీ, ఇంగ్లాండ్ దేశాలను పర్యటించారు. వీరికి 1993లో సుబ్రహ్మణ్యభారతి ఏక్తాపురస్కారాన్ని కలకత్తా హిందీ అకాడమీ అందజేసింది. 1994లో సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. తెలుగు యూనివర్శిటీ నుంచి డి.లిట్ డిగ్రీని అందుకున్నారు.

శేషేంద్ర రచించిన 'కవిసేన మ్యానిఫెస్టో' కావ్య శాస్త్ర గ్రంథం సాహిత్య విమర్శకు ఊపిరిపోసింది. గజల్ లక్షణాలను వివరిస్తూ వచ్చిన 'ఈనగరం జాబిల్లి' కావ్యం విశిష్టస్థానం అందుకున్నది.

'ఆధునిక మహాభారతం', 'జనవంశమ్' వంటి ఇతిహాస కావ్య రచనలు అందించిన కవిరత్న గుంటూరు శేషేంద్ర శర్మతో ప్రస్తుత సాహిత్య పరిస్థితులు, ప్రభావాలు, పరిణామాలపై స్వాతి ప్రత్యేకంగా అందిస్తోంది విశ్లేషణాత్మక ఇంటర్వ్యూ:

'కవిత్వం' గురించి మీ అభిప్రాయం?

కవిత్వమంటే ఒక పదునైన ఆయుధం. దాని రూపం ఏదైనా కావచ్చు.అలజడి కావచ్చు.ఆరాధన కావచ్చు. ఆర్ద్రత కావచ్చు. సూటిగా హృదయాన్ని తాకి చైతన్యాన్ని, ఆవేశాన్ని అది అందించగలుగుతుంది. కవిత్వం కాగడాలా మంటలురేపుతుంది. వెలుగును చూపిస్తుంది.

కవిత్వం ఒక మెస్మరిజం/కవికన్ను ఒక ప్రిజం/ కవిత్వం ఎర్రగుర్రంలా పరిగెత్తుకువస్తుంది/ రక్తంలో మునిగిన బాణంలా/ వీరుడు విడిచిన ప్రాణంలా/ సాగిపోయేది కవిత్వం.

ఇది యూనివర్సల్. ప్రపంచంలోని ప్రజలందరికీ ఒకేవిధమైన భావాల్ని అందించగలుగుతుంది. దీని సారూప్యతలో ఏ రకమైన తేడాలుండవు. బలీయమైన అనుభూతిని కవిత్వం కల్గిస్తుంది.

హృదయం స్పందించినప్పుడు ఒక ప్రత్యేక పదజాలంతో కలంనుంచి, గళంనుంచి ఉప్పెనలా ఉధృతంగా పెల్లుబికికాగితాలపైకిచేరి దృశ్యాలుగా, శిల్పాలుగా చిత్రాలుగా మారేది కవిత్వం.

సాధారణంగా 'పండువెన్నెల కురుస్తోంది' అనే వాక్యమే 'ఈరాత్రి వెన్నెల నగ్నంగా స్నానం చేస్తోంది'అని కవీత్వీకరించబడుతుంది. కవిత్వానికి జీవితాలను ప్రభావితం చేసే శక్తివుంది.

కవిత్వం కవి మరణించినతర్వాత ఆకాశంలోకి లేచే నిర్మాణం. మొలిచే నాగరికత. అడుగుపెట్టే



వసంతం. అందమైన కవిత్వమంటే దానికి ఒక గుండె వుండాలి. అది కన్నీళ్ళు కార్చాలి. క్రోధాగ్నులు పుక్కిలించాలి. పీడితుల పక్షం అవలంబించాలి. మనిషి రుణం తీర్చుకోవాలి. కాలపు బరువుల్ని మోయాలి. అదే అసలుసిసలైన కవిత్వంగా పరిగణింపబడుతుంది.

సాహిత్యంలో ఇప్పుడు వస్తున్న వాదాలు ఎంతవరకు నిలబడతాయి? స్త్రీవాదం, దళితవాదాలపట్ల మీ అభిప్రాయం...

నేను అన్నివాదాలు చదువుతూనే వున్నాను. స్వచ్ఛందంగా వారివారి భావాలకు, అభిప్రాయాలకు వాదనల్ని వేదికలుగా చేసుకుంటున్నారు. తమ వాణికి బలాన్ని, తమకంటూ బలగాన్ని తయారుచేసుకొని తాము చెప్పదల్చుకున్నదేమిటో సూటిగా, స్పష్టంగా,నిఖార్సుగా, నిర్భయంగా చెప్పుకుంటూ వస్తున్నారు. పేర్లు ఏవైనా వాదాల అంతిమ లక్ష్యం ఒక్కటే. గుర్తింపుకోసమే ఈ వాదాలన్నీ ప్రయత్నిస్తున్నాయి. దళితులు అన్ని వర్గాల్లోనూ ఉన్నారు.పేదవారు, వెనుకబడినవారు, గుమస్తాలు, స్త్రీలు అందరూ దళితులు కిందకే వస్తారు. దళితులదే వ్యవస్థలో మెజార్టీ.

ఆర్థిక సమానత్వం ముందుగా ఈ వ్యవస్థ సాధించగలిగితే అన్ని సమస్యలు దాదాపుగా పరిష్కారం అవుతాయి. అన్ని వాదాలు, వివాదాలు తొలగిపోతాయి. స్త్రీ వాదమైన, దళితవాదమైన సొంతంగా తమ ఉనికిని తెలియజేసుకోవడమే అంతర్లీనమైన అంశం. ఏ వాదంవచ్చినా సాహిత్యానికి వచ్చే నష్టమేమీ వుండదు.

నడుస్తున్న సాహిత్యం చరిత్రలోని అన్ని రచనా ప్రక్రియల గాలుల్ని చూస్తూనే వున్నాను. వస్తున్నవన్నీ మంచికే. వారివారి గొంతుల్ని వినిపిస్తున్నారు. వారి గొంతులకొక వాదాన్ని జత చేసుకొని నినాదిస్తున్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామమే.

ఆర్థిక సమానత్వం దిశగా వ్యవస్థ అడుగులు వేయడం ప్రారంభిస్తే అవస్థలు తొలగిపోయి అసలైన సాహిత్యం ఆవిర్భవిస్తుంది.

'కవిసేన మెనిఫెస్టో' ఎందుకోసం వచ్చింది? మీ 'కవిసేన' తన లక్ష్యం సాధించిందా?

కవిసేన ఒక ప్రభంజనం. సంచలనం. దాన్ని ఎవరో ఏర్పాటుచేయలేదు.1970 కాలంలో స్వచ్ఛందంగా కదలివచ్చిన కవిమిత్రులు చేతులుకలిపి నిర్మించుకున్నారు. వారందరికోసం నేను మేనిఫెస్టో రాశాను. 'కొడవలి కర్షకుడి ఆయుధం. సుత్తి కార్మికుడి ఆయుధం. కత్తి సైనికుడి ఆయుధం. అట్లాగే కవిత్వమే కవి ఆయుధం. కవి తన ఆయుధాల్ని గురించి తెలుసుకోవాలి.

దాన్ని ఎప్పుడు, ఎందుకు, ఎలా ప్రయోగించాలో తెలుసుకోవాలి. దాని కోసమే 'కవిసేన' ఏర్పడింది.ఇది రాజకీయఉద్యమంగా ఏర్పడింది కాదు. ఇది ప్రధానంగా వైజ్ఞానిక ఉద్యమం.

మీ నడకలు అడవుల్లో నిర్భయంగా తిరిగే సింహాల్లా ఉండాలని కోరుకుంటూ,కవి సత్యాగ్రహి అని తెలియజేస్తూ, సత్యమంటే గుండెల్లో మండే వెసూవియస్ అగ్నిపర్వతమనీ, గొంతులో గర్జించే నయాగరా జలపాతమని అలాంటి సత్యాన్ని బతికించడం కోసం కవిసేన తయారయ్యింది. తాను అనుకున్న లక్ష్యం సాధించింది.

కవిసేన ఆ సమయంలో (1970) ఒక తుపానులా వీచింది. ఉద్యమమై నడిచింది. దీన్ని ఎవరూ మరచిపోలేరు. ఈ ఉద్యమం అడుగులు ఎంతో బలమైనవి. అందుకే నేను ఆకాంక్షించినట్లుగానే లక్ష్యాన్ని సాధించి తన సత్తా ఏమిటో కవిసేన నిరూపించుకోగలిగింది. ఇంతకంటే ఇంకేం కావాలి? 'కవిసేన మేనిఫెస్టో' ప్రపంచసాహిత్య ఉద్యమాల కరదీపికగా ఇప్పటికీ నిలిచేవుంది.




ఎథెన్స్ నగరంలో తన భార్య రాజకుమారి ఇందిరాదేవితో శేషేంద్ర శర్మ

మీరు రచనలుచేయడానికి స్ఫూర్తి ఏమిటి?

జీవితానికి అనుభవాలే ఆధారాలు. నేను ఎన్నో కష్టనష్టాలు అనుభవించాను. చిన్నప్పటి నుంచి సంఘర్షణ పడుతూనే వున్నాను. అలా నాలో నేనూ దుఃఖించి ఆవేదనను బైటకు అక్షరాలకు ఊపిరి పోస్తూ వచ్చాను. జీవితాన్ని మోస్తు నేను పడిన బాధల గాయాలే గేయాలుగా మారుతూ వచ్చాయి ఇదంతా నాకు ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తూ వచ్చింది. ఏవీ మరచిపోలేదు.

ఒక యోగస్థితిలో కెళ్ళి పుంఖానుపుంఖాలుగా కాగితాల్లోకి నా భావాల్ని ఒంపుకుంటూపోయిన



1979లో గ్రీకు కవి యాన్నిస్ రిటోస్‌ను కల్పినప్పటి దృశ్యం

సందర్భాలు అనేకం వున్నాయి.

అనుభూతి తీవ్రమై ఆవేశంగా వాక్యాలకు వాక్యాలు రాత్రంతా మేలుకొని నిద్రలోనూ పక్కనే తెల్లకాగితాల్ని పెట్టుకొని ఒకయజ్ఞంలా కవిత్వాన్ని లిఖించుకుంటూపోయిన రోజులు వున్నాయి.

సాహిత్య అధ్యయనం కూడా అదే స్థాయిలోనే సాగింది. చదవడం కోసమే చాలా సమయం కేటాయించేవాడ్ని. ప్రపంచదేశాల సాహిత్యాన్ని అంతా సేకరించుకొని పరిశోధన చేయడానికే శ్రమించాను. జీవితంలో ఎన్నో దశల్ని చూశాను.

అవమానాలుపడ్డాను.అపజయాలనుచూశాను. పిడికెడు మెతుకుల కోసం రోజంతా పేదలు ఎన్ని కష్టాలుపడి తమ రక్తాన్నిచిందించిబతుకును నెట్టుకొస్తారో నేను వీక్షించాను. అలాంటి దృశ్యాలెన్నో పాతుకపోయాయి. ఆ పునాదులనుంచే సాహిత్యం అంకురిస్తూ వచ్చింది. ఇదంతా నా రచనల వెనుక ప్రభావం చూపిస్తూ వచ్చింది.

తెలుగులో ఇతిహాస కావ్యాలుగా వచ్చిన మీ ఆధునిక మహాభారతం, జనవంశమ్ కావ్యాలు ఏం చెప్పదల్చుకున్నాయి?

"లేస్తోంది ఉషః కాంతుల్లో నుంచి ఒక హస్తం. ఆ హస్తం నిరంతర శ్రామికుడి సమస్తం"- అంటూ సాగే కావ్యరూపమే 'నా దేశం నాప్రజలు'అనే ఆధునిక మహాభారతం. నేను అనేక కావ్యాలు రాయలేదు. రాసింది ఒకే కావ్యం దాని పేరు 'నా దేశం నా ప్రజలు' దాని వర్తమాన రూపాంతరమే ఆధునిక మహాభారతం. ఈ కావ్యం యొక్క భావాలు అప్పుడప్పుడూ రాస్తూ వచ్చాను.

ఈ ఆధునిక మహాభారతానికి 'జనవంశమ్' అనుబంధకావ్యం. దీనితో నా కావ్యయాత్ర ముగిసింది. ఈ కావ్యం తయారుచేసే అవకాశం నాకు లభించడం నా జీవితాన్ని నా ప్రజలకు సమర్పించే అవకాశంగా అదృష్టంగా భావిస్తాను.

వర్గచైతన్యం జ్వలింపచేయడమే ఈ కావ్య హృదయము. వ్యాస మహాభారతం రాజుల భూమి కోసం జరిగిన యుద్ధమైతే ఇది కూడా సామాన్య ప్రజానీకం భూమినిపొందడంకోసంచేసే యుద్ధాన్నే చెబుతుంది. దీన్ని చదవడంవల్ల మనిషి మనిషిగా మారతాడు. భూగోళానికి ఇరుసు అవుతాడు.

వాల్మీకి... గురించి మీ రచనలు వచ్చాయి. వారిని స్ఫూర్తిగా తీసుకున్నారా?

వాల్మీకి లోకప్రియ సాహిత్య సృష్టికోసం మార్గాన్వేషణ చేసిన ఆ కాలపు ఆదిమ పురుషుడు. సామాన్య ప్రజానీకానికి జ్ఞానబోధ అందించిన మహానుభావుడు. వాల్మీకిని చదవడం నాకెంతో ఇష్టం. ఏదైనా మంచి సాహిత్యం పఠించాలనుకున్నప్పుడు వాల్మీకి రామాయణాన్ని అందుకుంటాను.

వచ్చివాలిన ఒక రంగులపక్షి. రెండు రెక్కలు ఒక గొంతు. ఇంతేదాని సంపద అంతా కలిసి. ఎవరైనా ఆ పక్షిని చేత్తో పట్టుకుంటే తెలుస్తుంది దాని పిడికెడు శరీరం. ఇలా గజల్ తయారవుతుంది.

"గోలుకొండ నిషానయిన కోహినూరు
కన్నచోట
ప్రేమ కు ఝుండా మాదిరి చార్మినార్
ఉన్నచోట
యీ నగరం జాబిల్లి దక్కేను ప్రేమాగల్లీ"



1995లో రాష్ట్రీయ ఏక్తాపురస్కార్ స్వీకరిస్తున్న శేషేంద్ర శర్మ

'ఈ నగరం జాబిల్లి' కావ్యం గజల్ ప్రక్రియపై రాయడానికి కారణం?

ఒక శోకం నుంచి, ఒక మోహమాటం నుంచి, ఒక భయంనుంచి పుట్టిందే ఈ గీతికావ్యం. రాజ్‌కుమారి ఇందిరాధన్ రాజ్‌గారి ప్రోత్సాహంతో తయారైంది. 1984లో శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు నా చేత గజల్ వ్యాసాలు రాయించారు. అందుకే ఆ పుస్తకాన్ని వారికే అంకితమిచ్చాను.

గజల్ వాస్తవంగా పాడేపాట. పుస్తకాల్లో చదువుకునే తెలుగు వచన కవితలాంటిది కాదు. గజల్ పాడడానికేరాయబడుతుంది.గజల్ ఆయస్కాంత విద్య. వెచ్చని చలి మంటలాంటిది. గజల్ చేతిలోకి

అలాగే గజల్ లక్షణాలను కూడా ఈ కావ్యం వివరిస్తుంది. తెలుగులో ఇలాంటి రచన అరుదైనదే. అప్పట్లో పలువురు దీన్ని ప్రశంసించారు.

సాహిత్యానికి అవార్డులు అవరోధంగా మారుతున్నాయా? అభినందనలుగా వుంటున్నాయా? అవార్డులపై మీ అభిప్రాయం ఏమిటి?

అవార్డుల మీద మొదటినుంచీ నాకు నమ్మకంలేదు. అవి వస్తేరావచ్చు. రాకుండానూపోవచ్చు. అంతమాత్రాన వాటికోసమే మనం రచనలు చేస్తున్నట్లు కాదు. మన రచనల్ని ప్రజలు గుర్తిస్తేచాలు అంతకంటే గొప్పపురస్కారాలేముంటాయి?



1993లో ప్రొఫెసర్ వి.ఎన్.మిశ్రా నుంచి సుబ్రహ్మణ్య భారతి అవార్డును అందుకున్నప్పటి చిత్రం

రాజకీయాలు చేసి అవార్డులు సంపాదించడం నాకిష్టంలేదు. రాజకీయ నాయకుల వెనుక తిరిగి తాయిలాలుగా సంపాదించే అలాంటివి నాకు వద్దు. అవార్డులు అభినందనల స్థాయిదాటి అవరోధాలుగా మారిపోతున్నాయి. సాహిత్యానికి అవార్డులెందుకోకూడా నాకు అర్థంకాదు. ఇలాంటి వాటిని రద్దు చేయాలని కోరుతూ నేను గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి సూచన కూడా చేశాను.

అధికారం కోసమో ప్రభుత్వాల కోసమో, అవార్డుల కోసమో రచనలు చేయాల్సిన అవసరంలేదు. ఆత్మసంతృప్తి ముఖ్యం. దాన్ని మనం పొందగలిగి, ప్రజల మన్ననలు పొందగలిగితే రచన పరమార్థం నెరవేరినట్లే. నేను అవార్డులను కొన్నిసార్లు కాదనలేక తీసుకున్నా చాలాసార్లు తిరస్కరించాను.

సాహిత్యాన్ని పదవులపైకిఎక్కడానికి నిచ్చెనగా వాడుకోవడం కంటే అలాంటి సాహిత్యాన్ని సృష్టించకుండా వుండడమే ఉత్తమం.

'నేను కలమెత్తితే నాకు ఒక దేశపు జెండా కున్నంత పొగరుందని' మీరు అనడం పలు వివాదాలకు కారణమైంది. దీనిపై మీ స్పందన ఏమిటి?

కవి తనలో తాను ఎంతో సంఘర్షణపడితే తప్ప ఉట్టిగానే సాహిత్యం పుట్టదు.అంతఃప్రేరణ కల్గాలి. అప్పుడే హృదయం స్పందిస్తుంది. ఆ స్పందన నుంచే కవిత్వం జీవంపోసుకుంటుంది. మంచు కొండలా వున్నా, మండేకొండలా వున్నా అలాంటి సాహిత్యమే కాలంతో పోటీపడి నిలుస్తుంది.

సవాళ్ళనుంచి, సంక్షోభాలనుంచి, సమస్యల నుంచి, సందేహాల నుంచి సమాధానంగా పుట్టేదే నిజమైన సాహిత్యం.కవిత్వమంటే బలమైన ఆయుధమని నేను ముందే చెప్పాను.

నేను కలంపట్టినప్పుడు నాకు దేశపు జెండాకున్నంత పొగరుందని అనడం నాభావావేశం.దాన్ని కూడా విమర్శించే వారికి నేనేం చెప్పగలను?వాళ్ళు అంతే అలా విమర్శిస్తూనేవుంటారు.చివరికి వాళ్ళకి విమర్శలే మిగుల్తాయి. కవిత్వం రాస్తున్నప్పుడు ఒక ప్రత్యేకస్థితిలోకి వెళ్ళి ఆవేశంతో రాస్తాం. అందుకే ఆ పదాలు ప్రాణంపోసుకొని పటిష్టంగా నిలిచిపోతాయి. అంతమాత్రాన అందులో ఆవేశమే తప్ప ఆలోచన వుండదంటే ఒప్పుకోను.

నా కవిత్వాన్ని జనం సరిగ్గానే అర్థం చేసుకున్నారు. ఆ ఆత్మసంతృప్తిచాలు. అంతకంటే నేనేం కోరుకోవడం లేదు. ఆ వాక్యాలు ఎందరికో స్ఫూర్తినిచ్చాయని నాకెన్నో ఉత్తరాలురాశారు. ఎన్నో సభల్లో, సాహిత్య సమావేశాల్లో ప్రజలే ప్రత్యక్షంగా నన్ను ప్రశంసించారు.అభినందనలు అందజేశారు. ఇక విమర్శలతో అవసరంలేదు.

రాజకీయాలపై మీ అభిప్రాయం?

ఏదో ఒకసిద్ధాంతాన్ని కార్యరూపం చేయడానికి చేసే ప్రయత్నమే నా దృష్టిలో రాజకీయం. ఇప్పుడు రాజకీయాలు బురదలా తయారయ్యాయి. సిద్ధాంతం కూడా లేకుండానే పార్టీలు మనుగడ సాగిస్తున్నాయి. ఏదో విధంగా ప్రజల్ని మోసంచేసి, అధికారం అందుకోవాలనే ఆశమీద ధ్యాసేతప్ప సరైన పరిపాలన మీద, సామాన్య ప్రజల కష్టాలమీద రాజ



1995లో ప్రొఫెసర్ యు.ఆర్. అనంతమూర్తి చేతుల మీదుగా సాహిత్య అకాడమీ అవార్డును అందుకుంటున్న శర్మ

కీయ పార్టీలకు ఎలాంటి అభిప్రాయాలూ వుండడంలేదు. ఎంతసేపూ అధికారం మీదనేగురి.

కవి సమాజంలో పెరిగిపోతున్న రాజకీయ అనైతికతను, అవినీతిని వ్యతిరేకించాలి.సమస్త మానవ జాతి జీవితంపట్ల కవికి బాధ్యత వుండాలి. ఇది రాజకీయ పరమైన బాధ్యతకంటే గొప్పది.

"కవితా చైతన్యం ఒక విరాట్ స్వరూపమయితే రాజకీయ చైతన్యం దాని వెంట్రుక ముక్క" అని నా మేనిఫెస్టోలో రాశాను.

మన కళ్ళు సూర్యోదయం కోసం తహతహలాడుతూ ఎదురుచూసే తరుణంలో తెల్లవారుజామునే రెండుముఖాలు కనిపిస్తాయి. అందులో ఒకడు బుడబుక్కలవాడు, మరొకడు పాములవాడు. వీళ్ళకోసం కాదు మనం ఎదురుచూసేది. వీళ్ళ మీద పేడనీళ్ళు చల్లండె. మన ఎదురుచూపు సూర్యోదయం కోసం అని మరచిపోకూడదు. ఇదే నేను రాజకీయాలకు ఇచ్చే నిర్వచనం. 'నా కవిత్వం ఏ జెండాను ఎగరెయ్యదు. కానీ నా చేతులు నా దేశపు ఖడ్గాలు' అని గొరిల్లాలో రాశాను.

జీవితానికి మీరిచ్చే నిర్వచనం?

జీవితం ఒక యాత్ర. యాత్ర అనేక మజిలీల ప్రయాణం. మనిషి జీవితంలో సుఖాలకంటే దుఃఖాలేఎక్కువ. కంటికొసన ఒక అశ్రువు నిలిస్తేనే జీవితం నీతో హృదయం విప్పి మాట్లాడుతుంది. జీవితం బ్రహ్మాండమైన రథచక్రానికి కట్టి ఈడ్చుకొని పోతుంటే మనమెంత నిస్సహాయులమో బోధపడుతుంది. జీవితం మనం అడక్కుండా వచ్చిన ఒక సంగరం. కవి తన జీవితకాలంలో అనేక

కావ్యాలు రాయడు. కవి ఒకేమనిషి. ప్రవహిస్తున్న ఒకే జీవితం జీవిస్తాడు.

అలాగే ఒకే కావ్యం రాస్తాడు. కవి కావ్యయాత్ర అనేక కృతుల సాముదాయక స్వరూపం. దీన్ని అప్పుడప్పుడూ క్రమక్రమంగా రాస్తూవుంటాడు. అలా రాయబడే ఒక్కోకృతి వాస్తవంగా పూర్ణకృతి కోసం పుట్టే ఒక్కోపర్వం. కావ్యయాత్ర అంతిమ చరణంలో అన్ని పర్వాలూ కలిపి ఒక్క కావ్యం మాత్రమే అవుతుంది. ఇదే నేను ఆధునిక మహాభారతంలోనూ చెప్పాను.

గంగానది మొదట ఒక దేవత/ తర్వాత ఒక పడవల రస్తా/ ఆ తర్వాత మన పొలాల్లోకి ప్రవహించే పంటకాలువ/చూశావా దేవతల రూపాలు కూడా/ కాలం చేతుల్లో ఎలామారిపోతాయో/ ఇవాళ మనటమంతా ఈ నదిలో/మునిగిపోతే మునిగిపోవచ్చుగాక/ కానీ మరచిపోకు రేపు ఈ నదే/ సముద్రంలో మునిగిపోయే రోజురాక పోదు/ జీవించడంలోనే జీవితమంతా/ఖర్చుచేసి అలసిపోయాడు/ వర్తమానంలోంచి చరిత్రలోకి వలస పోయాడు. అంటూ రాశాను.

సాహిత్యానికి సమాజాన్ని సంస్కరించే సత్తా నిజంగా వుందంటారా?సాహిత్యం సమాజాన్ని మార్చగలుగుతుందా?

సాహిత్యం ప్రచండమైన శక్తిని తనలో నింపుకొంది. సమాజాన్ని మార్చేశక్తి సాహిత్యానికి మాత్రమే వుంది. చేతివేళ్ళను పిడికిళ్ళుగా మార్చి చైతన్యాన్ని ఇచ్చే ఆవేశాన్ని సాహిత్యమే అందిస్తుంది. వ్యవస్థలో వచ్చే ఉద్యమాలకు ఊపిరిపోసేది సాహిత్యమే. సాహిత్యంనుంచే సమాజంజీవంనింపుకుంటుంది. సమాజం ఎప్పటికప్పుడు ఎలా నిర్మితమయితే బాగుంటుందో, ఎలాతీర్చిదిద్దబడితే ప్రజలంతా సుఖసంతోషాలతో వుండి సమసమాజం తయారవుతుందో సాహిత్యం విశ్లేషిస్తుంది.

ఆ మార్పుల్ని ముందే ఆశిస్తుంది. కోరుకుంటుంది.అనంతరం ఆ దశల్ని సమాజం అందుకోవడానికి, ఆస్థాయికి చేరుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ మార్పులకి కీలక కారణం సాహిత్యమే కదా!

ఇలా సమాజ నిర్మాణంలో సాహిత్యం అత్యంత కీలకపాత్ర పోషిస్తూ వస్తుంది. ఇది చరిత్ర పరిణామక్రమాల్నిచూసే మరింత దృఢంగా విశదమౌతుంది.

చలం పై మీ అభిప్రాయం?

ఆయన నైతికంగా నిర్భయుడు. అందుకే ఆయన ఎలా అయితే సమాజాన్ని చూశాడో అదే ధైర్యంగా తన రచనల్లో అందించగలిగారు. ఎవరో చదివి ఏదోఅనుకుంటారని తనలోనే తన భావాల్ని దాచేసుకోలేదు. చెప్పదల్చుకున్నదేదో సూటిగా చెప్పడమే చలం రచనా విధానం. చలం స్వతంత్ర భావాలుండే వ్యక్తి. కథారచనలో ప్రవీణుడు.

ఒక్క సినిమా పాటతోనే ఆగిపోయారు... తర్వాత రాయలేదు. ఎందుకని?

'ముత్యాల ముగ్గు' సినిమా మా 'గ్యాన్ బ్యాగ్ ప్యాలెస్'లోనే చేశారు. ఆ సందర్భంలో వాళ్ళు కోరడంలో 'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది. కన్నుల్లో నీరు తుడిచి కమ్మటి కల ఇచ్చింది' అనే పాట ఇచ్చాను. అంతే ఆ తర్వాత ఆ ప్రయత్నాలేవీ చేయాలనిపించలేదు.

పరిశ్రమలో అసూయ పెరిగింది. దాంట్లో నేను జోక్యం చేసుకోవడం ఎందుకు అనిపించింది. నైతికంగా పతనమైనచోట పాట బతకలేదు. అలాంటి విలువలు లేనిచోట దాన్ని వుంచడం ఎందుకు? అందుకే వాటికి దూరమయ్యాను.

నేను చెప్పదల్చుకున్న విషయాన్ని కవిత్వంలోనే చెప్పడంనాకిష్టం.కవిత్వం స్వచ్ఛమైంది.దాని స్వరూపాన్ని, స్వభావాన్ని, స్వచ్ఛతను నాకిష్టంలేని రంగంలోకి తీసుకెళ్ళడం నాకే నచ్చలేదు. అలా సినిమా పాటల జోలికిపోలేదు.

ఎమర్జెన్సీ రోజుల గురించి...

అవి చీకటి రోజులు. ఎంతో హింస జరిగింది. కవిగా స్పందించాను. కావ్యం తీసుకొని వచ్చి నా స్పందన తెలియజేశాను. 'గొరిల్లా' ఆ భయంకర కాలానికిపుట్టిందే.దాన్నిండా ఆమచ్చలు,గాయాలు కుప్పలు కుప్పలుగా ఆవిష్కారం అవుతాయి.

కొత్తతరం కవులకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

కవిత్వం రాయండి. సాదా సీదాగా కాదు. బలమైన వాదంగా రాయండి.మనసమాజంలోరెండు వర్గాలున్నాయి.ఒకరు పీడితులు. మరొకరుపీడకులు. ఈసమాజం బాగుపడాలంటే పీడితుల్లేకుండా నిర్మితమయ్యే సర్వసమాన మానవ సమాజాన్ని తయారు చేయాలి. దానికి సాహిత్యాన్ని ఆయుధంగా కవులందరూ స్వీకరించాలి. పీడకుల్ని పెకలించి పీకెయ్యాలి. అప్పుడే మనం కోరే వ్యవస్థ సాధింపబడుతుంది.

ఆర్థిక సమానత్వ సాధనకు ఏకైక మార్గం విప్లవం. అది కేవలం సాహిత్యం ద్వారానే సిద్ధిస్తుంది.ప్రజలంతా ఏకమై తిరుగుబాటుచేసే స్థాయిలో సాహిత్యం చైతన్యం తీసుకురావాలి. ఈ వ్యవస్థను సంస్కరించడానికి సాహితీకారులు ఉద్యమించాలి.

పీడితుల పక్షంవైపునుంచి ఈ ఇతివృత్తంతో కవిత్వం రాయాలి. రావాలి.అప్పుడే మనం కలలుకనే వ్యవస్థ మనకు అంది వస్తుంది. కొత్తతరం కవులు కూడా ఈ దిశగానే కలాల్ని కదిలించాలని నేనుకోరుకుంటాను. అదే నేను వారినుంచి కోరేది. వారికి సూచించేది.

కవి కీర్తి ఎప్పుడూ లాభం కాదు. మంచి పనులు చేయడం ఒక లాభం కోసంకాదు. ఎన్నో మంచి పనులు చేసిన జీసస్ ఏ లాభం పొందాడు? కవి కూడా ఒక క్రీస్తు అని భావించండి. దానికి సిద్ధంగా వుండండి. ఆ తర్వాతేకలంపట్టండి.కొత్తయుగం తీసుకొస్తాననుకుంటే పూలదండలతో ఆహ్వానాలు ఎదురవుతాయనుకోకండి. 'నీవు పెరిగి పెద్దవాడివైతే ఈ మిద్దెలు, మేడలు, అసెంబ్లీలు, అకాడమీలు నీ నడుం ఎత్తుక్కూడా రాలేవు' అని రాశాను. యువకవులతరం దీన్ని గుర్తించుకోవాలి.

చివరికి ఎలాంటి సాహిత్యం చిరస్థాయిగానిలుస్తుంది?

ప్రజల్ని చైతన్యవంతం చేసే సాహిత్యం ఏదైనా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగానే నిలిచి వుంటుంది. మనం ఏదైతే చెప్పాలనుకుంటామో దాన్ని మనకంటే గొప్పగా పూర్వులు ఎప్పుడో రాశారు. రాయడానికి మిగిలిందేదో వెతుక్కోవాలి. ఎందరో చచ్చారు. మరెందరో పుట్టారు. జీవం నిండిన సాహిత్యమే నిలబడుతుంది. జీవితానుభూతి మరింత పదునెక్కాలి. అప్పుడే జీవం నిండిన సాహిత్యం పుట్టుకొస్తుంది. అదే నిలుస్తుంది.

చివరగా...!

శేషేంద్ర ఒక నినాదం. ఉద్యమం. విప్లవం.చైతన్యం. విప్లవ భావజాల దార్శనికుడు. 74 ఏళ్ళ వయసులోనూ ఆయన అలసిపోని సాయుధుడుగా సాహిత్య స్వాప్నికుడుగానే కనిపిస్తారు. అనర్గళంగా, ఆవేశంగా, వయసు భారంమోస్తూనే సుదీర్ఘ సమాచారం అందించే శేషేంద్ర తెలుగు సాహిత్యకీర్తిని అంతర్జాతీయ పీఠమెక్కించిన ఐతిహాసికులు.వారికి కృతజ్ఞతలు. అభినందనలు.

వేంపల్లి గంగాధర్

శేషేంద్ర సాహిత్యం

కవిత్వం

ఋతుఘోష
గొరిల్లా
సముద్రం నా పేరు
నేనూ నా నెమిలి
చంపో వినోదిని
నా రస్తా
పక్షులు
ప్రేమలేఖలు
నీరై పారిపోయింది
రక్తరేఖ
మండే సూర్యుడు

విమర్శ

షోడసి
స్వర్ణహంస
సాహిత్యకౌముది
సీత
వార్షిక చర్చ
అలంకార చర్చ
రిలేషన్ షిప్ ఆఫ్ మేఘదూత్- విత్ రామాయణ (ఆంగ్లం)


వ్యాసాలు

నరుడు-నక్షత్రాలు
ఊహలు
విశ్వవివేచన

లేఖలు

ఇన్ డిఫెన్స్ ఆఫ్ పీపుల్ అండ్ పొయిట్రీ (ఆంగ్లం)

జ్ఞానపీఠంపై భరద్వాజుడు





డా॥ రావూరి భరద్వాజను అభినందిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి


తెలుగు సాహిత్యానికి వెలుగు భారతీయ సాహిత్యరంగంలో అత్యున్నత పురస్కారం జ్ఞానపీఠం. 2012 సంవత్సరానికి తెలుగు సాహిత్యం నుంచి డాక్టర్ రావూరి భరద్వాజ ఎంపిక అయ్యారు. పాతిక సంవత్సరాల తర్వాత ఈ పురస్కారం మళ్ళీ తెలుగు తేజానికి దక్కింది.

తెల్లటి పంచె, లాల్చీ, తెల్లగా నెరసిన గడ్డంతో ఒక యోగిలా కన్పించే 86 సంవత్సరాల రావూరి భరద్వాజ ఇప్పటివరకు 37 కథా సంపుటాలు, 17 నవలలు, బాలసాహిత్యంలో 11 సంపుటాలు, 3వ్యాస సంకలనాలు, 8 నాటకాలు తెలుగుసాహిత్యానికి తన కానుకగా అందించారు.

ఏడు దశాబ్దాలుగా సాహితీసేద్యం చేస్తున్న రావూరి భరద్వాజను ఈ సందర్భంగా 'స్వాతి' ప్రత్యేక ఇంటర్వ్యూ చేసింది. కేంద్రసాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డా॥ వేంపల్లి గంగాధర్ మీకందిస్తున్నారు.

భారతీయ సాహిత్యరంగంలో అత్యున్నత పురస్కారం - జ్ఞానపీఠాన్ని విశ్వనాథ సత్యనారాయణ 'రామాయణ కల్పవృక్షం' *(1970)*, డాక్టర్ సి.నారాయణరెడ్డి 'విశ్వంభర' *(1988)* తర్వాత పాతికసంవత్సరాల సుదీర్ఘసమయం తర్వాత జ్ఞానపీఠ పురస్కారంపొందిన మూడవ తెలుగుసాహితీవేత్తగా... ఈ సందర్భంగా మీ స్పందన...

నేనొక నిరాడంబరమైన వ్యక్తిని. కలలో కూడా నేను ఎప్పుడూ ఊహించలేదు.కాసేపు ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత ఉత్సాహం కమ్ముకొచ్చింది. నిజ



డా॥ రావూరి భరద్వాజకు జ్ఞానపీఠ్ అవార్డ్ తెచ్చి పెట్టిన నవలారాజం

మేనా? అనికూడా అనిపించింది.

న్యూఢిల్లీనుంచి ఫోన్‌వచ్చింది. విషయం తెలుసుకుని ఆనందపడ్డాం. నా జ్ఞాపకాలో,గాయాలో ఏవో రాసుకుంటూ ముందుకెళ్ళాను.

అవార్డుల్ని, పురస్కారాల్ని దృష్టిలో ఉంచుకుని రచనలు రాయలేదు. రాయలేను. నేను నిస్సహాయుడ్ని. ఆకలి ఆర్తనాదం ఏమిటో తెలిసినవాడిని. నాకిప్పుడు 86 సంవత్సరాలు నిండాయి. ఇప్పటికైనా ఇస్తున్నందుకు సంతోషపడదాం. రాలేదని ఆవేదన చెందడానికంటే అదే మంచిదికదా! పాతిక సంవత్సరాల తర్వాత తెలుగువారి సాహితీ కృషికి దీన్ని గుర్తింపుగానే భావించాలి అనుకుంటున్నాను.

'జీవితం' ఏం నేర్పింది...

నా మొదటి తల్లిపేరు - లేమి (దరిద్రం), నా రెండవ తల్లిపేరు- కాంతం (భార్య) అని నేనెప్పుడూ చెబుతూ ఉంటాను. ఈ ప్రపంచం నుంచి అనేక విషయాలు తెలుసుకున్నాను. తెలుసుకుంటూనే ఉన్నాను. జీవితం ఎన్నో చేదునిజాలు చూపించింది. చూపిస్తూనేవుంది.

తపన ఉంటే దేనినుంచైనా, ఎవరినుంచైనాసరే నేర్చుకోవచ్చు. ఏది చేయాలో ఉత్తములనుంచి, ఏది చేయకూడదో ఉత్తమేతరులనుంచి తెలుసుకున్నాను. ఇప్పటికీ నన్ను నేను అన్వేషించుకుంటున్నాను... ఎప్పటికప్పుడు తెలిసినట్లే ఉండి, అసలేమీ తెలియకపోవడం జీవితం నేర్పే పాఠం.

మీ బాల్యం ఎలా గడిచింది...

అప్పటి కృష్ణాజిల్లా, గతంలో హైదరాబాద్ స్టేట్‌లో భాగమైన పరిటాల జాగీరులోని 'మోగులూరు' గ్రామంలో బాల్యం సాగింది.

1927 జూలై 5వ తేదీన పుట్టాను. నాన్నగారు రావూరి కోటయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. అమ్మ మల్లికాంబ. ఊర్లోని ఇరవై ఎకరాల భూమి హరించుకొనిపోతే ఇక చేసేదేం లేక గుంటూరు జిల్లాలోని తాడికొండకు వలసపోవాల్సివచ్చింది.

చిన్నప్పటినుంచి చదువుకు ఎందుకు దూరంగా పారిపోయారు...

అక్షరాలంటే ప్రాణం. చదువంటే ఎంతో ఇష్టం. 'తాడికొండ'లోనే చదువు సాగుతున్నప్పుడు ఏవేవో పరిస్థితులు అనుకూలించకుండాపోయాయి.

ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు బడిలో ఏదో గొడవ. మాటామాటా వచ్చింది. ఏదో అవమానం జరిగినట్లు అన్పించింది. చిన్నవయస్సుకదా భరించలేకపోయాను. పుస్తకాల సంచీ హెడ్‌మాస్టర్‌ముఖాన విసిరేసి బడినుంచి పారిపోయాను.

ఇంట్లోవాళ్ళకు నా పని నచ్చక మండిపడ్డారు. బలాదూరుగా తిరుగుతున్నానని ఇక ఇంటికి రావద్దని కూడా చెప్పేశారు.

దీంతో ఎన్నెన్నో వ్యవసాయ పనులు చేయాల్సి వచ్చింది. పశువుల కాపరిగా, కమ్మరిదగ్గర గాలి తిత్తులు ఊదుతూ, సమ్మెటకొడ్తూ, కలప అడితిలో రంపం కోస్తూ పనులు చేస్తూ జీవితం గడిపాను.



కుటుంబసభ్యులతో శ్రీ రావూరి భరద్వాజ

రాయాలని ఎందుకనిపించింది... ఎప్పటినుంచి రాస్తున్నారు...

మా ఊర్లో 'కొల్లూరి వెంకటేశ్వర్లు' వల్ల పుస్తకాలు చదవాలనే అభిరుచి ఏర్పడింది. నెలకు నాలుగణాలు చందా కట్టి మరీ నాకు గ్రంథాలయానికి వెళ్ళే ఏర్పాటుచేశాడు. పగలంతా కూలిపనికి వెళ్ళేవాడిని. రాత్రిపూట వెన్నెలకింద పుస్తకపఠనం. దినచర్యగా మారిపోయింది.

అవి రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైన రోజులు. నాకప్పటికి 17 సంవత్సరాలే. అయినా 18 అని అబద్ధం చెప్పి మిలటరీలో చేరాను.

1945లో యుద్ధం పూర్తికాగానే మళ్ళీ బతుకు మొదటికొచ్చింది. అంతకుముందు కొన్నిసార్లు నాటకాలు వేసిన అనుభవం ఉంది. 1946లో నెల్లూరుకు చేరుకున్నాను. ఆచార్య రంగాచారి గారి సిఫార్సుతో 'జమీన్‌రైతు'లో చేరాను. 'ఆత్రేయ'తో పరిచయం ఏర్పడింది. నా కవిత 'బక్కిడొక్క'ను వారే ప్రచురించారు మొదటిసారిగా!


'రోహిణి' ఎవరు... ఏమిటా ప్రేమకథ...

అప్పట్లో నేను 'దీనబంధు' వారపత్రికలో పని చేసేవాడ్ని. ఆకర్షణనో, ప్రేమనో తెలియదు కానీ ఇష్టమైతే ఉండేది. ఆమెకు ముందూ, వెనుకా ఎవరూ ఉన్నట్లు లేదు. పెళ్ళి చేసుకోవాలని కూడా అనుకున్నాను. కులాంతర వివాహమే. కుదర్లేదు. దాంతో నెల్లూరు వదిలేశాను. కానీ రోహిణి నా తలపుల్లో ఎప్పుడూ ఉండేది. దాన్నుంచి బయట పడలేక అప్పుడు రాసిన అన్ని కథల్లోనూ తానే నా హీరోయిన్. నీలికలువలు, పంకజం, కలియని బాటలు... వంటి కథలన్నీ అలా రాసినవే. 'రోహిణి' పేరుతో కొంతకాలం ప్రచురణసంస్థను కూడా నడిపాను. అది ఆమెపట్ల నా ఆత్మీయత.

అలాగే 'కొల్లూరి వెంకటేశ్వర్లు' పట్ల కూడా కృతజ్ఞత చూపించారు కదా!...

నాకు ఎంతో మేలుచేసిన మంచిమనిషి. ఆత్మీయతకు అద్దంలాంటి వ్యక్తి కొల్లూరి వెంకటేశ్వర్లు గారు. నేను లైబ్రరీలో పుస్తకాలు చదువుకోవడానికి ఎంతో సహాయమందించాడు.

నాకు అభిమానం, అనురాగం ఎక్కువ.అందుకే



తన అర్ధాంగి కాంతమ్మ జ్ఞాపకాలతో రాసుకున్న ఓ స్మృతికావ్యం

మర్చిపోకుండా ఆ కృతజ్ఞతను 'పాకుడు రాళ్ళు' నవల వారికి అంకితమిచ్చి కొంత తీర్చుకున్నాను. ఇప్పుడు నాకు మరింత తృప్తిగా ఉంది.

1944 ప్రాంతంలో నేను రచనలు ప్రారంభించిన కొత్తలో నా ముఖ్యశ్రోత కూడా వారే!

మీ పెళ్ళిముచ్చట్లు...

పత్రికల్లో పనిచేసుకుంటూ అటూ ఇటూ గాలికి తిరుగుతూవుండే వాడికి పిల్లను ఎవరిస్తారు? చివరికి పెద్దవాళ్ళు ఏదో మాట్లాడి పెళ్ళిచేయాలని నిర్ణయించారు. తోటరావులపాడు వాసి మేడూరి మల్లయ్య రెండవ కూతురు కాంతంతో 1948 మే నెలలో పెళ్ళి జరిగింది.

సినిమారంగం రచనలోకెలా అడుగు పెట్టారు.

తెనాలినుంచి మద్రాసుకు వెళ్ళిపోయాను. అక్కడ 'చందమామ' పిల్లలపత్రికలో పనిచేశాను. తర్వాత 'అభిసారిక', 'జ్యోతి', 'చిత్రసీమ' పత్రికల్లోకి మారాను. సినిమా వార్తలకోసం స్టూడియోల చుట్టూ తిరిగేవాడ్ని.

సినిమా పరిశ్రమలోని వాతావర ణం నాలాంటి వాడికి సరిపోదని అర్థమైపోయింది. ఇమడలేకపోయాను. వద్దనుకున్నాను. వదిలేశాను.

రత్నంగారి కలాల కంపెనీలో పనిదొరికిందికానీ మద్రాసులో బతకలేనని నిర్ణయానికి వచ్చేశాను. హైదరాబాదుకు ఇక్కడినుంచి బయలుదేరాను.

మీ తొలికథ...

అచ్చులో వచ్చిన నా తొలి కథ 'విమల' 1946 ఆగష్టు ఆఖరివారం 'ప్రజామిత్ర' సంచికలో ప్రచురితమైంది.

మీ తొలి పుస్తకం...

'రాగిణి' నా తొలిపుస్తకంగా వేశాం. అప్పుడు ఈ పుస్తకానికి చలం పరిచయం రాశారు. అదే అప్పట్లో పెద్ద విశేషం. చర్చ.

మీ రెండవ పుస్తకం 'కొత్త చిగుళ్ళు' 'చలం'కు అంకితమిచ్చారు. కారణమేమిటి?

అవును. చలంను బాగా చదివాను. ఎలాగైనా కలవాలనుకున్నాను. వెతుక్కుంటూవెళ్ళి పరిచయం చేసుకున్నాను. నా మొదటి పుస్తకానికి చలంతో ముందుమాట రాయించుకోవాలని ఆశపడ్డాను. వారు నన్ను ప్రోత్సహిస్తూ 'రాగిణి'కి పరిచయం రాసివ్వడంతో వారికి కృతజ్ఞతగా నా రెండవ పుస్తకం 'కొత్త చిగుళ్ళు' అంకితమియ్యాలని నిర్ణయించుకున్నాను.

నాటకరంగంలోనూ మీకు అనుభవం ఉంది కదా! ఆ విషయాలు...

తాడికొండలో ఉండే రోజుల్లో, కొంతకాలం నాటకాల్లో తిరిగాను.

'బాల భారతీ నాట్యమండలి' నాటకసంఘంలో సభ్యుడిగా ఉండేవాడిని. నా మిత్రుడు పందిటి రామచంద్రరావు తోడుగా ఉండేవాడు.

'చింతామణి', 'తులాభారం', 'గయోపాఖ్యానం', 'సరోజముఖి', 'ఉద్యోగవిజయాలు', 'భక్తసిరియాళ' నాటకాలు చుట్టుపక్క ఊర్లన్నీ తిరుగుతూ ప్రదర్శించేవాళ్ళం.

తర్వాత కొంతకాలానికి ఆ సమాజం మూతపడింది. మిత్రులు కొల్లూరి వెంకటేశ్వర్లు, బి.వీరయ్య గార్లూ, వచ్చి ప్రోత్సహించి మాతో సాంఘిక నాటకాలు వేయించారు.

'గాంధీమార్గం'ను ఆకాశవాణిలో విస్తృతంగా ప్రచారం చేశారు...

గాంధీ ఆశయాలు శక్తివంతమైనవి. వాటిని 'గాంధీమార్గం' పేరుతో ఆకాశవాణి శ్రోతలకు అందించేటప్పుడు నిదురించిన చైతన్యాన్ని రగిలించినట్లు ఉండేది. ఆ తర్వాత 'జాతీయ జ్యోతి' అనే మరొక కార్యక్రమం కూడా చేశాను.

27 సంవత్సరాలపాటు ఆకాశవాణితో వివిధ కార్యక్రమాలతో అనుబంధం కొనసాగింది.

ఇంగ్లీష్ నేర్చుకోవడంవెనుక ఏదైనా కారణం...

తెనాలిలో ఉండేరోజుల్లో ఇంగ్లీష్‌భాషపట్ల ఆసక్తి కలిగింది. దగ్గర్లోని గుడిలో ప్రతిరోజూ సాయంత్రం నుంచి రాత్రివరకు అదేపనిగా నేర్చుకోవడం మొదలుపెట్టాను. దీపం వెలుగులోనే చాలా భాగం నెట్టుకొచ్చాను. తర్వాత నా రచనలు కూడా ఇంగ్లీష్‌లోకి అనువాదమయ్యాయి.

విమర్శకుల ప్రశంసల్ని కూడా అందుకున్నాయి. కొన్ని రచనలు ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువాదం చేశాను.

మీ జీవితంలో అత్యంత విషాదం... దురదృష్టకరమైన రోజు ఏది...

ఆగష్టు 1వ తేదీ 1986వ సంవత్సరం దురదృష్టకరమైన రోజు. నానుంచి నా కాంతం (అర్ధాంగి కాంతమ్మగారు) దూరమైపోయింది.నా జీవిత భాగస్వామి, నా కంటివెలుగు, నా జీవిత మార్గదర్శిని పోగొట్టుకున్న దురదృష్టకరమైన విషాదాన్ని మిగిల్చిన రోజు. నాకెప్పటికీ చీకటిరోజు.



భరద్వాజ అనువాద గ్రంథం

మీ అర్ధాంగి కాంతమ్మ గారి జ్ఞాపకాలు...

మద్రాసులో ఉన్నప్పుడు అష్టకష్టాలుపడ్డాం. 1956లో అనుకుంటా తన దగ్గరున్న నగలన్నీ అమ్మివేయాల్సివచ్చింది- చివరికి తాళిబొట్టుతో సహా! కాంతమ్మ పసుపుకొమ్ము మెడలో కట్టుకుని తిరుగుతుంటే చూడలేకపోయేవాడిని.

నా వెనుకవున్న గొప్పవ్యక్తి ఎవరంటే నా కాంతం. సహధర్మచారిణి అనే భావనకు రూపం వస్తే అది కాంతమ్మ అవుతుంది. కాంతమ్మ జ్ఞాపకాలతోనే ఐదు స్మృతి కావ్యాలు రాసుకున్నాను.

ఇది ఆమె పెట్టిన దయ. 'నాలోని నువ్వు', 'అంతరంగిణి', 'ఐతరేయం', 'అయినా ఒక ఏకాంతం', 'ఒకింత వేకువ కోసం' వీటన్నింటి వెనుక కాంతమ్మ స్మృతులే ఉన్నాయి.

బ్రహ్మంగారి తత్వాలను అమితంగా ఇష్టపడతారు. ఎందుకు...

సమాజంలో పేరుకుపోయిన మూఢాచార విశ్వాసాల్ని ఖండించిన వైతాళిక యోగి వీరబ్రహ్మం. సర్వమానవ సమతావాదాన్ని బోధించి కుల, మత, వర్ణ, వర్గ విచక్షణ లేకుండా సమాజం నిర్మితం కావాలన్న విప్లవయోగి వీరబ్రహ్మం.

భూత, భవిష్యత్, వర్తమానాలను ఆవిష్కరించిన జ్ఞానబోధకుడు. అందుకే కడపజిల్లా 'బ్రహ్మంగారి మఠం' కు నేనిప్పటివరకు రెండుసార్లు వెళ్ళి ధ్యానం చేసుకుని వచ్చాను.

'సైన్స్ రచనలు' విస్తృతంగా చేశారు...

శాస్త్ర, సాంకేతికరంగాలలో విప్లవాత్మకంగా వస్తున్న మార్పుల్ని ఎప్పటికప్పుడు రాయడానికి ఇష్టపడుతూ వచ్చాను.

1950-52 ప్రాంతంలో 'చిత్రగ్రహణం' అనే పేరుతో అంతరిక్ష విజ్ఞాన రచన చేశాను. ఆ తర్వాత అది ఆంధ్రప్రభలో సీరియల్‌గావచ్చింది.

'డిటెక్టివ్ రచనలు' కూడా చేసినట్లున్నారు...

మొదట్లో బతుకుపోరాటం కోసం ఎన్నో పాట్లు పడుతున్నప్పుడే అవి కూడా రాశాను.

డిటెక్టివ్ రచనల్ని 'రావూరి జయదేవ్' అని పేరు పెట్టుకుని రాసేవాడ్ని.

మీ కలంపేర్లుకాకుండా అసలుపేరు ఏమిటి...

రావూరి శరభాచారి.

మీకిష్టమైన ప్రదేశాలు...

షిర్డీ, బ్రహ్మంగారి మఠం, బాసర.

మీకిష్టమైన రచయితలు...

రవీంద్రనాథ్ ఠాగోర్ రచనలంటే వల్లమాలిన అభిమానం. వారి శైలి, ఇతివృత్తాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి.

తర్వాత గుడిపాటి వెంకటాచలం- రచనలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. శ్రీశ్రీ కవిత్వం చైతన్యాన్ని ఇస్తుంది. మా గోఖలే కథలు ఆర్ద్రతతో ఉంటాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి గీతాలు లలితంగా ఉంటాయి. విశ్వనాథ సత్యనారాయణ... వంటి వారందర్నీ అభిమానిస్తాను.

నేటి ఉద్యమాలపై మీ అభిప్రాయం...

వాటన్నింటి గురించి నాకంతగా తెలియదు. ప్రపంచాన్ని ఉద్ధరించడానికి ఎవరైనా ఏమైనా రాస్తారా? అనేది పట్టించుకోను.

మనుగడకోసం పోరాటంతోనే సరిపోతోంది. నాలుగు మెతుకులు సంపాదించుకుని, కుటుంబ పోషణతో ఆకలిని జయించడానికే కాలం సరిపోతోంది. నిజాయితీగా ఉన్న విషయాన్ని మాట్లాడడానికే నేను ఇష్టపడతాను. అదే రాస్తాను.

'పాకుడురాళ్ళు' ఎటువంటి నేపథ్యంలో రాశారు...

మద్రాసులో ఉన్నప్పుడు 'ధనికొండ హనుమంతరావు'కు సన్నిహితుడైన కొలను బ్రహ్మానందరావు ఆధ్వర్యంలో వచ్చే 'చిత్రసీమ'లో పనిచేశాను.

అప్పుడు రాసే డైరీలోని సంఘటనలతో చిన్న కథ ముందుగా రాశాను. ఆ తర్వాత మల్లంపల్లి సోమశేఖరశర్మ గారికి చూపించాను. దాన్ని పెంచి రాయమని వారే సూచించారు. కృష్ణాపత్రిక 'ముదిగొండ సుబ్రహ్మణ్యశర్మ' గారి కోరిక ప్రకారం ముందు 12 భాగాలుగా రాసిచ్చాను.

తర్వాత కృష్ణాపత్రికలో నాలుగేళ్ళవరకు సీరియల్‌గా రాసుకుంటూ వెళ్ళాను.

'మాయ జలతారు' అని పేరుపెట్టాను. దానిని 'పాకుడురాళ్ళు'గా కృష్ణాపత్రికలో పనిచేసే శీలా వీర్రాజు మార్చాడు.

మహానటి 'సావిత్రి' గారితో మీ కుటుంబానికి ఉన్న అనుబంధం...

మా రెండు కుటుంబాలమధ్య చాలాకాలం నుంచి మిత్రస్నేహబంధాలున్నాయి. కాంతమ్మ గారికి సావిత్రంటే, ఆమె నటనంటే కూడా ఎంతో అభిమానం. తనని 'వదిన' అని సంబోధించేది.



ఆకాశవాణిలోని భరద్వాజ స్నేహితులు

గుంటూరు జిల్లా కోళ్ళగూడెంలోని మంగమ్మ 'మంజరి'గా మారి బొంబాయి సినీప్రపంచంలో అగ్రతారగా వెలుగుతుంది. 'పాకుడు రాళ్ళ'లో సినీలోకంలోని చీకటి వ్యధలకు అక్షరరూపమిచ్చారు. ఎలా అనిపించింది.

మద్రాసు నగరంలో సినీపత్రికల్లో న్యూస్ ఐటెమ్స్ రాసుకుంటూ తిరిగే రోజుల్లో పరిశ్రమలోని వెలుగునీడలూ, కష్టసుఖాలు, ఒడిదుడుకులూ సినిమా వెనుక నడిచే మరొక సినిమాను కూడా నేను బాగా చూశాను. దగ్గరగా చూశాను.

1956 నుంచి నేను డైరీలో రాసుకున్న విషయాలన్నీ ఉపయోగపడ్డాయి. మల్లంపల్లి సోమశేఖరశర్మ సూచన మేరకే 824 పేజీలతో - 'మాయ జలతారు' కథ నుంచి 'పాకుడు రాళ్ళు' నవలగా రూపాంతరం చెందింది. ఆకాశవాణిలో ఆ నవల గురించి తర్వాత ఒక గంట నాటకం కూడా చేశాం.

'పాకుడురాళ్ళు'లో కథానాయిక మంజరి చివరికి ఆత్మహత్య చేసుకునేలా రాశారు...

అలా చాలామంది సినీ హీరోయిన్స్ జీవితాల్ని నిజంగానే మనం చూశాం. మంజరి పాత్ర ఆత్మహత్య చేసుకోకతప్పదు. దాన్ని నేను ముందుగానే దృష్టిలో ఉంచుకున్నాను.

సినీప్రపంచంలో అప్పటికీ ఇప్పటికీ సినీహీరోయిన్స్ విషయంలో వచ్చిన మార్పు ఏదైనా గమనించారా?

నాకైతే ఏమీ కనిపించడంలేదు. చీకటిజీవితాల గురించి నేను కొంతే రాశాను. పరిస్థితులు మారివుంటే 'డర్టీ పిక్చర్' లాంటి సినిమా ఇప్పుడు ఎందుకొస్తుంది. విషాదం నిశ్శబ్దంగా కొనసాగుతున్నట్లే నని చెప్పుకోవచ్చు.

'దినచర్య' రాయడం ఎప్పటినుంచి మొదలుపెట్టారు...

కాంతమ్మ నిర్గమనం నా జీవితగమనాన్నే మార్చివేసింది. ఆమె ఎడబాటుతో ఆవేదనలు, సంవేదనలు, సంక్షోభాలను 'దినచర్య'గా రాయడం అలవాటు చేసుకున్నాను.

1956 జనవరి నుంచి 'దినచర్య' రాయడం ప్రారంభించినట్లు గుర్తు. అది నిరంతరంగా కొనసాగింది. ఆ దినచర్య గ్రంథాలు ఐదు పుస్తకాలుగా వెలువడ్డాయి.

ఆకాశవాణితో మీ అనుబంధం...

1959-75 మధ్య ఆకాశవాణిలో పనిచేశాను. అప్పట్లో 185 రూపాయల జీతానికి పనిచేయాల్సి

వచ్చింది. రచయిత త్రిపురనేని గోపీచంద్ సలహాతో ఆకాశవాణిలో స్క్రిప్ట్ రాయడానికి చేరాను. వారు నాకు అండగా నిలబడి ఎంతో సహాయమందించారు. ఆ కృతజ్ఞతతోనే మా అబ్బాయికి 'గోపీచంద్' అని పేరు పెట్టుకున్నాను.

అయ్యదేవర కాళేశ్వరరావు, త్రిపురనేని సుబ్బారావు, త్రిపురనేని గోపీచంద్‌ల సహాయంతోనే నేను ఆకాశవాణిలో బతకగలిగాను. 'నాకొక విశ్వవిద్యాలయంలా ఎన్నో నేర్పింది ఆకాశవాణి'

ప్రసిద్ధ ఆంగ్ల పాత్రికేయుడు కె.ఎ.అబ్బాస్ రచనను తెలుగులోకి అనువాదం చేశారు కదా! ఆ సంగతులు...

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను అమితంగా ఇష్టపడే పాత్రికేయుడు కె.ఎ.అబ్బాస్ 'Return of the Red Rose' అనే పుస్తకాన్ని రాస్తే దానిని నేనే తెలుగులోకి 'మొగ్గ తొడిగిన ఎర్రగులాబి'గా అనువదించాను. ఒకసారి శ్రీమతి ఇందిరాగాంధీ గారు హైదరాబాద్ వస్తే ఆమెకు ఆ తెలుగు అనువాద ప్రతిని కూడా బహూకరించాను.

మీరు పిల్లలకోసం రాసిన తొలికథ...

పిల్లలకు అర్థమయ్యేలాగా సరళవాక్యాలతో చిన్నపదాలతో రచన చేయాలనిపించి, మొదట నేను ప్రయత్నం చేస్తూ రాసిన కథ 'మణిమందిరం'

ఆ తర్వాత కూడా బాలసాహిత్యంలో విస్తృతంగా రచనలు వచ్చాయి మీనుంచి...

అవును. రాసుకుంటూపోయాను. వైజ్ఞానిక అంశాల్ని పిల్లలకు అర్థమయ్యేలాగా చిన్నకథలుగా మలిచాను. 'బంగారు కుందేలు', 'ఉడతమ్మ ఉపదేశం'తో పాటు 'నిప్పు కథ', 'నీటి కథ', 'గాలి కథ', 'బొగ్గు కథ', 'రబ్బరు కథ'-

'మనిషి కథ', 'స్టాంపుల కథ', 'చెత్తనుంచి విత్తం', 'కాలం కథ', 'నక్షత్రాలు- చిత్రాలు', 'ద్రవ్య ప్రపంచం', 'వినువీధిలో వింతలు', 'ప్లాస్టిక్ ప్రపంచం'... ఇవన్నీ పిల్లలకోసం రాసి వారి హృదయాలను ఆకట్టుకున్నాను.

'జీవన సమరం' మీకు సంతృప్తి ఇచ్చిన రచనగా చెప్తారు. ఎందుకు...

ఎక్కువమంది జీవితాలకు అక్షరరూపం ఇచ్చాను. జీవన చిత్రణకు అద్దం పట్టాను. రచన రాసిపెట్టుకున్నాను కానీ ప్రచురణకు ఎవరూ ముందుకు రాలేదు. ఆ పరిస్థితుల్లో 'ఈనాడు' దినపత్రిక రామోజీరావు ప్రోత్సహించారు.

అందువల్లనే 50-60 వారాలపాటు ఆ కాలమ్ రాయడం వీలైంది. బడుగు జీవులు, మధ్యతరగతివారి జీవితదృశ్య చిత్రణ ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది.

శ్రీశ్రీ, కొకు, బుచ్చిబాబువంటి సాహితీస్రష్టలతో మీకున్న అనుబంధం...

ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు. గొప్పవ్యక్తులతో పరిచయభాగ్యం కల్గడం సుకృతమే కదా! మా ఇంట్లోనే అందరం కూర్చొని సాహితీ చర్చలు చేసేవాళ్ళం! 'దైవ రాజకీయాలు' కథ రాసినప్పుడు 'స్వర్ణకంకణం' అప్పట్లోనే అందుకున్నాను.

మీ విదేశీ పర్యటనలు...

రెండుసార్లు సోవియట్ రష్యాను పర్యటించి వచ్చాను. మొదటిసారి 1984లోనూ, రెండవసారి 1987లోనూ.

మీ 'సశేషం' రచన ప్రత్యేకత ఏమిటి...

గుండెజబ్బు కారణంగా 1977లో ఒకసారి, 1988లో రెండవసారి ఆసుపత్రిలో చేరాల్సివచ్చింది. చావు-బతుకుల మధ్య మనిషి జీవనవ్యథ ఏమిటో గుర్తొస్తుండేది.

ఒక లోలకంలా తిరిగే జీవనగమనానికి సంబంధించిన దృశ్యాలన్నీ 'సశేషం'లో రాసుకున్నాను.

మీ మొదటి పారితోషికం...

ఆంధ్రజ్యోతి మాసపత్రిక వాళ్ళనుంచి అందుకున్నట్లు జ్ఞాపకం.

అదికూడా ఎంతో తెలుసా? ఐదు రూపాయలు. 1947 ప్రాంతంలో అనుకుంటా!



డా॥ రావూరి భరద్వాజ నివాసం

మీరు ఏ ఏ పత్రికల్లో పనిచేశారు...

1946లో నెల్లూరులో 'జమీన్‌రైతు'లో ఉన్నాను. తర్వాత 'దీనబంధు', 'జ్యోతి', 'సమీక్ష', 'అభిలాష', 'చిత్రసీమ', 'సినిమా', 'రేరాణి', 'యువ', 'కృష్ణా పత్రిక'లు.

త్రిపురనేనిసుబ్బారావుగారి సుదీర్ఘమైన ముందుమాటతో మీ 'ఐతరేయం' వచ్చింది... దీని గురించి...

'నేపథ్యం'గా దాదాపు 13 పేజీలవరకు వారు దానికి సంపాదకీయం రాశారు. "భరద్వాజ వాక్యాలు కొన్ని పచ్చిగా ఉంటాయి.

ఇంకొన్ని పచ్చగానూ, వెచ్చగానూ ఉంటాయి. అతని రచనల్లో జనజీవితం కనబడుతుంది. ఆ జీవితంలోని కల్లోల ప్రభంజనమూ కనబడుతుంది" అని చెప్పారు సుబ్బారావుగారు. 'ఐతరేయం' అనే శీర్షికను డాక్టర్ ఇలపావులూరి పాండురంగారావు సూచించారు. డైరీలోని అంశాలన్నింటినీ మిత్రులు వాడ్రేవు పురుషోత్తం ప్రతిగా రూపొందించారు.

తెనాలిలో సాహితీజీవితం...

నా సాహితీ జీవితానికి ఒక మలుపు దొరికింది

అడ్రస్
డాక్టర్ రావూరి భరద్వాజ, 'కాంతాలయం'
159/2, ఆర్.టి. విజయనగర్ కాలనీ
హైదరాబాద్-500 457
ఫోన్ : 040-23348631

తెనాలిలోనే. తెలుగులో విశిష్టమైన రచయితలుగా నిలబడిన శారద, ఆలూరి భుజంగరావు, ఆలూరి ప్రకాష్‌రావు, కవిరావు, శార్వరి వంటివారందరితో కలసివుంటూ ఎన్నో నేర్చుకున్నాను.

మీరు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డును కూడా అందుకున్నారు...

1968లోనే నా కథా సంకలనం 'విజయ విలాసం'కు ఈ పురస్కారం లభించింది.

మీరు 'నాస్తికులు' కదా!

(నవ్వుతూ) కొత్తగా చెప్పేదేముంది... నా భావాలు నావి. నా అభిప్రాయాలు నావి. అవి ఇతరులకు ఇబ్బంది కలిగించేవీ కావు. నన్ను నన్నుగా వదిలేస్తే చాలని భావిస్తాను.

'ఈ లోకాన్ని కారుణ్యంతో జయిస్తాను' అన్నారు మదర్‌థెరీసా. 'దయగల హృదయమే దైవమందిరం'

అన్నారు భగవాన్. దయ, కారుణ్యం అనేవి ఎంత గొప్ప ఆయుధాలో, అవి ధరించినవారికి గానీ తెలియవు అని ఒకచోట రాసినట్లు గుర్తు.

చలం ప్రభావం మీపై ఎలా పనిచేసింది...

బయటపడడానికి కూడా వీలుకానంతగా ఆ ప్రభావం నాపై ఉండేది. చలం 'వాక్యం' ఎప్పటికప్పుడు నేర్చుకునేవాడిని. ఆ పదాలూ, వర్ణనలూ, వాక్యాలూ ఎప్పుడూ కొత్తగానే ఉంటాయి.

ఆ అభిమానంతోనే నా మొదటి రచన 'రాగిణి'కి వారితో ముందుమాట రాయించుకున్నాను.

నా రెండవ రచన 'కొత్త చిగుళ్ళు' వారికే అంకితం ఇచ్చాను. చలంగారి అమ్మాయి సౌరీస్‌తో కూడా పరిచయాలు బాగా ఉన్నాయి.

మీరందుకున్న గౌరవ డాక్టరేట్లు గురించి...

1980లో ఆంధ్ర విశ్వవిద్యాలయం మొదటిసారి డాక్టరేట్ అందజేసి గౌరవించింది. 1987లో జవహర్‌లాల్‌నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వారు రెండవసారి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆ తర్వాత 1991లో నాగార్జున విశ్వవిద్యాలయం మూడవసారి గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది.

వివిధ విశ్వవిద్యాలయాల్లో మీ సాహిత్యంపై జరిగిన పరిశోధనల గురించి...

వివరాలు గుర్తులేవు. ఎవరెవరో పరిశోధక విద్యార్థులమంటూ వస్తూ ఉంటారు. పోతుంటారు. దాదాపుగా ఆరేడు విశ్వవిద్యాలయాల్లో నా రచనలపైన ఎం.ఫిల్, పి.హెచ్.డి.స్థాయి పరిశోధనలు జరిగాయని మాత్రం చెప్పగలను.ఇప్పటికీ ఇంకా కొంతమంది రీసెర్చ్ స్కాలర్లు నన్ను కలుస్తూవున్నారు.

మీరింతవరకు అందుకున్న పురస్కారాల గురించి చెప్తారా...

1968లోను, 1983లోను రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డులందుకున్నాను. 1983లోనే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు కూడా లభించింది.

1987లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, అదే సంవత్సరమే రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డు, 1993లో న్యూఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం, కలకత్తా వారి భారతీయ భాషాపరిషత్తు పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, 1995లో బాబుల్ రెడ్డి అవార్డు లభించాయి.

ఆ తర్వాత రాష్ట్రప్రభుత్వం నుంచి 'ఆత్మగౌరవ పురస్కారం' కూడా అందుకున్నాను. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్టపురస్కారం అందజేసింది.లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం, త్రిపురనేని గోపీచంద్ పురస్కారం, డా॥ బోయి భీమన్న సాహితీపీఠం పురస్కారం స్వీకరించాను.

'శ్రీమతి రావూరి కాంతమ్మ భరద్వాజ ట్రస్ట్' ఏర్పాటుచేశారు. దాని గురించి...

వివిధరంగాలలో కృషిచేసిన మహిళలను తగినరీతిగా గుర్తించి సత్కరించి ప్రోత్సహించడం కోసం ఈ ట్రస్ట్ ఏర్పాటుచేశాం.

ప్రతి ఏటా నిర్వహిస్తున్నాం.

మీ రచనలు ఏవైనా 'సినిమా'గా నిర్మితమయ్యాయా...

'ఓ! ప్రేమకథ' అనే సినిమాను ఎమ్.ఎస్.రెడ్డిగారు నా నవల 'కరి మింగిన వెలగపండు' ఆధారంగానే తీశారు.

మీ కుటుంబసభ్యుల గురించి...

నాకు నలుగురు కుమారులు. ఒక కుమార్తె. పేరు పద్మ. నాకు సహాయం చేసిన, నన్ను తీర్చిదిద్ది నా జీవితానికో దారిచూపినవారిపేర్లే నా పిల్లలకు పెట్టుకుని కృతజ్ఞత చూపుకున్నాను.

కొత్తతరం రచయితలకు మీరిచ్చే సూచనలు... సలహాలు...

నేనంతటివాడిని కాను. నాకది ఇష్టమూ ఉండదు. సూటిగా చెప్పాలంటే- నాకే తెలియని విషయాన్ని, నేను ఎవరికిమాత్రం ఎలా చెబుతాను!

డాక్టర్ వేంపల్లి గంగాధర్

(www.vempalligangadhar.com)

ఆమె మాటల్లోనే ఆమె జీవితపోరాటం

సంచలనానికి మరో పేరు అరుంధతీ రాయ్. ఆమె మాటల్లో ఆవేశం వుంది. ఆవేదన వుంది. మనసును తాకే మానవీయత వుంది. అందుకే 39 సంవత్సరాల వయస్సులోనే భారతీయ సాహిత్య రంగంలో ప్రముఖ స్థానానికి చేరుకోగలిగింది. ఒకే ఒక రచనతో ప్రభంజనాన్ని సృష్టించింది.



'గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'తో అత్యంత విలువైన, సాహిత్యరంగంలో ప్రశస్తమైన బుకర్ ప్రైజ్ విజేత అయ్యిందామె. అంతర్జాతీయ స్థాయిలో అనూహ్యమైన గుర్తింపును పొందింది.

ఆమె ఈ స్థాయికి చేరుకోవడం వెనుక అంతులేని నిరంతర శ్రమ వుంది. మోయలేనంత భారమైన కష్టం వుంది. మధ్య తరగతి కంటే దిగువస్థాయి నుంచి ఆమె జీవితం ప్రారంభమయ్యింది.

అందుకే పేద ప్రజల గురించి, వారు పడుతున్న కష్టాల గురించి ఆమె రచనలు సుదీర్ఘంగా విశ్లేషిస్తాయి.

అలాంటి పేద ప్రజలే సర్దార్ సరోవర్ ప్రాజెక్టు ముంపు కింద తమ భూముల్ని, నివాసాల్ని పోగొట్టుకున్నారని తెలిసి విలవిలలాడింది.

ర్యాలీ ఫర్ వ్యాలీ

ఆనకట్టల పేరుతో వారి బతుకుల్ని ఎలా నాశనం చేస్తున్నారో, ఏ రకమైన సాయం లేకుండా దుర్భరజీవితాన్ని గడుపుతున్న ఆదివాసీల కోసం ఆమె తనకు బుకర్ ప్రైజ్ ద్వారా వచ్చిన కోట్లరూపాయల మొత్తాన్ని నిర్వాసితులకు, నర్మదా బచావో ఉద్యమానికి విరాళంగా ఇచ్చింది. ఆందోళనకు తన మద్దతు ప్రకటించింది.

గతసంవత్సరం 'ర్యాలీ ఫర్ వ్యాలీ' పేరుతో మధ్య ప్రదేశ్‌లోని కత్రాణ గ్రామం నుంచి నర్మదా సత్యాగ్రహం వరకు యాత్ర జరిపిందామె.

ఆమెకు పర్యావరణం అంటే ప్రాణం. ప్రకృతి అంటే ప్రేమ. పోఖ్రాన్-2 అణుపరీక్షలు ఆమెను కలవరపెట్టాయి. న్యూక్లియర్ ప్రభావం గురించి 'ఎండ్ ఆఫ్ ఇమాజినేషన్' అనే పుస్తకం రాసింది.



ఆకలి కేకల ప్రపంచాన్ని వదలి అణ్వాస్త్రాల కోసం ప్రాకులాడ్డాన్ని ఆమె విమర్శించింది.

అన్నీ నిజాలే

ఆమె దృష్టంతా ఇప్పుడు నర్మదా ఆందోళనపైనే వుంది. ఆనకట్టలకు, అభివృద్ధికి అసలు ఏ మాత్రం సంబంధం లేదంటుంది.

ఇదంతా పెద్దపెద్ద రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్ల జేబులు నింపుకోవడానికి పనికొస్తుందే తప్ప పేద ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడకపోగా, పర్యావరణానికి తీవ్రవిఘాతం కల్గిస్తున్నట్లు ఆమె ఆవేశంగా ఎగసిపడుతుంది.

కుటుంబ హింస కారణంగా స్త్రీలు పడే బాధల్ని కూడా ఆమె ఒక్కొక్కటిగా మనముందు పెడుతుంది. సోదరుడైనా, భర్త అయినా, తండ్రిఅయినా, కొడుకైనా మహిళలను హింసించే విషయంలో ఒక్కటేనంటుంది. ఈ విధమైన కుటుంబ హింస నుంచి బయటపడాలంటే మహిళలంతా ఎవరి కాళ్లపైవారు నిలబడి మగవాడ్ని తమ జీవితంలోంచి బహిష్కరించాలని చెపుతుంది. తన జీవితాన్నే అందుకు ఉదాహరణగా చూపిస్తుందామె.

తన జీవితంలో ఇంత వరకు ఒక్క మగాడికి కూడా చోటులేదని, చివరికి తన తండ్రిని కూడా బహిష్కరించినట్లు, తనకెప్పుడూ మగాడి అవసరం కలగలేదని, మగాళ్లకు ఆడవాళ్ల అవసరం తప్పనిసరి అవుతుందేమోగానీ, ఆడవాళ్లకు ఏ మగాడి తోడూ అవసరం లేదని ఉద్బోధిస్తుంది.

ఆమె మాటలు మొదట ఆశ్చర్యాన్ని కల్గించవచ్చు గానీ లోతుగా వెళ్లి ఆలోచిస్తే వాస్తవమేననిపిస్తుంది. స్త్రీలకు పెళ్లే సర్వస్వం కారాదు.

ఆవిధంగా ఆడవాళ్లంతా మగవాళ్లపై ఆధార

పడుతున్నందువల్లే పురుషాధిక్యత పెరిగిపోతోం దని, ఇదే కుటుంబ హింసకు పునాది అవుతోందని ఆమె అభిప్రాయపడుతుంది.

'సభలకు సమావేశాలకు నేను ఎప్పుడు వెళ్లను' అని ఖచ్చితంగా తేల్చి చెప్పే అరుంధతీరాయ్ ఊహించని రీతిలో అంతర్జాతీయ మహిళాదినోత్స వాన్ని పురస్కరించుకొని అనంతపురంలో మహిళా వేదిక ఆధ్వర్యంలో మార్చి1వ తేదీన జరిగిన భారీ ర్యాలీలో పాల్గొనడంతోపాటు, వివిధ మహిళా సంఘాలు ఏకమై నిర్వహించిన బహిరంగ సభకు కేరళ సంప్రదాయ వ్యవహార శైలిలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించింది.

ఆ తర్వాత రోజు 'నర్మదా మెసేజ్ టు రాయల సీమ' కోణంలో సాగిన చర్చా వేదికలో పాల్గొంది. పలు వివాదాస్పద అంశాలపైన తన అభిప్రాయాల్ని సూటిగా వెల్లడించారామె. సుదీర్ఘంగా తన జీవిత పోరాటాన్ని ఆవిష్కరించింది. ఆమెమాటల్లోనే ఆమె పోరాట జీవితం ఇలా వుంది.

అమ్మే నా గురువు

"జీవితం ఒక పెద్ద అగ్నిపరీక్ష. నేనెన్నో కష్టాలు పడ్డాను. తాగుబోతు తండ్రి నుంచి నేనూ, మా కుటుంబం ఎంతో హింసను అనుభవించాము. ఒక వైపు పేదరికం, మరోవైపు వేధింపుల మధ్య నా తల్లి ఎలా సంఘర్షణకులోనైందో నేనిప్పటికీ మరచి పోలేను. ఆమె మా కోసం ఎంతో కష్టపడింది.

ప్రతి రోజూ ఈ విధంగా ఆమె ఎంతకాలమని వేధింపులకు గురికాగలదు?

అందుకే ఓ రోజు అలాంటి భర్త నీడలో వుండ డంకంటే ఎటైనా వెళ్లిబతకడమే ఉత్తమమని భావిం చింది. అయినా ఎక్కడికి వెళ్లాలి?

బతకడానికి ఎక్కడో ఒక చోటికి వెళ్లే తీరాలి. తప్పదు. తాగుబోతు భర్తను నమ్ముకొని బతకడం సాధ్యంకాని పని. అతడు పెట్టే హింసల్ని భరించడం మరీకష్టం. అతడ్ని వదిలి ఇల్లు విడిచి వెళ్లిపోవడానికి నిర్ణయించుకుంది.

అవును... అతడ్ని వదిలి ఒంటరిగా జీవించాలి. ఓ రోజు తన ఇద్దరు పిల్లలతో ఇల్లు విడిచింది.

ఎక్కడికి వెళ్లాలి? మళ్లీ అదే ప్రశ్న. పురుషాధిక్యతలేని ప్రపంచం కావాలి. వుంటుందా? చివరికి కేరళలోని ఓ గ్రామం చేరుకున్నాం. అక్కడే గడిచింది నా బాల్యం. తల్లిచాటు కూతుర్లా మొదట్లోవుండే దానిని ఆ తర్వాత ఆలోచించడం నేర్చుకున్నాను. అమ్మబడి చెప్తుంది. పిల్లల్ని ప్రోగుచేసి విద్యను నేర్పిస్తుంది. పాఠాలుచెప్పడంఅంటే అమ్మకు ఇష్టం. చాలా చక్కగా కథలు, కథలుగా, విద్యార్థులను ఆకట్టుకునే విధంగా చదువు చెప్పేది.

నా గురువు కూడా అమ్మే. ఆమెను ఆదర్శంగా తీసుకునే నన్ను నేను తీర్చిదిద్దుకోవటం నేర్చుకు న్నాను. అమ్మనుంచే అభిప్రాయాలు, భావాలు నాలో ఏర్పడ్డాయి-అడ్డదిడ్డంగా మాట్లాడ్డంకాకుండా ముక్కుసూటిగా వుండడం, నచ్చినపనే చేయడం నాకిష్టం. ఎవరి సంతోషం కోసమో మనం మన భావాల్ని, అభిప్రాయాల్ని చంపుకొని వారికి అనుగు ణంగా వుండాలని అనుకోను.

బహుశా నాలో ఎక్కువ మందికి నచ్చని అంశం ఇదేననుకుంటాను.

మా అమ్మ కూడా అచ్చం నాలాగే చేస్తుంది. కావాలంటే ఒక విషయం చెప్తాను చూడండి. నాకు చిన్నప్పటినుంచి కలల్లో బతకడం కాకుండా వాస్తవంలో జీవించడం నేర్పింది. 'నువ్వు పెళ్లి చేసుకోవద్దు' అని నూరిపోసింది.

మగాడి అవసరం వద్దు

ఏ తల్లీ అయినా తన కూతురికి ఇలాంటిమాట చెప్పగలదా? మా అమ్మ నాతో చెప్పింది. ఒకటి, రెండూసార్లు కాదు... కొన్ని వందల సార్లు.

మన దేశంలో ఆడపిల్లకు పెళ్లే సర్వస్వం. పెళ్లి చేసి ఆమెను అత్తగారింటికి కోడలుగా పంపడమే ఆడపిల్లల తల్లిదండ్రుల లక్ష్యం. పెళ్లి అమ్మాయి జీవితంలో చివరిమెట్టు.ఒక మగాడి నీడలోకి చేరు కోవడం ఈ పెళ్లి పరమార్థం.

ఏమిటి? మగవాడి అండలేకుండా ఆడది జీవించలేదా? మగవాడు అవసరమా? లేదు. మగ వాడి అవసరంలేకుండా బతికి చూపించాలి.

అమ్మచెప్పినట్లు పెళ్లిని ప్రక్కన పెట్టేశాను.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అనంతపురంలో జరిగిన మహిళా చైతన్య సమావేశంలో పాల్గొన్న అరుంధతీరాయ్

అసలు చిన్నప్పటి నుంచి కూడా ఆ రకమైన ఆలో చనలు ఏవీ నాలోలేవు. మగవాడినుంచి ఎంత నర కాన్ని అనుభవించాలో అంతకు రెట్టింపు హింసను మా కుటుంబం అనుభవించింది. అమ్మ అందుకే నాలో చిన్నప్పటి నుంచి 'పెళ్లి నీ జీవితంలో లేదు' అంటూ హెచ్చరిస్తూ వచ్చింది.

ఈ దేశంలో ఒక కూతురికి ఈ రకమైన హెచ్చరికలు చేసిన మొదటి చివరి తల్లి మాఅమ్మనే అనుకుంటాను. ఆడపిల్లలందరికీ- తనకు చేతనై నంతవరకు చదువు మా అమ్మ చెప్పించింది. మీకు ఇంతకంటే నేనేం ఇవ్వగలను? కట్నాలు, కానుకలుఇచ్చి పెళ్లిచేసే పరిస్థితులల్లో నేను లేను. మీ కిష్టమైనట్లు చదువుకోండి. చదువునే నమ్ము కోండి.చదువు మిమ్మల్ని తీర్చిదిద్దుతుంది. అంటూ సర్వం చదువేనని మా అమ్మ ఉపదేశించేది.

చివరికి ఆమె మాటే నెగ్గింది. చదువు నాకు ఆధారమయ్యింది. నిజానికి మనదేశంలో అమ్మా యిలందరికీ వారివారి జీవితాల్ని నిర్మించుకోడానికి చదువే ఏకైక పరిష్కార మార్గం. దేశంలో మహిళలపై వివిధ రూపాల్లో జరుగుతున్న హింసను ఎదుర్కోవ డానికి చదువు తప్పనిసరి. అసలు మన కాళ్లపైన మనం నిలబడి బతకగలిగినప్పుడు మగవాడి అవ సరం ఎందుకు వస్తుంది?

మనం మగవాళ్లనే ఆధారంగా చేసుకోవడం వల్లనే వారి హింస మనకు శాపంగా మారుతోంది. సోదరుడైన, భర్త అయినా, తండ్రి అయినా, కొడు కైనా, ఆడవారిని హింసించే విషయంలో మగవా ళ్లంతా ఒకటే. కుటుంబానికి యజమానిగా అతడు పెట్టే హింసను ఎందుకు భరించాలి?

జీవితం అందమైనది

ఆడవాళ్లు యజమానులుగా వున్న కుటుం బాలు ఎన్నో ఇంతకంటే అభివృద్ధిచెందాయి. చెందు తున్నాయి. కాదనగలరా? స్త్రీలేకుండా పురుషుడు వుండలేకపోవచ్చు. కానీ పురుషుడు లేకుండా స్త్రీ తప్పకుండా వుండగలదు.

ఇందుకు నా జీవితమే ఉదాహరణ. ఆడవారి అభివృద్ధిని కాలరాయడానికి, వారి ప్రగతిని అడ్డుకో

డానికి ముందుగా ప్రయత్నించేది పురుషుడే. మహిళలంతా చదువుకొని తమ కాళ్లపై తాము నిలబడగలిగితే పురుషులతోపాటు సమాన గౌరవాలు అవేవస్తాయి. సమాజంలో ఈనాడు వుంటున్న వ్యత్యాసాలన్నీ కనుమరుగవుతాయి.

అలా కాకుండా పురుషుడిపైనే ఆధారపడినంత కాలం ఈ హింస, నరకయాతన ఇలాగే కొనసాగుతూ వస్తుంది. మనం మన వ్యక్తిత్వాన్ని చంపుకోకుండా కాపాడుకోవాలి. ఇంతకీ స్త్రీ పెళ్లి చేసుకొని ఏం చేస్తుంది? పనిమనిషిగా మారుతోంది. పిల్లల్ని కనిపెట్టే యంత్రం అవుతోంది. ఇంట్లోని టీ.వీ., ఫ్రిజ్, కూలర్‌లాగానే ఒక భోగ విలాసవస్తువుగా తయారైంది. కుటుంబ పరిచారిక పాత్ర పోషిస్తోంది. సహధర్మచారిణిగా కొనసాగడం అంటే ఇదేనా?

పురుషులు అండగా లేకపోయినా జీవితం ఆగిపోదు. జీవితం చాలా అందమైనది. ఆశలను యదార్థం చేసుకొని బతుకును చరితార్థం చేసుకోవడం మనలోనే వుంది. మగవాడిని నమ్మడం, మోసపోవడం, హింసను అనుభవించడం మామూలైంది. ఇలా ఇంకా ఎందుకు జరగాలి?

తల్లి, చెల్లి, భార్య ఇలా ప్రతి ఆడది కుటుంబ హింసను ఏదో ఒక రూపంలో అనుభవిస్తూనే వుంది. ఇక్కడ పేద, ధనిక, విద్యావంతుడు, నిరక్షరాస్యుడు అనే తేడాలు లేకుండా కుటుంబహింసను పోషిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మహిళలపై సరికొత్త రీతిలో హింస జరుగుతోంది.

మనదేశానికి స్వాతంత్ర్యంవచ్చి 50ఏళ్లుఅయినా మహిళలకు జరిగిన ప్రయోజనం ఏమిటి? ఇప్పుడు మహిళలంతా తమ హక్కుల కోసం, భవిష్యత్ కోసం పోరాడాల్సిన సమయం వచ్చింది.మా అమ్మ నాతో 'నిన్ను 18 సంవత్సరాల వరకే చదివిస్తాను. అంతవరకే నీ పోషణభారం వహిస్తాను. ఆ తర్వాత నువ్వు స్వతంత్రంగా బతకాలని చెప్పింది. నేను సరే అన్నాను. పురుషుల అండ లేకుండా మహిళలు ఏదైనా సాధించవచ్చు అని ఖచ్చితంగా చెప్పడానికి నేనే మీకు నిదర్శనం.

జీవితం నడిపినట్లే నడుచుకుంటే గొర్రెలకూ మనకూ తేడాలేదు. మనుషులైనందుకు, శక్తిసామర్థ్యాలు ఉన్నందున జీవితాన్ని మనకు నచ్చిన పద్ధతిలో మలుచుకోవాలి. ఇప్పుడు మనం ఎటువైపు వెళ్తున్నామో, చివరికి సమాజం ఏమైపోతుందో తెలియడం లేదు.

ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్

మానవ సంబంధాలన్నీ ఆర్థిక విలువలపైనే ఆధారపడుతున్నాయి. పెళ్లి అనే వైవాహికబంధం కూడా డబ్బుతోనే ముడిపడిపోయింది. కట్నంకోసం ఇల్లునీ, ఇల్లాలినీ వదులుకునేవాడు ఒకడైతే, వారిని హింసించే వారు మరొకరు. అందుకే అమ్మాయి పుట్టగానే చదువు చెప్పించడానికి ప్రాధాన్యత ఇవ్వండి. ఆమె తన ఉపాధిని తాను చూసుకునేలా మార్గం వేయండి. ఆమెకు అండగా నిలబడండి. ఆమె పట్ల ఆదరణ చూపండి. ఆమెకు మీ వంతు సహకారం అందించండి.

ప్రపంచంలో బతకడానికి అనేక మార్గాలు వున్నాయి. నీకు ఇష్టమైనది ఏదైనా చదువుకో ఆ రంగంలో రాణించేందుకు ప్రయత్నించు. మగవాడి తోడు అవసరంలేదు. ఆడవాళ్లుగా మనకున్నపరిధి చాలాచిన్నది. ఈ కాస్తపరిధిలోనే ఏదైనా చెయ్యాలి. ఎంతో సాధించాలి. నేను 'గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' పుస్తకాన్ని రాయకముందు చాలా ఇబ్బందులు పడ్డాను. తర్వాత సినిమాల్లోకి వెళ్లాను.

'ఇన్ విచ్ ఏనీ గివ్స్- ఇట్ దోజ్ వన్స్', 'మాస్సే సాహిబ్' సినిమాల్లో నటించాను. ఈ సినిమాలతో పాటు 'ఎలక్ట్రిక్ మూన్' అనే సినిమాలకుకూడా నేనే స్క్రిప్ట్ అందించాను. ఆ తర్వాత 'ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' రచన సాగింది. ఈ రచన కోసం దాదాపు ఐదేళ్లుపట్టింది.

రచన సమయంలో ఇంత పేరు వస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. రచనలో ప్రజల మనోభావాలు ప్రతిబింబించడం వలనే ఇంత పాపులర్ అయిందని భావిస్తున్నాను. 'గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'ఇప్పటి వరకు నలభైతొమ్మిది భాషల్లో ప్రచురితమయ్యింది. ఈ రచన వలన వచ్చిన ఆకస్మిక పేరు ప్రఖ్యాతులు, సంపద నన్ను ప్రలోభపెట్టలేక



పోయాయి. ఆ రచన బుకర్ ప్రైజ్‌ను గెల్చుకున్నాక కూడా నా జీవన విధానంలో మార్పు ఏమీ రాలేదు. మీడియా ఇచ్చే ప్రచారానికి అడ్డు చెప్పలేం.

నాకు అవార్డు రాకముందే బాగుండేది. నాకు నచ్చినట్లు నాపని నేను చేసుకునేదాన్ని. ఆసక్తిలేని అంశాల్ని వదిలేసేదాన్ని. గుర్తింపు వచ్చాక అలా వుండడానికి వీలులేకుండా, మౌనంగా చేతులు కట్టుకొని కూర్చోలేకపోతున్నాను. 'పోఖ్రాన్-2'అణు పరీక్షలు నన్నెంతో కలచివేశాయి. న్యూక్లియర్ ప్రభావం, జరగబోతున్న ప్రమాదాలను విశ్లేషిస్తూ 'ఎండ్ ఆఫ్ ఇమాజినేషన్' పుస్తకం రాశాను. ఇక్కడి పేద ప్రజల ఆకలి కేకల్ని, వినకుండా అణ్వస్త్రాలను తయారుచేయడం ఏమిటి?దానివల్ల- దేశానికిగానీ, పేదప్రజలకుగానీ కలిగే ప్రయోజనం ఏమిటి?

పర్యావరణ పరిరక్షణ

అణ్వస్త్రాలు నిజానికి మనకు అవసరమా? ప్రచ్ఛన్న యుద్ధం- ముగిసిన తర్వాత బేరాలు తగ్గి కలవరపడుతున్న మృత్యు వ్యాపారులైన ఆయుధ ఫ్యాక్టరీల యజమానులకు, చమురు క్షేత్రాల్ని గుప్పిట్లో పెట్టుకొని అంతర్జాతీయ విపణిని శాసించాలనుకుంటున్న పాశ్చాత్య పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు, వాటి వెనుక వున్న పారిశ్రామికవేత్తలకు అణ్వస్త్రాలు అవసరంగానీ పేదలతో నిండిన వారి ఆకలికేకల ఆర్తనాదాలతో ప్రతిధ్వనిస్తున్న మనదేశానికి అణుపరీక్షలు ఎందుకు చెప్పండి?

అసలు అణ్వస్త్రాలే ప్రపంచం విధ్వంసానికి మూల కారణం అవుతాయి. అణ్వస్త్ర రహిత ప్రపంచంగురించి పుంఖానుపుంఖాలుగా మాటలు, వల్లించేవారు ఈ విషయం గురించి మాట్లాడరెందుకు? ప్రజలందరూ ఆకాంక్షించే 'అణ్వస్త్ర రహిత ప్రపంచం' ఇలాగేనా సిద్ధించేది? అణ్వాయుధాల గుట్టలే తమ దేశాలకు అసలైన రక్షణ కవచాలు అనే సిద్ధాంతాన్ని అగ్రరాజ్యాలు ఇప్పటికే పాటిస్తున్నాయి. దీని వలన పర్యావరణానికి భూగర్భంలో సంభవించే ప్రకంపనలకు వాటిల్లే ప్రమాదాన్ని ఎవరూ గుర్తించడం లేదు.

అణుధార్మిక వ్యర్థ పదార్థాల వలన సృష్టించబడే కాలుష్యం సామాన్యమైనది కాదు. ప్రకృతిని, మనిషిని సమూలంగా నాశనం చేసే వరకు అవి విశ్రమించవు. ఈ పరిణామాలను, ప్రభావాలను దృష్టిలో వుంచుకొని రాయబడిన పుస్తకమే 'ఎండ్ ఆఫ్ ఇమాజినేషన్'. స్పందించి రాసిన రచన.

రచయితలు సమాజంలోనుంచే వస్తారు. తమ

ఉనికికి కారణమైన సమాజ అభివృద్ధికి తమవంతు కృషి చేయడం కనీస కర్తవ్యం. ఆ ఉద్దేశ్యంతోనే నేను ప్రకృతి పరిరక్షణ కోసం, పర్యావరణ సమస్యలపై యుద్ధం ప్రకటిస్తూ నడుం బిగించాను.

ముందుగా ఉత్తర కేరళలోని కోజిక్కోడు పక్కన చాలియార్ నదిని పరిరక్షించడం కోసం సాగుతున్న ఉద్యమం గురించి తెలిసింది. అక్కడ నది పరిరక్షణ కోసం స్థానికులు ప్రభుత్వంతో చేస్తున్న పోరాటంలో నేను కూడా పాల్గొనాలని నిర్ణయించుకున్నాను. ప్రజలు సంతోషించారు.

అప్పుడే ఒక నిర్ణయం తీసుకున్నాను. పర్యావరణ పరిరక్షణకోసం పేదప్రజల అభ్యున్నతికోసం మనం పాటుపడాలి. వారికి అండగా నిలబడాలి. ఈ సమయంలో నర్మదానది తీరాన సాగుతున్న ఉద్యమం గురించి అధ్యయనం చేశాను. వెళ్ళి అక్కడి ఆదివాసీలను కలుసుకొని వారి కష్టాలు విన్నాను. వారి కన్నీళ్ళనుతుడవడానికి ఏదో ఒకటి చేయాలనిపించింది.

'నర్మదా బచావో'

ఆ ఉద్దేశ్యంతోనే నర్మదాబచావో ఉద్యమంలో పాలుపంచుకుంటూ 'గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' నవలకు బుకర్ ప్రైజ్ ద్వారా వచ్చిన నగదు కోట్ల రూపాయల మొత్తాన్ని ఆందోళనకు సమర్పించాను. నిజానికి నర్మదా బచావో ఆందోళన ఉద్యమంద్వారా నేనెంతో స్ఫూర్తిపొందాను. ఆదివాసీల ఆవేదన నేను అర్థంచేసుకోగలను. వారిప్పుడు నిర్వాసితులు. వారికిప్పుడు సాయం చేసే చేతులు కావాలి. వారి జీవితాన్ని కాలరాయడానికి ప్రభుత్వానికి ఎవరు అధికారం ఇచ్చారు?

అభివృద్ధి పేరుతో వినాశనం సృష్టిస్తున్నారు. నర్మదానదిపై కొనసాగుతున్న బహుళార్థ సాధక పథకాలైన నర్మదాసాగర్, సర్దార్ సరోవర్ ప్రాజెక్టుల వలన పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. ఆదివాసీల సంస్కృతి, చరిత్ర కనుమరుగవుతోంది. ఎంతోమంది ఆదివాసీలు నిరాశ్రయులవ్వడమే కాకుండా కొన్నివేల హెక్టార్ల అటవీభూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి.

ఎన్నో వందల గ్రామాలు నట్టేట మునిగిపోయాయి. తరతరాలుగా వస్తున్న ప్రాచీన ఆదివాసీల సంస్కృతీ అంతరించిపోతోంది.

నర్మద పరీవాహక ప్రాంతంలోని అమాయక ఆదివాసీలపై పెత్తందార్లయిన భూస్వాముల, కాంట్రాక్టర్ల అమానుష ధోరణి, రాజకీయ వేత్తల ఘరానా దోపిడీ, అధికార్ల అణిచివేత వారిని జలగల్లాగా పట్టి పీడిస్తున్నాయి. ఈ నాగరిక సమాజం ఆదివాసుల్ని పీల్చి పిప్పి చేస్తోంది.

వారి సర్వస్వాన్ని దోచుకుంటోంది. ఈ ప్రాజెక్టు కోసం మొదట్లో కొంతమేరకు ప్రపంచబ్యాంకు నిధులందించింది. ఆ తర్వాత 'నర్మదా బచావో ఆందోళన్' మొదలు కావడంతో బ్యాంకు అధికారులు కమీషన్ వేశారు.

కమీషన్ నివేదికప్రకారంపర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని వెల్లడికావడంతో ప్రపంచ బ్యాంకు నిధుల్ని ఇవ్వడం మానేసింది. 1985లో ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం రు.13.640 కోట్లుగా వున్న ప్రాజెక్టు వ్యయం 1994 నాటికి 34 కోట్లకు చేరుకోవడంకూడా ప్రపంచ బ్యాంకునిధుల్ని ఆపి వేయడానికి ఒక కారణమైంది.

పొంచివున్న ప్రమాదం

నర్మదా ఆనకట్ట వలన వచ్చే మొత్తం విద్యుత్ 523 మెగావాట్లు, నర్మదానదీ పరీవాహక ప్రాంతంలో మునిగిపోయే మొత్తం అటవీ వైశాల్యం 54,000 హెక్టార్లు. భారత ప్రభుత్వ పర్యావరణశాఖ అంచనాల ప్రకారమే నష్టం 40,000 కోట్లు.

ఇంతవరకు ఈ ప్రాంతాన్ని సందర్శించిన ఎంతోమంది అధికారులు ఆనకట్ట నిర్మాణంవలన లాభం కంటే నష్టమే ఎక్కువని అంచనా వేశారు. ఈ ప్రదేశం కూడా భూకంపాలు రావడానికి అనుకూలమైందని తేలింది.

నర్మదా వ్యాలీ ప్రాజెక్టు 30 పెద్ద, 135 మధ్య తరహా, 3000 చిన్న డ్యాముల కలయికతో కూడుకున్నది. ఇక్కడున్న రెండు పెద్ద డ్యాములు సర్దార్ సరోవర్, నర్మదాసాగర్. దాదాపు 10,000 గ్రామాలు నర్మదా పరీవాహక ప్రాంతంలో ముంపుకు గురవుతున్నాయి. సర్దార్ సరోవర్ ప్రాజెక్టు ఎత్తును 455 అడుగుల ఎత్తునుంచి 420కి తగ్గించినట్లయితే 90శాతం ప్రజలను ముంపుకు గురికాకుండా రక్షించుకోవచ్చు. కానీ ఇవేవీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.



మహిళలతోపాటు ప్రమాణం చేస్తున్న అరుంధతీరాయ్

నర్మదానదీ పరివాహక ప్రాంతంలో ఆనకట్టల వలన సాగుదల అయ్యే భూమి మొత్తం 1,38,000 హెక్టార్లు అయితే అదే ఆనకట్ట వలన మునిగిపోయే భూమిమొత్తం 1,38,000 హెక్టార్లు. సమానంగా ఉంది. మన దేశంలోను, ప్రపంచంలోను నిర్మించిన డామ్‌లలో దాదాపు 10వ వంతు విఫలమయ్యాయి. అనేక డామ్‌లు పగిలిపోయాయి.

భూగర్భంలో పగుళ్ళు, భూగర్భంలోని రాతి పగుళ్ళు, భూకంపాల తీవ్రత, డామ్ రూపకల్పనలోని తప్పులు, డామ్ భద్రత, జలాశయం నిండడం వలన కొండచరియలు విరిగిపడే ప్రమాదం, నీరు పొంగిపొర్లడంతో సిమెంటులైను, రాళ్ళు, గులకరాళ్ళు,ఇసుకతో డామ్ బాంబులా పేలిపోయే ప్రమాదం పొంచివుంది.

ఈ రోజు ప్రపంచంలో మనం చూస్తున్నది అభివృద్ధికీ, పర్యావరణానికీ మధ్య యుద్ధంకాదు. వినాశానికీ, జీవితానికీ మధ్య యుద్ధం.

నర్మదా ప్రాజెక్టు నిర్మించడం ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణ దృష్ట్యా, అభివృద్ధి దృష్ట్యాకూడా మంచిదికాదు. ప్రభుత్వాలు ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టి పొలాలకు నీరు, పరిశ్రమలకు విద్యుత్ అందించడానికి కృషిచేస్తుంటే పర్యావరణ ఉద్యమకారులు అర్థంపర్థంలేని గొడవలతో ప్రగతికి అడ్డు పడుతున్నారని కొందరు భావిస్తున్నారు. నర్మదా ప్రాజెక్టు వివాదంలో అధికారులు,నిపుణులు సత్యాలను ఎలా సమాధి చేశారో తెలుసుకుంటే మీరు కూడా పోరాటంలో భాగం అవుతారు. ఆదివాసీల పట్ల ప్రేమ, ఆప్యాయతలను పెంచుకుంటారు.

నిజమైన శత్రువు

ఆదివాసీలను వారి స్థలాలనుంచి ఖాళీ చేయించి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు గుజరాత్‌లోని 1.8 మిలియన్ల హెక్టార్లు, రాజస్థాన్‌లోని 75వేల హెక్టార్లను సాగులోకి తేవడంతోపాటు 1450

మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చెయ్యాలనేది ప్రభుత్వ లక్ష్యం. వీటిలో ఏ ఒక్కటి నెరవేరలేదు.

ఆదివాసీల సంస్కృతి, జీవన విధానం పూర్తిగా మారుతోంది. ఆనకట్ట నిర్మాణంవలన వృక్షసంపద నాశనమై వాతావరణం దెబ్బతింటోంది. డామ్ నిర్మాణం భద్రతకు భంగకరమే కాకుండా నిర్వాసితులకు పునరావాసంకూడా కల్పించబడలేదు.









ఆదివాసీల పరిస్థితి దయనీయంగా తయారైంది. ప్రకృతి ఒడిలో పెరిగిన ఆదివాసీలకు నీరు, వంట చెరుకు, పశువుల మేత అన్నీ అక్కడే లభించేవి. ఇప్పుడు వారు వారి ప్రాంతాల్ని పోగొట్టుకోవడం ద్వారా ఎన్నో ఇబ్బందులు పడాల్సివస్తోంది.

ఇక్కడి నేల, నీరు, అడవులను అధికారులు తమ గుప్పిట్లోకి తెచ్చుకుంటున్నారు. అడవులను కాంట్రాక్టర్లు కనుమరుగు చేస్తున్నారు. మట్టి,నీరు, గాలి ఇవే జీవించడానికి ఆధారాలు.ఒక్కసారి ఇవి లేని ప్రపంచాన్ని ఊహించుకోండి. అప్పుడు తెలుస్తుంది వీటి ఆవశ్యకత ఎంతో...ఇవిలేకుంటే జీవితం ఎంత భయానకంగా ఉంటుందో. భారీప్రాజెక్టులు కట్టేబదులు చిన్నచిన్న ప్రాజెక్టులు కట్టవచ్చు కదా.

ప్రభుత్వం ఇప్పటికీ రూ.7500 కోట్లు ఖర్చు పెట్టామని గొప్పలు చెప్తోంది. ఇంకా 35 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సివుంది.

కానీ ఎంతమందికి ప్రయోజనం జరిగింది? ఎన్ని భూములకు నీరు అందించగలిగారు? ఇవే నేను అడిగే ప్రధాన ప్రశ్నలు.

అభివృద్ధిపేరుతో పర్యావరణానికి జరుగుతున్న హింసను జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి. ఈ పెద్ద డ్యాముల వలన ఎవరికి లాభం? గత 50 ఏళ్ళ కాలంలో విద్యుత్ ఉత్పత్తి 20 రెట్లు పెరిగిందని చెప్తున్నారు. అయితే దేశంలో అనేక గ్రామాలకు ఇంకా విద్యుత్ సౌకర్యం లభించలేదు. వీటిని బట్టి మనకు నిజమైనశత్రువు ఎవరో అర్థమౌతూనేఉంది.

ఆహార భద్రత ఏది?

ముందుగా వీరు చెట్లని నరికేస్తారు. పీల్చేగాలిని కలుషితం చేస్తారు. ఆకాశాన్ని కూడా వదిలిపెట్టరు. డ్యాములు, ప్రాజెక్టులు నిర్మించేస్తారు.ఇవన్నీ మాకు అవసరంలేదని మీరు తేల్చి చెప్పండి. మాకు మా చెట్లే కావాలి. మాకు మా గాలే కావాలి. మాకు మా ఆకాశమే కావాలి అని నినదించండి. మీరిప్పుడు మౌనంగా ఉంటే దురాక్రమణ విస్తరిస్తూ వస్తుంది. మీ జీవితాల్ని కూడా కబ్జా చేసేస్తారు.

మీ ఊళ్లో చెట్లు నరికే వారిని క్షమించనేవద్దు. నిలదీసి ప్రశ్నించండి. దేశంలో ఉత్పత్తిఅయ్యే మొత్తం ఆహారధాన్యాలల్లో కేవలం 12శాతం మాత్రమే పెద్ద ప్రాజెక్టులకింద పండుతున్నాయి. మిగిలివన్నీ భూగర్భ జలాలవలనే పండుతున్నాయి. పైగా ఏటా ఉత్పత్తి అయ్యే మొత్తం ఆహారధాన్యాలలో పదిశాతం ఎలుకల పాలవుతున్నాయి.

1951లో 50 మిలియన్ల ఆహారధాన్యాల ఉత్పత్తి నుంచి ప్రస్తుతం 200 మిలియన్ల ఉత్పత్తికి చేరుకున్నా దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు సరిపడేంత పంపిణీ చేయడంలేదు.

గుజరాత్‌లో ఎడారిఛాయలు కనిపించే కచ్, సౌరాష్ట్ర జిల్లాలకు మంచి నీరు అందించేందుకు నర్మదా ప్రాజెక్టు ఉద్దేశ్యమని అధికారులు చెప్తున్నారు. కానీ ఇప్పటివరకు మధ్య గుజరాత్ వరకే నీళ్ళు చేరాయి. కచ్ ప్రజలకు ఇంతవరకు నీళ్ళు చేరనేలేదు. సౌరాష్ట్రలోని 1.8శాతంమాత్రమే ఇప్పటి వరకు లాభపడ్డారు. మిగిలిన ఉత్పత్తులన్నీ నదీ జలాలు, కాలువ వర్షాధారంగా పండుతున్నవేనని గమనించాలి.

ప్రపంచంలోని భారీ ప్రాజెక్టుల నిర్మాణంలో మనదేశం మూడవ స్థానంలో ఉంది. ఇప్పుడున్న 3,600 పెద్ద డ్యాములలో, 3,300 స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిర్మించినవే. మనదేశంలోని డామ్‌లు ఆధునిక దేవాలయాలుగా, ఆకలి, పేదరికం పారదోలేందుకు నిర్మించినవిగా పాఠ్యపుస్తకాల్లో బోధనాంశాలుగా చేర్చబడ్డాయి. అయితే ఇవి మనకు ఆహార భద్రత నిస్తున్నాయా?

ఎవరైనా మాట్లాడండి

1990లో మధ్యప్రదేశ్‌లో చార్గిడ్యాం నిర్మాణం పూర్తి అయ్యింది. ముందు ప్రణాళిక వేసుకున్న దానికంటే బడ్జెట్ 10 రెట్లు పెరిగింది.

మూడింతలు పరీవాహక ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. ముంపుకు గురైన ప్రాంతం మేర సాగుభూములకుకూడా ఈ డామ్ నీరందించలేకపోయింది. నర్మదా ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులైన ఆదివాసీలకు పునరావాసం కల్పిస్తామని వట్టిమాటలు చెప్పారు.

ఇంతవరకు ఒక గ్రామ ప్రజకు కూడా ప్రభుత్వం పునరావాసం కల్పించలేదు.

నర్మదానది వెంబడి చెక్కర కర్మాగారాలు నిర్మించబోమని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటికే 14 చెక్కర కర్మాగారాలు నిర్మించారు. అందులో ఒకటి చిమన్‌భాయి పటేల్ కర్మాగారం కూడా ఉంది. నీటిపారుదల రంగానికి కేటాయిస్తున్న మొత్తం నిధులలో 85శాతం నిధులను నర్మదా ప్రాజెక్టుకు గుజరాత్ ప్రభుత్వం మళ్ళిస్తోంది. ఇంత భారీ మొత్తం ఖర్చుచేసినా ఒరిగిందేమీ లేదు. ఆదివాసీలు అది గ్రహించారు. దానినుంచి పుట్టిందే నర్మదా బచావో ఆందోళన్.

ఈ ఆందోళన్ వెనుక విదేశీయుల హస్తం ఏమీలేదు. దేశంలో అభివృద్ధి జరగకుండా విదేశీయులు ఆందోళనను ప్రోత్సహిస్తున్నారని వస్తున్న ఆరోపణలలో వాస్తవంలేదు. ఆందోళనకారుల్ని, సి.ఐ.ఎ.ఏజెంట్లుగా గుర్తించడాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను. పోరాట వీరుల్ని విదేశీశక్తులుగా, ఏజెంట్లుగా ముద్రవేసి అభివర్ణించడం శోచనీయం.

పాలకవర్గాలు అభివృద్ధిపేరుతో ఇలాంటి హింస కొనసాగిస్తున్నారు. ముంపుకు గురైన వారికోసం ఇంతవరకు ఏం చెయ్యలేకపోయారు.

దేశంలో ధనిక వర్గాలకు చెందిన ఐదువందల కుటుంబాల ఆస్తులను స్వాధీనం చేసుకుంటే ప్రజాస్వామ్యాన్ని హత్యచేశారని పతాక శీర్షికల్లోకి ఎక్కుతారు. ఇప్పుడు ఆదివాసీల ఆస్తుల్ని, సంపదల్ని స్వాధీనం చేసుకుంటుంటే ఎవ్వరూ మాట్లాడరెందుకు? అధికంగా భూగర్భజలాలను తోడడం, విచక్షణారహితంగా చెట్లను నరకడం తదితర కారణాలవలన కచ్‌జిల్లా ఎడారిగా మారింది.

ఇప్పుడు అదే కచ్ జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని చెబుతూ నర్మదానది వెంబడి ఉన్న అనేక చెట్లు నరికివేయడం అభివృద్ధి అనిపించుకుంటుందా? పర్యావరణ పరిరక్షణకోసం ఆందోళన చేయడంద్వారా ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవాలి. నర్మదా ఉద్యమం దేశప్రజలందరికీ సంబంధించినది.

విజయం సాధించాం

ఒకరకంగా చెప్పాలంటే టైంబాంబు ఇది. భారతీయ సంస్కృతికీ ముప్పుతెస్తోంది. మనిషి మనుగడతో ముడిపడుతున్న పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రజలందరి బాధ్యత. మన హక్కుల్ని కాపాడుకోవాలి. ఆనకట్టలు ఆధునిక దేవాలయాలు, అభివృద్ధికి సోపానాలు అంటున్నారు. ప్రకృతిని, ప్రజల్నీ నాశనం చేసే ప్రాజెక్టులు దేవాలయాలా? చెప్పండి.

ప్రపంచ బ్యాంకునే పునరాలోచించుకునేలా చేసిన ఈ ప్రజాఉద్యమం గిరిజనుల హక్కుల పోరాటంలోనూ విజయం సాధించాలనే లక్ష్యంతోనే సాగుతోంది. దేశఅభివృద్ధి కార్యక్రమాలకోసం ఆదివాసీలు, దళితులు, రైతులు త్యాగాలు చేస్తుండగా నగరాల ప్రజలు, పారిశ్రామికవేత్తలు ఆ త్యాగాన్ని అనుభవిస్తున్నారు. ఇదేనా న్యాయమంటే? స్వాతంత్ర్యం లభించి యాభై సంవత్సరాలు దాటుతున్న పరిస్థితులలోకూడా అభివృద్ధి పేరుతో తమఇళ్లను వీడి వెళ్ళాల్సిన దుస్థితివస్తోంది.

ఇప్పటివరకు మనం 3700 ఆనకట్టలు నిర్మించాం. అయినా ఈరోజుకి 35 కోట్లకుపైగా ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువనే ఉన్నారు. వీళ్ళలోనే ఎక్కువమంది గ్రామాల్లోనే ఉన్నారు. కణ్ణూర్ జిల్లాలో పాత్తన్‌పార గ్రామస్థులు సొంతంగా విద్యుత్ తయారుచేసుకుంటున్నారు.

అల్వార్‌లో నీటిపారుదలకు గ్రామస్థులు కొత్త పథకాలు తయారు చేసుకున్నారు. ఇవన్నీ ప్రశంసించదగ్గవే. నీటిపారుదలకు,విద్యుదీకరణకు ఇవి మరోపరిష్కార మార్గాలు కావా?

ఎంతో ఉన్నతమైన ఆశయాలతో నిర్మితమైన ఆనకట్టలన్నీ ప్రయోజనాలను ఇవ్వకపోగా రాజకీయ పార్టీలకు, కాంట్రాక్టర్లకు, ఇంజనీర్లకు ఉపయోగపడుతున్నాయి. అందుకే నా నవల 'గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'కు బుకర్ ప్రైజ్ ద్వారా వచ్చిన కోట్ల మొత్తాన్ని ఆదాయపన్నుశాఖకు అప్పగించి మరిన్ని ప్రాజెక్టులకో, అణుపరీక్షలు నిర్వహించడానికో బదులు తమ ఉనికికోసం పోరాడుతున్న నర్మదా బచావో ఆందోళనకారులకు అందించాను.

దేశం ఈరోజు పేదలతో నిండిపోతోంది. మన పేదరికం ఎంతో సంపన్నమైంది. మన పేదరికం డబ్బు పుట్టిస్తుంది. మన పేదరికం మన పేదల్ని ఇంకాఇంకా పాతాళానికి లాక్కెళ్తోంది. పేదరికం చుట్టూ ఉన్న వ్యూహాలే పెద్దల పెద్దరికాన్ని నిలబెడుతున్నాయి.

నర్మదా బచావో ఆందోళన ద్వారా మేమెంతో విజయం సాధించాం. ప్రకృతికి ముప్పు వాటిల్లే ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా ప్రజలు ఎదురుతిరిగి ప్రశ్నించే స్థాయికి తీసుకెళ్ళాం.

పోరాటం నాకిష్టం

నర్మదా సమస్య మీకెందుకు? అని నన్ను ప్రశ్నించవచ్చు. నేనొక రచయిత్రిని. పోరాటం జరపడం నాకిష్టం. పేదప్రజల పక్షాన, పర్యావరణ పరిరక్షణ కోసం నేను ఈ ఉద్యమంలోకి వచ్చాను.

నా నవల 'గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్' యాభై లక్షల కాపీలు అమ్ముడైంది. నా జీవితానికి ఎలాంటి ఇబ్బందిలేదు. రచయిత్రిగా చైతన్యవంతురాలిగా ఉండి మౌనంగా ఉండలేకపోతున్నాను. ప్రభుత్వంతో పోరాటం జరపడమంటే ఎవ్వరికైనా జంకే.

అందుకే ఎక్కువమంది మేధావులు, రచయితలు ఉద్యమాలకు దూరంగా ఉంటారు. కానీ నేనలా ఉండలేను. నా కొత్త పుస్తకం 'ది గ్రేటర్ కామన్ గుడ్ (THE GREATER COMMON GOOD)'నర్మదా వ్యాలిలో ఆదివాసీలతో కలిసి మేం సాగించిన ఉద్యమంకు సంబంధించిన వ్యాసాల సంపుటి. నాకిప్పుడు పేరు ప్రఖ్యాతులు, కావలసినంత డబ్బు లభించాయి.

రచనా రంగంతోనే కాకుండా పర్యావరణ ఉద్యమంలో పాలుపంచుకోవాలనే ఉద్దేశ్యంతోనే నర్మదా బచావో ఉద్యమంలో పాల్గొంటున్నాను. గత ఏడాది 'ర్యాలీ ఫర్ వ్యాలీ'యాత్రలో పాల్గొన్నాను. మధ్యప్రదేశ్‌లో కత్రాణ గ్రామంనుంచి ఆరు గంటలు ఆడవిద్వారా ప్రయాణించి నదిలో రెండు గంటలు ప్రయాణించి నర్మదా సత్యాగ్రహం జరిగే చోటుకు చేరుకున్నాం.




నా కొత్త పుస్తకంలో ఈ అంశాలన్నీ వివరంగా ఉంటాయి. రచయితకు సామాజిక బాధ్యతకూడా ఉండాలి. కాదంటారా? కృతజ్ఞతలు.

• • •

ఏదైనాసరే ముక్కుసూటిగా మాట్లాడం ఆమెకిష్టం. అనైతికంగా, అమానుషంగా, అన్యాయంగా పర్యావరణంకు జరుగుతున్న ముప్పును ప్రశ్నించడమే ఇప్పుడు ఆమె పోరాటం. సరదాగా, ఆవేశంగా, ఆవేదనగా ధారళంగా మాట్లాడే అరుంధతీరాయ్ అంతరంగ ఆవిష్కరణ ఇది.

వేంపల్లి గంగాధర్



'రాష్ట్రపతి భవన్' నిర్వహించే 'విశిష్ట ఆతిథ్యం' కార్యక్రమానికి దక్షిణ భారతదేశం నుంచి ఎంపికై ఆహ్వానం అందుకున్న తెలుగు కథకుడు **డాక్టర్ వేంపల్లి గంగాధర్.** దేశవ్యాప్తంగా కేవలం ఇద్దరు సాహిత్యకారులకు మాత్రమే దక్కే అరుదైన గౌరవానికి అర్హత సాధించి సెప్టెంబరు ఎనిమిది నుంచి 18 రోజుల పాటు ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో విడిది చేశారు గంగాధర్. ఈ సందర్భంగా అక్కడి అనుభవాలనూ అనుభూతులనూ పంచుకుంటున్నారిలా...

రాజ్యాంగ మూలప్రతిని చూశా!



రాష్ట్రపతి భవన్ నుంచి ఫోన్... నన్ను 'విశిష్ట ఆతిథ్యం' కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు చెప్పారు అవతలి వ్యక్తి. 'ఇది నిజమా లేక కలా' అన్పించింది. ఎందుకంటే చాలా అరుదైన అవకాశం అది. ఆ అవకాశం నాకు దక్కిందంటే నమ్మశక్యం కాలేదు. నేను ఢిల్లీ వెళ్లేందుకు వారే విమాన టికెట్లు బుక్ చేసి పంపారు. వాటిని అందుకొని సెప్టెంబరు ఏడో తేదీ సాయంత్రం ఢిల్లీ విమానాశ్రయంలో దిగాను. ఆర్పీ భవన్ ప్రతినిధులు విమానాశ్రయానికి వచ్చి అక్కణ్నుంచి కారులో ఆర్పీ భవన్‌కు సాదరంగా తీసుకెళ్లారు. నాతోపాటు ఈ కార్యక్రమానికి సిక్కిం రచయిత్రి కుమారి యాషేడోమా, మరో ఇద్దరు చిత్రకారులు కూడా ఎంపికయ్యారు. గేట్‌నంబర్ 16కు దగ్గర్లో కొత్తగా నిర్మించిన 'పీకాక్ సర్వీస్ అపార్ట్‌మెంట్'లో మాకు విడిది. ఆరోజు రాత్రి తొమ్మిది గంటలకు అధికారులు వచ్చి కార్యక్రమ వివరాల్ని చెప్పారు.

ఎన్ని ఉద్యానవనాలో...

ఎనిమిదో తేదీ ఉదయం... నిద్రలేచి చూసేసరికి పచ్చని చెట్ల మధ్య కనీసం పది నెమళ్లు తిరుగుతూ కన్పించాయి. వందలకొద్దీ నెమళ్లు ఎక్కడపడితే అక్కడ తిరుగుతుంటాయని సాయంత్రానికి అర్థమైంది. ఆరోజే మా ఆర్పీ భవన్ సందర్శన మొదలైంది. ముందుగా ఉద్యానవనాల సందర్శనకు వెళ్లాం. కలాం రాష్ట్రపతిగా ఉన్న సమయంలో ప్రారంభించిన హెర్బల్ గార్డెన్‌లో 33 రకాల ఔషధ మొక్కలు పెంచుతున్నారు. అలాగే కాక్టస్ గార్డెన్‌లో 80, స్పిరుచ్యువల్ గార్డెన్‌లో 40, బోన్సాయ్ గార్డెన్‌లో 250, నక్షత్ర గార్డెన్‌లో 27 రకాల మొక్కల్నీ పెంచుతున్నారు. వీటిలో అన్నింటికంటే విశిష్టమైనది మొఘల్ గార్డెన్స్. పర్షియన్ శైలిలో తీర్చిదిద్దిన ఈ గార్డెన్‌లో దాదాపు 120 రకాల గులాబీ మొక్కలు ఉన్నాయి. ఉదయం పూట రాష్ట్రపతి ఈ గార్డెన్‌లో కాసేపు ఆహ్లాదంగా గడుపుతారు. పువ్వుల అందాలతో పోటీపడుతూ రంగురంగుల సీతాకోక చిలుకలు ఆ తోటల్లో స్వేచ్ఛగా విహరిస్తూ ఆనందపర్చాయి.



అశోకాహాల్‌లో చిత్రసోయగం...


చంద్రుడి నుంచి తెచ్చిన శిల...

గార్డెన్ల సందర్శన ముగిశాక ఆర్పీ భవన్‌కు దగ్గర్లో ఈ మధ్యనే ఏర్పాటు చేసిన మ్యూజియానికి వెళ్లాం. దీన్లో బ్రిటిష్ కాలంనాటి వస్తువులూ, ఆయుధాలూ, నిలువెత్తు తైలవర్ణచిత్రాలూ, అరుదైన కళాఖండాలూ తదితర సేకరణలు ఉన్నాయి. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి ఛాయా చిత్రాలూ కొలువుదీరి ఉన్నాయి. రాష్ట్రపతులకు బహుమతులుగా వివిధ దేశాల నుంచి వచ్చిన జ్ఞాపికలూ, బహుమతుల్నీ ఇక్కడ భద్రపరిచారు. చంద్రుడిపైనుంచి సేకరించిన శిలని అక్కడ చూడొచ్చు. దీన్ని మాజీ రాష్ట్రపతి వి.వి.గిరికి అమెరికా రాయబారి బహూకరించారు. ఎవరెస్ట్ శిఖరం నుంచి తెచ్చిన మరొక శిలతోపాటూ మహాత్మా గాంధీ పార్థివదేహంపై ఉంచిన పువ్వును కూడా ఒక అద్దాల గదిలో చూడొచ్చు. లార్డ్ మౌంట్ బాటెన్, నెహ్రూ స్వహస్తాలతో రాసిన లేఖల్నీ ఇక్కడ భద్రపరిచారు. దంతపు బొమ్మలూ, శిల్ప కళాకృతులూ, బ్రిటిష్ కాలంనాటి గుర్రపు బగ్గీలూ, రాష్ట్రపతి భవన్ నిర్మాతగా పేరుగాంచిన బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుటియన్స్ తయారుచేసుకున్న డ్రాయింగ్ చిత్రాలూ, నమూనాల్ని ఈ మ్యూజియంలో చూడొచ్చు.

330 ఎకరాల్లో...

మర్నాడు ఉదయం అయిదింటికి పోలో గ్రౌండ్‌కు వెళ్లి అక్కడ 'ప్రెసిడెంట్ బాడీ





అందాల నందనవనం... మొఘల్ గార్డెన్స్

గార్డ్ (పీబీజీ)' వారి ప్రాక్టీసు చూశాను. దాదాపు వంద గుర్రాలమీద సైనికులు విన్యాసాలు చేస్తున్నారు. చిన్న గోడల్ని ఎగురుతూ దాటేస్తున్నారు. 1773లో వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నపుడు 'బెనారస్ దళం'గా మొదలైన ఈ సైనిక పటాలాన్ని తర్వాత కాలంలో 'ది గార్డ్ ఆఫ్ మొఘల్స్'గా, 'ది గవర్నర్ జనరల్స్ బాడీ గార్డ్'గా, ప్రస్తుతం పీబీజీగా పిలుస్తున్నారు. సీనియర్ గైడ్ ఒకరు తోడురాగా రాష్ట్రపతి భవన్‌లోని మిగతా విభాగాల సందర్శనకు వెళ్లాం. 330 ఎకరాల్లో 340 గదులతో రాష్ట్రపతి భవన్ విస్తరించి ఉంది. దీన్లో మూడువేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 'H' ఆకారంలో నిర్మించిన ఈ భవనానికి ఎడ్విన్ లుటియన్స్ ప్లాన్ తయారుచేశాడు. ఈ భవన నిర్మాణంలో పూర్తి భారతీయత ఉట్టిపడుతుంది. ఈ భవనంపైన కన్పించే గోళాకార డోమ్‌కు సాంచీలోని నిర్మాణాల్ని నమూనాగా తీసుకున్నారు. భవన నిర్మాణానికి రాజస్థాన్ శిలల్ని ఉపయోగించారు. భవనం లోపల నిలువెత్తు స్తంభాలకు పైన నాలుగు ధర్మగంటలు కూడా చెక్కి ఉండటం విశేషం. ఆర్పీ భవన్ మొదటి గేటు నిర్మాణం కూడా ఎంతో కళాత్మకంగా ఉంటుంది. ఈ భవనం మొదట్లో బ్రిటిష్ వైస్రాయ్‌లకు నివాసంగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం మొదటి భారతీయ గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి ఈ భవనంలోకి అడుగుపెట్టారు. భారత్ గణతంత్ర దేశంగా మారిన తర్వాత ప్రథమ రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ దీన్లో నివాసం ఉన్నారు. అప్పట్నుంచీ ఇది రాష్ట్రపతి భవన్‌గా మారింది. దర్బార్ హాల్, అశోకా హాల్, క్యాబినెట్ రూమ్, బ్యాంక్వెట్ హాల్, మార్బుల్ హాల్... వంటివి దీన్లో చెప్పుకోవాల్సిన విభాగాలు. భారతదేశ అత్యున్నత పురస్కారాలన్నీ దర్బార్ హాల్‌లోనే అందజేస్తారు. సరిగ్గా డోమ్ కిందనే దర్బార్ హాల్ ఉంటుంది. దానికి ఎడమవైపున ఉండే అశోకా హాల్ మొత్తం పర్షియన్ శిల్ప కళాకృతుల తైలవర్ణ చిత్రాలతో చిత్రించి ఉంటుంది. అక్కడే రాష్ట్రపతి గ్రంథాలయం కూడా ఉంది. దీనికి ఇన్‌ఛార్జిగా మన తెలుగు వ్యక్తి సత్య ప్రకాష్ ఉన్నారు. ఆయన గత 30 సంవత్సరాలుగా అక్కడ సేవలందిస్తున్నారు.

ఉదయానికే ముస్తాబు...

మేం రాష్ట్రపతి భవన్‌లో ఉండగా మా ప్రణాళికలో లేని రెండు కార్యక్రమాల్ని చూసే అవకాశం దొరికింది. వాటిలో మొదటి కార్యక్రమం సెప్టెంబరు 12న విదేశీ రాయబారుల నియామకానికి సంబంధించింది. ఇది అశోకా హాల్‌లో జరిగింది. అయిదు దేశాల్లో నియమితులైన నూతన విదేశీ రాయబారులతో రాష్ట్రపతి సమావేశం నిర్వహించారు. మేం పై అంతస్తులో కూర్చొని దీన్ని వీక్షించాం. రెండో కార్యక్రమం సెప్టెంబరు 18న జరిగింది. ఆరోజు ఉదయానికే ఆర్పీ భవన్‌ని అందంగా ముస్తాబు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌కు రెడ్ కార్పెట్‌తో, 21 గన్ సెల్యూట్‌తో రాష్ట్రపతి భవన్ ఘన స్వాగతం అందించింది. ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసే అతి అరుదైన అవకాశం మాకు దక్కింది. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సుష్మాస్వరాజ్, వెంకయ్య నాయుడు, స్మృతీ ఇరానీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్పీ భవన్ ఎదురుగా ఉండే విశాలమైన 'ఫోర్‌కోర్ట్' మైదానంలో ఈ కార్యక్రమం జరిగింది.


ఢిల్లీలో ఉండే ఇద్దరు జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీతలు సత్యవ్రత్ శాస్త్రి, కేదార్‌నాథ్ శాస్త్రిలను కలుసుకునే అవకాశాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ మాకు ప్రత్యేకంగా కల్పించింది. రాష్ట్రపతి భవన్‌లో అత్యాధునిక హంగులతో నిర్మించిన ఆడిటోరియంలో సెప్టెంబరు 20న మా బృందంలో ఉన్న నలుగురు సభ్యులకూ రచనలూ, కళల్ని చూపే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. నేను నా మొత్తం రచనలూ, ఆంగ్లానువాదాలూ, కరపత్రాలూ, పత్రికల క్లిప్పింగ్‌లను ప్రదర్శనలో పెట్టాను. ఆ సందర్భంలో ఆర్పీ భవన్‌లో ఉన్న పలువురు తెలుగు అధికారులతో పరిచయమైంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానిలతోపాటు అద్వానీ కూడా ఈ ప్రదర్శనకు వచ్చి చూడటంతోపాటు మాకు ఆశీస్సులు అందించారు. అదే రోజు సాయంత్రం ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ తన కథక్ బృందంతో నాట్య రూపకం కూడా ప్రదర్శించారు.


భుజం తట్టిన ప్రణబ్...

రాష్ట్రపతి భవన్‌లో క్యాబినెట్ రూమ్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఎన్నో యుద్ధాలూ, క్లిష్ట సమయాల్లో నిర్ణయాల్ని అక్కడ తీసుకున్నారు. అక్కడే సెప్టెంబరు 22న భారత రాష్ట్రపతితో మా సమావేశం జరిగింది. పది నిమిషాలపాటు నా రచనల గురించి ఆయనకి చెప్పి వాటి ఆంగ్లానువాదాల్ని అందజేశాను. 'ఇలాంటి సామాజిక అంశాలపై రచనలు చేయడమే యువ సాహిత్యకారులకు నేనిచ్చే సూచన' అని చెబుతూ నా భుజం తట్టి అభినందించారు. ఎంతో ఆత్మీయంగా గంటకు పైగా సమయం వారితో గడిచింది. మర్నాడు రాజాజీ మార్గ్‌లో నివాసం ఉన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారిని కలిశాను. ఆయన తన 'విజన్ 20-20' గురించీ, విద్యా వ్యవస్థలో సంస్కరణల గురించీ గంటసేపు చర్చించారు. మేం ఆర్పీ భవన్‌లో ఉన్న సమయంలో రెండు సార్లు అక్కడి ఆర్ట్ థియేటర్‌లో మాకోసం ప్రత్యేకంగా సింఘమ్ రిటర్న్స్, మర్దానీ సినిమాలు వేశారు. 50 సీట్లు ఉండే ఈ థియేటర్‌లో బ్లూ రే టెక్నాలజీని వాడుతున్నారట. మామూలు థియేటర్‌తో పోల్చితే బొమ్మ 20 రెట్లు నాణ్యతతో ఉంటుంది. మా నలుగురి కోసమే రెండు సార్లూ సినిమా వేశారు. పర్యటనలో భాగంగా పార్లమెంట్ భవనాన్నీ సందర్శించాం. అక్కడి గ్రంథాలయంలో భారత రాజ్యాంగ లిఖిత మూల ప్రతిని చూశాం. దాన్నో గాజు పెట్టెలో ఉంచి భద్రపరిచారు. ఆర్పీ భవన్ లోపల ఉండే రోడ్లకు మాజీ రాష్ట్రపతుల పేర్లు పెడుతున్నారు.

రాష్ట్రపతి భవన్ సందర్శన నా జీవితంలో ఎంతో ముఖ్య ఘట్టం. మధుర జ్ఞాపకం. ప్రకృతి, చరిత్రల కలబోతే ఆ భవనం అనిపించింది. ఆ భవనం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఈ విశేషాల్ని ఒక పుస్తకంగా కూడా రాస్తున్నాను. ★


దర్బార్ హాల్ దర్పం...


గాంధీజీ - ఇర్విన్ భేటీ నమూనా


పీబీజీ దళం కవాతు

విమర్శ - ప్రస్థానం

వేంపల్లి గంగాధర్

"శబ్దం వెనుక ఉన్న నిశ్శబ్దాన్ని పట్టుకునే ధ్వని: విమర్శ"

రచయితలు మట్టి ముద్దను మానవ ముఖాకృతిలోకి క్రమంగా మార్చే శిల్పుల లాంటివారు. రూపాన్ని తాను ఎన్నాళ్ళ నుంచో మనస్సులో సృష్టించుకుంటూ వచ్చినప్పటికీ... అది అతడి నీడ మాత్రమే. ఆ నీడకు అతడు రక్తమాంసాలు కల్పిస్తాడు. పాత్రలుగా అవి బయటకు వస్తాయి. రచన రూపుదిద్దుకుంటుంది. అయితే రచయిత చూడని అంశాల్ని, అనుభవాల్ని చేయని ఆలోచనల్ని, నిధిలా దాచుకున్న గుప్తభావాల్ని, రహస్య కీలకాన్ని విమర్శకుడు పట్టుకుంటాడు. భావోద్రేకాల్ని, భావాల్ని విమర్శకుడు వల విసిరి అందుకుని బంధించి ఆవిష్కరిస్తాడు. అప్పుడే అది అత్యుత్తమ విమర్శ అవుతుంది. అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని విమర్శ గురించి 'రచయితా-శిల్పమూ' రచనందించిన రష్యన్ రచయిత ఇల్యా ఎహైన్‌బర్గ్ అంటారు. విమర్శకుడ్ని అతడెంత నిశితంగా వివరించాడో కదా! భారతీయ సాహిత్య విమర్శ ప్రాచీన వైభవాన్ని చూసినా అదే స్పష్టత మనకు కనిపిస్తుంది.

ఉద్భటుడు మొదలు విశ్వనాథుడి వరకు తీక్షణమైన, నిశితమైన, స్పష్టమైన విమర్శకే పట్టంకట్టారు. భామహుడు, ఆనందవర్ధనుడు, జగన్నాథ పండితుడు, వామనుడు అందరూ భారతీయ సాహిత్య విమర్శకు జీవం పోసిన వారేకావడం విశేషం. వీరిని కాదని విమర్శ గురించి చెప్పుకోవడం సాధ్యంకాదు. ఆనాడు వారు వేసిన పునాదులపైనే నేటి విమర్శ నిర్మాణానికి సులువు అవుతుంది.

వ్యాసమహర్షి రచించిన 'మహాభారతాన్ని' నన్నయ తెలుగులోకి అనువదిస్తున్నప్పుడు జరిగిన చర్చ కూడా తెలుగులో మొదటి విమర్శ రావడానికి దోహదమయ్యింది. సంస్కృత భాష రాజ్యమేలే కాలంలో తెలుగుభాష బరువును తన భుజాలపై మోస్తూ, 'కాకిగోలకు రాజహంస మౌనమే సమాధానం' అని చెప్పడంలోనే అంతర్లీనంగా విమర్శ ఉంది. ప్రాచీనాంధ్ర రచనల్లో విమర్శ ఉన్నప్పటికీ అది సూత్రరూపంలోనే ఉంది. దీనికి విశ్లేషణ అవసరం. పాండురంగని పదగుంభనలు తెనాలి రామకృష్ణుని కావ్యావతారికలు ఇందుకు నిదర్శనాలు.

19వ శతాబ్దంలో విమర్శ మరింతగా పుంజుకుంది. తొలి విమర్శకుడిగా కందుకూరి వీరేశలింగం పంతులుగారిని చెప్పుకోవచ్చు. అయితే తెలుగు సాహిత్యానికి బ్రౌన్ చేసిన సేవను కూడా మరిచిపోకూడదు. 1829లోనే రెండువేల వేమన పద్యాలను సేకరించి వాటిలోనే 693 పద్యాలను ఇంగ్లీషులోనికి అనువాదం చేశారు. కర్నాటిక్ క్రోనాలజీ, ఆంధ్ర గీర్వాణీచ్ఛందం, మీరాశీస్వామ్యం, రాజుల యుద్ధాలు, తాతాచారి కథలు, మిశ్రమ నిఘంటువులు కాల గర్భంలో కలిసిపోకుండా బ్రౌన్ పుణ్యంవల్ల నిలదొక్కుకున్నాయి.

ఆధునిక సాహిత్య నిర్మాతగా వీరేశలింగంపంతులు తొలి స్వీయచరిత్ర, తొలి నాటకం, తొలి ప్రహసనం, తొలి వచన ప్రబంధం, తొలి కవులచరిత్ర, తొలి శాస్త్రీయ గ్రంథాల నిబంధనం, తొలి విమర్శకు శ్రీకారం చుట్టి విశిష్ట ప్రక్రియలను మన ముందుకు తెచ్చారు. కందుకూరి వారి రాజశేఖర చరిత్ర నవలకి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉంది. ఇంగ్లీషులో గోల్డ్‌స్మిత్ రచించిన 'The Vicar of Wake Field' ఆధారమని వారే తెలియజేసుకున్నారు. అయితే పలు అంశాలతో కాశీభట్టవారు 'మను-వసు ప్రణాళిక'లో దీనిపై విమర్శ చేశారు. 'ది ట్రావెలర్' రచనను కూడా 'పధిక విలాసము' పేరుతో కందుకూరి వారు అనువదించారు. ఈ రచన కోసం వారు అనేక ప్రాంతాలను అధ్యయనం చేశారు. ఆంగ్లభాష పైన ఉన్న పట్టుతో 'కవుల చరిత్ర' రచనకు పూనుకున్నారు. 684 పేజీల విశిష్ట గ్రంథాన్ని ఆయన మనకు అందించారు.

ఈ రచన కోసం అనేక తాళపత్ర గ్రంథాలను, శాసన చారిత్రక సంపుటాలను కూడా వారు పరిశీలించాల్సి వచ్చింది. కందుకూరి తర్వాత మనం ప్రముఖంగా ప్రస్తావించుకోవాల్సింది గురజాడ అప్పారావు గారిని. 1936లో వచ్చిన మాటా-మంతీ, డైరీలు గురించి చర్చించుకోవాల్సిందే. 1953లో వ్యాస చంద్రిక కూడా తయారైంది. 1910లో ముత్యాల సరాలు, 1893లో కన్యాశుల్కం, 1883లో ఆంగ్ల పద్య కావ్యం నుంచి సారంగధర, 1910లో దిద్దుబాటు కథ-రచనా పరంపర కొనసాగింది. వీరి మాటా-మంతీ లోనూ, వ్యాస చంద్రికలోనూ విమర్శ కనపడుతుంది.

ఆ తర్వాత 'శారదా కాంచిదిక విమర్శలు' పేరుతో వేదం వెంకటరాయ శాస్త్రి గారు ఆంధ్ర ప్రసన్న రాఘవ విమర్శనం చేశారు. అలంకార సారసంగ్రహం, 1913లో శ్రీనాథుని శృంగార నైషధానికి 'సర్వంకషవ్యాఖ్య', ఆముక్తమాల్యద కావ్యానికి చేసిన వ్యాఖ్యానం చెప్పుకోదగ్గవి. కొక్కొండ వారి ప్రసన్న నాటక విమర్శనం వీరు అందించారు. 'విక్రమార్క చరిత్ర విమర్శనం' కూడా వీరి రచనల్లో ప్రముఖమైనవి.

'అముద్రిత గ్రంథ చింతామణి' పేరుతో పూండ్ల రామకృష్ణయ్య విమర్శలు రాశారు. తరువాత తెలుగులో స్వతంత్ర విమర్శనా విధానానికి శ్రీకారం చుట్టిన ఘనత కట్టమంచి రామలింగారెడ్డి గారికి దక్కుతుంది. వీరి 'కవిత్వతత్త్వవిచారం'లో విమర్శలు మరింత పుంజుకున్నాయి. పలువురు దీనిపై స్పందించారు. 1928లో రామలింగారెడ్డి గారి 'లఘుపీఠికా సముచ్చయం' వెలువడింది. దీనినే తెలుగులో తొలి పీఠికా గ్రంథంగా కూడా చెప్పుకుంటారు.

అయిదు భాగాలతో 'వ్యాసమంజరి' కూడా వీరు తీసుకువచ్చారు.

ఇలాగే 'కవి సామ్రాట్' విశ్వనాథ సత్యనారాయణగారు విమర్శనాగ్రంథాలకు నడుం బిగించారు. ఫలితంగా 1954లో నన్నయగారి ప్రసన్నకథాకలితార్థయుక్తి, 1961లో అల్లసాని వాని అల్లికజిగిబిగి, కాళిదాసుని యొక్క అభిజ్ఞత, గ్రంథాలు వచ్చాయి. మరిన్ని విశ్వనాథ సాహిత్యోపన్యాసాలు'గా తీసుకువచ్చారు.

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు వేమన, సారస్వతాలోకం, నాటకోపన్యాసములు వంటి రచనలు చేశారు. నాలుగు వందల పద్యాలతో, శాలివాహన గాథాసప్తశతీసారం' రచించారు. వేమన జీవిత చరిత్రను సవివరంగా మనకు అందచేస్తూ వీరు చేసిన విశ్లేషణాత్మక విమర్శ ప్రశస్తమైనది.

'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డి గారు 'అల్లసాని పెద్దన సమకాలీన భావ ప్రతినిధి', 'తిక్కన', 'విమర్శ కవిత్వము', 'తెలుగు కవితలో కొత్త తెన్నులు', 'కవికోకిల గ్రంథావళి'లో సూటిగా విమర్శలు చేసి మంచి విమర్శకులుగా ప్రశంసలు అందుకున్నారు. వీరు మనకందించిన విమర్శనా వ్యాసాలు విభిన్న కోణాల్ని ఆవిష్కరించాయి.

కొమర్రాజు వేంకటలక్ష్మణరావు గారు 'ఆంధ్రవిజ్ఞాన సర్వస్వం' తయారు చేశారు. భారతీయ భాషల్లోనే మొదటి విజ్ఞాన సర్వస్వంగా దీన్నే చెప్తారు. మల్లికార్జున పండితారాధ్యుల 'శివతత్త్వసారం' కొమర్రాజు గారే పరిష్కరించారు. పలు విమర్శనాత్మక వ్యాసాలను 'లక్ష్మణరాయ వ్యాసావళి' పేరుతో అందించారు. ఇందులో పలు పరిశోధనాత్మక వ్యాసాలు కూడా చోటు చేసుకున్నాయి.

ఖండవల్లి లక్ష్మీరంజనంగారు 'లక్ష్మీరంజన వ్యాసావళి'ని, 'విమర్శనా తరంగిణి'ని నడకుదుటి వీరరాజు పంతులు వ్రాశారు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు 1926లో మనుచరిత్రకు, 1927లో బసవ పురాణానికి, 1936లో ఉత్తర హరివంశాలకు పీఠికలు రాశారు. గ్రంథ పరిష్కరణ ప్రకటన, దక్షిణ దేశమందలి ఆంధ్ర వాఙ్మయము, ప్రాచీనాంధ్ర వచన కావ్యములు, హరవిలాసం, సుగ్రీవ విజయం..., వంటి నలభై రచనల్ని పరిష్కరించి ప్రభాకర శాస్త్రిగారే పీఠికలు తెచ్చారు. 1918లో 'ప్రబంధ రత్నావళి' సంకలనం వెలువరించారు. శాస్త్రి గారి విమర్శనాత్మక పరిశోధనలకు ఇవన్నీ తార్కాణాలుగా నిలుస్తాయి.

కేతవరపు రామకోటి శాస్త్రిగారు వ్యాససంపుటాలు, బూర్గుల రామకృష్ణారావుగారి సారస్వత వ్యాసముక్తావళి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారి 'వ్యాసావళి', పిల్లలమర్రి వెంకట హనుమంతరావు గారి 'సాహిత్య సమాలోకము' వంటి విమర్శనా రచనలు పుట్టుకొచ్చాయి.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, అక్షరశిల్పి డా॥ సి. నారాయణరెడ్డి గారు 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయాలు - ప్రయోగాలు' సిద్ధాంత గ్రంథాన్ని అందించారు. ఆధునికాంధ్ర కవిత్వానికి ఇప్పటికీ ఇదే ప్రామాణిక గ్రంథంగా నిలిచిపోయే తీరుగా ఇందులో పరిశోధన సాగింది. 1952 నుంచి దాదాపుగా అరవైకి పైగా రచనలు ఆవిష్కరింపబడ్డాయి. 'విశ్వంభర'తో వీరు ప్రశస్తమైన జ్ఞానపీఠాన్ని పొందారు.

అభ్యుదయకవి 'ఆరుద్ర' పదమూడు సంపుటాల 'సమగ్రాంధ్ర సాహిత్యం' తయారు చేశారు. 'ఆరుద్ర వ్యాస పీఠం' పేరుతో వ్యాస సంపుటి తెచ్చారు. 'అభ్యుదయ కవిత్వంలో ఆరుద్రత' అనే అంశంపై తన దృక్పథాన్ని విశ్లేషించారు. 1949లో త్వమేవాహమ్ కావ్యం తెచ్చారు. వేమన్నవాదం' పేరుతో వేమన మీద పరిశోధనాత్మక రచన చేశారు.

బుచ్చిబాబు 'నన్ను మార్చిన పుస్తకం', కాటూరి వేంకటేశ్వరరావు 'సాహిత్య దర్శనం', తీసుకుని వచ్చారు. గుంటూరు శేషేంద్ర శర్మ 'కవిసేన మానిఫెస్టో', 'సాహిత్య కౌముది', 'షోడశి' అనే విమర్శ రచనలు చేశారు. అభ్యుదయభావాల్ని సామాజిక చైతన్యంతో ముడిపెట్టి విమర్శనా అస్త్రాలు సంధించారు. 'మండే సూర్యుడు', 'గొరిల్లా', 'సముద్రం నాపేరు', 'రక్తరేఖ' వంటి రచనలు ఈ విషయాన్ని మరింత దృఢపరుస్తాయి.

తరవాత భావ కవిత్వానికి ఆద్యులుగా నిలిచినవారు దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి గారు. 'అప్పుడే పుట్టి వుంటే' వ్యాస సంపుటిని దేవులపల్లి గారు వెలువరించారు. వీరి ఏకాంతసేవ పీఠిక, భారతిలో ప్రచురితమైన 'పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వం' వంటి వచన రచనలు విమర్శను అందుకున్నాయి.

సాహిత్యంలోదృక్పథాలు, సమాజం-సాహిత్యం, సాహిత్యనేపథ్యం రచనలతో ఆర్.ఎస్.సుదర్శనం విమర్శకు మరింత వన్నె తెచ్చారు.

'హృదయం లాంటిది కవిత్వం, మెదడు లాంటిది విజ్ఞానం, సంస్కారం లాంటిది విమర్శ' అంటూ తెలుగు విమర్శకు రంగులద్దిన ఘనత డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం గారికి దక్కుతుంది. 1961లో 'వీరరసము'తో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందారు. 1980లో 'రసోల్లాసము' ఆంధ్రప్రదేశ్, సాహిత్య అకాడమీ వారి 'ఉత్తమ సాహిత్య విమర్శ'గా పురస్కారాన్ని అందుకుంది. 'ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం' రచన 1986లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని వీరికి సంపాదించి పెట్టింది.

సాహిత్యరంగంలో వివిధ వాదాలపట్ల, సిద్ధాంతాలపట్ల, ఉద్యమాల పట్ల ఆచార్య సుబ్రహ్మణ్యం గారికి గల సమదృష్టి ఈ విమర్శల్లో స్పష్టంగా కనిపిస్తుంది. వినిపిస్తుంది.

1969లో తిరుమల రామచంద్రగారు 'సాహితీ సుగతుని స్వగతం' వెలువరించారు. ఎస్. గంగప్ప, తూమాటి దొణప్ప, కోరాడ రామకృష్ణయ్య, చల్లా రాధాకృష్ణశర్మ వంటివారు విమర్శకు మెరుగులు దిద్దారు.

అభ్యుదయ భావాలతో చైతన్యవంతమైన విమర్శలతో రాచమల్లు రామచంద్రారెడ్డి గారు 'సారస్వత వివేచన', కె.వి.రమణారెడ్డి గారు 'ఆధునిక కవిలోకం' రాశారు. అదే దారిలోనే కొడవటిగంటి కుటుంబరావు, సోమసుందర్, కేతు విశ్వనాథరెడ్డి, అద్దేపల్లి రామ్మోహనరావు, ఆర్వీయార్ విమర్శకు రూపం తెచ్చారు.

మరోవైపు నాటక సాహిత్య విమర్శ బలం పుంజుకుంది. మొదలి నాగభూషణశర్మ, సర్దేశాయి తిరుమలరావు, అప్పారావు, మిక్కిలినేని, పి.వి.రమణ, జయప్రభ (నాలుగో గోడ), మల్లికార్జున రావులు, కొత్తదారులు తెచ్చారు.

ఆ దారిలోనే కథా సాహిత్యంపైన కూడా విమర్శ దూసుకొచ్చింది. వల్లంపాటి వెంకట సుబ్బయ్య, 'కథాశిల్పం'కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందారు.

కోడూరి శ్రీరామమూర్తి, పోరంకి దక్షిణామూర్తి, కాత్యాయనీవిద్మహే, నవీన్, మధురాంతకం రాజారాం, శివశంకర్ లాంటి వారు విమర్శను అందుకొని కథా సాహిత్యంలో వచ్చిన వినూత్న పరిణామాలను విశ్లేషించారు. వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు, 'నవలా శిల్పం' పై కూడా పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు.

'విమర్శ మౌలిక లక్షణాలు', 'తెలుగు కవిత సాంఘిక సిద్ధాంతాలు' సంపుటాలను ముదిగొండ వీరభద్రయ్య గారు మనముందు ఉంచారు. విమర్శ ఎలా సాగాలో, ఏఏ అంశాల్ని విమర్శించాలో, విమర్శ లక్షణాలేమిటో 'విమర్శ మౌలిక లక్షణాలు' రచనలు వివరిస్తుంది.

కొలకలూరి ఇనాక్, డా.ఎన్. గోపి, అనుమాండ్ల భూమయ్య, జి. లక్ష్మీనరసయ్య, బి.ఎస్. రాములు, ఓల్గా, బాలగోపాల్, అఫ్సర్, వై.విజయకుమార్, వల్లభాచార్య, చందు సుబ్బారావు, ద్వా.నా.శాస్త్రి వంటివారు విమర్శకు మరింత ప్రాచుర్యం తెస్తున్నారు.

ఆదివారం ఆంధ్రజ్యోతిలో సంచలనాత్మకంగా సాగిన చేకూరి రామారావు గారి 'చేరాతలు' ప్రభంజనాన్ని సృష్టించాయి. వెల్చేరు నారాయణరావు 'కవితా విప్లవాల స్వరూపం', రామ మోహన్‌రాయ్ 'తెలుగు కవితా వికాసం' అందించారు.

ఈ విధంగా మరెందరో విమర్శకుల చేతులమీదుగా తెలుగు విమర్శ ప్రస్థానం వివిధ పరిణామాల్ని తనలో లిఖించుకుంటూ సాగిపోతోంది.

విమర్శ సృజనాత్మక ప్రక్రియ. ఇది మంచి చెడులను నిరూపిస్తుంది. రచనకు పూరణ విమర్శ. సమగ్రమైన అనుభూతిని ఇచ్చే సృజనాత్మకమైన ముద్ర సాహిత్యం అయితే దానిని విశ్లేషణాత్మకంగా, పరిశోధనాత్మకంగా వివరించేది విమర్శ. మంచి, చెడు గుణదోషాలను విమర్శకుడు నిర్ధారిస్తాడు. సృజనాత్మకత లేని ఏ రచనా నిలబడలేదు. ఇందుకు విమర్శ అతీతమైనదేమీ కాదు. విమర్శకుడికి కూడా తన కంటూ ఒక శైలి ఉండాలి. రచయిత రచనాపరంగా ఎంత తపన పడతాడో విమర్శకుడూ తన విమర్శ పట్ల అంతే ఆరాట పడతాడు. ఉత్తమ విమర్శకుడు కావాలంటే రచనలోని మూలాన్ని విమర్శకుడు పట్టుకోవాలి. అందుకోసం విషయ సేకరణకు విమర్శకుడు వెనుకాడకూడదు. అధ్యయనం కూడా చేయగలగాలి.

'వ్యాఖ్యానంతో కూడిన తీర్పును విమర్శ' అని హడ్సన్ నిర్వచించాడు. 'అనుభూతి విశేషాలను వివేచించి విలువలను నిర్ణయించేదే విమర్శ' అనేది రిచర్డ్స్ అభిప్రాయం. ఫ్రాయిడ్ ప్రకారం చేసిన విమర్శ మనస్తత్త్వ విమర్శ అవుతుంది. ప్రాచీన సాహిత్యాన్ని విమర్శించే పద్ధతి 'ఆలంకారిక విమర్శ'గా మారింది. కవికి, పాఠకుడికి వారధి వంటివాడు విమర్శకుడు. విమర్శకుడికి రాగద్వేషాలు ఉండకూడదు.

"రచయిత ఎక్కడ ఆగిపోతాడో
అక్కడ ప్రారంభమయ్యేవాడు విమర్శకుడు"

*****

డా॥ వేంపల్లి గంగాధర్ : 'రాష్ట్రపతి భవన్'లో విశిష్ట ఆతిథ్యం అందుకున్న తొలి భారతీయ సాహితీవేత్తగా వీరు గుర్తింపు పొందారు. 2014, సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 26 వరకు వీరు రాష్ట్రపతి భవన్‌లో విడిది చేశారు. రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన పలు అంశాలపై పుస్తకాలు రాశారు. వీరి కథా సంకలనం 'మొలకల పున్నమి'కి కేంద్ర సాహిత్య అకాడమి మొదటి యువపురస్కారం - 2011 లభించింది. ప్రసిద్ధ సాహితీవేత్త సునీల్ గంగోపాధ్యాయ చేతుల మీదుగా తామ్రపత్రం అందుకున్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి 'రాయలసీమ కథా సాహిత్యం' పై పిహెచ్‌డి, 'రాయలసీమ ఫ్యాక్షనిజం' పై ఎంఫిల్ పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం వారి 'రైటర్స్ ట్రావెల్ గ్రాంట్' ద్వారా 'శాంతినికేతన్'లో పర్యటించారు. మొలకల పున్నమి, దేవరశిల, గ్రీష్మభూమి, తొలితెలుగు శాసనం, పూణే ప్రయాణం, కథనం, హిరణ్యరాజ్యం, నేలదిగినవాన, నేను చూసిన శాంతినికేతన్, పాపాఘ్ని కథలు, రావణవాహణం కథలు, కడప వైభవం (సంపాదకత్వం), అనంతపురం చరిత్ర (సంపాదకత్వం), ఎర్రచందనం దారిలో తమిళ కూలీలు, యురేనియంపల్లె నవల పుస్తకాలు రాశారు. సీమ గిరిజన తండాల నుంచి పడుపు వృత్తిలోకి తరలిపోతున్న మహిళల జీవన ఆక్రందనను 'పూణే ప్రయాణం' రచనలో చిత్రణ చేశారు. ఇదే ఇతివృత్తంతో రాసిన 'మైనం బొమ్మలు' కథకు అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) పురస్కారం దక్కింది. న్యూఢిల్లీ కథా ఫౌండేషన్‌వారి నుంచి 'శిలబండి' కథకు జాతీయ కథాపురస్కారం, 'నేలదిగిన వాన' నవలకు అంపశయ్య నవీన్ సాహితీ పురస్కారం, 'దేవరశిల'కు రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం అందుకున్నారు. వీరి కథలు పలు భారతీయ భాషలలోకి అనువాదమయ్యాయి.



Dr.Vempalli Gangadhar of Kadapa receiving sahitya Akademi Yuva Puraskar
from Akademi president Sunil Gangopadhyay . (25th August 2012, Bhubaneswar (Odisha).


గ్రీష్మ భూమి
కథలు